సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 55

శనివారం 17-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'



స్వేచ్ఛగా .. రెక్కలు విప్పేలా..

మిస్ సౌత్ సుడాన్‌గా కిరీటం ధరించి మిస్ వరల్డ్‌కి పోటీపడ్డానికి హైదరాబాద్ చేరుకుంది అయోమ్ టీటో మతీజ్. తన దేశ పరిస్థితులు, వ్యక్తిగత వివరాలు, తన లక్ష్యం వగైరా ఆమె మాటల్లోనే...

–ఫ్యామిలీలో

యాభై దాటారా? ఇవి మరచిపోకండి



మీ వయసు యాభై దాటిందా? ఏమనుకోకండి...మీ పిల్లలకు, మీ వారికి, అత్తమామలకు, ఇతర కుటుంబ సభ్యులకు కావలసిన వాటన్నింటినీ అమర్చి పెడుతూ మీ గురించి మీరు పట్టించుకోవడం మానేశారా? అయితే ఇప్పుడు తెలియకపోవచ్చు కానీ, ముందు ముందు చాలా ఇబ్బందులు పడవలసి వస్తుంది. అందుకే కనీసం ఇప్పుడయినా మేలుకోవడం మంచిది. 50 సంవత్సరాలు దాటిన స్త్రీలు తమ ఆరోగ్యం కోసం అలవరచుకోవలసిన ఆహారపు నియమాలు ఏమిటో తెలుసుకుందాం...

నిజానికి యాభై ఏళ్లు దాటిన వారికోసం ప్రత్యేకమైన ఆహారం అంటూ ఏమీ లేదు. కాకపోతే వయసుతోపాటు శరీరానికి విటమిన్లను గ్రహించే శక్తి తగ్గుతుంటుంది కాబట్టి తీసుకునే ఆహారంలోనే ఆయా విటమిన్లు పుష్కలంగా ఉండేలా చూసుకుంటే సరిపోతుంది.

యాభైఏళ్లు వచ్చేసరికి మహిళల్లో ఈస్ట్రోజెన్ అనే హార్మోన్ తగ్గిపోవడం వల్ల శరీరానికి క్యాల్షియంను గ్రహించే శక్తి కూడా తగ్గుతుంది. శరీరంలో క్యాల్షియం తగ్గితే ఆస్టియో పొరోసిస్ అనే వ్యాధి వస్తుంది. కాబట్టి క్యాల్షియం ఎక్కువ ఉన్న ఆహారం తీసుకోవాలి. క్యాల్షియం ఆకుకూరల్లో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఆకుకూరలు బాగా తీసుకుంటే సరిపోతుంది. అయితే ఇక్కడ మరో విషయం... శరీరం క్యాల్షియంను గ్రహించాలంటే విటమిన్ డి3తోపాటు వ్యాయామం అవసరం.

విటమిన్ డి3 కోసం పొద్దున పూట సూర్యరశ్మి శరీరానికి తగిలేలా వ్యాయామం చేస్తే శరీరం క్యాల్షియంను గ్రహించుకుంటుంది. లేకుంటే క్యాల్షియం ట్యాబ్లెట్లు మింగవలసి ఉంటుంది.

సాధారణంగా 50 సం. దాటినవారు కుటుంబంలోని వాళ్లందరూ ఎవరి పనుల మీద వాళ్లు బయటకు వెళ్లిపోయాక ఎక్కువ సమయం కూర్చుని ఉంటారు.



అందువలన కండరాలు పటుత్వం కోల్పోయి బలహీనత వస్తుంది. అలా రాకుండా ఉండాలంటే ప్రోటీన్లు ఎక్కువగా ఉండే పప్పు, మొలకలు, బాదం, నట్స్ లాంటి ఆహారం తీసుకోవాలి.

యాభై దాటిన వారికే కాదు, ఎవరికైనా సరే, శరీర పోషణకు మాంసకృత్తులు చాలా అవసరం. కిలో శరీర బరువుకు 1.5 గ్రా. చొప్పున మాంసకృత్తులు తీసుకోవాలి. ఉదాహరణకు 60 కేజీల బరువున్నవారు 90 గ్రాముల ప్రోటీన్ తీసుకుంటే సరిపోతుంది.

మరో ముఖ్య విటమిన్ – విటమిన్ బి 12. శరీరానికి రోజుకు 2.4 మైక్రోగ్రాముల బి12 కావాలి.

విటమిన్ బి 12, శరీర



ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు, ఎర్ర రక్తకణాల వృద్ధికి, మెదడు సరిగా పనిచేయడానికి అవసరం.

బి 12, పాలు,పెరుగు, చీజ్, గుడ్లు, చేపలు, చికెన్ మొదలైన వాటిలో లభిస్తుంది.

ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలు తగ్గిస్తే మంచిది. అధిక ఉప్పు అధిక రక్తపోటుకు, కీళ్ల నొప్పులకు దారి తీసే అవకాశం ఉంది.

50 సం. దాటినవారు ఎక్కువగా మతిమరుపు వచ్చిందని అంటూ ఉంటారు. ఒక సర్వే ప్రకారం వీళ్ళు నీళ్ల తక్కువ తీసుకోవడం కూడా మతిమరుపునకు ఉన్న కారణాల్లో ఒకటని తేలింది.

చక్కగా పండ్లు, కూరలు, ఆకుకూరలు, మొలకలు, తృణధాన్యాలతో కూడిన మితాహారాన్ని తీసుకుంటూ, శరీరానికి తగినంత వ్యాయామం కల్పించడం అవసరం. ●

బట్టతలపై వెంట్రుకలు సాధ్యమే!



వయసు మీరుతున్న కొద్దీ తలపై జుట్టూడిపోవడం సాధారణం. కానీ.. కొంతమందికి చిన్న వయసులోనే బట్టతల వచ్చేస్తుంటుంది. మళ్లీ జుట్టు కావాలని అనుకుంటే హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి వ్యయ ప్రయాసలతో కూడిన పద్ధతులు మాత్రమే ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. అయితే త్వరలోనే ఈ సమస్య తీరిపోతుందంటున్నారు హార్వర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు. జుట్టు రాలడాన్ని తగ్గించడమే కాకుండా... రాలిపోయిన జుట్టు స్థానంలో సరికొత్తగా వెంట్రుకలు మొలిచేలా కూడా చేసేందుకు తాము ఓ కొత్త పద్ధతిని ఆవిష్కరించామని వీరు చెబుతున్నారు. నొప్పి ఏమాత్రం కలిగించని, అతిసూక్ష్మమైన సూదులతో కూడిన పట్టీని అతికించి.. ఆ సూదుల ద్వారా ఒక మందును నెత్తికి అందించడం ద్వారా ఇది సాధ్యమని వారు వివరించారు. ఎలుకలపై తాము ఇప్పటికే కొన్ని ప్రయోగాలు చేశామని, సత్ఫలితాలు సాధించామని తెలిపారు. అలొపేసియాకు కారణాలు కచ్చితంగా తెలియవు కానీ.. ఇది ఒక ఆటో ఇమ్యూన్ వ్యాధి. అంటే.. శరీర రోగ నిరోధక వ్యవస్థే.. బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు దాడి చేశాయని పొరబడి మన శరీరానికి నష్టం చేయడాన్నే ఆటో ఇమ్యూన్ వ్యాధి అంటారు. అలోపేసియా విషయంలో రోగ నిరోధక వ్యవస్థలోని టీ–కణాలు వెంట్రుకల కుదుళ్లపై దాడి చేస్తాయన్నమాట. ఫలితంగా వెంట్రుకలు అక్కడక్కడా రాలిపోవడం మొదలవుతుంది. కొంతమందిలో రాలిపోయిన తరువాత ఒకసారి పెరిగే అవకాశం ఉంటుంది కానీ.. మిగిలిన వారికి ఆ అదృష్టం ఉండదు.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. కీళ్లనొప్పులు, తామర వంటివి ఆటో ఇమ్యూన్ వ్యాధులు కావడం... చికిత్సకు మందులు (రోగ నిరోధక వ్యవస్థను అణచివేసేవి) ఉపయోగించినప్పుడు జుట్టు మొలవడం! మందులు వాడటం నిలిపేసిన వెంటనే జుట్టు రాలడమూ మొదలవుతూండటాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో ఈ మందుల్లోనే ఏదో మర్మముందన్న సందేహంతో శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేయడం మొదలుపెట్టారు. మందులు కేవలం వెంట్రుకల కుదుళ్లపై దాడి చేస్తున్న టీ–కణాలే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. దీంతో మైక్రో నీడిల్ ప్యాచ్ ద్వారా ఈ మందులు నేరుగా వెంట్రుకల కుదుళ్లకు మాత్రమే అందేలా చేశారు. ఎలుకలతో ప్రయోగాలు చేసినప్పుడు మూడు వారాల్లోపు పదిసార్లు ప్యాచ్‌లు మార్చి.. ఇంకో ఎనిమిది వారాలు వాటిని గమనించారు. మూడు వారాల తరువాత వెంట్రుకలు పెరగడం మొదలైంది. పదివారాలపాటు పెరుగుతూనే ఉన్నాయి. సో... సమీప భవిష్యత్తులోనే బట్టతల కలవారందరూ ఎంచక్కా జేబులో దువ్వెన పెట్టుకుని తిరిగే అవకాశం ఉందన్న మాట! ●

● యోగా

కూర్చొని తగ్గచ్చు



'దండాసనం' అని పిలువబడే స్టాఫ్ పోజ్ వెన్నెముక, కాళ్ళు, తుంటి భాగంలో బలాన్ని మెరుగుపరుస్తుంది. ఈ ఆసనం కూర్చున్న భంగిమలో ఉంటుంది. యోగా ప్రారంభకులకు అనుకూలమైన అభ్యాసంగా ఉపయోగపడుతుంది.

ఎలా చేయాలంటే..

● మ్యాట్ పైన కూర్చొని, కాళ్ళు ముందు చాపి కూర్చోవాలి. ● తొడ కండరాలను స్ట్రెచ్ చేయాలి. పాదాలను ముందుకు వంచాలి. ● వెన్నెముకను నిటారుగా ఉంచాలి.
● భుజాలను వెడల్పుగా చేస్తూ, నిటారుగా ఉంచాలి. ● చేతులను హిప్ బాగానికి రెండు వైపులా నేల మీద నిటారుగా ఉంచాలి.
● ఈ భంగిమలో 5–15 శ్వాసల తీసుకొని, వదలాలి, ఈ సమయంలో శ్వాసపై పూర్తి దృష్టి పెట్టాలి.

ప్రయోజనాలు..

● ఈ ఆసనం ద్వారా వెన్నునొప్పి నుండి ఉపశమనం కలుగుతుంది. ● చేతులు, తొడ కండరాలలో ఒత్తిడి రిలీజ్ అవుతుంది. దీర్ఘ శ్వాసల వల్ల ఛాతీ భాగం స్ట్రెంథెన్ అవుతుంది. ● ఇతర యోగా భంగిమలకు శరీరాన్ని సిద్ధం చేస్తుంది. ● ఈ భంగిమ రోజూ సాధన చేయడం ద్వారా శారీరక బరువు పట్ల అవగాహన పెరుగుతుంది. ఫలితంగా ఆరోగ్యకరమైన ఆహారంవైపు దృష్టి మరలి, అధికబరువు సమస్య తగ్గుతుంది.

ఈ భంగిమలో తొడ, మోకాలి భాగాలు ఇబ్బంది పెడుతున్నట్టు అనిపిస్తే యోగా పట్టీని ఉపయోగించవచ్చు. కూర్చోవడంలో ఇబ్బంది పడుతుంటే, సపోర్ట్ కోసం ఒక పలచటి దిండును ఉంచవచ్చు. మొదట్లో కాళ్ళను నిటారుగా ఉంచలేకపోతే ఆందోళన పడనక్కర్లేదు. మెల్లగా అభ్యాసనం ద్వారా కాళ్ల నిటారుగా వస్తాయి. ●

చెమట వాసన వదులుతుంది ఇలా..



వేసవిలో చెమట వాసన అత్యంత అసౌకర్యంగా అనిపిస్తుంది. ఇది సాధారణమే అయినప్పటికీ కాలేజీ అయినా, ఆఫీసు అయినా, పార్టీ అయినా, ఫంక్షన్ హౌస్ అయినా చెమట దుర్వాసన వ్యక్తిత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. దాదాపు అందరూ చెమట వాసన రాకుండా ఉండేందుకు పెర్ఫ్యూమ్‌లు, డియోడరెంట్‌లు వంటి వివిధ రకాల సువాసనలను ఉపయోగిస్తారు. కానీ కొంత మంది పెర్ఫ్యూమ్, డియోల నుంచి వచ్చే ఘాటైన వాసనను తట్టుకోలేరు. అలెర్జీ కూడా కలిగిస్తుంది. బ్రిటన్‌లోని యూనివర్శిటీ ఆఫ్ యార్క్ పరిశోధన ప్రకారం.. చెమట వాసనకు గల కారణాలలో ముఖ్యమైనది ఎంజైమ్. ఇది ప్రధానంగా చంకలలో కనిపించే బ్యాక్టీరియా ద్వారా ఉత్పత్తి అవుతుంది. వీటి మూలాన్ని తొలగించడం వల్ల చెమట దుర్వాసన తొలగించుకోవచ్చు.


చెమట వాసన ఎంజైమ్‌లను తొలగించడానికి ఇంటి నివారణలు చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి. నిమ్మ, టమోటా, కొబ్బరి నూనె వంటి కొన్ని గృహోపకరణాల ద్వారా చెమట దుర్వాసనను సులభంగా వదిలించుకోవచ్చు. రెండు నిమ్మకాయలను కట్ చేసి చెమట పట్టిన ప్రదేశంలో రుద్దాలి. కొద్దిసేపటి తర్వాత నిమ్మరసం ఆరిపోయినట్లు అవుతుంది. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని నీటితో కడగాలి. ఇలా రోజుకి ఒకసారి చేస్తే చెమట దుర్వాసన ఇట్టే పోతుంది.

ప్రతి రోజూ స్నానానికి ముందు టొమాటోను కట్ చేసి.. దీని రసాన్ని శరీరంలోని చెమట ఉన్న భాగాలపై రాసుకోవాలి. కనీసం 15 నిమిషాల పాటు అలాగే ఉంచి తర్వాత స్నానం చేయాలి. ఇలా రోజూ చేస్తే చెమట వాసన దూరం అవుతుంది.

చెమట దుర్వాసనను తగ్గించడంలో కొబ్బరి నూనె చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇందులోని లారిక్ యాసిడ్ చెమటలో దుర్వాసన కలిగించే బ్యాక్టీరియాను చంపుతుంది. అలాగే స్నానం చేసే నీటిలో ఒక చెంచా తేనె కలుపుకుని, ఆ నీటితో స్నానం చేస్తే చెమట వాసన రానేరాదు. ●

సాక్షి సినిమా

జూన్‌లో వీరమల్లు


● పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీర మల్లు'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో నిధీ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. నిర్మాత ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఈ సినిమాని జూన్ 12న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ''ఈ చిత్రంలో చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కల్యాణ్ కనిపిస్తారు. షూటింగ్ తుది దశకు చేరుకుంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ప్రస్తుతం వీఎఫ్ఎక్స్, సౌండ్ డిజైన్, డబ్బింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

తిన్నడి పరివర్తనతో...


● విష్ణు మంచు

విష్ణు మంచు హీరోగా నటించిన పాన్ ఇండియన్ మూవీ 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్. మంచు మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ తదితరులు ఇతర కీలక పాత్రలు పోషించారు. మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. కాగా కన్నప్ప కథ అందరికీ తెలియాలనే ఉద్దేశంతో కామిక్ బుక్స్ రూపంలో విష్ణు మంచు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో ఇప్పటికే తొలి, ద్వితీయ అధ్యాయాలు విడుదల చేయగా, తాజాగా మూడో అధ్యాయాన్ని రిలీజ్ చేశారు మేకర్స్. ''కన్నప్ప కామిక్ బుక్ చివరి అధ్యాయం తిన్నడు (కన్నప్పలో విష్ణు పోషించిన పాత్ర) భావోద్వేగ, ఆధ్యాత్మిక పరివర్తనను సూచిస్తుంది. దైవత్వం ఆలోచనను తిరస్కరించిన అతను చివరికి శివ భక్తుడిగా మారతాడు. భక్త కన్నప్పగా తిన్నడు మారే అద్భుతమైన ప్రయాణాన్ని ఈ మూడో అధ్యాయం వివరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

నిధి అన్వేషణలో అర్జున్


● నాగచైతన్య

'తండేల్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్‌సీ 24' (వర్కింగ్ టైటిల్). కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్న ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ఆర్ట్ డైరెక్టర్ నాగేంద్ర వేసిన గుహ సెట్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. నాగచైతన్య, మీనాక్షీలపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో అర్జున్ అనే ట్రెజర్ హంటర్‌గా కనిపిస్తాను. నాగేంద్ర గారు గుహని అద్భుతంగా తీర్చిదిద్దారు'' అని తెలిపారు. ''ఈ గుహలో తీస్తున్న సీన్స్ సినిమాలో 20 నిమిషాలకు పైగా ఉంటాయి'' అన్నారు కార్తీక్ వర్మ. ''ఈ చిత్రంలో ఆర్కియాలజిస్ట్ పాత్రలో కనిపిస్తాను'' అన్నారు మీనాక్షీ చౌదరి. ''ప్రేక్షకులకు ఒరిజినల్ సినిమాటిక్ అనుభూతినిచ్చేందుకు గుహ సెట్ వేసి, సీన్స్ తీస్తున్నాం'' అని బీవీఎస్ఎన్ ప్రసాద్ చెప్పారు. ''ప్రేక్షకులకు సెట్ అనే భావన కలగకుండా 50 రోజులు కష్టపడి ఈ సెట్‌ని సహజంగా తీర్చిదిద్దాం'' అని నాగేంద్ర పేర్కొన్నారు. ఫైట్ మాస్టర్ విజయ్ పాల్గొన్నారు.

తిరిగొచ్చిన కాలం


● దేవన్, వీవీ వినాయక్

దేవన్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ట్యాగ్ లైన్. ధన్యా బాలకృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. బేబీ వైష్ణవి సమర్పణలో జ్యోత్స్న జి. నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని డైరెక్టర్ వీవీ వినాయక్ విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. 'ప్రేమించడం, ప్రేమించబడడం.. రెండూ కర్మలే. ఈ ప్రేమని అనైతికంగా అనుభవించాలనుకున్నా, అవాయిడ్ చేయాలనుకున్నా అది మరింత కాంప్లికేటెడ్ అయి, ఎన్ని జన్మలైనా నీకు సరైన పాఠం నేర్పే వరకు వదలదు' అనే డైలాగ్స్‌తో టీజర్ ఆరంభమవుతుంది. ''సూపర్ నేచురల్ లవ్ స్టోరీగా రూపొందుతోన్న చిత్రం 'కృష్ణ లీల'. దేవన్ సరికొత్త పంథాలో ఈ ప్రేమకథని ప్రెజెంట్ చేస్తున్నారు'' అని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకి కెమేరా: సతీష్ ముత్యాల, సంగీతం: భీమ్స్.

హాస్యం... ప్రేమ


● 'వర్జిన్ బాయ్స్' పోస్టర్

గీతానంద్, మిత్రా శర్మ హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. శ్రీహాన్, రోనిత్, జెన్నిఫర్, అన్షుల, సుజిత్ కుమార్, అభిలాష్ ముఖ్య తారలుగా దయానంద్ దర్శకత్వంలో రాజా దరపునేని నిర్మించిన ఈ చిత్రం టీజర్ విడుదలైంది. ''హాస్యం, ప్రేమ, ఎమోషన్స్ ప్రధానాంశాలుగా రూపొందించిన ఈ చిత్రంలో ఆధునిక రిలేషన్‌షిప్స్‌ను చూపించాం. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఈ వేసవిలోనే విడుదల చేస్తాం'' అని రాజా దరపునేని తెలిపారు.

ఇదే అసలైన విజయం - సమంత


● రాకేశ్ రెడ్డి, సమంత, ప్రవీణ్ కండ్రేగుల, హిమాంక్

''శుభం' చిత్రానికి పని చేసిన ప్రతి ఒక్కరిలో నవ్వులు, సంతోషం కనిపిస్తున్నాయి. ఇదే అసలైన విజయం. ఇలాంటి ఆనందం చూడటానికే నిర్మాతలు ఇంకా ఇంకా సినిమాలు తీస్తూనే ఉంటారు'' అని హీరోయిన్, నిర్మాత సమంత చెప్పారు. హర్షిత్ రెడ్డి, సి. మల్గిరెడ్డి, శ్రియా కొంతం, చరణ్ పెరి, షాలినీ కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రావణి ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలైంది. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో సమంత మాట్లాడుతూ– ''శుభం' చూస్తే నా వేసవి సెలవులు గుర్తుకొచ్చాయి. మమ్మల్ని సినిమాలకు తీసుకు వెళ్లేందుకు మా అమ్మ ఎంత కష్టపడిందో నాకు తెలుసు. ఓ మూవీని మా ఫ్యామిలీ అంతా కలిసి చూసిన రోజులన్నీ మళ్లీ గుర్తుకొచ్చాయి. 'శుభం'తో అందర్నీ మళ్లీ పాత రోజుల్లోకి తీసుకెళ్లాం. ఇలాంటి మంచి చిత్రాలను తీసి కుటుంబ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాం. మీ తీపి జ్ఞాపకాల్ని మళ్లీ గుర్తు చేస్తూనే ఉంటాం... అదే మా ట్రాలాలా లక్ష్యం. సినిమా రిలీజ్‌కు ముందు మూడు రోజులు మా టీమ్‌లోని ఏ ఒక్కరూ నిద్రపోలేదు. ఇప్పుడు వస్తున్న ప్రేమ, అభిమానం, ప్రశంసలన్నింటికీ వాళ్లే కారణం. నాకు సపోర్ట్‌గా నిలిచిన మైత్రి శశి, సురేష్‌బాబుగార్లకు థ్యాంక్స్. అభిమానులే నా ప్రపంచం. 'శుభం'ని ముందుకు తీసుకెళ్తున్న ఫ్యాన్స్‌కి ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు. ప్రవీణ్ కండ్రేగుల మాట్లాడుతూ– ''సమంతగారు లేకపోతే 'శుభం'ని ఎవరు చూస్తారు? ఆమె వల్లే ఈ సినిమా జనాల్లోకి వెళ్లింది. ఇలాంటి సినిమాలను ఆదరిస్తే ఇంకా ఎన్నో మంచి చిత్రాలు వస్తాయి'' అన్నారు. నటీనటులు శ్రియా కొంతం, శ్రావణి, షాలినీ, వంశీధర్, హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్, రచయిత వసంత్, సహ నిర్మాత హిమాంక్, 'మైత్రీ' మూవీస్ శశి, ప్రొడక్షన్ డిజైనర్ రామ్, క్యాస్ట్యూమ్ డిజైనర్ పూజిత, రాగ్ మయూర్ మాట్లాడారు.

తళతళ తారకలాగా...


● నితాంశా ● జాక్వెలిన్

ఎరుపు రంగు గౌనులో తళతళ తారకలాగా తళుక్కుమని ప్రత్యక్షమయ్యారు జాక్వెలిన్ ఫెర్నాండెజ్. ఫ్రాన్స్‌లో జరుగుతున్న 78వ కాన్స్ చిత్రోత్సవాల్లో ఆమె 'రెడ్ సీ ఫెస్టివల్'లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించారు. అలాగే మహిళా నిర్మాతలు, నటులు, సాంకేతిక విభాగంలో ఉన్నవారు సినిమాలకు చేసిన కృషిని ప్రస్తావించే 'ఉమెన్ ఇన్ సినిమా' గాలాలో పాల్గొనే గౌరవం జాక్వెలిన్‌కి దక్కింది. ఇక భారతదేశం నుంచి ఈ వేడుకల్లో రెడ్ కార్పెట్ పై తళుక్కుమన్న తారల్లో హిందీ చిత్రం 'లాపతా లేడీస్'లో నటించిన నితాంశా గోయల్ తొలిసారి పాల్గొన్నారు. గత ఏడాది గ్రాండ్ ప్రీ అవార్డు గెలుచుకున్న 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ లైట్'లో నటించిన ఛాయా కదమ్ ఆ 77వ చిత్రోత్సవాల్లో సందడి చేశారు. ఈ ఏడాదీ ఆమె కాన్స్ వెళ్లారు. ఇంకా భారతదేశం నుంచి డిజిటల్ కంటెంట్ క్రియేటర్ మాసూమ్ మీనావాలా, ఇండియన్–థాయ్ బ్యూటీ, 'మిస్ యూనివర్స్ థాయ్‌ల్యాండ్ సరాబురి' వీణా ప్రవీణర్ సింగ్, ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్ సాక్షి సింద్వానీ పాల్గొన్నారు. 'తన్వీ ది గ్రేట్' స్క్రీనింగ్ కోసం హాజరైన ఆ చిత్రదర్శకుడు అనుపమ్ ఖేర్ కూడా రెడ్ కార్పెట్‌పై స్టైలిష్‌గా కనిపించారు.

మరోసారి నిరూపించారు - అల్లు అరవింద్


● కార్తీక్ రాజు, వంశీ, 'వెన్నెల' కిశోర్, అల్లు అరవింద్, శ్రీవిష్ణు

''సింగిల్' సినిమా రషెస్ చూశాక మా గీతా ఆర్ట్స్‌లో మరో రెండు సినిమాలు చేయాలని శ్రీవిష్ణుకి చెక్ ఇచ్చాను. మనిషిగా, నటుడిగా తను అంత నచ్చాడు. సినిమా బాగుంటే మేము థియేటర్స్‌కి వస్తామని ప్రేక్షకులు మరోసారి నిరూపించారు. ఇందుకు వారికి ధన్యవాదాలు'' అన్నారు అల్లు అరవింద్. శ్రీవిష్ణు, కేతికా శర్మ, ఇవానా హీరో హీరోయిన్లుగా 'వెన్నెల' కిశోర్ కీలక పాత్ర పోషించిన చిత్రం 'సింగిల్'. కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలైంది. శుక్రవారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ– ''సింగిల్' కథని దాదాపు 15 మంది తిరస్కరించారు. వాళ్లందరికీ థ్యాంక్స్ (నవ్వుతూ). మంచి టీమ్‌తో చేస్తున్న ఈ సినిమా కచ్చితంగా సక్సెస్ అయితే బాగుంటుందనుకున్నాను... అదే జరిగింది'' అని తెలిపారు. ''ఈ సినిమా విజయం ఇండస్ట్రీకి ఉపయోగపడింది'' అన్నారు 'బన్నీ' వాసు. ''సింగిల్'ని నా లైఫ్‌లో మర్చిపోలేను'' అని కార్తీక్ రాజు చెప్పారు. ''మా సినిమాకి ఇంత మంచి విజయం అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని విద్య, భాను ప్రతాప, రియాజ్ చౌదరి తెలిపారు.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 55

శనివారం 17-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'



'షో' మళ్లీ షురూ...

నేటి నుంచి ఐపీఎల్ పునఃప్రారంభం. బెంగళూరుతో కోల్‌కతా 'ఢీ' -17లో



వెయిట్ లిఫ్టర్ బామ్మ

వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్‌లో పాల్గొనడానికి సిద్ధమైన 70 ఏళ్ల రోషిణి. -ఫ్యామిలీలో



కేంద్రం దౌత్యమార్గం..

పాక్ నిజస్వరూపాన్ని ప్రపంచానికి వివరించేందుకు అఖిలపక్ష బృందాలను విదేశాలకు పంపాలని కేంద్రం నిర్ణయించింది.

- వివరాలు 6లో



మసూద్ అజార్‌కు రూ.14 కోట్లు

జైషే అధినేతకు రూ. 14 కోట్లు ఇవ్వాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆరోపించారు.

- వివరాలు 6లో



ఇకపై కుదరవు..

మైనింగ్ వంటి ప్రాజెక్టులకు కార్యకలాపాలు మొదలయ్యాక పర్యావరణ అనుమతులు ఇవ్వరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది.

- వివరాలు 6లో



బార్ తీరుపై సీజేఐ ఆక్షేపణ

జస్టిస్ బేలా మాధుర్య త్రివేదికి వీడ్కోలు పలకరాదన్న ఎస్‌సీబీఏ నిర్ణయాన్ని జస్టిస్ బి.ఆర్.గవాయ్ తప్పుబట్టారు.

- వివరాలు 6లో

పవర్‌ఫుల్‌గా ఉండాలి

2034-35 నాటికి 31,808 మెగావాట్లకు డిమాండ్

అందుకు తగినట్లుగా ఉత్పత్తికి ప్రణాళికలు వేయండి

క్లీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజీ, ఫ్లోటింగ్ సోలార్‌పై దృష్టి పెట్టాలి

ఓఆర్ఆర్ పొడవునా సోలార్ లైటింగ్ ఏర్పాటు చేయండి

సచివాలయం, నెక్లెస్‌రోడ్, కేబీఆర్ పార్కులో స్మార్ట్ పోల్స్

విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఐటీ, పారిశ్రామిక అభివృద్ధితోపాటు గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో విద్యుత్‌కు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని ఇంధన శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా తరలి వస్తున్నాయని, భవిష్యత్‌లో పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు తయారు చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. సీఎం శుక్రవారం తన నివాసంలో ఇంధన శాఖపై డిప్యూటీ సీఎం భట్టితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, ప్రజా రవాణా (మెట్రో, ఎలక్ట్రికల్ వెహికిల్స్) పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు.

హెచ్ఎండీఏతో సమన్వయం..

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) వరకు రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్‌లకు విద్యుత్ అవసరాలపై హెచ్ఎండీఏతో సమన్వయం చేసుకోవాలని విద్యుత్తు శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. క్షేత్రస్థాయిలో డిమాండ్‌కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలని, విద్యుత్ లైన్ల ఆధునీకరణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్లు బహిరంగంగా కనిపించడానికి వీల్లేదని, హై టెన్షన్ లైన్లను కూడా అక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయం, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో ముందుగా వీటిని ఏర్పాటుచేయాలని ఆదేశించారు. 160 కిలోమీటర్ల ఓఆర్ఆర్ పొడవునా సోలార్ విద్యుత్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఫుట్‌పాత్‌లు, నాలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

9.8 శాతం పెరిగిన విద్యుత్ డిమాండ్..

గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందని సీఎం తెలిపారు. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో వినియోగం పెరగలేదని, అయినా అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో ▶

పీడీ యాక్ట్ పెట్టి లోపలేయండి: సీఎం

నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయదారులపై ఉక్కుపాదం మోపండి

- వివరాలు 8లో

రక్షణకు మరో రూ. 50వేల కోట్లు!



- ఉగ్రవాదం, పాక్ దుస్సాహసాల నేపథ్యంలో కేటాయింపులు పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం
- అనుబంధ బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని సమకూర్చాలని ప్రతిపాదన
- పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో లభించనున్న ఆమోదం
- రక్షణకు ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు రూ. 6.81 లక్షల కోట్లు - 6లో

ఇష్టమొచ్చినట్టు ఇంటర్నల్ మార్కులు..



అటానమస్ కాలేజీల్లో మార్కుల మాయాజాలం

40 మార్కులకు గరిష్టంగా 38 వేస్తున్న వైనం

థియరీలో 60 మార్కులకు 20 దాటని విద్యార్థులు

జేఎన్‌టీయూహెచ్ ఆడిట్‌లో వెలుగు చూసిన నిజం

కఠిన చర్యల దిశగా ప్రభుత్వానికి నివేదిక

- వివరాలు 15లో

వర్సిటీ అధికారుల అండతోనే దందా సాగుతున్నట్లు ఆరోపణలు..

న్యూస్‌రీల్

రైలు పట్టాలకూ ఫెన్సింగ్!



రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన మార్గాల్లో రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఫెన్సింగ్ వేసేందుకు దక్షిణ మధ్య రైల్వే సిద్ధమైంది. దాదాపు అన్ని లైన్లను 130 కి.మీ. స్పీడ్‌తో వెళ్లేలా సామర్థ్యం పెంచిన నేపథ్యంలో ట్రాక్‌పై ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 18లో

పోడుభూముల్లో జలసిరులు



గిరిజన రైతుల పోడు భూములను పూర్తిగా సస్యశ్యామలం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఆ భూముల్లో ఉచితంగా బోర్లను ఏర్పాటు చేసి సౌర విద్యుత్ అందించనుంది. స్ప్రింక్లర్లు, డ్రిప్‌ల ద్వారా ఉద్యాన వన పంటలను పండించి ఆదాయం పొందేందుకు వీలుగా ప్రభుత్వం ఇందిరా సౌర జలవికాసం పథకాన్ని చేపట్టనుంది.

- వివరాలు 8లో

నిజంగా డ్రెస్ వేసుకున్నట్లే..



కస్టమర్లను ఆకర్షించేందుకు ఈ-కామర్స్ సంస్థలు దుస్తుల ఎంపికలో వర్చువల్ ట్రై-ఆన్ టెక్నాలజీని తెస్తున్నాయి. ఈ క్రమంలో మంచిర్యాలకు చెందిన ఇద్దరు బాలురు ఇలాంటి టెక్నాలజీని సొంతంగా అభివృద్ధి చేసి ఔరా అనిపించారు. ఇటీవలే పదో తరగతి పూర్తి చేసిన రోహన్ సుధన్వ, సన్నిత్ శెట్టి ఈ అప్లికేషన్‌ను తయారుచేశారు.

- వివరాలు 18లో

విభేదాలు ఒట్టి మాట.. కేసీఆర్ మాటే మా బాట

సమన్వయంతో సాగాలని కేటీఆర్, హరీశ్ కీలక భేటీలో నిర్ణయం

- హరీశ్‌రావు నివాసంలో రెండు గంటలపాటు మంతనాలు
- కేసీఆర్ కుటుంబంలో విభేదాలంటూ జరుగుతున్న ప్రచారంపై చర్చ
- తమ మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేవనే సంకేతాలు ఇవ్వాలని నిర్ణయం
- ఎల్కతుర్తి సభ స్ఫూర్తితో పార్టీ క్షేత్ర స్థాయి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి



హరీశ్ నివాసంలో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌లో కీలక నేతల నడుమ విభేదాలు అంటూ ప్రచారం జరుగుతున్న వేళ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నడుమ కీలక భేటీ జరిగింది. రెండుగంటల పాటు జరిగిన ఈ సుదీర్ఘ భేటీలో పార్టీ సంస్థాగత అంశాలు, ఎల్కతుర్తిలో పార్టీ రజతోత్సవ సభ, ఏడాది పొడవునా నిర్వహించే రజతోత్సవాలు తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలపైనా ఇద్దరూ చర్చించారు. హరీశ్‌రావు తండ్రి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. ఆయన ఆరోగ్య స్థితిపై వాకబు చేసేందుకు హరీశ్‌రావు నివాసానికి శుక్రవారం ఉదయం 9.30కి కేటీఆర్ వెళ్లారు. ఈ సందర్భంగా

మిగతా 8వ పేజీలో ▶

పుష్కర స్నానం.. పరమం పవిత్రం

సరస్వతి పుష్కరాల రెండో రోజు 80 వేల మంది భక్తుల రాక

పరిపూర్ణానంద సరస్వతి స్వామి పుష్కరస్నానం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పుష్కర స్నానం, పూజలు

కాళేశ్వర ఆలయంలో దర్శనానికి గంటల తరబడి క్యూలో నిరీక్షించిన భక్తజనం..

15లో




శుక్రవారం తెల్లవారుజామున పుష్కర స్నానం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు

ఒక్క ఆరుతడి పంటకైనా నీటిని కేటాయించండి

బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వ వాదన

విచారణ జూలై 23–25కు వాయిదా

- వివరాలు 15లో





ఏంట్రీ.. 700 ఏళ్లా..?

- పిల్లలమర్రిని సందర్శించిన మిస్‌వరల్డ్ 2025 అందాల భామలు
- మహా వృక్షాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేసిన పోటీదారులు
- నమస్కారం.. తెలంగాణ, తెలంగాణ.. జరూర్ ఆనా అంటూ నినాదాలు

2లో

అందాల పోటీలు.. అధికారుల సిగపట్లు

స్పాన్సర్‌షిప్స్ విషయంలో అధికారుల తప్పటడుగులు

పర్యాటక శాఖ ఉన్నతాధికారుల మధ్య కీచులాటలు

పోటీదారుల కాళ్లు కడిగించటంపై ప్రభుత్వం సీరియస్

2లో

సాక్షి ఫ్యామిలీ

హైదరాబాద్
శనివారం ॥ 17-5-2025



హైదరాబాద్ లో జరిగే 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్ లో చెక్ రిపబ్లిక్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది అడెలా స్ట్రాఫెకోవా. 21 ఏళ్ల ఈ బ్యూటీ మోడల్, ఫిట్నెస్ ట్రైనర్, ఈవెంట్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తోంది. కనెక్టింగ్ హార్ట్స్ అక్రాస్ జనరేషన్స్ పేరుతో రెండు, మూడు తరాల వారిని ఒకచోట చేర్చడం, ప్రేమ, దయ, స్నేహపూరిత వాతావరణాన్ని వ్యాప్తి చేయడంపై దృష్టి పెడుతుంది. 'ఏదైనా సాధించాలనుకోవడానికి ముందు తమకు నిజంగా ఏం కావాలో తెలుసుకోవడం ముఖ్యం' అంటూ తన గురించి తెలియజేసింది.

మనల్ని మనం తెలుసుకోవడమే..

''అందాల కిరీటం అనేది ఒక ఏడాది వరకే. కానీ, చాలామందితో కనెక్ట్ అవ్వచ్చు. నా కల ఒక్కటే! మిస్ వరల్డ్‌గా నన్ను నేను చూసుకోవాలి. నా చిన్నప్పటి నుంచే ఈ ఆలోచన ఉండేది. మా అమ్మ మేకప్ వస్తువులన్నీ నేనే వాడేసేదాన్ని. అమ్మ డ్రెస్సులు, హీల్స్ వేసుకొని ఇంట్లో తిరిగేదాన్ని. పదిహేనేళ్ల వయసు నుంచి అందాల పోటీలలో పాల్గొంటూ వచ్చాను. పదిహేడేళ్ల వయసులో మొదటి సారి ప్రపంచ పోటీలో పాల్గొన్నాను.

విజయసాధనకు..

బ్యూటీ కాంటెస్ట్‌లో చాలా ఛాలెంజెస్ ఉంటాయి. వివిధ రంగాలలో మమ్మల్ని పరీక్షిస్తారు. వాటిలో పాల్గొన్నప్పుడు కొంత ఆందోళనగా కూడా ఉంటుంది. కానీ, నన్ను నేను నిరూపించుకోవడానికి ముఖ్యమైన సమయం అదే. మిస్ బ్యూటీ కావాలని కలలు కనే యువతులు అనుకరించడం కాదు. ముందు తామేం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకోవడం ముఖ్యం. నిజంగా ఏదైనా కోరుకుంటే 200 శాతం ప్రయత్నించాలి. అప్పుడే విజయం సాధించగలం. ఒక్క మిస్ విషయమే కాదు నేను ఏదైనా కోరుకున్నప్పుడు విజయం కోసం నా వంతుగా మొత్తం ప్రాణం పెట్టేస్తాను. అలాగే, విజయాలూ సాధించాను. కోరుకున్నది పొందాలంటే సరైన సమయం, శక్తి, దృష్టి పెడితే అదే మనకు అదృష్టంగా మారుతుంది. అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

> అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

ఫిట్‌నెస్ ట్రైనర్

నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. స్విమ్, రన్నింగ్, హార్స్ రైడింగ్ చేస్తాను. మోడలింగ్ నా కెరియర్. జీవనాధారం కూడా అదే. ఫిట్‌నెస్ ట్రైనర్‌గా కోచింగ్ ఇస్తాను. ఆ సమయంలో చాలా ఆనందిస్తాను. ఫిట్‌నెస్ గురించి నేను చెప్పే విషయాలు వినడమే కాదు, వాళ్లు ఆచరణలో పెడతారు. ఓ గొప్ప సమాజమే నాతో పాటు ఉందనిపిస్తుంది. వారితో నా అనుభవాలను పంచుకోవడం కూడా నాకు చాలా ఇష్టం. వారానికి కనీసం రెండుసార్లు ఫిట్‌నెస్ గ్రూప్‌లకు కోచ్‌గా పనిచేస్తాను.

నాకు ప్రస్తుతం ఉన్న క్షణం చాలా ముఖ్యమైనది. అందుకే ఈ క్షణంలో మాత్రమే జీవిస్తాను. సాధ్యమైనంత వరకు ప్రపంచాన్ని తెలుసుకోవాలి అనుకుంటాను.

ఫ్యాషన్ గురించి

ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని తను ధరించే దుస్తుల ద్వారానే వ్యక్తపరచగలడు. మేం చెక్ రిపబ్లిక్‌లో స్థిరపడినా వివిధ దేశాలకు సంబంధించిన దుస్తుల్లో నన్ను నేను చూసుకుంటాను'' అని వివరించారీ బ్యూటీ.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

అడెలా స్ట్రాఫెకోవా: చెక్ రిపబ్లిక్



• సంకల్ప బలం

వెయిట్ లిఫ్టర్ బామ్మ @ 70

వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్‌కి రెడీ

అరవై ఎనిమిది సంవత్సరాల వయసులో జిమ్‌లోకి అడుగు పెట్టిన రోషిణి... ఇప్పుడు ఎన్నో వ్యాయామాలలో ఆరి తేరింది. వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించింది. అమెరికాలో జరగబోయే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'లో పాల్గొనడానికి రెడీ అవుతోంది 70 సంవత్సరాల రోషిణి.

కుమారుడితో కలిసి ఢిల్లీలో ఉంటున్న రోషిణికి ఎడమ కాలి మోకాలినొప్పి మొదలైంది. మెట్లు ఎక్కడం, నడవడం కష్టంగా మారింది. ఆమె ఎడమ మోకాలికి ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు గుర్తించారు. కుడి చూపుడు వేలు బలహీన పడింది.

ఫిజియో థెరపీ మొదలు పెట్టింది.

'ఈ టైమ్‌లో అమ్మకు జిమ్ అవసరం ఉంది' అనుకున్నాడు ఆమె కుమారుడు, ఫిట్‌నెస్ కోచ్ అయిన అజయ్.

68 సంవత్సరాల వయసులో తొలిసారిగా జిమ్‌లోకి అడుగు పెట్టింది రోషిణి.

మెల్ల మెల్లగా ఆమెకు సాంత్వన చేకూరింది.

స్ట్రెచ్చింగ్, మూమెంట్ ఎక్సర్‌సైజ్‌లతో మొదలుపెట్టి వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టింది. రెగ్యులర్ ట్రైనింగ్ వల్ల చేయి బలపడింది. రోజువారీ పనులు కష్టంగా అనిపించేవి కావు.

జిమ్ ఉత్సాహం ఆమెను వెయిట్ లిఫ్టింగ్ వైపు తీసుకువచ్చింది.

ఇప్పుడు రోషిణి ట్రాప్‌బార్ డెడ్‌లిఫ్ట్‌లో 97 కేజీల బరువు ఎత్తుతుంది.
80 కేజీల కన్వెన్షనల్ డెడ్‌లిఫ్ట్స్ చేస్తుంది.
50 కేజీల స్క్వాట్స్ చేస్తుంది.
120 కేజీల లెగ్ ప్రెస్ చేస్తుంది.
4 నిమిషాల పాటు ప్లాంక్ పట్టుకోగలదు.

ప్రతిరోజూ రెండు గంటలు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో చేస్తుంది.

'దువ్వెన పట్టుకోవడం కూడా కష్టమే అని ఒకప్పుడు డాక్టర్లు అమ్మ గురించి చెప్పారు' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అజయ్. జిమ్‌లో వర్కవుట్స్ పుణ్యమా అని ఇప్పుడు రోషిణికి ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. వారు ఆమెను ప్రేమగా 'వెయిట్‌లిఫ్టర్ మమ్మీ' అని పిలుచుకుంటారు.

డైట్ విషయానికి వస్తే...

'ఎలాంటి రిస్ట్రిక్షన్‌లు లేవు. నాకు దహీ బల్లే అంటే చాలా ఇష్టం. అలా అని అదేపనిగా తినను. అప్పుడప్పుడు మాత్రమే తింటాను. ఏదైనా ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు' అంటుంది ఇంటి భోజనాన్ని ఇష్టపడే రోషిణి.

వచ్చే సంవత్సరం అమెరికాలో జరిగే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'కి ఆమెకు ఆహ్వానం అందింది.

ప్రస్తుతం రోషిణి ఆ ఈవెంట్ కోసం ప్రాక్టీస్ చేస్తోంది.

'ఒకప్పుడు నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఇప్పుడు మాత్రం బయటికి వెళుతున్నాను. రకరకాల కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది' అంటుంది రోషిణి.

'సీనియర్ సిటిజన్స్ జిమ్‌లో వ్యాయామాలు చేసినప్పుడు అది వాళ్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. వారి నుంచి యువతరానికి సందేశం అందుతుంది' అంటున్నాడు అజయ్.



• అజయ్, రోషిణి

ఎండాకాలం వచ్చిందంటే గృహిణులకు చేతినిండా పనే.
ఎండను డబ్బాల్లో దాచి పెట్టాల్సిందే...
అప్పడాలు, వడియాల పని పట్టాల్సిందే!
పప్పులో.. పులుసులో.. సాంబారులో.. రసంలో...
ఇలా దేనిలో నంచుకున్నా ఆ రుచి అదుర్స్.
అన్నింటినీ మించి అప్పడం ఒక్కటి ఉంటే చాలు...
విందు భోజనం చేసిన ఫీలింగ్ వచ్చేస్తుంది.
అయితే ఎప్పటిలా రొటీన్ రుచులు కాకుండా
కాస్త వెరైటీ అప్పడాలివి... ప్రయత్నించి చూస్తారా?

అప్పడాలతో అదిరే విందు

సగ్గుబియ్యం అప్పడాలు

కావలసినవి: సగ్గుబియ్యం – ఒక కప్పు (కడిగి, సగ్గుబియ్యం రకాన్ని బట్టి, 3 గంటలు లేదా రాత్రి అంతా నానబెట్టుకోవాలి); నీరు – సరిపడా; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీస్పూన్; నువ్వులు – ఒక టీ స్పూన్ (అభిరుచిని బట్టి); పచ్చిమిర్చి పేస్ట్ – ఒక టీస్పూన్ (అభిరుచిని బట్టి); నిమ్మ రసం – అర టీస్పూన్.

తయారీ: ముందుగా మందపాటి గిన్నెలో 4 కప్పుల నీరు పోసి మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు, నానబెట్టిన సగ్గుబియ్యంలోని నీరు వంపేసి, మరిగే నీటిలో వేసుకోవాలి. కాసేపటికి ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి పేస్ట్ వేసుకుని బాగా కలుపుకోవాలి. మంటను మీడియంకు తగ్గించి, సగ్గుబియ్యం పూర్తిగా ఉడికే వరకూ అడుగంటకుండా, మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. సగ్గుబియ్యం ఉడికిన తర్వాత, అది జిగురుగా మారుతుంది. ఒకవేళ మరీ గట్టిగా అనిపిస్తే కొద్దిగా నీరు కలపవచ్చు. చివరగా నిమ్మరసం కలిపి ఒకసారి కలుపుకొని స్టవ్ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారనివ్వాలి. మరీ పూర్తిగా చల్లారకుండా, గోరువెచ్చగా ఉండగానే, ఒక ప్లాస్టిక్ షీట్‌ను ఎండలో లేదా ఇంట్లోనే నేల మీద పరచుకుని, ఒక చిన్న స్పూన్ సహాయంతో కొద్ది కొద్దిగా సగ్గుబియ్యం మిశ్రమాన్ని గుండ్రంగా లేదా మీకు నచ్చిన ఆకారంలో అప్పడాల్లాగా వేసుకోవాలి. ఒకదానికొకటి కాస్తంత దూరం ఉంచాలి. వీటిని 2 లేదా 3 రోజుల పాటు ఎండలో బాగా ఆరనివ్వాలి. అప్పడాలు గట్టిగా తయారవ్వాలి. ఒకవైపు ఆరిన తర్వాత రెండోవైపుకు తిప్పి ఆరబెట్టాలి. అప్పడాలు పూర్తిగా ఆరిన తర్వాత, వాటిని ఒక ఎయిర్ టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవచ్చు. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.



వంటిల్లు

మిరియాల అప్పడాలు



కావలసినవి: బియ్యం పిండి – ఒక కప్పు; మిరియాల పొడి – 2 టీస్పూన్లు; ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– అర టీస్పూన్; వంట సోడా – చిటికెడు; నీళ్లు – కొద్దిగా; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ఒక గిన్నెలో కప్పు నీళ్లు పోసి మరుగుతుండగా మిరియాల పొడి, ఉప్పు, జీలకర్ర పొడి, వంటసోడా వేయాలి. కాసేపు మరిగాక అందులో బియ్యం పిండి వేసి అడుగంటకుండా బాగా కలపాలి. స్టవ్ మీదినుంచి దించేసి కాస్త చల్లారాక అందులో రెండు స్పూన్ల నూనె వేసి మరోసారి కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని గుండ్రని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. వీటిని ఎండలో ఒకటి లేదా రెండు రోజుల పాటు బాగా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు.

టమాటో అప్పడాలు



కావలసినవి: టమాటోలు – అరకేజీ; బియ్యం పిండి – రెండు కప్పులు; సగ్గుబియ్యం – కప్పు (నానబెట్టినవి); పచ్చిమిర్చి – 2 లేదా 3 (కట్ చేసి పేస్ట్‌లా చేసుకోవాలి); ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– టీస్పూన్; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ: టమాటోలను బాగా కడిగి, కట్ చేసి, మెత్తగా, గుజ్జులా చేసుకోవాలి. ఒక గిన్నెలో బియ్యంపిండి, నానబెట్టిన సగ్గుబియ్యం, టమాటో గుజ్జు, తరిగిన పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చి మెత్తని పిండిలా చేసుకోవాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. ఈ అప్పడాలను ఎండలో 2 లేదా 3 రోజుల పాటు బాగా ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత వాటిని నిల్వ చేసుకోవచ్చు.

స్వేచ్ఛగా .. రెక్కలు విప్పేలా...

అమ్మాయిలకు చదువు కాదుకదా.. కనీసం వ్యక్తిగత శుభ్రత పాటించే వెసులుబాటు కూడా లేని చోట అందాల పోటీలంటే ఆనందంగా సాగనంపుతారా? పంపరు! అయోమ్ టీటో మతీజ్‌కు కూడా తీవ్ర నిరసన ఎదురైంది! అయినా వెనకడుగు వేయకుండా అందాల పోటీలకు అటెండ్ అయింది..

మిస్ సౌత్ సుడాన్‌గా కిరీటం ధరించి మిస్ వరల్డ్‌కి పోటీపడ్డానికి హైదరాబాద్ చేరుకుంది. తన దేశ పరిస్థితులు, వ్యక్తిగత వివరాలు, తన లక్ష్యం వగైరా ఆమె మాటల్లోనే...

''లా చదివాను. లీగల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సౌత్ సుడాన్‌లో పుట్టాను. కానీ అక్కడి రాజకీయ అనిశ్చితి వల్ల మా అమ్మ మమ్మల్ని తీసుకుని కెనడాకు వలస వచ్చేసింది. అందుకే నేను అక్కడే పెరిగాను. మా నాన్న, ఆయన తరఫు, అమ్మ తరఫు బంధువులంతా సౌత్ సుడాన్‌లోనే ఉండిపోయారు. మా అమ్మ కెనడాలో టీచర్‌గా ట్రెస్ అయ్యి, మా సొంత దేశంలోని పిల్లలకు మంచి స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి తిరిగి సుడాన్ వచ్చేసింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత 2019లో నేను మా కుటుంబాన్ని చూడ్డానికి నా సొంత దేశానికి వెళ్లాను. ఎమోషనలే కాదు.. కొంచెం షాక్ కూడా అయ్యాను. కెనడాలో నేను ఆస్వాదించిన జీవితం, సౌత్ సుడాన్‌లో మా వాళ్లంతా అనుభవిస్తున్న జీవితాన్ని బేరీజు వేసుకుని. అప్పుడే డిసైడ్ చేసుకున్నాను నా దేశ ప్రజలకూ ఉన్నత ప్రమాణాల జీవితం అందేలా కృషి చేయాలని! కోవిడ్ తర్వాత వచ్చేశాను. సర్వీస్ మొదలుపెట్టాను. నా బ్యూటీ విత్ పర్పస్ అదే!

అందాల పోటీలకు వ్యతిరేకం

అందాల పోటీల పట్ల సౌత్ సుడాన్‌లో చాలా వ్యతిరేకత ఉంది. నేను మిస్ సౌత్ సుడాన్ పాజెంట్‌లో పాల్గొంటున్నప్పుడు, ఇప్పుడు కూడా నిరసన ఎదురైంది. కానీ నా దృష్టిలో ఈ పోటీలు స్కిన్ షో కాదు. వైవిధ్యమైన సంస్కృతులు, భాషలు, జీవనశైలులను పరిశీలించే, అధ్యయనం చేసే అవకాశాన్నిచ్చే వేదిక. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సర్దుబాటు, సహనాన్ని నేర్పిస్తుంది. ఇవన్నీ కూడా నా సామాజిక బాధ్యతను మెరుగ్గా నిర్వర్తించేందుకు తోడ్పడతాయి. అందుకే నిరసనను ఎదుర్కొని మరీ ఈ పోటీకి వచ్చాను. అంతేకాదు ఈ పోటీలు ఒకరినొకరు తెలుసుకుని, అర్థం చేసుకుని, ఒకరికొకరు సాయం అందించుకునే స్ఫూర్తినీ పంచుతాయి. మహిళలకు అలాంటి స్ఫూర్తి, ప్రేరణ అవసరం. దానికి అందాల పోటీలే కావాలా అంటారేమో! స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నానుడి ప్రపంచ వ్యాప్తంగా పాతుకుపోయి.. అది స్త్రీల సహజ లక్షణమనే అభిప్రాయమూ అంతే లోతుగా నాటుకుపోయింది. దాన్ని అబద్ధమని నిరూపిస్తున్నాయి ఈ పోటీలు! కొన్ని దేశాల పేర్లే తెలియవు నేనీ కంటెస్ట్‌కి వచ్చేదాకా! అందుకే పట్టుబట్టి మరీ ఈ పోటీకి వచ్చాను. ఇక్కడి వైవిధ్యత, ఆధ్యాత్మికత నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి. ఈ దేశంలోని వాళ్లను చూస్తే నాకు ఫారినర్స్‌గా అనిపించరు. మా వాళ్లలాగే అనిపిస్తారు. ఎప్పుడో ఎక్కడో తప్పిపోయి.. ఇప్పుడు కలుసుకుంటున్నామేమో అనిపిస్తోంది! తెలంగాణ గురించి చెప్పుకోవాల్సి వస్తే ఇక్కడి ఎడ్యుకేషన్, మెడికల్ కేర్ గురించి కచ్చితంగా మాట్లాడుకోవాలి. ప్రపంచ ప్రమాణాలతో పోటీపడుతున్నాయి. సౌత్ సుడాన్ యువత తమ ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కే వస్తోంది. మా దేశంలోని చాలామంది ప్రజలు ఆరోగ్య అవసరాల కోసం ఇక్కడి హాస్పిటల్స్‌నే ఆశ్రయిస్తున్నారు.

బాల్య వివాహాలు.. బలవంతపు పెళ్లిళ్లు

ప్రపంచంలోని అనేక దేశాల్లాగే సౌత్ సుడాన్‌లోనూ పురుషాధిపత్యమే! కొడుకుకే ప్రాధాన్యం. అమ్మాయికి వ్యక్తిగత శుభ్రత విషయంలోనూ ఆర్థికపరమైన వెసులుబాటు ఉండదు. బాల్యవివాహాలు, బలంతపు పెళ్లిళ్లు కామన్. ఇక చదువుకునే అవకాశమెక్కడిది? నేను ఇక్కడిదాకా రాగలిగాను అంటే మా అమ్మే కారణం. మమ్మల్ని ఆమె కెనడా గనుక తీసుకు వెళ్లకపోయుంటే నా పరిస్థితి ఎలా ఉండేదో (ఈ మాట చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్లు). నాకింకా గుర్తు.. ఆమె లగేజ్ సర్దుతుంటే 'మనం ఎక్కడికి వెళ్తున్నాం?' అని అడిగాను. 'మీరు స్వేచ్ఛగా మీకు నచ్చింది చదువుకునే చాన్స్ ఉన్న చోటికి' అని చెప్పింది! మేం నలుగురు అక్కచెల్లెళ్లం. మాకొక తమ్ముడు. అందరినీ సింగిల్ పేరెంట్‌గానే పెంచింది అమ్మ. ఎలాంటి అవకాశాల కోసం అమ్మ మమ్మల్ని కెనడాకు తీసుకెళ్లిందో అలాంటి అవకాశాలనే సౌత్ సుడాన్‌లోని అమ్మాయిలకూ కల్పిస్తోంది తాను నడిపిస్తున్న స్కూల్ ద్వారా! ఆమె చేస్తున్న ఆ సర్వీస్‌కి నేనూ శాయశక్తుల సాయపడుతున్నాను. మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్ల కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్లకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి. సాధికారతకు, సామాజిక బాధ్యతకు ఐకాన్స్‌గా ఉండి, తర్వాత తరాలను ఇన్‌స్పైర్ చేసేలా వాళ్లను తీర్చిదిద్దాలి. ఇదంత సులువైన జర్నీ కాదు. అయినా ప్రయత్నం వీడను!'' అంటూ తన జర్నీ గురించి చెప్పారు మిస్ సౌత్ సూడాన్.

– సరస్వతి రమ

ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

> మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్లు కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్ళకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి.



అయోమ్ టీటో మతీజ్, మిస్ సౌత్ సుడాన్

కూల్ రూఫ్ టెక్నాలజీ




కూల్ సమ్మర్

పెరుగుతున్న వేడిని తట్టుకోవడానికి సామాన్యులు తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇందులో కూల్ రూఫ్స్ ప్రోగ్రామ్ ఒకటి. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా టైటానియం ఆక్సైడ్‌లాంటి మెటీరియల్‌తో తయారుచేసిన ప్రత్యేకమైన వైట్ పెయింట్‌ను రూఫ్ టాప్‌లకు వేస్తారు.

దీనికి ముందు రూఫ్‌ను చెత్త, మురికి లేకుండా శుభ్రపరుస్తారు. 'వైట్ పెయింట్ వల్ల ఏ మేరకు ఫలితం ఉంటుంది?' అనే విషయానికి వస్తే... ఉష్ణోగ్రతలలో చెప్పుకోదగ్గ తగ్గుదల కనిపిస్తుందని ప్రాథమిక పరీక్ష ఫలితాలు తెలియజేస్తున్నాయి. 'సోలార్ రెఫ్లెక్టివ్ వైట్ పెయింట్ నార్మల్ పెయింట్ కాదు' అంటుంది అహ్మదాబాద్‌లోని 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' మేనేజర్ దీపిక వద్గామ.

'రూఫ్‌కు రెండుసార్లు పెయింట్ వేయడం మంచిది. మొదటి లేయర్‌కు, రెండో లేయర్‌కు మధ్య కనీసం రెండు గంటల విరామం ఉండాలి' అంటుంది దీపిక. 'అధిక వేడి వల్ల ఇబ్బంది పడకుండా హోమ్–బేస్ వర్కర్స్‌కు కూల్ రూఫ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. వారు చేసే పనికి అంతరాయం ఏర్పడకుండా ఉంటుంది' అంటుంది దీపిక. అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజ బస్‌స్టాప్‌ను 'కూల్ బస్ స్టాప్'గా క్లైమేట్–ఫ్రెండ్లీగా డిజైన్ చేశారు.

'ఒకప్పుడు వేసవికాలంలో ఇంట్లో ఉండడం కష్టంగా ఉండేది. వేడి తట్టుకోలేక కుట్టుమిషన్ పని ఆపేయాల్సి వచ్చేది. సోలార్ రెఫ్లెక్టివ్ వైట్ పెయింట్ వల్ల ఇంట్లో వేడి బాగా తగ్గింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసుకోగలుగుతున్నాను. వచ్చే సంవత్సరం కూడా రూఫ్‌కు వైట్ పెయింట్ వేయిస్తాను' అంటుంది సంగీత బెన్ అనే గృహిణి.


‘ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 55

శనివారం 17-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇండస్ఇండ్‌లో మళ్లీ కలకలం

ఖాతాల్లో రూ. 595 కోట్ల ఆధారం లేని నిల్వలు.


- 17లో



ఫైనాన్స్, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ నష్టం 200 పాయింట్లు 25,100 స్థాయి దిగువకు నిఫ్టీ


- 17లో



పత్రికల్లో పేరు కోసం పిటిషన్లా?

పత్రికల్లో పేరు కోసం కొందరు వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ పిటిషన్లు వేస్తున్నారని సుప్రీంకోర్టు మండిపడింది.

- వివరాలు 6లో



25 ఏళ్ల జైలు..

ప్రఖ్యాత రచయిత సల్మాన్ రష్దీ (77)పై కత్తితో దాడి చేసిన వ్యక్తికి న్యూయార్క్ కోర్టు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

- వివరాలు 6లో



యుద్ధ ఖైదీల మార్పిడి

వెయ్యి మంది యుద్ధ ఖైదీల పరస్పర మార్పిడికి రష్యా, ఉక్రెయిన్ ద్వైపాక్షిక చర్చల్లో అంగీకరించాయి.

- వివరాలు 6లో



నీరజ్ 90.23 మీటర్లు

భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తన కెరీర్‌లో తొలిసారి 90 మీటర్ల మైలురాయి దాటాడు.

- వివరాలు 17లో

తహసీల్దార్ల బదిలీల్లో ‘ట్విస్ట్’



- రెవెన్యూ సంఘాల ఒత్తిడి మేరకు తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు పంపేందుకు అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం...అందులో కొత్త మెలిక పెట్టింది. ఎన్నికల సమయంలో సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారు కాకుండా, ఇతర జిల్లాల నుంచి బదిలీపై వెళ్లిన వారిని మాత్రమే వెనక్కి పంపిస్తామని అంటోంది.

- వివరాలు 16లో

సారీ.. నో లారీ!

ధాన్యం అమ్ముకునేదెట్టా అంటున్న రైతులు.. వారాల తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు

- రాష్ట్రవ్యాప్తంగా అనేక సెంటర్లలో కుప్పలుగా వడ్ల రాశులు..
- కొన్నిచోట్ల లారీలు లేవంటూ కాంటా వేసేందుకూ నిరాకరిస్తున్న నిర్వాహకులు
- కొన్న ధాన్యం తరలింపులోనూ రోజుల తరబడి జాప్యం..
- ట్రాక్టర్ల ద్వారా తరలించుకుంటామంటే హమాలీలు లేరంటున్న వైనం

- ఈ యాసంగిలో దాదాపు 1.30 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- 70.13 ఎల్‌ఎంటీల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావొచ్చని లెక్కలు వేసిన అధికారులు
- అన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా తప్పిన ప్రణాళిక!
- ఇప్పటివరకు మొత్తం 51.39 ఎల్‌ఎంటీల ధాన్యం సేకరణ
- సుమారు 10 ఎల్‌ఎంటీల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్నట్లు అంచనా
- అకాల వర్షాలు, ముందస్తు రుతుపవనాల వార్తలతో ఆందోళనలో రైతులు



తూకం వేసినా.. లారీలు లేక..

మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పైతర కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేసినా, లారీలు రాకపోవడంతో వారం రోజులుగా రవాణాకు నోచుకోలేదు. అకాల వర్షాలకు దాదాపు 800 బస్తాల ధాన్యం తడిసింది. దీంతో సంచుల్లోంచి మొలకలు ఇలా బయటకు వచ్చాయి.

సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: ఓవైపు నైరుతి రుతుపవనాలు ముంచుకొస్తున్నాయి. మరోవైపు యాసంగి సీజన్‌లో వచ్చిన అధిక దిగుబడితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాశులతో నిండిపోయాయి. నెల రోజులుగా కొనుగోళ్లు సాగుతున్నప్పటికీ.. ఇప్పటికీ చాలా జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు దర్శనమిస్తున్నాయి. 10 నుంచి 20 రోజుల పాటు ఎదురు చూసినా వడ్ల బస్తాలను కాంటా వేయడం లేదని రైతులు వాపోతున్నారు. కొన్న ధాన్యం తరలించేందుకు లారీలు లేవని, రైతులు సొంతంగా ట్రాక్టర్‌లో తీసుకెళ్తామంటే హమాలీలు లేరని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. ధాన్యం రాశుల వద్ద రోజుల తరబడి పడిగాపులు పడుతున్నారు. మరిపెడ మండలంలోని ఓ రైతు 600 బస్తాలకు కాంటా వేయించిన తర్వాత లారీలు లేవనే సాకుతో కేంద్రంలోనే వదిలేశారు. ఇప్పటికే అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచగా.. మరోవైపు ముంచుకొస్తున్న వానాకాలం అన్నదాతలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం సుమారు 10 ఎల్‌ఎంటీల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా పడి ఉన్నట్లు అంచనా.

ఇప్పటివరకు 51.39 ఎల్‌ఎంటీల కొనుగోలు

రాష్ట్రంలో ఈసారి యాసంగి సీజన్‌లో 60.14 లక్షల ఎకరాల్లో వరి సాగయింది. దాదాపుగా 1.30 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే

మిగతా 14వ పేజీలో ▶

20 రోజులైనా కాంటా కాలేదు..



నాకు ఉన్న 3 ఎకరాల్లో వరి పంట సాగు చేశా. కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చి 20 రోజులు అవుతుంది. ఇప్పటివరకు కాంటా పెట్టలేదు. అదేమంటే లారీల కొరత ఉందని చెబుతున్నారు. రోజూ కేంద్రానికి వచ్చి ఎప్పుడు కాంటా పెడతారా అని ఎదురుచూస్తున్నా. రైతులం చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం తొందరగా వడ్లు కొనాలి.

– కొల్లి తిప్పారెడ్డి, రైతు, జటప్రోలు, పెంట్లవెల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

లారీలు అందుబాటులో ఉంచాలని ఆదేశించాం: ఉత్తమ్ 14లో



నెలాఖరులో కాళేశ్వరం విచారణ కమిషన్ నివేదిక

- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలపై విచారణ కోసం ఏర్పాటైన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈ నెలాఖరులో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే నివేదికను దాదాపు కొలిక్కి తీసుకువచ్చిన కమిషన్, మరోమారు దానిని క్షుణ్ణంగా పరిశీలించి, ఈ నెల 22వ తేదీ తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుందని విశ్వసనీయంగా తెలిసింది.

-8లో



5 శాతం రెమిటెన్స్ పన్ను

మనోళ్లపై ట్రంప్ మరో పిడుగు

- గ్రీన్‌కార్డుదారులకు కూడా వర్తింపు
- జూలై 4 నుంచి అమలయ్యే అవకాశం
- ఏటా రూ. 3 లక్షల కోట్లు పంపే ఎన్నారైలు
- వాటిపై ఆధారపడే కుటుంబాలకు కష్టకాలమే
- యూఎస్‌కు మాత్రం రూ. 15 వేల కోట్ల ఆదాయం
- ఇకపై మనవాళ్లు పంపే మొత్తాలు భారీగా తగ్గొచ్చని ఆర్థిక నిపుణుల అంచనా

- వివరాలు 6లో

క్లుప్తంగా...

కొత్త భవనంలో వచ్చే మండలి సమావేశాలు

సత్వరం పునరుద్ధరణ పనులు: మండలి చైర్మన్ గుత్తా ఆదేశం



మీర్జా రియాజ్‌తో ప్రమాణం చేయిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే శాసనమండలి సమావేశాలను కొత్త భవనంలోనే జరపాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి.. నిర్ణీత సమయానికి భవనాన్ని అప్పగించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి భవన పునరుద్ధరణ పనులను శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు, ఆర్అండ్‌బీ అధికారులు, ఆగాఖాన్ సంస్థ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

ఎమ్మెల్సీగా మీర్జా రియాజ్ ప్రమాణం

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ (ఎంఐఎం) శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన చాంబర్‌లో ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు, ఎంఐఎం ఎమ్మెల్యేలు బలాల, జుల్ఫీకర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కలిసి పనిచేస్తే డ్రగ్స్ కట్టడి

డీసీఏ, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం

సాక్షి, హైదరాబాద్: డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలు కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని డ్రగ్ కంట్రోల్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అన్నారు. ఎక్సైజ్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులతో సమన్వయ సమావేశం శుక్రవారం అబ్కారీ భవన్‌లో జరిగింది. మత్తుముఠాల పని పట్టేందుకు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని సూచించారు. దీనిపై ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రెండు విభాగాలు కలిపి ఇంటెలిజెన్స్ బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. సమన్వయ సమావేశంలో ఎక్సైజ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, డ్రగ్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ రామ్‌ధన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు కేఏబీ శాస్త్రి, పి.దశరథ్, అడిషనల్ ఎస్పీ భాస్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ డి.సరిత, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి, ఎస్టీఎఫ్ అధికారులు అంజి రెడ్డి, ప్రదీప్‌రావు, తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, చైతన్య, గోవింద్ సింగ్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

నా ఒత్తిడితోనే ఇండో-పాక్ యుద్ధం ఆగింది

24న హైదరాబాద్‌లో శాంతి సభ: పాల్

సాక్షి, న్యూఢిల్లీ: తన ఒత్తిడివల్లే భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం ఆగిందని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాల్ స్పష్టం చేశారు. ఇందుకోసం కొన్ని దేశాల అధ్యక్షులను కలిసినట్లు వివరించారు. ఆ ఫొటోలు బయటకు రావొద్దని.. వారు స్వయాన కోరడంతో బయటపెట్టలేదన్నారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ శాంతి కోసం ఈనెల 24న హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో శాంతిసభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించామని చెప్పారు. భారత్–పాకిస్తాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపినట్లు.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించుకోవడం హాస్యాస్పదమన్నారు. టర్కీకి వెళ్లే సమయంలో ఇండిగో విమాన సంస్థ తనపై దురుసుగా ప్రవర్తించిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాయ్‌కాట్ ఇండిగో.. అంటూ కేఏ పాల్ పిలుపునిచ్చారు.

హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి: హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ కోర్సుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణంలోని చేనేత సహకార సంఘంలో శుక్రవారం ఐఐహెచ్‌టీ ప్రవేశాలపై చేనేత కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2025–26 సంవత్సరానికి ఖాళీగా ఉన్న 60 సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో పాటు వయసు 15 నుంచి 23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 15 నుంచి 25 ఏళ్ల వయసున్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కమిషన్ ద్వారా నెలకు రూ.5 వేలు, తెలంగాణ చేనేత, జౌళిశాఖ నుంచి రూ.2500 ఉపకార వేతనాలను కూడా అందజేస్తారన్నారు. కోర్సు ఫీజు, రికార్డులు, పుస్తకాలు, పరీక్ష ఫీజు కలిపి మొత్తం రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తిగల వారు జిల్లా చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో లేదా హైదరాబాద్‌లోని ఐఐహెచ్‌టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఫోటో.. స్టోరీ



పులి మనతో మాట్లాడగలదా?
తన బాధను మనతో చెప్పుకోగలదా?
ఈ ఫొటో చెప్పగలదు..
ఆ పులి కథనే కాదు..
అందులోని అంతులేని వ్యథనూ
మనకు కళ్లకు కట్టినట్లు చూపించగలదు

ఓ గదిలో బంధించి కొడితే..
పిల్లి అయినా పులిలా మారుతుందట..
కానీ అదే గదిలో ఓ పులి
పిల్లిలా మారిన కథ ఇది...
ఆ పులి పేరు... సలమాస్..

సలమాస్.. ఓ ఇండో చైనీస్ ఆడ పులి.. థాయ్‌లాండ్‌లోని ఓ ప్రైవేటు బ్రీడింగ్ ఫార్మ్ దాని నివాసం. జీవిత ఖైదు వేసినా.. 14 ఏళ్ల తర్వాత విడుదలయ్యే చాన్స్ ఉంది.. సలమాస్ విషయంలో అది 20 ఏళ్లు.. చిన్నపాటి కాంక్రీట్ గదిలోనే అన్నేళ్లూ గడిపేసింది. తొలి సంధ్యను చూసింది లేదు.. తొలకరిలో తడిచింది లేదు.. జీవితాంతం పిల్లల్ని కనే యంత్రంగా పనిచేసింది. థాయ్‌లాండ్‌లోని టైగర్ టూరిజం, పులుల పళ్లు, గోర్లు, చర్మం, ఎముకలు, పంజా, మాంసం వంటి అక్రమ విక్రయాల వ్యాపారాల కోసం వరుసగా పిల్లల్ని కంటూనే ఉంది. ఈ క్రమంలో తన ఆరోగ్యం క్షీణించింది. చిక్కిశల్యమైంది. ఎముకల గూడులా మారింది. కానీ నిర్వాహకుల మనసు కరగలేదు. మరణమే మేలు అనుకునేలా తన బతుకును మార్చారు. దానికి నిదర్శనమే ఈ చిత్రం. అయితే, అదృష్టవశాత్తూ 2023 డిసెంబర్‌లో వైల్డ్ లైఫ్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆఫ్ థాయ్‌లాండ్ సలమాస్‌తోపాటు ఆ ఫాంలో ఉన్న మరికొన్ని పులులను రక్షించింది. వాటిని తమ అభయారణ్యానికి తరలించింది.



ఇక్కడే సలమాస్ తన జీవితపు మలి సంధ్యలో తొలి సంధ్యను చూసింది. తొలకరిలో తడిచింది. తొమ్మిది నెలల అనంతరం అక్కడే తుది శ్వాస విడిచింది.

సలమా అంటే అరబిక్‌లో శాంతి అని అర్థం అట. రెస్ట్ ఇన్ పీస్ అంటే మరణానంతరం శాంతి లభించుగాక అని అర్థం అట.. జీవితాంతం అశాంతితో బతికిన సలమాస్.. రెస్ట్ ఇన్ పీస్!


బ్రీడింగ్ ఫార్మ్‌లో సలమాస్ దయనీయ స్థితిని తన ఫొటోతో చిత్రిక పట్టిన ఆమీ జోన్స్‌కు ఇటీవలి ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రఫీ పోటీల్లో హ్యూమానిటీ వెర్సస్ నేచర్ విభాగంలో తొలి బహుమతి దక్కింది.

- సాక్షి, సెంట్రల్ డెస్క్

అందాల పోటీలు.. అధికారుల సిగపట్లు

స్పాన్సర్‌షిప్స్ విషయంలో అధికారుల తప్పటడుగులు
ఖర్చును మించి ఆదాయం వచ్చేలా ఉన్నా అస్తవ్యస్తం
పర్యాటక శాఖ ఉన్నతాధికారుల మధ్య కీచులాటలు
పోటీదారుల కాళ్లు కడిగించటంపై ప్రభుత్వం సీరియస్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీలను ఘనంగా నిర్వహించి చూపాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంటే, ఆ పనిని సక్రమంగా నిర్వహించాల్సిన అధికారులు మాత్రం కీచులాటలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల మధ్య సమన్వయం కొరవడి చివరకు ప్రభుత్వానికే తలవంపులు తెచ్చేలా మారింది. ఈ పోటీల నిర్వహణలో ప్రధాన భూమిక పర్యాటక శాఖదే. అందులో అంతర్భాగమైన తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థలో ఈడీ స్థాయి అధికారిని పోటీలు కొనసాగుతుండగానే మాతృ సంస్థకు పంపటం వెనుక అధికారుల మధ్య వివాదాలే కారణమన్న చర్చ జరుగుతోంది.



స్పాన్సర్ల విషయంలో ప్రభుత్వం సీరియస్..

పోటీల నిర్వహణ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం–మిస్ వరల్డ్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా చెరిసగం భరిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్వహణ ఖర్చుల అంచనా రూ.57 కోట్లని ఇప్పటికే ప్రభుత్వం తెలిపింది. దాదాపు రూ.25 కోట్లను మించి స్పాన్సర్‌షిప్ మొత్తం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ, ఆ అంచనాలు తలకిందులయ్యాయని సమాచారం. పోటీలు ప్రారంభం కాకముందే స్పాన్సర్‌గా ఉండేందుకు ఓ పెద్ద బ్యాంకు ముందుకొచ్చి, ప్రభుత్వం ఆశించిన మొత్తం చెల్లించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అయితే, ఒక్క బ్యాంకుకే మొత్తం స్పాన్సర్‌షిప్ ఇవ్వలేమని, మరికొన్ని సంస్థలతో కలిపి ఇస్తామని ఓ ఉన్నతాధికారి ఆ బ్యాంకు ప్రతినిధులతో చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ బ్యాంకు వెనక్కు వెళ్లిపోయినట్లు సమాచారం. ఆ తర్వాత కొన్ని సంస్థలు ముందుకొచ్చినా.. వాటితో ఓ ఉన్నతాధికారి సరిగా వ్యవహరించకపోవటంతో అవి కూడా వెనుదిరిగాయని చెబుతున్నారు. సదరు సంస్థలతో అధికారులు సరిగా డీల్ చేసి ఉంటే ప్రభుత్వం ఖర్చు చేయాల్సిన మొత్తానికి మించి ఆదాయం సమకూరి ఉండేదని అంటున్నారు. మరోవైపు ఒకరిద్దరు అధికారులు ఈ స్పాన్సర్‌షిప్ వ్యవహారాన్ని సొంత లబ్ధికి వాడే ప్రయత్నం చేశారని, దానిపై విజిలెన్స్ విచారణ కూడా జరుగుతోందన్న ప్రచారం సాగుతోంది. వెరసి కీలక స్పాన్సర్‌షిప్స్ వ్యవహారంలో యంత్రాంగం వైఫల్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్టు తెలుస్తోంది.

అధికారుల మధ్య కీచులాటలు..

ప్రపంచ సుందరి పోటీల ఏర్పాట్లను ప్రారంభంలో అప్పటి పర్యాటకశాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్ పర్యవేక్షించారు. ప్రభుత్వం ఆమెను బదిలీ చేసి ఈ బాధ్యతను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్‌కు అప్పగించింది. ఆ సమయంలో సీఎంతో జరిగిన ఓ సమావేశంలోనే ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య వివాదం మొదలైనట్లు తెలిసింది. ఈ పోటీల్లోని కొన్ని కార్యక్రమాలకు సాధారణ ప్రజలను కూడా అనుమతించాలని ఆ సమావేశంలో పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి ప్రతిపాదించారు. అప్పుడే కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జయేశ్‌రంజన్‌కు దీనిపై సమాచారం లేదు. చివరకు కొన్ని కార్యక్రమాలకు సాధారణ ప్రజలను అనుమతించాలని సీఎం ఆదేశించారు. ఇంతటి కీలక నిర్ణయం తనకు తెలియకుండా తీసుకోవటమేంటని ప్రకాశ్‌రెడ్డిని జయేశ్‌రంజన్ ప్రశ్నించినట్టు సమాచారం. ఈ ఘటన ఆ ఇద్దరు అధికారుల మధ్య కొంత అగాధానికి కారణమైందని పర్యాటక శాఖలో ప్రచారం జరుగుతోంది. పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, ఈడీ విజయ్ మధ్య కూడా అభిప్రాయ భేదాలు వచ్చాయని, అందుకే విజయ్‌ని ఉన్నఫలంగా మాతృసంస్థకు పంపారని అంటున్నారు.

కాళ్లు కడిగించారనే అపవాదు..

ఇటీవల వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయ సందర్శనకు వెళ్లినప్పుడు ఆలయాల్లోకి వెళ్లేముందు మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లు కడిగిన ఘట్టం ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతోంది. అక్కడ సాధారణ భక్తులు కాళ్లు కడుక్కున్నట్టుగా ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఉంటే సరిపోయేది. కానీ, పోటీదారులను కుర్చీల్లో కూర్చోబెట్టి కాళ్ల కింద కొత్త పళ్లాలు ఉంచి, చెంబులతో నీళ్లు పోసి సిబ్బందితో కాళ్లు కడిగించారు. కొందరు సిబ్బంది టవల్‌తో కాళ్లను తుడిచారు. ఇది తీవ్ర విమర్శలకు దారి తీసింది. అసలు ఇలా పళ్లాల్లో కాళ్లుంచి కడిగించే ఆలోచన ఎవరు చేశారంటూ తర్వాత పర్యాటక శాఖ మంత్రి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.



ఎక్స్‌పీరియం ఎకో పార్కులో ప్రపంచ సుందరి పోటీదారులు



మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లల మర్రి వద్ద కళాకారుల నృత్య పదర్శన

ఏం ట్రీ.. 700 ఏళ్లా..?

పిల్లలమర్రిని సందర్శించిన పోటీదారులు

మహా వృక్షాన్ని చూసి మురిసిపోయిన సుందరీమణులు
- హైదరాబాద్‌లోని ఎక్స్‌పీరియం ఎకో పార్కు సందర్శన
- ఏఐజీ ఆసుపత్రిలో వైద్య సేవలను పరిశీలించిన పోటీదారులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, హైదరాబాద్/శంకర్‌పల్లి: రాష్ట్రంలో ప్రపంచ సుందరి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పోటీదారులు శుక్రవారం పలు పర్యాటక, వైజ్ఞానిక ప్రాంతాలను సందర్శించి సందడి చేశారు. పోటీదారుల్లోని ఒక బృందం శుక్రవారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రఖ్యాత పిల్లల మర్రిని సందర్శించింది. మరికొందరు హైదరాబాద్ శివార్లలోని ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌తోపాటు ఏఐజీ ఆసుపత్రిని సందర్శించారు.

పిల్లల మర్రికి ఫిదా: పాలమూరులోని ప్రఖ్యాత పిల్లల మర్రి వృక్షాన్ని చూసి మిస్ వరల్డ్ పోటీదారులు ఫిదా అయ్యారు. మహా వృక్ష చరిత్ర, పునరుజ్జీవం గురించి తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పోటీదారుల్లో గ్రూప్–2లోని 23 మంది శుక్రవారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లాలోని చారిత్రక పిల్లలమర్రి పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. వీరికి బంజారాల నృత్యాలు, డోలు వాయిద్యాల మధ్య కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నమస్కారం తెలంగాణ, తెలంగాణ.. జరూర్ ఆనా అంటూ సుందరీమణులు నినాదాలు చేశారు. ముందుగా 16వ శతాబ్దానికి చెందిన శ్రీ రాజరాజేశ్వర దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం పురావస్తు ప్రదర్శనశాలకు చేరుకుని చారిత్రక శిల్పాలు, పురాతన కళాఖండాలను తిలకించారు. ప్రత్యేక గైడ్ శివనాగిరెడ్డి వాటి విశిష్టతను వివరించారు. ఆ తర్వాత పిల్లల మర్రి మహావృక్షాన్ని సందర్శించారు. దాదాపు మూడున్నర ఎకరాల్లో విస్తరించిన 700 సంవత్సరాల వయసు కలిగిన మహావృక్షం మానులు, ప్రకృతి అందాలను చూసి మైమరచిపోయారు. ఈ సందర్భంగా అధికార యంత్రాంగం తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన బోనాలు, బతుకమ్మ ఆటపాటలు విదేశీ వనితలను విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీదారులు స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం గురుకుల విద్యార్థులతో ముచ్చటించారు. పోటీదారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు చేనేత కార్మికులు తయారు చేసిన చేనేత పట్టు వస్త్రాలు అందజేశారు.

మనసు దోచుకున్న ఎక్స్‌పీరియం..

హైదరాబాద్ శివారులోని ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌ను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించి సందడి చేశారు. మిస్ వరల్డ్ –2024 విజేత క్రిస్టినా పిష్కోవాతోపాటు అమెరికా ఖండ ఓషియానా విభాగంలోని దేశాలకు చెందిన 23 మంది ఇందులో పాల్గొన్నారు. డోలు వాయిద్యాలకు అనుగుణంగా పోటీదారులు ఉత్సాహంగా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. అనంతరం ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌లో గ్రీన్ టెక్నాలజీ, పర్యావరణ పరిరక్షణ, స్థానిక జీవవైవిధ్యం, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి అధికారులు వారికి వివరించారు. చిన్నారులతో కలిసి పోటీదారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మిస్ కెనడా ఎమ్మా మోరిసన్ మాట్లాడుతూ.. 'ఈ ప్రదేశం అద్భుతంగా ఉంది. నా తల్లిదండ్రులను త్వరలో హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఈ అందాలను చూపిస్తా'అని తెలిపారు. మిస్ యూఎస్ అథెనా క్రాస్బీ.. 'భూమిని రక్షించడం మన బాధ్యత. ఎక్స్‌పీరియం, సృజనాత్మక డిజైన్‌తో ప్రకృతితో ఎలా సామరస్యంగా జీవించవచ్చో చూపిస్తుంది'అని పేర్కొన్నారు. 'మా దేశంలో కూడా ఇలాంటి పర్యావరణ అద్భుతాలను సృష్టించాలని ఉంది'అని మిస్ బ్రెజిల్ జెస్సికా పెడ్రోసో తెలిపారు.

కుటుంబ ఆరోగ్యం మహిళ చేతిలోనే..

తల్లిగా, సోదరిగా, కుమార్తెగా, ఆరోగ్య సంరక్షణ కార్మికురాలిగా, వృత్తి నిపుణురాలిగా, నాయకురాలిగా మహిళలు ప్రపంచంలో అనేక పాత్రలు పోషిస్తున్నారని ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా అన్నారు. శుక్రవారం మిస్ వరల్డ్ పోటీదారులు ఏఐజీ ఆసుపత్రిని సందర్శించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఫలితంగా కుటుంబం, సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఏఐజీ ఆసుపత్రి చైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. గొప్ప వైద్యులు, శాస్త్రవేత్తలు గుండె, మెదడు, మూత్రపిండాలు వంటి ప్రధాన అవయవాలపై మాత్రమే దృష్టి సారించేవారని.. ఇప్పుడు ఆ కోణం మారిందని అన్నారు.



ఏఐజీ ఆసుపత్రిలో అందించే సేవలను మిస్ వరల్డ్ పోటీదారులకు వివరిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారితో మాట్లాడుతున్న మిస్ మలేషియా

28న పోలవరంపై ప్రధాని మోదీ సమీక్ష

ముంపు సమస్యలపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీ సీఎస్‌లతో చర్చ



సాక్షి, హైదరాబాద్: పోలవరం జాతీయ ప్రాజెక్టు పనులపై ఈనెల 28న ప్రధాని నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించనున్నారు. భూసేకరణ, నిర్వాసితులకు పునరావాస కల్పన, పనుల పురోగతిని సమీక్షించి.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ఒడిశాల్లో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పబ్లిక్ హియరింగ్(బహిరంగ విచారణ) నిర్వహించడంపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు దిశానిర్దేశం చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా చేపట్టిన ప్రాజెక్టులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను గైడ్ చేసేందుకు పీఎం ప్రగతి కార్యక్రమాన్ని ప్రధాని మోదీ చేపట్టారు. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ప్రాజెక్టులో 41.15 మీటర్ల ఎత్తు వరకూ నీటిని నిల్వ చేయడానికి వీలుగా 15,227.84 ఎకరాల భూమిని ఇంకా సేకరించాలి. పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయాలంటే 53,393.89 ఎకరాల భూమిని ఇంకా సేకరించాల్సి ఉంది. ప్రాజెక్టు పనులు ఇప్పటి వరకూ 60.78 శాతం పూర్తయ్యాయి. రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేయాలంటే.. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లలో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖతో కలిసి పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలి. ప్రాజెక్టు భూసేకరణ, నిర్వాసితులకు పునరావాస కల్పన పనుల్లో పురోగతిని సమీక్షించి, గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆంధ్రప్రదేశ్ సీఎస్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల తమ ప్రాంతాలు ముంపునకు గురవుతాయని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో కేసులు వేశాయి. ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయాలంటే ఆ మూడు రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేయాల్సి ఉంది. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలి. బ్యాక్ వాటర్ ప్రభావంపై నాలుగు రాష్ట్రాల సీఎస్‌లతో చర్చించి.. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించడంపై ప్రధాని మోదీ మార్గనిర్దేశం చేయనున్నారు.

జరిమానా విధిస్తాం జాగ్రత్త

గ్రూప్-1 అభ్యర్థులకు సుప్రీంకోర్టు హెచ్చరిక
- మళ్లీ మళ్లీ ఎందుకు వస్తారంటూ సీరియస్
- పిటిషన్ విత్‌డ్రా చేసుకున్న అభ్యర్థులు



సాక్షి, న్యూఢిల్లీ: 'మీ ఇష్టం వచ్చినట్లు ఒకే విషయంపై పదే పదే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే జరిమానా విధించాల్సి ఉంటుంది జాగ్రత్త..'అని గ్రూప్–1 అభ్యర్థులను సుప్రీంకోర్టు హెచ్చరించింది. 'ఈ విషయమై గతంలోనూ కొందరు కోర్టును ఆశ్రయించారు. పరీక్షలు అయ్యాక దీనిపై వాదనలు అవసరమా అని అప్పుడే మేం ప్రశ్నించాం. ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేశాం. ఇప్పుడు మళ్లీ మీరెందుకు వచ్చారు? మేం డిస్మిస్ చేసిన విషయం మీకు తెలియదా?'అంటూ నిలదీసింది. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. అభ్యర్థులు పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు, ఆ పిటిషన్ విత్‌డ్రాకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది. గ్రూప్–1,2,3 నోటిఫికేషన్లకు సంబంధించిన జీవో 29, జీవో 33ను, పీహెచ్‌సీ రిజర్వేషన్లు వర్టికల్‌గా అమలు చేయడాన్ని సవాల్ చేస్తూ కుమ్మరి ప్రవీణ, మరో 12 మంది 370 పేజీలతో కూడిన రిట్ పిటిషన్‌ను ఏప్రిల్ 30న సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ జోమాల్య బగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎస్.నిరంజన్ రెడ్డి, పిటిషనర్ల తరఫున రానా ముఖర్జీ వాదనలు వినిపించారు. గ్రూప్–1 నోటిఫికేషన్ వ్యవహారంలో జీవో 29 రద్దు అంశంపై సుప్రీంకోర్టు ఇప్పటికే విచారణ జరిపి, కొట్టివేసిందని నిరంజన్ రెడ్డి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం అభ్యర్థులపై సీరియస్ అయ్యింది. 'పిటిషన్‌లో కొత్తగా ఏం ఉంది? ఒకే అంశంపై ఇంతమంది ఇన్నిసార్లు ఎందుకు? ఇలా చేస్తే జరిమానా విధిస్తాం..'అని హెచ్చరించింది. దీంతో పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని రానా ముఖర్జీ అభ్యర్థించగా ధర్మాసనం అంగీకరించింది.

సహయోగ్ పోర్టల్‌తో అనుసంధానం కండి

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించిన కేంద్రహోం మంత్రిత్వ శాఖ

సాక్షి, హైదరాబాద్: అసత్య ప్రచారాలు, అసభ్యకరమైన సందేశాలు, వీడియోల సర్క్యులేషన్‌లో పలు సోషల్ మీడియా యాప్‌లు కీలకంగా మారిన విషయం తెలిసిందే. ఇలాంటి సోషల్ మీడియా యాప్‌లను నియంత్రించడంలో భాగంగా కేంద్ర హోంశాఖ కీలక చర్యలు ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ సహయోగ్ పోర్టల్‌తో అన్ని సోషల్ మీడియా యాప్‌లు ఇంటిగ్రేట్ కావాలని కేంద్ర హోంశాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యేకించి పిల్లలపై లైంగిక వేధింపుల విషయాలు (సీఎస్ఏఎం–చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ మెటీరియల్)కు సంబంధించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ అయ్యే అంశాలపై వెనువెంటనే (రియల్ టైంలో) సమాచారం అందించేలా ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్లను నియమించుకోవాలని సూచించింది. అన్ని సోషల్ మీడియా యాప్‌ల నిర్వాహకులు సీఎస్ఏఎం అంశాలను అప్‌లోడ్ అయిన వెంటనే గుర్తించేలా ఏపీఐ (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేసెస్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత టూల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని చెప్పింది. చిన్నారులకు సంబంధించి లైంగిక వీడియోలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ తరహాలో తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలను సైతం పంపాలని పేర్కొంది.

సహయోగ్ పోర్టల్ అంటే...

చట్ట విరుద్ధమైన చర్యకు ఉపయోగించే ఏదైనా సమాచారం, డేటా లేదా కమ్యూనికేషన్ లింక్‌ను తొలగించడానికి లేదా నిలిపివేయడానికి వీలుగా మధ్యవర్తులకు (ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్ వంటి ఇంటర్మీడియేటరీస్) ప్రభుత్వం లేదా చట్టబద్ధమైన ఏజెన్సీలు ఐటీ చట్టం 2000 ప్రకారం నోటీసులు పంపే ప్రక్రియను ఆటోమేట్ చేయడానికి 'సహయోగ్'పోర్టల్‌ను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది. చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ సమాచారంపై తక్షణ చర్యలు తీసుకునేలా చూసుకోవడానికి ఇది దేశంలోని అన్ని అధీకృత ఏజెన్సీలు, అన్ని మధ్యవర్తులను ఒకే వేదికపైకి తీసుకొస్తుంది. ఈ పోర్టల్ భారత పౌరులకు క్లీన్ సైబర్ స్పేస్‌ను సాధించడంలో సహాయపడుతుంది.



ఏ మనుష్యుని మనస్సు ఇంద్రియముల వెంట తిరుగుచుండునో
వాని బుద్ధియు గాలి వలన నావ కదిలినట్లు చలించుచుండును.
– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 17 మే 2025

మళ్లీ చైనా 'నామకరణోత్సవం'

కయ్యానికి కాలుదువ్వటం, గిల్లికజ్జాలకు దిగటం చైనాకు అలవాటైన విద్య. అందులో భాగంగానే మన అరుణాచల్‌ప్రదేశ్ ప్రాంతాలకు మాండరిన్ పేర్లు తగిలించి మళ్లీ పేచీకి దిగింది. తమ దేశంలో పేర్లు మార్చుకుంటే అది అంతర్గత వ్యవహారమవుతుంది. దాని వెనక ఏ సెంటిమెంటువున్నదో బయటివారికి అనవసరం. కానీ పొరుగు ప్రాంతాలకు కొత్త పేర్లు ఆలోచించే భారాన్ని ఎందుకు నెత్తినేసుకున్నట్టు? ఏదైనా ప్రాంతాన్ని సొంతం చేసుకునేముందు ఆ ప్రాంతానికి తమదైన పేరు తగిలిస్తే సరిపోతుందని చైనా నేతలు భావిస్తున్నట్టున్నారు. సంబంధాలు మెరుగుపడతాయనుకున్న ప్రతిసారీ కొత్త పేచీకి దిగటం చైనాకు రివాజైంది. 2020లో గల్వాన్ లోయలో అకారణంగా ఘర్షణలకు దిగి మన జవాన్లు 20మందిని బలితీసుకుంది. తాను కూడా మన జవాన్ల చేతుల్లో భారీ నష్టం చవిచూసింది. చర్చోపచర్చల తర్వాత ఇప్పుడిప్పుడే సంబంధాలు మెరుగవుతు న్నాయి. మానస సరోవర యాత్రకు మన యాత్రికులను అనుమతిస్తామని నాలుగేళ్ల తర్వాత ఇటీ వలే చైనా ప్రకటించింది. ఈలోగానే హఠాత్తుగా ఈ వివాదాన్ని తెరపైకి తెచ్చింది. అరుణాచల్‌పై ఏదోరకంగా ఆధిపత్యాన్ని చాటుకునే ప్రయత్నం చేయటం, దాన్ని 'వివాదాస్పద ప్రాంతం'గా అభివర్ణించటం చైనా ఎప్పుడూ మానుకోలేదు. ఇరు దేశాల మధ్యా సుహృద్భావ సంబంధాలు ఏర్పడి అయిదు దశాబ్దాలవుతోంది. శిఖరాగ్ర సమావేశాలు జరగటం, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదరటం, ఇరువైపులా పౌరులు రాకపోకలు సాగించటం వంటివన్నీ కొనసాగుతున్నాయి. కానీ మన అధినేతలెవరైనా అరుణాచల్ వెళ్లినప్పుడల్లా మతిభ్రమించినట్టు గొడవకు దిగటం అలవాటైంది. గగనతలాన్ని అతిక్రమించి అరుణాచల్‌లోకి చైనా యుద్ధ విమానాలు చొచ్చుకురావటం కూడా షరా మామూలే.

ఈ చిత్ర విచిత్ర విన్యాసాల్లో భాగమే అరుణాచల్‌లోని ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టడం. మొదటగా 2017లో దీన్ని ప్రారంభించింది. అటు తర్వాత 2021నుంచి వరసగా ఇదే పని చేస్తోంది. మళ్లీ తాజాగా మరోసారి తన పైత్యాన్ని ప్రదర్శించింది. 2017లో మొత్తం ఆరు ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టింది. ఇంచుమించు ఆ రాష్ట్రం నలుదిక్కులావున్న ప్రాంతాలు ఇందులో ఉన్నాయి. 2021లో 15 జనావాస ప్రాంతాలూ, నాలుగు పర్వతాలూ, రెండు నదులూ, ఒక పర్వతప్రాంత మార్గమూ ఎంపిక చేసుకుని మాండరిన్ పేర్లు పెట్టింది. 2023లో 11, ఆ మరుసటేడాది 30 ప్రాంతాలు ఎంపిక చేసుకుని పేర్లు మార్చింది. తాజాగా 27 ప్రాంతాలకు చైనా కొత్త పేర్లు పెట్టింది. ఇందులో రెండు భూభాగాలూ, రెండు జనావాస ప్రాంతాలూ, అయిదు పర్వత శిఖరాలూ, రెండు నదులతోసహా అనేకం ఉన్నాయి. ఈసారి అదనపు విశేషం ఏమంటే... వీటిని పాలనాపరమైన సబ్ డివిజన్లుగా విభజించి ఏవి ఏ పరిధిలోకొస్తాయో ఏకరువు పెట్టింది. పైకి చూడటానికి ఇదంతా తెలివితక్కువతనంగా, పనికిమాలిన చర్యగా అనిపించవచ్చు. కానీ భవిష్యత్తులో ఆ ప్రాంతాలు తనవేనని దబాయించటానికే ఇంత శ్రమ తీసుకుంటున్నదని వ్యూహాత్మక వ్యవహారాల నిపుణులంటారు. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో దీవులకు కూడా ముందు ఈ మాదిరిగానే పేర్లు తగిలించి, అటుతర్వాత అవి ఎప్పటినుంచో తమవని పేచీకి దిగింది. జపాన్‌తోనూ సెంకాకు దీవుల విషయంలో ఇదే మాదిరిగా గొడవ ప్రారంభించింది.

అరుణాచల్‌లో దాదాపు 90,000 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని తనదిగా చెప్పుకోవటం చైనాకు ఎప్పటినుంచో అలవాటు. మన దేశం బ్రిటిష్ వలసపాలకుల ఏలుబడిలోవుండగా 1914లో సిమ్లాలో భారత్, టిబెట్‌ల మధ్య సరిహద్దు ఒప్పందం కుదిరింది. దాని ఆధారంగా ఉనికిలోకొచ్చిన మెక్‌మెహన్ రేఖ రెండు ప్రాంతాలనూ విభజిస్తుంది. ఆ సమయంలో చర్చల్లో పాల్గొన్న చైనా ప్రతినిధి ఇందుకు ఆమోదం తెలిపేందుకు నిరాకరించాడు. అంతర్జాతీయ ఒప్పందాలు కుదుర్చుకునే స్వాతంత్ర్యం టిబెట్‌కు లేదని వాదించాడు. 1949లో అక్కడ కమ్యూనిస్టులు అధికారంలోకొచ్చాక వారు కూడా ఈ వాదననే తలకెత్తుకున్నారు. చారిత్రకంగా అరుణాచల్... టిబెట్‌లో అంతర్భాగమని చెబుతూ అందుకు తవాంగ్, లాసాల్లోని బౌద్ధారామాల మధ్య ఉన్న సంబంధాలను ఏకరువు పెడుతోంది. అరుణాచల్‌ను దక్షిణ టిబెట్‌గా భావిస్తూ తనదైన మాండరిన్‌లో జంగ్నాన్ అనటం, అక్కడివారికి విడి వీసాలు జారీచేయటం కూడా పాత ధోరణే.

ఒకపక్క వాస్తవాధీనరేఖ వద్ద అయిదేళ్ల క్రితం జరిగిన ఘర్షణలపై చర్చలు సాగుతూ, ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు ఏర్పడుతుండగా మళ్లీ పేర్ల జోలికి పోవటంలో మతలబువుంది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు చైనా అందించిన ఆయుధ సామగ్రి సంగతి వెల్లడైంది. అవి మన త్రివిధ దళాల శక్తిముందు సరిపోలేదు. మనతో చెలిమికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నట్టు కనబడుతూనే ఈ వివాదంలో పాక్ పక్షం చేరింది. ఈ సమయంలో పేర్ల వివాదం రాజేస్తే దృష్టి మళ్లించటం సులభమవుతుందని చైనా అంచనా వేసుకున్నట్టు కనబడుతోంది. వ్యూహాత్మకంగా అరుణాచల్ మనకెంతో ముఖ్యమైనది. ఈశాన్య భారత్‌కు ఇది రక్షణకవచంగా ఉపయోగపడుతుంది. ఈ ప్రాంతాన్ని ఎలాగైనా సొంతం చేసుకుంటే ఆగ్నేయాసియా దేశాలతో సాన్నిహిత్యం మరింత పెరుగుతుందని చైనా ఆశిస్తోంది. అదీగాక ఇక్కడ సహజవనరులు పుష్కలంగావున్నాయి. జల విద్యుదుత్పత్తికి వీలుంటుంది. ఈ ప్రాంత నదుల్ని గుప్పెట్లో పెట్టుకుంటే భవిష్యత్తులో నీటిని ఆయుధంగా వాడుకోవచ్చు. ఇంత దురాలోచనతో చైనా వేస్తున్న ఎత్తుగడలను మొగ్గలోనే తుంచటం, పేర్లు మార్చినంతమాత్రాన భౌగోళిక వాస్తవికతలు తారుమారు కావని చెప్పటం అవసరం.

అక్షరాలా... కక్షసాధింపు!

అభిప్రాయం



కొమ్మినేని శ్రీనివాసరావు

ఎవరైనా బలవంతంగా ఇంట్లోకి చొరబడితే ఏం చేస్తాం? ముందుగా అడ్డుకునే ప్రయత్నం చేస్తాం. ఆ తరువాత పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. మరి పోలీసులే వ్యక్తుల ఇళ్లల్లోకి బలవంతంగా చొరబడితే? చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తే? ప్రజల స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వమే వాటిని హరిస్తూ అరాచకాలకు పాల్పడితే? ఏపీలో ప్రస్తుత పరిస్థితి ఇదే!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిగిలిన పనులన్నీ పక్కనబెట్టి మరీ పోలీసులతో తప్పుడు కేసులు పెట్టిస్తూ విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను వేధిస్తూ చివరికి ప్రజల పక్షాన వార్తలు రాస్తున్న మీడియా గొంతు నొక్కేందుకూ ప్రయత్నిస్తోంది. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డి నివాసంపై పోలీసుల దాడిని కూడా ఈ కోణంలోనే చూడాలి. అధికారంలోకి వచ్చినప్పటినుంచీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి దుశ్చర్యలకు అంతు లేకుండా పోతోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఎప్పుడూ మీడియాపై ఒక కన్నేసే ఉంచుతారు. బాకా మీడియాను ఒక రకంగా; వైఫల్యాలను, ప్రభుత్వ స్కామ్‌లను బయటపెట్టే మీడియాను మరో రకంగా చూస్తారు. మాట వినని జర్నలిస్టులను ఉద్యోగాల నుంచి తొలగించేలా యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకు వస్తారు కూడా! అనుకూలంగా ఉండే మీడియాకు రకరకాల రూపాలలో మేళ్లు చేస్తారు. తద్వారా ఆ యాజమాన్యాలను తన గుప్పిట్లో ఉంచుకుంటారు.

1995లో తన మామ ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా ఒక వర్గం మీడియా ద్వారా ఆయనపైనే– వ్యతిరేక ప్రచారం అనండి... దుష్ప్రచారం అనండి– చేయించిన చరిత్ర చంద్రబాబుది అని అప్పటి నుంచి రాజకీయాలు చూస్తున్నవారు చెబుతుంటారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా ఉంటూనే ఆయన తెలివిగా ఎన్టీఆర్ ప్రతిష్ఠను తగ్గించే వ్యూహాలు అమలు చేశారని ఆరోపణలున్నాయి. ఎన్టీఆర్ భార్య లక్ష్మీపార్వతిని బూచిగా చూపెట్టేందుకు 'ఈనాడు', ఆంధ్రజ్యోతి వంటి పత్రికలను బాగా వాడుకోగలిగేవారు. 'ఈనాడు' చూడటానికే అసహ్యంగా ఉండే ఘోరమైన కార్టూన్లు ఎన్టీఆర్‌పై వేసేది. అయినా ఆ రోజుల్లో ఈ పత్రికలపై ఎన్టీఆర్ కేసులు పెట్టలేదు.

హామీలను గుర్తు చేయకూడదా?

మామను కూలదోసి ముఖ్యమంత్రి అయిన తరువాత చంద్రబాబు పాలన మాటలా ఉన్నా అనుకూల మీడియా వ్యవస్థనైతే బాగానే ఏర్పాటు చేసుకున్నారు. మీటింగులు జరిగినా జరగకపోయినా, కల్పిత కథనాలకు కొదవ ఉండేది కాదు. అదే టైమ్‌లో రాజకీయ ప్రత్యర్థులపై బురద చల్లే వ్యూహాలు పక్కాగా అమలయ్యేవి. ఆ రోజుల్లో కూడా ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాసే కొన్ని పత్రికలకు ప్రభుత్వ ప్రచార ప్రకటనలు నిలిపివేసే వారు. కానీ ఇప్పటిలా బరితెగించి మరీ కేసులు పెట్టేవారు కాదనే చెప్పాలి. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వడం చంద్రబాబుకు కొత్తకాదు. అయితే, ఆ హామీలను అమలు చేయకపోయినా ఎవరూ వాటిని గుర్తు చేయకూడదు! అందుకోసం ఆయన నానా ప్రయత్నాలూ చేస్తుంటారు.

2014లో రైతుల సంపూర్ణ రుణమాఫీ కావచ్చు... కాపుల రిజర్వేషన్ ఉద్యమం కావచ్చు... మరేదైనా కావచ్చు... చంద్రబాబు పంథా ఒక్కటే. తనకు వ్యతిరేకంగా ఏదైనా జరుగుతుంటే అనుకూల మీడియా చేత వాటిని అణచివేసే ప్రయత్నం చేయడం. అంశం ఏదైనా, టీవీ ఛానళ్లలో అనుకూల ప్రచారమే సాగాలన్నది ఆయన ఆకాంక్ష. కాపుల రిజర్వేషన్ విషయమే తీసుకుందాం... ఇచ్చిన హామీ అమలుకు ముద్రగడ పద్మనాభం ఉద్యమం చేపడితే ఆ విషయం ప్రజలలోకి వెళ్లనీయకుండా కొన్ని టీవీ చానళ్లను బ్లాక్ చేయడానికి యత్నించారు. ఇదే చంద్రబాబు ప్రతిపక్షంలో ఉంటే మాత్రం అధికార పార్టీపై వ్యతిరేక వార్తలు రాయాలని జర్నలిస్టులకు నూరిపోస్తుంటారు. దానికి తగినట్లే 'ఈనాడు', 'ఆంధ్రజ్యోతి' వంటివి తమ రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కోసం ఉన్నవి, లేనివి కల్పించి వార్తలు ఇచ్చేవి. ఈ మీడియా 2019–2024 మధ్యలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై కక్కినంత విషం బహుశా ప్రపంచంలోనే మరే మీడియా కక్కి ఉండదు. ఇందుకోసం పచ్చి అబద్ధాలు రాసేందుకూ వెనుకాడలేదు ఈ సంస్థలు.



టీడీపీ మీడియా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న జగన్‌ను కించపరిచేలా కథనాలు ఇచ్చినా, చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ తదితరులు దారుణమైన వ్యాఖ్యలు చేసినా అప్పట్లో ఎవరిపై కేసులు పెట్టలేదు. కానీ 2024లో అనూహ్యంగా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చంద్రబాబు... 'సాక్షి' మీడియా అణచివేతకు యత్నిస్తూనే ఉన్నారు. పలువురు విలేకరులపై పోలీసు కేసులు నమోదవడం ఇందుకు నిదర్శనం. నెల్లూరు జిల్లా కావలి వద్ద ఎప్పుడో మూడేళ్ల క్రితం శిలాఫలకం పడవేశారంటూ అప్పటి ఎమ్మెల్యేతోపాటు విలేకరిపై కూడా కేసు పెట్టారట. కూటమి అధికారంలోకి వచ్చాక, టీడీపీ, జనసేన వారు లెక్కలేనన్ని శిలాఫలకాలను ధ్వంసం చేసినా ఒక్క కేసూ నమోదు కాలేదు. మనోభావాలు దెబ్బతిన్నాయంటూ ఎవరెవరో ఫిర్యాదు చేయడం... పోలీసులు హుటాహుటిన వైఎస్సార్ సీపీ వారిని అరెస్టు చేయడం సాధారణమై పోతోంది.

ముఖ్యమంత్రి కుమారుడు, మంత్రి లోకేశ్ 'రెడ్ బుక్' పేరుతో కక్ష రాజకీయాలు చేస్తున్నారు. ఎందుకు ఇవన్నీ? చాలా సింపుల్. ప్రభుత్వ తప్పులు ఎవరూ ఎత్తి చూపకూడదు. 'సూపర్ సిక్స్'తో సహా ఎన్నికల సమయంలో ఇచ్చిన 150 హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ఎవరూ ప్రశ్నించకూడదు. గత ప్రభుత్వం చేసిన అప్పులపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ తదితరుల అసత్యపు ప్రచారాన్ని ఎవరూ గుర్తు చేయకూడదు. ఏడాది తిరగకుండానే కూటమి ప్రభుత్వం చేసిన రూ.1.5 లక్షల కోట్ల అప్పులు ఎందుకు, దేనికి ఖర్చుపెట్టారు, అని ఎవరూ అడగకూడదు. ప్రభుత్వంలో జరుగుతున్న కుంభకోణాలను ఎవరూ వెలికి తీయకూడదు. 'సాక్షి' మీడియా ఇవన్నీ చేస్తున్నందునే చంద్రబాబు ప్రభుత్వం కక్ష కట్టి దాడి చేస్తోంది.

'సాక్షి' గొంతు నులమాలనా?

నిజానికి 'సాక్షి' మీడియా ప్రతీ వార్తనూ ఆధార సహితంగానే రాస్తుంది. సౌరశక్తి ఒప్పందాలనే తీసుకుందాం. జగన్ హయాంలో యూనిట్‌కు రూ.2.49లకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సంస్థ సెకీతో ఒప్పందం చేసుకుంది. ఇందుకు గగ్గోలు పెట్టిన చంద్రబాబు, ఎల్లోమీడియా... లక్ష కోట్ల రూపాయల నష్టం జరిగిపోయిందని ప్రచారం చేశాయి. తీరా చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిందేమిటి? అదే విద్యుత్తును రూ.4.60లకు కొనుగోలు చేస్తున్నారు. అంటే... యూనిట్‌కు దాదాపు రెండు రూపాయలు ఎక్కువ పోసి కొంటున్నారన్నమాట. అయినా సరే... దీనిపై 'ఈనాడు', 'ఆంధ్రజ్యోతి'ల్లో ఒక్క వార్త కూడా రాలేదు. 'సాక్షి' మాత్రం పక్కా ఆధారాలతో జరిగిన అవినీతిని వివరించింది. సౌరశక్తి కొనుగోళ్ల విషయంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో చంద్రబాబు ప్రభుత్వ ప్రతిష్ఠ మసకబారింది.

అలాగే... విశాఖలో టీసీఎస్‌కు 99 పైసలకు ఎకరా భూమి ఇవ్వడం; ఊరు, పేరు లేని ఒక కంపెనీకి అరవై ఎకరాలు కట్టబెట్టడం, అమరావతి రాజధాని నిర్మాణాల పేరుతో అధిక రేట్లకు ఇష్టారాజ్యంగా టెండర్లు కేటాయించడం, అప్పుల కోసం ఏకంగా రాష్ట్ర ఖజానాను కూడా తాకట్టు పెట్టడం, పెన్షన్లు మినహా మరే హామీ అమలు చేయకపోవడంతో ప్రజలలో అసంతృప్తి నెలకొనడం మొదలైన వార్తలను 'సాక్షి' మీడియా ఇస్తోంది. ఏలికలకు ఇది పంటి కింద రాయిలా మారింది. దీంతో 'సాక్షి'ని ఇబ్బంది పెట్టడానికి యత్నిస్తోంది. ఈ క్రమంలో ఆధారాలు లేని మద్యం స్కామ్‌ను సృష్టించి వైఎస్సార్‌సీపీ నేతల అరెస్టుకు చంద్రబాబు... పోలీసులను ప్రయోగించారు. నిందితులు 'సాక్షి' ఎడిటర్ ధనంజయ రెడ్డి ఇంటిలో ఉన్నారన్న అనుమానం వచ్చిందని పోలీసులు చెప్పా పెట్టకుండా విజయవాడలో ఆయన ఇంటిపై పడ్డారు. నిజంగా అలాంటి అనుమానం ఉంటే ఏమి చేయాలి? సెర్చ్ వారంటే ఇచ్చి సోదాలు చేయాలి. అసలు ఒక పత్రికా సంపాదకుడి ఇంటికి అంత ధైర్యంగా వెళ్లారంటే ఈ ప్రభుత్వం ఎంత నియంతృత్వంగా వ్యవహరిస్తున్నది అర్థం చేసుకోవచ్చు.

సాక్షి సిబ్బందిని మానసికంగా వేధించడానికి ఇలా చేసినట్లు తెలుసుకోవడం కష్టం కాదు. ఇంత మాత్రానికే 'సాక్షి' మీడియా వణికిపోతుందా? 2008 నుంచి 'సాక్షి' మీడియా ఇలాంటి ఆటుపోట్లను ఎన్నింటినో ఎదుర్కొంది. ఈ మీడియాను దెబ్బతీయడానికి కాంగ్రెస్‌తో కలిసి చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నిందీ... ఎన్ని కేసులు పెట్టించిందీ తెలియనిది కాదు. 2014 టర్మ్‌లో కూడా 'సాక్షి'ని లేకుండా చేయాలని ప్రయత్నించి విఫలం అయ్యారు. తిరిగి ఈ టర్మ్‌లో అంతకన్నా ఎక్కువగా కక్ష సాధింపు చర్యలకు తెగిస్తున్నారు. ఎడిటర్ ధనంజయ రెడ్డి వాటిని సమర్థంగానే ఎదుర్కొన్నారు. పోలీసులు మూడు గంటలపాటు అక్కడ ఉన్నా వారికి ఏమీ దొరకలేదు. దాంతో వారు సైలెంట్‌గా వెళ్లిపోక తప్పలేదు. సెర్చ్ వారంట్ లేకుండా వెళ్లడం ద్వారా పోలీసులు దుశ్చర్యకు పాల్పడినట్లు అయింది.

ఎమర్జెన్సీలో సైతం ఇందిరాగాంధీ ఇలాంటి పద్ధతులు అనుసరించి మీడియా గొంతు నులమాలని విశ్వయత్నం చేశారు. కానీ, అంతిమంగా ఆమె ఘోర పరాజయాన్ని మూట కట్టుకున్నారు. తొలుత ఇందిరాగాంధీ శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసి, ఆ తర్వాత తెలుగుదేశంను తన అధీనంలోకి తెచ్చుకుని రాజకీయం చేస్తున్న చంద్రబాబు నాయుడు కూడా ఇప్పుడు అవే పద్ధతులు అవలంబిస్తున్నారు. చరిత్ర చెప్పిన పాఠాలను మర్చిపోయి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఎవరికైనా ఓటమి తప్పదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ వ్యవహారాల వ్యాఖ్యాత

సోషల్ మీడియా



ఈడీ మళ్లీ మొదలుపెట్టింది. రాత్రి పొద్దుపోయాక 'గుజరాత్ సమాచార్' సహ యజమానులను అరెస్టు చేసిన పద్ధతి, సమయం ప్రశ్నలను రేకెత్తిస్తోంది. బీజేపీ పాలిత గుజరాత్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న చివరి వార్తాపత్రిక కాబట్టి మూల్యం చెల్లిస్తోందా? మీడియాను బలవంతంగా టేకోవర్ చేయడానికి ఇది మరో ప్రారంభమా?

– సాగరికా ఘోష్, రాజ్యసభ సభ్యురాలు (తృణమూల్)



ఇండియా విదేశాంగ విధాన శబ్దకోశానికి బహుశా ఒక ముఖ్యమైన వ్యక్తీకరణను జతచేయొచ్చని ఒక మాజీ సెక్యూరిటీ ఎనలిస్ట్ నాతో చెప్పారు. అదేమిటంటే – 'వ్యూహాత్మక భ్రమ'.

– ఎం.కె. వేణు, సంపాదకుడు



పాకిస్తాన్ తన ఆర్మీ హెడ్‌క్వార్టర్‌ను చక్లాలా (రావల్పిండి) నుంచి ఇస్లామాబాద్‌కు మారుస్తున్నట్టు వార్త. దానికి బదులుగా వారు మొత్తం పాకిస్తాన్‌నే ఇండియాకు దూరంగా ఎందుకు తీసుకెళ్లరు?

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

ఈ దోపిడీని అరికట్టలేరా?

అభిప్రాయం



కూరపాటి వెంకట నారాయణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 30 ఏళ్ల నుండి సమాజాభివృద్ధికి ఉపయోగపడే మౌలిక రంగాలైన విద్య, వైద్య వ్యవస్థలను ప్రైవేటీకరించి చేతులు దులుపుకొని ప్రజలను దోపిడీకి వదిలివేశాయి. పేద వర్గాల సుస్థిర అభివృద్ధికి పునాదులు వేసే విద్యా రంగాన్ని ప్రైవేటీకరించి రాజకీయ నాయకులకు, అవినీతి అధికారులకు, పార్టీలకు డబ్బు సంచులు ఇచ్చే వ్యాపారులకు కళాశాలలను, పాఠశాలలను అప్పగించి ప్రతి సంవత్సరం ఇష్టానుసారంగా ఫీజులు పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూడా ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు ఫీజులు మళ్లీ పెంచాలని ప్రతిపాదనలు వచ్చిన సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రానా తదితరులు చేసిన వ్యాఖ్యలు పాలకులు, ప్రజలు, మేధావులు గమనించదగినవి.

రాష్ట్రంలోనే కాదు దేశంలో కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను సాధించిన సంస్థలు కరవై పోయినాయి. అంతర్జాతీయ స్థాయి సంగతి దేవుడెరుగు కానీ జాతీయ స్థాయిలో కూడా నాణ్యతలో గుర్తింపులేని అనేక ఇంజినీరింగ్ కళాశాలలు, కార్పొరేట్ విద్యాసంస్థలు... విద్యార్థులను, తల్లిదండ్రులను వేధించుకుతింటూ ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్ర పాలకుల పుణ్యాన ప్రభుత్వ విద్యా సంస్థల నాణ్యత దిగజారడంతో పేదలు, మధ్యతరగతికి చెందిన తల్లితండ్రులు గత్యంతరం లేక ప్రైవేటు సంస్థలను ఆశ్రయించి వారు విధించిన ఫీజులు చెల్లించక తప్పడం లేదు. కార్పొరేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు కూడా ఈ దోపిడీ స్రవంతిలో కలిసి ప్రయాణం చేస్తున్నాయి. 30 వేల ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ సీట్లను ఎర చూపి కార్పొరేట్ జూనియర్ కళాశాలలు కనీసం 30 లక్షల మంది విద్యార్థుల, తల్లితండ్రుల నుండి ప్రతి ఏడాది ప్రతి విద్యార్థి నుండి రెండు నుండి 5 లక్షల రూపాయల వరకు వసూలు చేయడం సభ్య సమాజం, ఏలికలు ఎంతవరకు సమర్థించగలరు?

ప్రభుత్వ విద్యా వ్యవస్థల విధ్వంసం 30 సంవత్సరాల ముందే ప్రారంభమైంది. సొంత రాష్ట్రం సాధించుకున్నప్పటికీ గత 11 ఏళ్ల నుండి ఈ సంస్థలు మరింత దిగజారి కోలుకోలేని దుఃస్థితికి చేరుకున్నాయి. పాలకుల నిర్లక్ష్యం అధికారుల, అధ్యాపకుల ఉదాసీన వైఖరి కారణంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, విశ్వ విద్యాలయాలు నాణ్యమైన విద్య ఇవ్వలేని దుఃస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. గత



18 నెలల నుండి రాష్ట్రంలో ప్రజా పాలన చేస్తున్నామని చెబుతున్న ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థలను పునరుద్ధరించే దిద్దుబాటు చర్యలు కూడా అంతంతే! 13,000 మంది ఉపాధ్యాయుల నియామకం జరిగినప్పటికీ ప్రభుత్వ విద్యా సంస్థలలో గుణాత్మకమైన మార్పులు ఏవీ కనిపించడం లేదు.

అనేక సందర్భాలలో నియంత్రణ వ్యవస్థలు, ముఖ్యంగా అధికారులు... ప్రైవేటు రంగ వ్యవస్థలకు వివిధ కారణాల వలన లొంగిపోతున్నారు. అందుకే పేద, మధ్యతరగతి ప్రజలపై విద్య, వైద్య రంగాలలో ప్రైవేటు వసూళ్ల పర్వం నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. పార్టీలు మారినప్పటికీ, పాలకులు మారినప్పటికీ, అధికారులు మారినప్పటికీ... విద్య, వైద్య రంగాల అవినీతి, దోపిడీ నుండి పేద ప్రజలకు ఎలాంటి ఉపశమనమూ లభించడం లేదు. ప్రతి సంవత్సరం అడ్డు అదుపు లేకుండా ఫీజుల భారం మరీ పెరుగుతున్నది.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌తో పాటు ఇతర కేంద్ర నియంత్రణ సంస్థలు కూడా దేశంలో ఉన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులను గమనించకుండానే ఈ దోపిడీ వ్యవస్థల కొమ్ము కాయడం దురదృష్టకరం. ఈ సంవత్సరం అనేక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు 'డీమ్డ్ యూనివర్సిటీల' హోదా కల్పించడం ఇందులో భాగమే అనిపిస్తున్నది. ఇంకా అనేక ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు తమ సంస్థలను డీమ్డ్ యూనివర్సిటీలుగా మార్చుకోవడానికి బారులు తీరి ఉన్నారట. ఎవరి నియంత్రణా లేకుండా యథేచ్ఛగా తమ ఫీజుల వసూళ్లను కొనసాగించడానికి అవినీతి అధికారులు, వ్యవస్థలు ఉపయోగపడుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్రంలో జరుగుతున్న ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవలసిన అవసరాన్ని గుర్తించాలి. ప్రభుత్వ రంగ విద్యాసంస్థలను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరింపజేసి ప్రైవేటు రంగ సంస్థల వసూళ్లపై నాణ్యమైన విద్య కొరకు నిరంతర నియంత్రణ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని పేద వర్గాల ఆవేదన.

ఉచిత బియ్యం లాంటి పథకాలు దశాబ్దాలే కాదు, శతాబ్దాల కాలం అమలుపరిచినప్పటికీ సామాజిక అభివృద్ధి అసాధ్యం. కేవలం నాణ్యమైన, ఉపయోగకరమైన విద్యతోటే సాధ్యమని ఇప్పటికైనా పాలకులు, చైతన్యవంతమైన ప్రజలు గుర్తించాలి.

వ్యాసకర్త యూజీసీ ఎమెరిటస్ ప్రొఫెసర్, కాకతీయ యూనివర్సిటీ

ఆ రకమైన గణన జరపాలి!

సందర్భం



డానీ

కుల గణన డిమాండును మొదటి నుండీ చాలా తీవ్రంగా నిరాకరిస్తూ వస్తున్న బీజేపీ ఇప్పుడు తానే ఆ పని చేస్తాను అంటోంది. ఒకవేళ ఎన్నికల్లో లబ్ధి కోసమే తన విధానాన్ని మార్చుకుందనుకున్నా సరే ఇది గొప్ప నిర్ణయం. దీనిని అన్ని రాజకీయ పార్టీలు, పౌర సమాజం తప్పక మెచ్చుకోవాలి. అయితే, సామాజిక న్యాయం దిశగా చేసే ప్రయాణంలో కులగణన అనేది తొలి అడుగు మాత్రమే. ఇది ఒక పరికరమే కానీ పరిష్కారం కాదు; సాధనమే కానీ సమాధానం కాదు. వర్తమాన భారతదేశం ఎదుర్కొంటున్న సామాజిక సంక్షోభాన్ని కొలవడానికీ, అందులోని అపార వైవిధ్యాన్నీ, సంక్లిష్టతను అర్థం చేసుకోవడానికీ కులగణన ఒక్కటే సరిపోదు. రాజకీయ ఆర్థిక, సామాజిక, కుల మత గణన జరగాలి. కులగణన వల్ల దేశంలో ఏ కులస్థులు ఎంత మంది ఉన్నారో తెలుస్తుంది. ప్రభుత్వంలోనో, ప్రభుత్వరంగ సంస్థల్లోనో ఈ కులాలన్నింటికీ ఎంతెంత శాతం రిజర్వేషన్లు కల్పించాలి అనడానికి ఒక ప్రాతిపదిక ఏర్పడుతుంది. ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే ఈ కేటాయింపుల్ని వెంటనే అమలు చేయనూవచ్చు.

ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉన్న కులాలే రిజర్వేషన్ అవకాశాలను దక్కించుకోగలుగుతాయనేది అందరికీ తెలిసిన సత్యం. ఇది హిందూ సమాజానికే కాక ముస్లిం సమాజానికి కూడ వర్తిస్తుంది. ఇక ముందు ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల వంటి అమూర్త, సామూహిక ఉనికులు ఉండవు. చాకలి, సాలె, వడ్రంగి, లద్దాఫ్, నూర్ బాషా, సంబన్, రెల్లి వంటి నిర్దిష్ట కులాలు మాత్రమే ఉంటాయి. ఇటీవల ఎస్సీలను మూడు విభాగాలుగా వర్గీకరించారు. ఇక ముందు ఈ వర్గీకరణ కూడా ఉండదు. ప్రతి కులానికీ వాళ్ళ జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.

దేశంలో ముస్లిం సమాజం మీద సాగుతున్న వివక్ష మరీ క్రూరంగా తయారయ్యింది. ముస్లిం సమాజాన్ని రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో నయా అస్పృశ్యులుగా మార్చేశారు. కొన్ని కీలకమైన ఉద్యోగాలను వారికి నిషేధితమైనవిగా మార్చారు. వాళ్ళ చేతివృత్తుల్నీ, వ్యాపారాలనూ; ఓలా, ఊబర్, స్విగ్గీ, జొమాటోలు వంటి వాటిలో చిరు ఉద్యోగాలను సహితం బహిష్కరించాలంటూ ఏలినవారి కాల్బలం ప్రకటనలు చేస్తున్నది. రోడ్డు పక్కన జీవనాధారాన్ని ఎంచుకున్న చిరువ్యాపారుల్ని హింసిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో నిత్యం మనం చూస్తున్నాం.



ఉపాధి కల్పనలో ప్రభుత్వ ఉద్యోగాలు అనేవి సంఖ్య రీత్యా చాలా పరిమితమైనవి. ప్రభుత్వరంగ సంస్థలు క్రమంగా ప్రైవేటుపరం అయిపోతున్నాయి. అంటే, అక్కడా అవకాశాలు తగ్గిపోతున్నాయి. అప్పుడు ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలి అనే డిమాండు సహజంగానే ముందుకు వస్తుంది. దానికి ప్రభుత్వం సిద్ధమా? కార్పొరేట్లను ప్రభుత్వం ఒప్పించ గలుగుతుందా?

దేశ సంపద ఏ సమూహాల్లో తగ్గిపోతున్నది, ఏ సమూహాల్లో పోగవుతున్నది అనేది ప్రాణప్రదమైన అంశం. టెలీకమ్యూనికేషన్స్, ఐటీ, రెన్యూవబుల్ ఎనర్జీ, మౌలికరంగ నిర్మాణాలు, ఇ–కామర్స్, డిజిటల్ ఎకానమీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మాస్యూటికల్, హెల్త్ కేర్, ఆయిల్– గ్యాస్, పెట్రో కెమికల్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, గనులు, సహజ వనరులు, కార్పొరేట్ విద్యా సంస్థలు తదితర రంగాల్లో ఇప్పుడు సంపద సృష్టి అవుతున్నది. వీటి యాజమాన్యంలో సమస్త కులాలకు స్థానం కల్పిస్తారా? అణగారిన సమూహాలను ఎప్పటిలానే సేవకులుగా కొనసాగించి ప్రాతినిధ్యం కల్పించాం అంటారా?

వర్తమాన భారత దేశంలో రెండు పరస్పర విరుద్ధ పరిణామాలు ఒకే సందర్భంలో సాగుతున్నాయి. ఒకవైపు సంపద వేగంగా పెరుగుతోంది; మరోవైపు పేదరికం అంతకన్నా వేగంగా పెరుగుతోంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి అంచనా ప్రకారం 2025లో భారత స్థూల జాతీయోత్పత్తి నాలుగున్నర ట్రిలియన్ డాలర్లను మించుతోంది. త్వరలో జర్మనీని అధిగమిస్తుందనే అంచనా ఉంది.

'ఆక్స్ ఫామ్' సంస్థ ఇటీవల ప్రకటించిన 'ఇండియా రిపోర్టు – 2024'లో దిగ్భ్రాంతి కలిగించే అనేక అంశాలున్నాయి. మొత్తం జాతీయ సంపదలో 77 శాతం ఓ పది శాతం ధనికుల చేతుల్లో ఉందట. 40 శాతం జాతీయ సంపద కేవలం ఒక్క శాతం ధనికుల చేతుల్లో ఉందట. 50 శాతం జనాభాకు జాతీయ సంపదలో కేవలం 3 శాతం మాత్రమే దక్కుతున్నదట. అంటే పేద రికం ఏ స్థాయిలో ఉందో అంచనా వేయవచ్చు.

సంపద పంపిణీలో అసమానత్వం అత్యధికంగా ఉన్న దేశాల్లో ఇండియా ఒకటి. విచిత్రం ఏమిటంటే, మన రాజ్యాంగ ఆదర్శాల్లో సామ్యవాదం కూడా ఉంది. 39వ అధికరణం భౌతిక వనరుల పంపిణీలో సమానత్వాన్ని పాటించాలని ఆదేశిస్తుంది. ఉమ్మడి పౌరస్మృతిని అమలుపరచాలని రాజ్యాంగం ఆదేశిస్తున్నదంటూ రెండేళ్ళ క్రితం బీజేపీ చాలా హంగామా చేసింది. అటు ఆదేశిక సూత్రాల్లోనేగాక, ప్రధాన ఆదర్శాల్లోనూ ఉన్న సామ్యవాదం గురించి మాత్రం ఆ పార్టీ మాట్లాడడం లేదు.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు

గ్రహం అనుగ్రహం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.పంచమి రా.2.41 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** పూర్వాషాఢ ప.3.09 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** రా.11.22 నుండి 1.00 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.03 నుండి 7.14 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.04 నుండి 11.36 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.21.

ట్రంప్ మరో పిడుగు

5 శాతం రెమిటెన్స్ పన్ను ● గ్రీన్‌కార్డుదారులకు కూడా వర్తింపు

- జూలై 4 నుంచి అమలయ్యే అవకాశం
- ఏటా రూ.3 లక్షల కోట్లు పంపే ఎన్నారైలు
- వాటిపై ఆధారపడే కుటుంబాలకు కష్టకాలమే
- యూఎస్‌కు మాత్రం రూ.15 వేల కోట్ల ఆదాయం



మీరు అమెరికాలో ఉంటున్నారా? భారత్‌లోని మీ కుటుంబానికి ప్రతి నెలా డబ్బులు పంపుతున్నారా? అయితే ఇకపై మరో పన్ను బాదుడుకు సిద్ధంగా ఉండండి. అలా పంపే ప్రతి లక్ష రూపాయలకూ రూ.5 వేల చొప్పున ట్రంప్ ముక్కు పిండి మరీ వసూలు చేయనున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ భారత అమెరికన్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్న అధ్యక్షుడు ఈ మేరకు ప్రతిపాదనను తాజాగా తెరపైకి తెచ్చారు. దాని ప్రకారం అమెరికాలోని వలసదారులు తమ మాతృదేశాలకు పంపే మొత్తాల (రెమిటెన్సు)లపై 5 శాతం పన్ను విధించనున్నారు. అమెరికా పౌరులు కానివారందరికీ ఇది వర్తిస్తుంది. గ్రీన్‌కార్డుదారులతో పాటు హెచ్‌-1బీ, ఎఫ్‌-1 లేదా జే-1 తదితర వీసాలపై అక్కడ ఉంటున్న భారతీయులంతా ఈ నిర్ణయంతో తీవ్రంగా ప్రభావితులవుతారు. ట్రంప్ దీనికి 'వన్ బిగ్, బ్యూటిఫుల్ బిల్' అని పేరు పెట్టుకుని మురిసిపోతున్నారు. ఈ బిల్లుకు అధికార రిపబ్లికన్లు మద్దతిస్తుండగా ఎన్నారైల మద్దతుదారుగా పేరున్న విపక్ష డెమొక్రటిక్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. బిల్లు ప్రస్తుతం ప్రతినిధుల సభ పరిశీలనలో ఉంది. అక్కడ, అనంతరం సెనేట్‌లో ఆమోదముద్ర పడితే జూలై 4 నుంచి అమల్లోకి వస్తుంది.

మనోళ్లకు పెద్ద దెబ్బ

అమెరికాలో ఉంటున్న భారతీయుల సంఖ్య 45 లక్షల పై చిలుకే. వారిలో చాలా మంది ఉన్నత స్థాయి ఉద్యోగులు, వ్యాపారవేత్తలు తదితరులే. వాళ్లు భారత్‌కు ఏటా భారీ మొత్తాలు పంపుతుంటారు. మామూలు ఉద్యోగులు చేసేవాళ్లు కూడా భారత్‌లోని తమ కుటుంబాల పోషణ, తల్లిదండ్రుల వైద్య ఖర్చులు తదితరాల నిమిత్తం ప్రతి నెలా టంచనుగా డబ్బులు పంపుతుంటారు. ఇక్కడ రియల్ ఎస్టేట్లో పెట్టుబడులు పెడుతుంటారు. రెమిటెన్స్ పన్ను దెబ్బకు ఇకపై మనవాళ్లు పంపే మొత్తాలు భారీగా తగ్గడం ఖాయమని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా మన విదేశీ మారకద్రవ్య నిల్వలపైనా ప్రతికూల ప్రభావం పడవచ్చంటున్నారు. ''భారత్ తిరిగొచ్చి ఇక్కడే స్థిరపడాలని భావించే అమెరికా ఎన్నారైలు సంపాదించే ప్రతి డాలర్‌పైనా 5 శాతం కోత పడ్డట్టే లెక్క. భారీ మొత్తాలు పంపే ఆలోచనలో ఉన్నవాళ్లు జూలైకి ముందే ముగించుకోవడం మేలు'' అని సూచిస్తున్నారు.

జీవనాధారంపై దెబ్బ

రెమిటెన్సుల పన్ను వర్తింపు విషయమై ప్రతిపాదనలో ఎలాంటి మినహాయింపులూ ప్రతిపాదించలేదు. కనుక ఎంత తక్కువ మొత్తం పంపినా బాదుడు ఖాయమే. దాంతో వాటిపైనే ఆధారపడే ఎన్నో భారత కుటుంబాలను ఇది తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ''పిల్లల్ని అమెరికా పంపిన తల్లిదండ్రుల్లో చాలామంది వారిపైనే ఆధారపడి ఉంటారు. ఇంటి అద్దె, లేదా ఈఎంఐలు మొదలుకుని వైద్య ఖర్చుల దాకా పిల్లలు నెల నెలా పంపే డబ్బులే ఆధారం. రెమిటెన్సులంటే కేవలం ఆర్థిక కార్యకలాపాలు కావు. లక్షలాది మందికి జీవనాధారాలు. దీన్ని ఆ మానవీయ కోణం నుంచి చూడాలి. కానీ ట్రంప్ పక్కా వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్నారు'' అంటూ ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నారై రెమిటెన్సులపై బాగా ఆధారపడే మన రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ తదితర రంగాలపై ప్రతికూల ప్రభావం ఖాయమని చెబుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రెమిటెన్సుల్లో భారతే టాప్

- ➤ ప్రపంచం మొత్తంలో విదేశాల నుంచి అత్యధికంగా రెమిటెన్సులు వచ్చేది భారత్‌కే.
- ➤ 2024లో వాటి మొత్తం ఏకంగా 130 బిలియన్ డాలర్లు! అంటే దాదాపు రూ.10.7 లక్షల కోట్లు.
- ➤ అందులో 28 శాతం, అంటే రూ.3 లక్షల కోట్ల (32 బిలియన్ డాలర్ల) మేరకు వాటా భారత అమెరికన్లదే.
- ➤ ఆ లెక్కన 5 శాతం రెమిటెన్సు పన్ను రూపేణా అమెరికాకు ఏటా ఒక్క ఎన్నారైల మీదే అప్పనంగా రూ.15 వేల కోట్ల ఆదాయం సమకూరనుంది!

అక్రమ పన్నే!

రెమిటెన్స్ పన్ను విధింపు చట్టారీత్యా చూసినా సరికాదన్నది ఆర్థిక నిపుణుల వాదన. ''ఇది చాలా అన్యాయమైన ప్రతిపాదన. వేలాది మైళ్ల వలస వెళ్లి అనేక కష్టాలకోర్చి తమవారికి అండగా నిలుస్తున్నందుకు, స్వదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నందుకు శిక్షిస్తున్నట్టుగా ఉంది. పైగా అమెరికాకు అన్ని రకాల కేంద్ర, రాష్ట్ర పన్నులు చెల్లించిన మీదట మిగుల్చుకున్న మొత్తంపై దీన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఇది కచ్చితంగా అక్రమమే. ఇందులో రాజకీయ ఉద్దేశాలు కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి'' అని వారంటున్నారు. ఈ ప్రతిపాదనపై డెమొక్రాట్ సభ్యులు కాంగ్రెస్‌లో తీవ్ర అభ్యంతరాలు వెలిబుచ్చారు. వలస సమాజాలను, ముఖ్యంగా అల్పాదాయ కుటుంబాలను ఈ పన్ను అన్యాయంగా పీల్చి పిప్పి చేస్తుందని వాదించారు. మితవాద రిపబ్లికన్లు కూడా వారితో గొంతు కలుపుతున్నారు.

పనులు మొదలయ్యాక పర్యావరణ అనుమతులు

ఇకపై కుదరవు

- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- అలా అనుమతులివ్వొద్దు
- కేంద్రానికి లక్ష్మణరేఖ
- ఉల్లంఘనులు నిరక్షరాస్యులేమీ కాదంటూ ఘాటు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: పర్యావరణ అనుమతుల విషయంలో కేంద్రానికి సుప్రీంకోర్టు లక్ష్మణరేఖ గీసింది. మైనింగ్ తదితర ప్రాజెక్టులకు కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత పర్యావరణ అనుమతులు ఇవ్వరాదని ఆదేశించింది. అలా అనుమతులిచ్చేందుకు వీలు కల్పిస్తూ 2017, 2021 ఉత్తర్వుల ఆధారంగా కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్లు తదితరాలు అక్రమమని పేర్కొంటూ వాటన్నింటినీ కొట్టేసింది. ఇకపై అలాంటి ఆదేశాలు, సర్క్యులర్లు, నోటిఫికేషన్లు, ఉత్తర్వులు ఇవ్వడానికి వీల్లేదని పేర్కొంది. న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. అయితే ఆయా నోటిఫికేషన్ల ఆధారంగా ఇప్పటికే జారీ చేసిన పర్యావరణ అనుమతులు మాత్రం చెల్లుబాటవుతాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు నేపథ్యంలో పర్యావరణ అనుమతుల్లేకుండా మొదలైన ప్రాజెక్టులు తమ కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఇకపై అవకాశముండదు.

కావాలనే ఉల్లంఘనలు

అత్యంత కీలకం, తప్పనిసరి అయిన పర్యావరణ అనుమతులను పట్టించుకోకపోవడం భారీ అవకతవకలకు పాల్పడటమే తప్ప మరోటి కాదని జస్టిస్ ఓకా ఆగ్రహం వెలిబుచ్చారు. ''ఇలా చేస్తున్నవాళ్లు నిరక్షరాస్యులేమీ కారు. వారు కంపెనీలు, రియల్టీ డెవలపర్లు, ప్రభుత్వ రంగ సంస్థలు, మైనింగ్ పరిశ్రమల యజమానులు. వీళ్లంతా ఉద్దేశపూర్వకంగానే నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్న వాళ్లే'' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ''అందుకే ఇలాంటి వాళ్లకు ఎలాంటి అనుచిత లబ్ధి కలగడానికి అనుమతించేది లేదు. ఇలాంటి ప్రాజెక్టులకు అనంతర కాలంలో ఈసీలు ఇచ్చేలా 2017 నోటిఫికేషన్ల వంటివి ఇకపై జారీ చేయడానికి వీల్లేదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంగా నిర్దేశాలు జారీ చేస్తున్నాం'' అని పేర్కొన్నారు. ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఈఐఏ) నోటిఫికేషన్ (2006) ప్రకారం మైనింగ్‌తో పాటు ఎలాంటి భారీ ప్రాజెక్టులకైనా ముందుగా పర్యావరణ అనుమతులు (ఈసీ) తీసుకోవడం తప్పనిసరి. అలాంటివేవీ లేకుండానే మొదలు పెడుతున్న ప్రాజెక్టులకు ఈసీల జారీని సవాలు చేస్తూ వనశక్తి అనే స్వచ్ఛంద సంస్థ తదితరులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. తమ ఉత్తర్వులు ఈఐఏ నోటిఫికేషన్‌కు విరుద్ధమేమీ కాదని, కొనసాగుతున్న ప్రాజెక్టులకు ఈసీలు ఇవ్వకపోతే భారీ నష్టం వాటిల్లుతుందని కేంద్రం వాదించింది. పర్యావరణ పరిరక్షణ చట్ట నిబంధనల మేరకే ఆ చర్యలు తీసుకున్నట్టు పేర్కొంది.



పత్రికల్లో పేరు కోసం పిటిషన్లా?

- వక్ఫ్(సవరణ) చట్టంపై ఇక పిటిషన్లు స్వీకరించం
- తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ ఇక కొత్తగా పిటిషన్లు దాఖలైతే విచారణకు స్వీకరించే ప్రసక్తే లేదని సుప్రీంకోర్టు కుండబద్దలు కొట్టినట్లు తేల్చిచెప్పింది. పత్రికల్లో పేరు కోసం కొందరు ఇష్టానుసారంగా పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. పత్రికల్లో పేరు రావాలని కోరుకుంటున్నారని, అందుకే పిటిషన్లు అంటూ తమ సమయం వృథా చేస్తున్నారని మండిపడింది. మీడియాలో పబ్లిసిటీ కోసం కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేయడం ఏమిటని నిలదీసింది. వక్ఫ్(సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ కొత్తగా రెండు వ్యాజ్యాలు దాఖలు కాగా, వాటిని విచారించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం నిరాకరించింది. ఆ రెండు పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్లపై ఈ నెల 20న విచారణ చేపట్టనున్నట్లు తెలియజేసింది. వక్ఫ్(సవరణ) చట్టాన్ని సవాలు చేస్తూ లెక్కలేనన్ని పిటిషన్లు దాఖలవుతున్నాయని, వాటికి అడ్డుకట్ట వేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తి చేయగా, ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. కొత్తగా ఎవరూ వ్యాజ్యాలు దాఖలు చేయొద్దని పరోక్షంగా హెచ్చరించింది.

రక్షణకు మరో రూ.50 వేల కోట్లు!

న్యూఢిల్లీ: అటు ఉగ్రవాదం, ఇటు దాయాది దుస్సాహసాల నేపథ్యంలో రక్షణ కేటాయింపులను మరింత పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా రక్షణ రంగానికి రూ.50 వేల కోట్లు అదనంగా కేటాయించనున్నట్టు సమాచారం. అనుబంధ బడ్జెట్ ద్వారా ఈ మొత్తాన్ని సమకూర్చాలని కేంద్రం ప్రతిపాదించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఇందుకు ఆమోదముద్ర పడనుందని తెలుస్తోంది. సైనిక బలగాల తక్షణావసరాలను తీర్చడంతో పాటు పరిశోధనలు, అభివృద్ధి కార్యకలాపాలపై ఈ నిధులను వెచ్చించనున్నారు. ప్రస్తుత బడ్జెట్లో రక్షణ రంగానికి రికార్డు స్థాయిలో రూ.6.81 లక్షల కోట్లు కేటాయించడం తెలిసిందే. గత ఆర్థిక సంవత్సరం కంటే ఇది 9.5 శాతం అదనం. గత పదేళ్లలో రక్షణ బడ్జెట్ దాదాపు మూడింతలైంది.

కేంద్రం దౌత్యమార్గం

పాక్ ఉగ్రనీతి బట్టబయలుకు విదేశాలకు ఎంపీల బృందాలు

న్యూఢిల్లీ: ఉగ్రవాదానికి దన్నుగా నిలుస్తున్న పాకిస్తాన్ అసలు స్వరూపాన్ని ప్రపంచ దేశాలకు వివరించేందుకు కేంద్రం దౌత్య మార్గాన్ని ఎంచుకుంది. ఇందులో భాగంగా అఖిలపక్ష నేతల బృందాలను వచ్చే వారం నుంచి వివిధ దేశాలకు పంపించాలని నిర్ణయించింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న తేదీన ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకోవడం, కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తదితర పరిణామాలను వివరిస్తూ పాక్ వక్రబుద్ధిని విదేశీ ప్రభుత్వాలకు ఈ బృందాలు వివరించనున్నాయి. ఇందులో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు, సీనియర్ నేతలుంటారు. బృందాలకు కేంద్ర మాజీ మంత్రులు సారథ్యం వహించనున్నారు. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే కొన్ని పార్టీలు ఆమోదం తెలిపాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఎన్ని బృందాలుంటాయి, అందులో ఎందుకు సభ్యులుంటారనే దానిపై స్పష్టత రాలేదు. కనీసం 30 మంది ఎంపీలకు భాగస్వామ్యం ఉంటుందని కొందరు నేతలంటున్నారు. బృందాలకు ప్రయాణ ప్రణాళికతోపాటు అవసరమైన సూచనలను విదేశాంగ శాఖ అందించనుంది. ఈ బృందాల్లో బీజేపీ, కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఎన్సీపీ(ఎస్పీ), జేడీయూ, బీజేడీ, శివసేన(యూబీటీ), సీపీఎం తదితర పార్టీల ఎంపీలుండొచ్చని సమాచారం. ఈ నెల 22, 23వ తేదీల్లో బయలు దేరనున్న ఈ బృందాలు 10 రోజుల్లో వివిధ దేశాలకు వెళ్లనున్నాయి. అధికార బీజేపీ నుంచి కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్, ఒడిశా బీజేపీ ఎంపీ అపరాజిత సారంగితోపాటు కాంగ్రెస్ నుంచి శశిథరూర్ సహా నలుగురు ఎంపీలు ఇందులో ఉంటారు. ఇందులో కాంగ్రెస్ సభ్యుడు సల్మాన్ ఖుర్షీద్ సారథ్యంలోని ఏడుగురు సభ్యుల బృందం దక్షిణ, వాయవ్య ఆసియాలోని దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ తదితర దేశాలకు వెళ్లనుంది. బారామతి ఎంపీ సుప్రియా సూలే బృందం ఆఫ్రికా, పశ్చిమాసియాలోని ఒమన్, ఈజిప్టు, కెన్యా, దక్షిణాఫ్రికాలకు వెళ్లనుంది. కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం యూరప్ లేదా మధ్యప్రాచ్యానికి వెళ్లే అవకాశముంది. అమెరికా వెళ్లే బృందానికి శశిథరూర్ నాయకత్వం వహిస్తారు. ప్రతి బృందంలో ఏడెనిమిది మంది సభ్యులుంటారు. వీరు నాలుగు నుంచి ఐదు దేశాలకు వెళ్లాల్సి ఉంటుంది. బృందాలను పంపించడంపై కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఈ విషయమై కేంద్ర మంత్రి రిజిజు కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో మాట్లాడారని ఆ పార్టీ నేత జైరాం రమేశ్ వెల్లడించారు.

మసూద్ అజార్‌కు రూ.14 కోట్లు

- భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ధ్వజం
- ఉగ్రవాద కార్యకలాపాల కోసం ప్రజల నుంచి పాక్ వసూళ్లని వెల్లడి

భుజ్: జైషే మొహమ్మద్ అధినేత మసూద్ అజార్‌కు రూ.14 కోట్లు ఇవ్వాలని పాకిస్తాన్ ప్రభుత్వం నిర్ణయించిందని భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలపాలను మరింత విస్తృతం చేయడానికి ప్రజల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలను, జైషే మొహమ్మద్, లష్కరే తోయిబా శిబిరాలను పాక్ ప్రభుత్వం మళ్లీ నిర్మిస్తోందని చెప్పారు. మురిడ్కే, బహవల్‌పూర్‌లో ఈ నిర్మాణాలు మొదలయ్యాయని వెల్లడించారు. శుక్రవారం గుజరాత్‌లోని భుజ్‌లో రాజ్‌నాథ్ సింగ్ పర్యటించారు. భుజ్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో సైనికాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం జవాన్లను ఉద్దేశించి మాట్లాడారు. పాకిస్తాన్ ప్రజల నుంచి ప్రభుత్వం వసూలు చేస్తున్న సొమ్మంతా ఉగ్రవాదుల జేబుల్లోకే వెళ్తుందని ఆందోళన వ్యక్తంచేశారు.

పాకిస్తాన్‌కు ఆర్థిక సాయంపై ఐఎంఎఫ్ పునరాలోచించాలి

పాకిస్తాన్‌కు ఎవరైనా ఆర్థిక సాయం అందిస్తే ఆ సొమ్మంతా ఉగ్రవాద కార్యకలాపాలకే ఖర్చవుతుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. విదేశాల నుంచి వచ్చే డబ్బుతో భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదులను ఎగదోయడం పాకిస్తాన్‌కు అలవాటేనని మండిపడ్డారు. ఆ దేశానికి 2.3 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందించడంపై పునరాలోచన చేయాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్)ను కోరారు. దుష్ట పాకిస్తాన్ సంగతి తెలిసి కూడా పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వాలనుకోవడం సరైంది కాదని చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పాకిస్తాన్‌కు ఆర్థిక సాయం అందిస్తే ఉగ్రవాదులకు సాయం చేసినట్లేనని పేర్కొన్నారు. అందుకే పాక్‌కు ఆర్థిక సాయంపై మరోసారి ఐఎంఎఫ్ ఆలోచించాలని, భవిష్యత్తులో ఎలాంటి సాయం అందించకూడదని విజ్ఞప్తి చేశారు. ఉగ్రవాదం అంతమయ్యే దాకా తమ పోరాటం ఆగదని రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదంపై ఇప్పటిదాకా తాము తీసుకున్న చర్యలన్నీ కేవలం ట్రైలర్ మాత్రమేనని, అవసరమైతే ఫుల్ పిక్చర్ చూపిస్తామని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని స్పష్టంచేశారు.



భుజ్ వైమానిక స్థావరంలో ఆర్మీ సిబ్బందితో మాట్లాడుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

చర్చించుకుందాం

భారత్‌కు పాక్ ప్రధాని విజ్ఞప్తి

ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌లు కశ్మీర్ సహా తమ మధ్య విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్ అన్నారు. శుక్రవారం రాత్రి సైనికులకు నివాళులర్పించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'భారత్, పాకిస్తాన్‌లు ఇప్పటి వరకు మూడుసార్లు యుద్ధాలు చేసినా ఏమీ సాధించలేకపోయాయి. జమ్మూకశ్మీర్ వంటి అన్ని ప్రధాన అంశాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. లేకుంటే మనం ప్రశాంతంగా ఉండలేం' అని షెహబాజ్ పేర్కొన్నారు. శాంతియుత వాతావరణం నెలకొనేందుకు ముందుకు వస్తే ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో సహకరిస్తామని భారత్‌కు హామీ ఇచ్చారు. కాల్పుల విరమణకు సహకరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

యుద్ధ ఖైదీల మార్పిడి

- రష్యా, ఉక్రెయిన్ అంగీకారం
- ఇస్తాంబుల్‌లో ప్రతినిధుల భేటీ
- మూడేళ్లలో తొలి ముఖాముఖి
- 2 గంటల్లోపే ముగిసిన చర్చలు

ఇస్తాంబుల్: సర్వత్రా ఆసక్తి రేపిన రష్యా, ఉక్రెయిన్ యుద్ధ విరమణ చర్చలు ఆశాజనకంగా మొదలయ్యాయి. వెయ్యి మంది యుద్ధ ఖైదీల పరస్పర మార్పిడికి అంగీకారం కుదిరింది. రష్యా ప్రతినిధి వ్లాదిమిర్ మెడిన్‌స్కీ ఈ మేరకు వెల్లడించారు. వాటిమధ్య దాదాపు మూడేళ్లుగా సాగుతున్న యుద్ధంలో ఇదే అతి పెద్ద ఖైదీల మార్పిడి కానుంది. రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధులు శుక్రవారం ఇస్తాంబుల్‌లో సమావేశమై తమ తమ డిమాండ్లు వినిపించారు. 2022లో యుద్ధం మొదలయ్యాక వాటి మధ్య ఇది తొలి ముఖాముఖి కావడం విశేషం. ఉక్రెయిన్ ప్రతినిధి వర్గానికి రక్షణ మంత్రి రుస్తెం ఉమెరోవ్, రష్యా బృందానికి అధ్యక్షుడు పుతిన్ సహాయకుడు మెడిన్‌స్కీ సారథ్యం వహించారు. తుర్కియే విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్ చర్చలను ప్రారంభించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇరు పక్షాలను కోరారు. తక్షణం కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం ముఖ్యమన్నారు. ''కాల్పుల విరమణ ప్రతిపాదనలను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవాలని నిర్ణయించాం. పుతిన్, జెలెన్‌స్కీ భేటీ ఏర్పాటు చేయాలన్న ఉక్రెయిన్ విజ్ఞప్తిని పరిశీలిస్తామని చెప్పాం. చర్చలను కొనసాగించేందుకు రష్యా సిద్ధంగా ఉంది'' అని మెడిన్‌స్కీ వెల్లడించారు. కీలకాంశాలను పరిష్కరించుకుని, చర్చల్లో పురోగతి సాధించాలని సూత్రప్రాయంగా అభిప్రాయానికి వచ్చినట్టు ఉక్రెయిన్ అధికారి ఒకరు తెలిపారు. అయితే రష్యా ముందెన్నడూ ప్రస్తావించని డిమాండ్లను ముందుకు తెచ్చిందని విమర్శించారు. కాల్పుల విరమణ పూర్తిస్థాయిలో అమలవాలంటే ఆక్రమిత ప్రాంతాల నుంచి ఉక్రెయిన్ సైన్యాలను ఉపసంహరించాలన్నది అందులో ఉన్నట్టు చెప్పారు. రెండు గంటల్లోపే చర్చలు ముగిసినట్టు తుర్కియే పేర్కొంది.

పుతిన్‌కు ఆసక్తి లేదు: జెలెన్‌స్కీ

చర్చల పురోగతిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పెదవి విరిచారు. కాల్పుల విరమణకు కూడా అంగీకారం కుదరలేదంటే దౌత్య మార్గంపై పుతిన్‌కు విశ్వాసం లేదని అర్థమన్నారు. అల్బేనియా రాజధాని టిరానాలో 47 యూరప్ దేశాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. చర్చల్లో రష్యా ప్రతిపాదనలు అంగీకారయోగ్యంగా లేవని బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ పేర్కొన్నారు. ''చర్చలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో జెలెన్‌స్కీ ఫోన్‌లో చర్చించారు. ఈ విషయంలో మేమంతా సహకారంతో సాగుతాం. సమష్టి బాధ్యత వహిస్తాం. ట్రంప్‌తో చర్చించి తీసుకున్న నిర్ణయాన్ని ఫ్రాన్స్, జర్మనీ, పోలండ్ కూడా ఆమోదించాయి'' అని వెల్లడించారు.

త్వరలో పుతిన్‌తో భేటీ: ట్రంప్

రష్యా ఉక్రెయిన్ చర్చలపై ట్రంప్ స్పందించారు. పుతిన్‌తో తాను అతి త్వరలో భేటీ అయ్యే అవకాశముందన్నారు. ''మా భేటీతో యుద్ధం ముగియవచ్చు, ముగియకపోవచ్చు. అయితే యుద్ధం కొనసాగితే మాత్రం చాలా ఆసక్తికరంగా ఉంటుంది'' అంటూ గమ్మత్తైన వ్యాఖ్యలు చేశారు. ఇస్తాంబుల్ చర్చలకు తాను వెళ్లని కారణంగానే పుతిన్ కూడా హాజరవలేదని ట్రంప్ గురువారం పేర్కొనడం తెల్సిందే. తన కుమార్తె టిఫానీకి కొడుకు పుట్టిన కారణంగానే ఉన్నట్టుండి అమెరికా వెళ్లిపోవాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. 'అందమైన నా మనవడిని చూడాలనుంది' అని పేర్కొన్నారు. పుతిన్, ట్రంప్ భేటీకి వేళైందని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ కూడా అన్నారు. వారి శిఖరాగ్రానికి ఏర్పాట్లకు సమయం పడుతుందని చెప్పారు.

రష్దీపై దాడి చేసిన వ్యక్తికి 25 ఏళ్ల జైలు

మేవిల్లె(అమెరికా): రచయిత సల్మాన్ రష్దీ(77)పై కత్తితో దాడి చేసిన వ్యక్తికి 25 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రష్దీ ఒక కంటిని కోల్పోవడం తెల్సిందే. హత్యాయత్నం, దాడి ఆరోపణల్లో దోషిగా అమెరికా పౌరుడైన హది మతార్(27)ను న్యూయార్క్ కోర్టు నిర్ధారించింది. రష్దీ కోర్టుకు రాలేదు. 2022 ఫిబ్రవరిలో చౌటౌకా (న్యూయార్క్)లోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో కార్యక్రమం జరుగుతుండగా వెనుక నుంచి హఠాత్తుగా వేదికపైకి వచ్చిన ఓ వ్యక్తి రష్దీని వెనుక నుంచి వచ్చి గట్టిగా పట్టుకున్నాడు. వెంట తెచ్చుకున్న కత్తితో రష్దీ తలతో పాటు మిగతా శరీర భాగాలపై డజను సార్లకుపైగా పొడిచినట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు కోర్టులో వాంగ్మూలమిచ్చారు. హత్యాయత్నం నేరం కింద మతార్‌కు గరిష్ఠంగా ఉన్న 25 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. మరో వ్యక్తిని గాయపరిచినందుకు మరో ఏడేళ్ల జైలు శిక్ష విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలవుతాయని జడ్జి స్పష్టం చేశారు.

24న ప్రధాని అధ్యక్షతన నీతి ఆయోగ్ భేటీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో ఈ నెల 24వ తేదీన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరగనుంది. సమావేశం అజెండా ఖరారు కావాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ చైర్మన్‌గా ఉండే గవర్నింగ్ కౌన్సిల్‌లో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, పలువురు కేంద్ర మంత్రులు సభ్యులు. ఏడాదికోసారి కౌన్సిల్ పూర్తి స్థాయి సమావేశం ఉంటుంది. గతేడాది జూలై 27న గవర్నింగ్ కౌన్సిల్ భేటీ జరిగింది.

బార్ తీరుపై సీజేఐ ఆక్షేపణ

- జస్టిస్ త్రివేదికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయలేదంటూ అభ్యంతరం
- ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికిన సీజేఐ లాంఛన ధర్మాసనం
- గొప్పగా సేవలు అందించారు
- ఏజీ తదితరుల అభినందనలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్సీబీఏ) తీరును భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ తీవ్రంగా ఆక్షేపించారు. శుక్రవారం పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా మాధుర్య త్రివేదికి వీడ్కోలు పలకరాదన్న ఎస్సీబీఏ నిర్ణయాన్ని తప్పుబట్టారు. జస్టిస్ త్రివేదికి వీడ్కోలు పలికేందుకు తన సారథ్యంలో కొలువుదీరిన లాంఛన ధర్మాసనం నుంచే ఈ మేరకు ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ''న్యాయమూర్తి రిటైరవుతున్న సందర్భంలో బార్ అలాంటి వైఖరి తీసుకోకుండా ఉండాల్సింది. దాని తీరుతో బాహాటంగా విభేదిస్తున్నా. నేను ఉన్నదున్నట్టుగా మాట్లాడే వ్యక్తిని. కనుక ఈ విషయాన్ని ఇలా స్పష్టం చేయడం చాలా అవసరమని కూడా భావిస్తున్నా'' అని ఎస్సీబీఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కపిల్ సిబర్, రచనా శ్రీవాత్సవ సమక్షంలోనే వ్యాఖ్యానించారు. అయితే లాంఛన ధర్మాసన కార్యక్రమంలో వారిద్దరూ పాల్గొనడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ''బెంచ్ మరోలా తీర్మానించినా వచ్చి పాల్గొన్నందుకు వారిద్దరికీ కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొన్నారు. న్యాయమూర్తిగా జస్టిస్ త్రివేది ఎంత సమర్థురాలో చెప్పేందుకు ఇంతకంటే నిదర్శనం అవసరం లేదు. న్యాయమూర్తుల్లో కొందరి నుంచి ఆశించిన తీర్పులు రావు. వారికి దక్కాల్సిన వాటిని నిరాకరించేందుకు అది కారణం కారాదు'' అన్నారు.

జస్టిస్ త్రివేది న్యాయవ్యవస్థకే ఆభరణం



జస్టిస్ త్రివేదీ న్యాయవ్యవస్థకే ఆభరణమంటూ సీజేఐ జస్టిస్ గవాయ్ కొనియాడారు. ట్రయల్ కోర్టు జడ్జిగా ప్రస్థానం ప్రారంభించి సుప్రీంకోర్టు దాకా ఎదిగిన తొలి న్యాయమూర్తి ఆమేనని గుర్తు చేశారు. గుజరాత్ నేషనల్ లా వర్సిటీ ఏర్పాటు వంటివాటిలోనూ ఆమె కీలక పాత్ర పోషించారన్నారు. ''ఎస్సీ కోటాలో ఉప వర్గీకరణపై ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం సభ్యురాలిగా మెజారిటీ తీర్పుతో జస్టిస్ త్రివేది విభేదించారు. తద్వారా స్వతంత్ర ఆలోచనకు, స్థైర్యానికి ప్రతీకగా నిలిచారు. వ్యక్తిగత జీవిత సవాళ్లు తన ఉద్యోగ ధర్మాన్ని ఏనాడూ ప్రభావితం చేయనివ్వలేదు. ఆరోగ్యం బాగాలేని తండ్రిని చూసుకునేందుకు వారాంతాల్లో అహ్మదాబాద్ వెళ్లి, ఎంత కష్టమైనా సోమవారాకల్లా కోర్టుకు హాజరయ్యేవారు'' అని చెప్పుకొచ్చారు. ''జస్టిస్ త్రివేదీ! నిజాయతీకి, నిష్పాక్షికతకు, శ్రమించే తత్వానికి మీరు మారుపేరు. జీవిత ప్రయాణంలో నూతన అధ్యాయానికి తెర తీస్తున్న సందర్భంగా అభినందనలు'' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాతో పాటు బార్ సభ్యులు తదితరులు జస్టిస్ త్రివేది సేవలను కొనియాడారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రిటైరైనప్పుడు ఎస్సీబీఏ వీడ్కోలు సమావేశం నిర్వహించడం ఆనవాయితీ.

నా తీర్పులే మాట్లాడాయి: జస్టిస్ త్రివేది



తానేమిటో చెప్పేందుకు 30 ఏళ్లుగా తానిచ్చిన తీర్పులే నిదర్శనమని జస్టిస్ బేలా త్రివేది అభిప్రాయపడ్డారు. ''ప్రతి తీర్పులోనూ ఆత్మ ప్రబోధానుసారమే నడుచుకున్నా. సివిల్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా విధ్యుక్త ధర్మాన్ని నిబద్ధతతో, నిజాయతీతో నెరవేర్చిన తృప్తితోనే సెలవు తీసుకుంటున్నా'' అని చెప్పారు.

11వ మహిళా న్యాయమూర్తి

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలందించిన 11వ మహిళగా జస్టిస్ త్రివేది నిలిచారు. పలు చరిత్రాత్మక తీర్పుల్లో భాగస్వామి అయ్యారు. ఆమె జూన్ 9న రిటైరవాల్సి ఉంది. వ్యక్తిగత కారణాలతో శుక్రవారమే పదవీ విరమణ చేశారు. ఆమె 2021 ఆగస్టు 31న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. అదే రోజు ఆమెతో పాటు మరో ఇద్దరు మహిళలు సహా రికార్డు స్థాయిలో మొత్తం 9 మంది బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ త్రివేది సిటీ సివిల్ కోర్టు జడ్జిగా నియుక్తురాలైన సమయంలో ఆమె తండ్రి కూడా అదే హోదాలో ఉండటం విశేషం!

ప్రభుత్వ పథకాల్లో ముస్లింలకు సముచిత వాటా

- వాటిని సద్వినియోగం చేసుకోవాలి
- దేశం, రాష్ట్రం అభివృద్ధి, శాంతి కోసం మక్కాకు వెళుతున్న వారు ప్రార్థించండి
- హజ్‌యాత్ర–2025లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో ముస్లిం జనాభాకు అనుగుణంగా సముచిత వాటా కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ హజ్ హౌస్ నుంచి హజ్ యాత్ర–2025కు బయలుదేరుతున్న యాత్రికుల బస్సును జెండా ఊపి సాగనంపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ ముస్లిం సామాజికవర్గంలో అత్యధిక మంది పేదరికంలో మగ్గుతున్నారని, వారికి సొంత గూడు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం పథకాల్లో కూడా జనాభా శాతానికి అనుగుణంగా ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్పొరేషన్ పదవుల్లో సైతం మైనారిటీ వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చామని, భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తామని తెలిపారు.



హజ్ యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో అసదుద్దీన్ ఒవైసీ, అనిల్, షబ్బీర్ అలీ తదితరులు

మామిడిపల్లిలో రుబాత్: హజ్ యాత్రికుల కోసం ఎయిర్‌పోర్టుకు ఐదు కిలోమీటర్ల సమీపంలోని మామిడిపల్లిలో హైదరాబాద్ రుబాత్ నిర్మిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అవసరమైన నిధులు కేటాయించి వచ్చే సంవత్సరానికి భవన సముదాయ నిర్మాణం పూర్తి చేసి అక్కడి నుంచే హజ్ యాత్రికులు బయలుదేరే విధంగా ఏర్పాట్లు కల్పిస్తామని చెప్పారు. మక్కా యాత్రకు వెళుతున్న యాత్రి కులు దేశం, రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి, శాంతికోసం ప్రార్థించాలని విజ్ఞప్తి చేశారు.

రిజర్వేషన్ ఘనత వైఎస్‌దే: షబ్బీర్ అలీ

ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిది అని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ గుర్తు చేశారు. రిజర్వేషన్ కారణంగా ఇప్పటివరకు 22 లక్షల యువత ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు చదువుకొని ఉద్యోగాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధురాలి సంరక్షణకు ఏం చేశారు?

'సాక్షి' కథనంపై ఎస్‌హెచ్‌ఆర్‌సీ విచారణ

సాక్షి, హైదరాబాద్/దంతాలపల్లి: వృద్ధ తల్లిని కన్న కొడుకు ఇంట్లోంచి వెళ్లగొట్టిన సంఘటనపై.. శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తను తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరించింది. వృద్ధ మహిళ ప్రస్తుత పరిస్థితి, ఆమె సంక్షేమం, పునరావాసం కోసం తీసుకున్న చర్యలతో సహా వివరణాత్మక నివేదికను సమర్పించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. జూన్ 24 లోగా నివేదిక అందజేయాలని స్పష్టం చేసింది.



సఖి కేంద్రానికి లింగమ్మను తీసుకెళుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

సఖి కేంద్రానికి లింగమ్మ తరలింపు: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం గున్నెపల్లి గ్రామాన్ని శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లమ్మ, సఖి (డీఎస్‌సీ) బృందం సందర్శించి.. బిడ్డల నిరాదరణకు గురైన వృద్ధురాలు రామగిరి లింగమ్మను సఖి కేంద్రానికి తరలించారు. సీడీపీవో ఎల్లమ్మ, సఖి కేంద్రం అధికారి శ్రావణి తమ బృందంతో గున్నెపల్లికి చేరుకొని వృద్ధురాలు లింగమ్మను రక్షించారు.

నిశ్చితార్థం ఒకరితో.. పెళ్లి మరొకరితో

- కరీంనగర్ జిల్లాలో ఓ పెళ్లికొడుకు ఘనకార్యం
- కేసు నమోదు చేసిన పోలీసులు



కుంట మధుకర్‌రెడ్డి

హుజూరాబాద్: ఇరవై రోజుల క్రితం పెళ్లి నిశ్చయమైంది. కాబోయే అల్లుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అని ఆడపిల్ల తరఫు వారు మురిసిపోయారు. శుక్రవారం పెళ్లి జరగాల్సి ఉండగా.. పెళ్లికొడుకు గట్టి షాక్ ఇచ్చాడు. ఒకరోజు ముందుగానే మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. రంగాపూర్ గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్‌రెడ్డి చిన్న కొడుకు మధుకర్‌రెడ్డికి మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఒక యువతితో ఇటీవల నిశ్చితార్థం జరిగింది. కట్నం కింద రూ.40 లక్షల విలువైన అర ఎకరం భూమి, 10 తులాల బంగారం, రూ.6 లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. 16వ తేదీన వివాహం జరగాల్సి ఉండగా.. మధుకర్‌రెడ్డి ఈ నెల 15న మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో అమ్మాయి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై అబ్బాయి తండ్రిని సంప్రదిస్తే సరైన సమాధానం ఇవ్వకపోవడంపై అమ్మాయి తరఫు వారు లబోదిబోమంటున్నారు.

పెంచికల్‌పేట్ అడవుల్లో పెద్దపులి హతం!

కాలిపోయిన కళేబరం గుర్తింపు

పెంచికల్‌పేట్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ రేంజ్ పరిధి ఎల్లూర్ అటవీ ప్రాంతంలో పెద్దపులిని వేటగాళ్లు హతమార్చారు. ఈ సంఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గస్తీ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది కాలిపోయిన పులి కళేబరాన్ని గుర్తించి.. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టోబ్రివాల్ పులి కళేబరాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. పులి రెండ్రోజుల క్రితం మృతి చెందినట్లు అంచనా వేస్తున్నారు. వేసవి నేపథ్యంలో రెండు నెలలుగా పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలో వన్యప్రాణి వేటగాళ్లు పెద్ద ఎత్తున విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చి వన్యప్రాణులను వేటాడుతున్నారు. రేంజ్ పరిధిలో సుమారు ఐదేళ్లుగా ఆవాసంగా మార్చుకుని మనుగడ సాగిస్తున్న కే8 ఆడపులి విద్యుత్ తీగలు తగిలి మృతి చెందినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సంఘటనపై అటవీశాఖ అధికారులు గోప్యత పాటిస్తున్నారు. దీనిపై జిల్లా అటవీశాఖ అధికారిని 'సాక్షి'సంప్రదించగా.. ఒక మృత కళేబరం కనిపించిందని, పూర్తిగా కాలిపోవడం వల్ల చనిపోయింది పులా? లేదా ఇతర జంతువా? అనేది తేలాల్సి ఉందన్నారు. ఘటనకు కారకులైన వారిని పట్టుకునేందుకు పూర్తి విచారణ జరుపుతున్నామని, అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆరు గేదెలు మృతి

నర్సింహులపేట: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఆరు గేదెలు మృతి చెందాయి. బాధితుల కథనం ప్రకారం.. ఎర్రకుంట సమీపంలో గేదెలు మేతకు వెళ్లాయి. గురువారం రాత్రి వచ్చిన గాలి దుమారానికి కింద పడిన 11 కేవీ విద్యుత్ తీగ తగిలి.. పెసర రవికి చెందిన రెండు గేదెలు, బూర్గుల మల్లయ్యకు చెందిన ఒకటి, పిర్నాకి రాములుకు చెందిన ఒకటి, గండు వెంకన్నకు చెందిన ఒకటి, ఇండ్ల సంపత్‌కు చెందిన ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, అధికారులు నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు కుటుంబాలు కోరుతున్నాయి.

అద్దింటి యజమాని అమానవీయం

- ఇంట్లో శవాన్ని ఉంచేందుకు నిరాకరణ
- నాలుగు రోజులుగా శ్మశానంలోనే బాధితులు

సిద్దిపేట కమాన్: తండ్రి చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాన్ని అద్దె ఇంట్లోకి యజమాని రానివ్వకపోవడంతో వారికి చేదు అనుభవం ఎదురైంది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు శ్మశానంలోని ఒక గదిలో నివాసం ఉంటున్నారు. సిద్దిపేటలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. కామారెడ్డి జిల్లా ఘణపూర్‌కు చెందిన సంతోష్ సిద్దిపేటలోని బట్టల దుకాణంలో పనిచేస్తూ.. స్థానికంగా కుటుంబంతో నివసిస్తున్నారు. సంతోష్ తండ్రి దత్తయ్య (75) అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 11వ తేదీన మృతి చెందాడు. వీరు నివసిస్తున్న అద్దె ఇంటి యజమానికి విషయం తెలియడంతో.. మృతదేహాన్ని ఇంటి వద్ద ఉంచేందుకు నిరాకరించారు. దీంతో మర్నాడు కుటుంబ సభ్యులు శ్రీరామకుంట్ల శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం సంతోష్.. కుటుంబ సభ్యులతో సహా తిరిగి అద్దె ఇంటికి వెళ్లినప్పుడు కూడా ఇంటి యజమాని లోపలికి రానివ్వలేదు. దీంతో బాధితుడు కుటుంబ సభ్యులతో సహా శ్మశానంలోనే ఉంటున్నారు. ఫ్రీజర్లు భద్రపరిచే ఓ గదిలో సంతోష్ తన భార్య, ఇద్దరు కూతుళ్లతో కలిసిఉంటున్నారు. తమ కుటుంబానికి తాత్కాలికంగా వసతి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.



శ్మశాన వాటికలోని గదిలో దీనంగా బాధిత కుటుంబ సభ్యులు

క్లుప్తంగా...

కేంద్రం పసుపు రైతుల సమస్యలు పరిష్కరించాలి

● రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాజకీయాలు పక్కన పెట్టి రైతుల కోసం పని చేయాలని, వచ్చే సీజన్‌కు ముందే పసుపు రైతుల సమస్యలను కేంద్రం పరిష్కరించాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కోరారు. శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో కమిషన్ సభ్యులు భవానీరెడ్డి, భూమి సునీల్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డు ఏర్పాటైనా రైతుకు న్యాయమైన ధర అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో పసుపు ధర ఎక్కువగా ఉంటే మన దగ్గర మాత్రం తక్కువగా ఉందన్నారు. దీనికి కర్కుమిన్ శాతం ఎక్కువగా ఉండే విత్తనం అందుబాటులో లేకపోవడమే కారణమని, సరైన విత్తనం లేక పసుపు సాగులో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. త్వరలో కొత్త విత్తన చట్టం రాబోతోందని కోదండరెడ్డి వెల్లడించారు.

కల్తీ విత్తనాలతో రైతులకు నష్టం..

రాష్ట్రంలో కల్తీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని భవానీరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కమిషన్ ఏర్పాటైన తర్వాత ములుగులో రైతులకు జరిగిన మోసం చూశాక నూతన విత్తన చట్టం తేవాలని ప్రభుత్వానికి చెప్పామన్నారు. భూమి సునీల్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనం అందడం లేదని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే ఐదు, పదేళ్ల జైలు శిక్ష పడాలన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

● 20 క్వింటాళ్లు.. రూ.40 లక్షల విలువ



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ విత్తన బ్యాగులు

కొడంగల్ రూరల్: వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అంగడిరాయిచూర్‌లో శుక్రవారం దాదాపు రూ.40 లక్షల విలువైన 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాస్ వెల్లడించిన వివరాలివి. గ్రామంలో ఉదయం 11 గంటలకు ఎస్‌ఐ సత్యనారాయణ వ్యవసాయాధికారి తులసి, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం ముదోల్ గ్రామానికి చెందిన కొండప్పనాయుడు, నారాయణపేటలోని మంగలి వెంకటప్ప గ్రామానికి చెందిన పెద్ద మల్లప్ప ఇంటిని అద్దెకు తీసుకొని నకిలీ విత్తనాలు నిల్వ చేసి విక్రయిస్తున్నారు. 35 బ్యాగుల్లో రూ.40 లక్షల విలువైన 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని ప్రశ్నిస్తే బూటు దెబ్బలు

● కార్యకర్తపై కాంగ్రెస్ నాయకుడి దాడి

మణుగూరు టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామ కాంగ్రెస్ నాయకుల మధ్య ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు అంశం వివాదానికి దారి తీసింది. గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు ఇందిరమ్మ కమిటీ సభ్యుడిగా ఉన్నాడు. అయితే, జాబితాలో తమ పేరు లేకపోగా, ఎనిమిది ఎకరాల భూమి ఉన్న వారికి ఎలా స్థానం కల్పించారని ఇటీవల ఓ కాంగ్రెస్ కార్యకర్త ఆయనను ప్రశ్నించాడు. ఇందిరమ్మ కమిటీలో కొందరు ఏకపక్షంగా వ్యవహరించి, వారి కుటుంబ సభ్యులకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో స్థానం కల్పించారని, అధికారులను ప్రభావితం చేశారని నిలదీశాడు. ఎనిమిది ఎకరాల భూమి ఉన్న వారికి ఇల్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నిస్తూ, తమ బంధువుల్లో నిరుపేదలు ఉన్నా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో మాటామాటా పెరగడంతో ఆ నాయకుడు కార్యకర్తపై బూటుతో దాడి చేశాడు. ఈ విషయం మండల నాయకుల దృష్టికి వెళ్లడంతో దాడి చేసిన నాయకుడితో క్షమాపణ చెప్పించినట్లు తెలిసింది. ఈ ఘటన మూడు రోజుల క్రితం జరగ్గా, శుక్రవారం దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

మార్కులు తక్కువగా వచ్చాయని విద్యార్థి ఆత్మహత్య

జనగామ: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జనగామ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మంద అశోక్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు యోగేశ్వర్ (19) స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో తక్కువ మార్కులు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురై యశ్వంతాపూర్ బ్రిడ్జి సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోడు భూముల్లో జలసిరులు

● సౌర విద్యుత్‌తో మోటార్లు నడిచేలా ఏర్పాట్లు
● ఇందిరా సౌర జలవికాసం కింద రూ.12,600 కోట్లు
● నల్లమలలోని మాచారంలో 19న ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి



మాచారంలోని పోడు భూముల్లో అధికారులు ఏర్పాటు చేసిన డ్రిప్, స్ప్రింక్లర్లు

సాక్షి, నాగర్‌కర్నూల్: గిరిజన రైతుల పోడు భూములను పూర్తిగా సస్యశ్యామలం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఆ భూముల్లో ఉచితంగా బోర్లను ఏర్పాటు చేసి, సౌర విద్యుత్ అందిస్తారు. స్ప్రింక్లర్లు, డ్రిప్‌ల ద్వారా ఉద్యానవన పంటలను పండించి ఆదాయం పొందేందుకు వీలుగా ప్రభుత్వం ఇందిరా సౌర జలవికాసం పథకాన్ని చేపట్టనుంది. రూ.12,600 కోట్లతో రాష్ట్రంలోని 2.10 లక్షల మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూర్చనున్నారు. ఈ పథకం కింద నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలోని చెంచుల పోడు భూములను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. ఈ నెల 19న సీఎం నల్లమలలోని మాచారం నుంచి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. దీనికోసం ముందుగా ఆ గ్రామంలోని 27 మంది చెంచులకు చెందిన 50 ఎకరాల పోడు భూములను గుర్తించారు. ఇద్దరు రైతులకు ఒక్కోటి చొప్పున బోరుబావులను ప్రభుత్వమే ఉచితంగా తవ్వించి, సోలార్ విద్యుత్ సౌకర్యం, 5 హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేసింది. నల్లమలలోని గుట్టల మధ్యనున్న మాచారంలో 16 బోర్లను తవ్వగా, అన్నిచోట్ల సరిపడా నీరు రావడం విశేషం. ఆ భూములను చదును చేయడంతోపాటు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిమ్మ, బత్తాయి, అవకాడో, మామిడి మొక్కలను నాటుతున్నారు. రైతుల పోడు భూముల్లో సరిహద్దుల చుట్టూ కొబ్బరి, వెదురు మొక్కలను ఏర్పాటు చేస్తున్నారు.

నీళ్లు బాగా పడ్డాయి..



మాకు తరాల నుంచి పోడు భూమి ఉంది. వర్షాధారం మీద మాత్రమే పంటలను పండించేవాళ్లం. ఎలాంటి నీటి సౌకర్యం లేదు. ప్రభుత్వం ఉచితంగా బోరు, మోటారును ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. బోరులో నీళ్లు బాగా పడ్డాయి. – ఉడుతనూరి అలివేలు

చెంచుల ఆదాయం పెంచేందుకు చర్యలు..



చెంచుల ఆదాయం పెంచే విధంగా ఈ పథకం కింద చర్యలు తీసుకుంటున్నాం. శాశ్వతంగా ఆదాయం లభించే పండ్లు, ఉద్యాన మొక్కలను ఏర్పాటు చేస్తున్నాం. అంతవరకు మధ్యంతర పంటలను పండించి ఆదాయం పొందేలా అవగాహన కల్పిస్తున్నాం. – బదావత్ సంతోష్, నాగర్‌కర్నూల్ కలెక్టర్

పీడీ యాక్ట్ పెట్టి లోపలేయండి

నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయదారులపై ఉక్కుపాదం మోపండి

● నిఘా పెంచాలి..ఎవరినీ ఉపేక్షించొద్దు.. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి
● వానాకాలం సాగుకు సిద్ధంగా ఉండాలి.. సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి
● వ్యవసాయశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో తుమ్మల, రామకృష్ణారావు, సందీప్ కుమార్

సాక్షి, హైదరాబాద్: నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మేవారిపై ఉక్కుపాదం మోపాలని, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి లోపలేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు నష్టం కలిగే చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉపేక్షించదని, నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టే విషయంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు కూడా లూజ్ విత్తనాలు కొనొద్దని, ప్యాకింగ్ చేసిన విత్తనాలను కొనుగోలు చేయడంతోపాటు పంట కాలం ముగిసేంతవరకు ఆ విత్తనాల కొనుగోలు బిల్లులను భద్రపర్చుకోవాలని కోరారు. వానాకాలం పంటల సాగుపై శుక్రవారం ఆయన సచివాలయం నుంచి సమీక్షించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, డైరెక్టర్ గోపీలతో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ, పోలీస్ విభాగం సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించాలని, రాష్ట్ర సరిహద్దుల వద్ద టాస్క్‌ఫోర్స్ నిఘా పెంచాలని సూచించారు. 'ఎవరెవరు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నారు.. ఎక్కడ నిల్వలున్నాయి..ఎక్కడ నుంచి రవాణా అవుతున్నాయనే వివరాలన్నీ అధికారులకు తెలుస్తుంది. రైతులను మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాల్సిందే. ఎవరినీ ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. నకిలీ దందా చేసే వ్యాపారులపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలి.' అని దిశానిర్దేశం చేశారు.

అన్నీ అందుబాటులో ఉంచండి

వానాకాలం పంటల సాగుకు సన్నద్ధంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అన్ని జిల్లాల్లో సాగు విస్తీర్ణానికి సరిపడే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. అయితే, ఇప్పటికే అన్ని జిల్లాల్లో సరిపడే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సీజన్‌లో వరి, పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని, రైతుల నుంచి డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు మార్కెట్లో ఉన్నాయని చెప్పారు.

ఆందోళన వద్దు... రైతులకు సీఎం భరోసా

ఎరువులు, విత్తనాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. ఈసారి రుతుపవనాలు ముందే వస్తుండటంతో, రాష్ట్రంలోనూ వానలు ముందుగానే కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చేసిన సూచనలను రైతులు గమనించాలని కోరారు. నకిలీ కంపెనీలు, కల్తీ విత్తనాల బారిన పడి రైతులు మోసపోకుండా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖను ఆదేశించారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో మాట్లాడాలని సీఎస్‌ను సీఎం ఆదేశించారు.

కాళేశ్వరం బరాజ్‌ల్లో పరీక్షలు

మేడిగడ్డ బాధ్యతలు సీఎస్ఎంఆర్ఎస్‌కు

● అన్నారం, సుందిళ్ల బాధ్యతలు సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు
● అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ సిఫారసులకు అనుగుణంగా కేంద్ర సంస్థలతో భూసాంకేతిక (జియో టెక్నికల్), భూభౌతిక (జియో ఫిజికల్) పరీక్షలు వెంటనే చేయించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వానాకాలంలోపే పరీక్షలన్నీ పూర్తిచేసి..నివేదికలు తెప్పించుకోవాలన్నారు. శుక్రవారం జలసౌధలో నీటిపారుదలశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మేడిగడ్డ బరాజ్‌లో పరీక్షలు చేసే బాధ్యతలు సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్-ఢిల్లీ)కి , అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో కేంద్ర విద్యుత్, నీటి పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్-పూణె)తో చేయించాలని చెప్పారు. వెంటనే ఆయా సంస్థలకు లేఖలు రాసి, సకాలంలో పరీక్షలు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని అంశాలపై అధికారులతో చర్చించిన మంత్రి, తక్షణమే పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. బరాజ్‌లకు వరదలు వచ్చేలోపే పరీక్షలు పూర్తి కావాలని స్పష్టం చేశారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం

ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) ఇన్‌లెట్ (దోమలపెంట- శ్రీశైలం) వైపు డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో టన్నెల్ తవ్వకం చేపట్టడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. దీనికోసం నిర్మాణ సంస్థ ప్రతినిధులను పిలిపించాలని చెప్పారు. ఇన్‌లెట్ వైపు శ్రీశైలం(దోమలపెంట) నుంచి 13.954 కిలోమీటర్ల దాకా టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) ద్వారా టన్నెల్ తవ్వారు. గత ఫిబ్రవరిలో జరిగిన ప్రమాదంలో టీబీఎం పూర్తిగా దెబ్బతిన్నది. అయితే మళ్లీ టీబీఎంను వాడే అవకాశాలు ఇన్‌లెట్ వైపు లేకపోవడంతో తక్షణమే డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో టన్నెల్ తవ్వకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. టన్నెల్ ఔట్‌లెట్ (మన్నెవారిపల్లి-అచ్చంపేట) వైపు టీబీఎంకు అవసరమైన బేరింగ్ రావడంతో బేరింగ్ బిగించే ప్రక్రియను వేగిరం చేయించాలని స్పష్టం చేశారు. వచ్చే నవంబరు కల్లా బేరింగ్ బిగించే ప్రక్రియ పూర్తవుతుందని నిర్మాణ సంస్థ ప్రతినిధులు గుర్తు చేసిన విషయాన్ని అధికారులు నివేదించగా, సత్వరం బేరింగ్ బిగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నెలాఖరులో కాళేశ్వరం విచారణ కమిషన్ నివేదిక

● ఇప్పటికే నివేదిక తయారీని దాదాపు పూర్తి చేసినట్లు సమాచారం
● రాజకీయ నాయకుల విచారణ లేకుండానే తుది నివేదిక!

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలపై విచారణ కోసం ఏర్పాటైన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈ నెలాఖరులో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే నివేదికను దాదాపు కొలిక్కి తీసుకువచ్చిన కమిషన్, మరోమారు దానిని క్షుణ్ణంగా పరిశీలించి, ఈ నెల 22వ తేదీ తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుందని విశ్వసనీయంగా తెలిసింది. న్యాయపరమైన చిక్కులు లేకుండా..పక్కాగా నివేదిక సమర్పించేందుకు కమిషన్ తుదిమెరుగులు దిద్దుతున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్, అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులను కమిషన్ పిలిపించి ప్రశ్నలు అడుగుతుందని ప్రచారం జరిగింది. అయితే రాజకీయ నాయకులను పిలిచి విచారణ చేపట్టే అవకాశం లేనట్లు తెలుస్తోంది.

డాక్యుమెంట్ ఆధారిత సమాచారంతోనే..

జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో డాక్యుమెంట్ ఎవిడెన్స్‌లకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. అప్పటి ప్రభుత్వం రూపొందించిన ప్రతి పత్రాన్ని కమిషన్ ఇప్పటికే లోతైన పరిశీలన చేసింది. అలాగే క్షేత్రస్థాయి నుంచి వచ్చిన సమాచారాన్ని కూడా తీసుకుని నివేదికను తయారు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకుల విచారణకు ఆస్కారం లేకుండా, న్యాయపరమైన చిక్కులకు అవకాశం కల్పించకుండా కమిషన్ తుది నివేదికను సిద్ధం చేస్తోంది. కాళేశ్వరం బరాజ్‌లపై విచారణ జరుపుతున్న సమయంలోనే కమిషన్.. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను పిలిచి విచారించాలని తొలుత నిర్ణయించినట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంతో పాటు భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణాలపై అప్పట్లో విచారణ జరిపిన జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సమన్లు పంపిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన కేసీఆర్, న్యాయస్థానాలను ఆశ్రయించడంతో విచారణనుంచి జస్టిస్ నర్సింహారెడ్డిని తప్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం విచారణ ప్రక్రియలో న్యాయపరమైన చిక్కులకు అవకాశం లేకుండా కమిషన్ తన నివేదికను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

దొరల చట్టం ధరణి.. | పేదల చట్టం భూభారతి

● మంత్రి పొంగులేటి
● రుద్రంగిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ
● జగిత్యాల కలెక్టరేట్‌లో భూ భారతిపై సమీక్ష



రుద్రంగిలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

చందుర్తి (వేములవాడ): నాలుగు గోడల మధ్య, నలుగురి స్వార్థం కోసం ప్రజల అభిప్రాయానికి భిన్నంగా తయారు చేసిన దొరల చట్టం ధరణి అని.. ప్రజల మేలు కోసం, పేదల కలలు నెరవేర్చేందుకు తీసుకొచ్చింది భూభారతి చట్టమని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. భూభారతి రెండో విడత పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ధరణిని బంగాళాఖాతంలో కలిపామని పొంగులేటి చెప్పారు. భూభారతి చట్టం అమలు ఆలస్యమైనప్పటికీ రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. భూభారతి కింద భూముల పట్టాలు, సరిహద్దులతో పాటు సర్వే చేసిన మ్యాప్‌లు పట్టేదారు పాసుబుక్‌లో నమోదు చేస్తామని తెలిపారు. తొలుత రాష్ట్రంలోని 4 మండలాలను పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసి 13 వేల దరఖాస్తులు స్వీకరించామని వివరించారు. అత్యధిక శాతం దరఖాస్తులు పరిష్కరించి, జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సంబంధిత పత్రాలను అందజేస్తామని తెలిపారు.

వారంలోగా ముంబైకి ఏసీ బస్సు: మంత్రి పొన్నం

వారం రోజుల్లోగా వేములవాడ నుంచి ముంబయి వరకు ఏసీ బస్సు ప్రారంభిస్తామని మంత్రి పొన్నం తెలిపారు. భూభారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, రాష్ట్ర కోఆపరేటీవ్ సొసైటీ అధ్యక్షుడు తీపిరెడ్డి మోహన్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్లు భూ సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: కలెక్టర్లు మానవీయ కోణంలో భూ సమస్యలను పరిష్కరించాలని మంత్రి పొంగులేటి కోరారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో భూభారతి, ఇందిరమ్మ ఇళ్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా సూచించారు.

పవర్‌ఫుల్‌గా ఉండాలి

▶ మొదటి పేజీ తరువాయి

ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఈ ఏడాది అత్యధిక విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరినాటికి అది 18,138 మెగావాట్లకు, 2034-35 నాటికి 31,808 మెగావాట్లకు పెరుగుతుందని అధికారులు సీఎంకు వివరించారు. దీంతో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాలని సీఎం సూచించారు. ప్రధానంగా క్లీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజీపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కొత్తగా అమల్లోకి తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీపై దృష్టి సారించాలని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో దిగ్గజ సంస్థలకు రాష్ట్రంలో అవకాశం ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మించే నీటి పారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని.. మెట్రో విస్తరణ, రైల్వే లైన్లు, ఇతర మాస్ ట్రాన్స్‌పోర్ట్‌లకు విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు ఇతర కార్పొరేషన్లు, కొత్తగా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.

పార్టీలకతీతంగా తిరంగా యాత్ర

● కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
● అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలను ఆహ్వానిస్తున్నాం
● మంత్రులుగా పదవి చేపట్టడమంటే ప్రజాధనాన్ని లూటీ చేయడం కాదు



సాక్షి, హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన నేపథ్యంలో తలపెట్టిన తిరంగా యాత్రను పార్టీలకతీతంగా చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా 26 మంది పౌరులను చంపడంపై దేశం యావత్తు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందన్నారు. ఉగ్రవాదుల చర్యకు బదులుగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను పేల్చివేశామన్నారు. ఉగ్రవాదుల శిక్షణ శిబిరాలు, వారి నివాసాలను ధ్వంసం చేయడంతో పాటు కరడుకట్టిన ఉగ్రవాదులను అంతం చేశామన్నారు. ఈ విజయాన్ని దేశ ప్రజలకు చెప్పేందుకే తిరంగా యాత్ర చేపడుతున్నామన్నారు. ఇందులో పాల్గొనాల్సిందిగా పార్టీలకతీతంగా పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులను ఆహ్వానిస్తున్నామన్నారు. అందరూ ఈ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కమీషన్లపై మంత్రులు తీర్మానం చేశారా?

మంత్రుల అవినీతి, అక్రమాలపై ఉన్నతస్థాయిలో దర్యాప్తు చేయించాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్లు తీసుకోవాలని మంత్రులు తీర్మానం చేశారా? అని ప్రశ్నించారు. సురేఖ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలన్నారు. రాజకీయ నాయకులు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే అపవాదు ఉందని, ముఖ్యమంత్రి, మంత్రులుగా పదవులు చేపట్టడమంటే ప్రజాధనాన్ని లూటీ చేయడం కాదని అన్నారు. గతంలోనే ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని బీజేపీ చెప్పిందని గుర్తు చేశారు. ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేక, ఒక్క కొత్త ప్రాజెక్ట్ ప్రారంభించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, భూములు అమ్మితే కానీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఇప్పుడు రాష్ట్రంలో దాపురించిందని విచారం వ్యక్తం చేశారు. అందాల పోటీల్లో పాల్గొన్న విదేశీ మహిళల కాళ్లను కడిగించడం తెలంగాణ సమాజాన్ని, మహిళా శక్తిని అవమానించడమేనని అన్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మంత్రులంతా సీఎం రేవంత్‌కు వ్యతిరేకులే

మంత్రివర్గ విస్తరణపై సీఎంకే ఆసక్తి లేదు

● మంత్రుల మధ్య విభేదాలున్నాయి
● ఉద్యోగుల జీతభత్యాలు ఎగ్గొట్టడానికే రేవంత్ దివాలా మాటలు
● ఆర్థిక ఎమర్జెన్సీ పెట్టడానికే సీఎస్‌గా రామకృష్ణారావు నియామకం
● మీడియాతో బీజేఎల్పీ నేత ఎ.మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్న వారంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకులే అని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంత్రివర్గ విస్తరణ జరగకపోవడానికి ఇదే కారణమని చెప్పారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలు, సామాజిక వర్గాల సమీకరణలు కుదరకపోవడంతో మంత్రివర్గ విస్తరణ జరగడం లేదని ప్రచారం కొనసాగుతున్నప్పటికీ.. కొత్త మంత్రుల నియామకం పట్ల సీఎం రేవంత్‌కు ఆసక్తి లేదని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంత్రివర్గ విస్తరణ ఆపే కుట్ర ముఖ్యమంత్రిదేనని, సమీకరణాలు సెట్‌కాకుండా ఆయనే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా తీసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో చెబుతున్నప్పటికీ, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మాత్రం ఎక్కడా ఈ విషయాన్ని ఒప్పుకోలేదన్నారు. మంత్రుల్లో విభేదాలు ఉన్నాయనేది వాస్తవమన్నారు. సంక్షేమ పథకాలు, ఉద్యోగుల జీతభత్యాలు ఎగ్గొట్టడానికే రేవంత్ దివాలా మాటలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మంత్రుల్లో తీవ్ర అసహనం ఉందని, సీఎంను వ్యతిరేకించే వాళ్లు ఎప్పటికప్పుడు ఢిల్లీకి నివేదికలు పంపుతున్నారని, పదేళ్ల వరకు కాంగ్రెస్‌ను పాతాళంలోకి తొక్కేసే విధంగా రేవంత్ వ్యవహారం ఉందని కాంగ్రెస్ నేతలే బహిరంగంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఆర్థిక ఎమర్జెన్సీ పెట్టడానికే సీఎస్‌గా రామకృష్ణారావు నియామకం జరిగిందన్నారు. పథకం ప్రకారమే సీఎం రేవంత్ రెడ్డి దివాలా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. మంత్రులకు కూడా సీఎం అపాయింట్‌మెంట్ లభించడం లేదన్నారు. భూముల అన్యాక్రాంతం విషయంలో కొన్ని ఫైల్స్ వల్ల రెవెన్యూ మంత్రికి, సీఎంకు మధ్య విభేదాలు వచ్చినట్లు తెలుస్తోందని, పొన్నం ప్రభాకర్‌కు, దామోదర రాజనర్సింహకు ఉప ముఖ్యమంత్రి ఇస్తే తన ఆటలు సాగవని రేవంత్ భావిస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డిని సీఎం కుర్చీ నుంచి తప్పించడానికి కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కోసం ఎదురుచూస్తోందని ఏలేటి అన్నారు.

విభేదాలు ఒట్టి మాట.. కేసీఆర్ మాటే మా బాట

▶ మొదటి పేజీ తరువాయి

ఇద్దరూ ఇటీవల కాలంలో పార్టీతోపాటు తమపై వస్తున్న విమర్శలు, రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలపై చర్చించినట్టు తెలిసింది. కాగా, పార్టీ అధినేత కేసీఆర్ ఎలా చెబితే అలా నడుచుకుంటానని, మీ(కేటీఆర్) ఆధ్వర్యంలో పనిచేయడానికి తనకు ఎలాంటి ఇబ్బంది లేదని హరీశ్‌రావు ఈ సందర్భంగా స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది.

విభేదాలు అంటూ అభూత కల్పనలు

విశ్వసనీయ సమాచారం మేరకు ఇద్దరి మధ్య జరిగిన చర్చ.. 'ఎల్కతుర్తిలో జరిగిన పార్టీ రజతోత్సవ సభ విజయవంతం కావడం కాంగ్రెస్, బీజేపీలకు మింగుడు పడలేదు. దీంతో డిజిటల్ మీడియా వేదికగా పార్టీ శ్రేణులను గందరగోళానికి గురి చేసేందుకు ఉద్దేశపూర్వకంగా ఆ రెండు పార్టీలు 'బీఆర్ఎస్‌లో విభేదాలు'అనే వార్తలను వండి వారుస్తున్నారు. హరీశ్‌రావు పార్టీ మారడమో లేదా కొత్త పార్టీ పెట్టడమో చేస్తారనే ప్రచారం ఇందులో భాగంగానే జరుగుతోంది. ఉద్యమ కాలం నుంచి కేసీఆర్ నాయకత్వంలో కలిసికట్టుగా పనిచేస్తున్న నేతల నడుమ విభేదాలు ఉన్నాయనే దుష్ప్రచారంతో పాలనా వైఫల్యాల నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్ ఈ రకమైన ప్రచారాన్ని చేస్తోంది. రేవంత్ కనుసన్నల్లోనే ఈ తరహా దుష్ప్రచారం జరుగుతున్నట్టు కాంగ్రెస్ సోషల్ మీడియా హ్యాండిల్స్ నుంచి వస్తున్న పోస్టులను పరిశీలిస్తే అర్థమవుతోంది. ఈ ప్రచారాన్ని బీజేపీ కూడా కొనసాగిస్తోంది. ప్రజల్లో బీఆర్ఎస్ పట్ల ఆదరణ పెరుగుతుండటంతో రెండు జాతీయ పార్టీలు అభూత కల్పనలు జోడిస్తున్నాయి. కొందరు స్థాయి లేని వ్యక్తులతో కేసీఆర్‌తోపాటు కుటుంబ సభ్యుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయించి వాటిని సోషల్ మీడియాలో ప్రచారంలో పెడుతున్నారు'అనే అభిప్రాయం ఇద్దరి నడుమ భేటీలో వ్యక్తమైంది.

కేసీఆర్ నాయకత్వంలోనే ముందుకు..

'కేసీఆర్ సైనికులుగా ఆయన అప్పగించిన పనులను చేయడమే మన బాధ్యత. ఇక ముందు కూడా అదే తరహాలో పార్టీ కార్యకలాపాలు ఉంటాయి. పార్టీలో విభేదాలు అంటూ పార్టీ కేడర్, ప్రజలను గందరగోళ పరిచేందుకు జరుగుతున్న ప్రయత్నాల నేపథ్యంలో మరింత సమన్వయంతో ముందుకు సాగుదాం. జూన్ 1న అమెరికాలోని డల్లాస్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కీలక నేతలందరమూ తరలివెళ్దాం. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే పక్షంలో జూన్ మొదటి వారం నుంచి క్షేత్ర స్థాయి పర్యటనలు, సమావేశాల్లో కీలక నేతలందరూ భాగస్వాములయ్యేలా చూద్దాం. ఆ రెండు పార్టీలు రాష్ట్రంలో మనుగడ కోల్పోతున్నామనే భయంతో చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది'అనే అభిప్రాయం ఈ భేటీలో వ్యక్తమైంది.

సంస్థాగత నిర్మాణం.. పని విభజన

'కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు, వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటు, శిక్షణ వంటి కార్యక్రమాలు ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ జిల్లాల వారీగా పని విభజన చేసుకొని ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధించొచ్చు. ఏడాది పొడవునా పార్టీ రజతోత్సవాలను నిర్వహించేందుకు వీలైనంత త్వరగా షెడ్యూల్ విడుదల చేయాలి. పార్టీ యంత్రాంగాన్ని ఏకోన్ముఖంగా నడిపేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి'అని కేటీఆర్, హరీశ్‌రావు నడుమ జరిగిన భేటీలో నిర్ణయించినట్టు తెలిసింది.

సాక్షి హైదరాబాద్

శనివారం ၊ 17 ၊ మే ၊ 2025



రోడ్డు ఆక్రమించి..షెడ్డు నిర్మించి..

జూబ్లీహిల్స్ రోడ్ నెం.78 నవ నిర్మాణ్‌నగర్ కాలనీ వెనక.. అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబు తన ఇంట్లో పని చేసే సిబ్బంది కోసం క్వార్టర్లు నిర్మించారు. -10లో



ఆమె స్ఫూర్తి.. విశ్వకీర్తి..

మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు ఒక్కో రోజు ఒక్కో ప్రసిద్ధ ప్రాంతాలను సందర్శిస్తున్న నేపథ్యంలో.. ఈ వ్యవహారం మొత్తం సోషల్ యాప్స్‌లో వైరల్‌గా మారుతోంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 33.0/20.0

వాతావరణం

నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 33, కనిష్టంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

వీధి దీపాల నిర్వహణపై బల్దియా నజర్

మై జీహెచ్‌ఎంసీ యాప్ ద్వారా సమస్యలు చెప్పవచ్చు

లక్డీకాపూల్: వీధి దీపాల వ్యవస్థను సమర్థంగా నిర్వహించేందుకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక దృష్టి సారించింది. గత నెల ఈఈఎస్‌ఎల్ ఏజెన్సీ అగ్రిమెంట్ ముగియడంతో వీధి దీపాల నిర్వహణ జీహెచ్‌ఎంసీ చేపట్టింది. ఇందులో భాగంగా నూతన అడిషనల్ కమిషనర్‌ని నియమించింది. జోన్‌ల వారీగా వీధి దీపాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు చర్యలు చేపట్టిన జీహెచ్‌ఎంసీ.. రోజువారీగా సమీక్షలు చేస్తోంది. ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటి వరకు 9 వేలు ఫిర్యాదులు అందగా, 5,800 ఫిర్యాదులను పరిష్కరించారు. ఫిర్యాదు అందిన 48 గంటల్లోగా సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. తమ ప్రాంతాల్లోని వీధి దీపాల సమస్యలను మైజీహెచ్‌ఎంసీ యాప్ ద్వారా తెలియజేయాలని సూచించింది.



అందాల భామలు ఆనందాల లోకంలో తేలియాడారు. శుక్రవారం ప్రపంచ సుందరి పోటీదారులు నగర శివారులోని ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌లో సందడి చేశారు. ఆహ్లాదకర వాతావరణంలో ముద్దుగుమ్మలు తన్మయత్వం చెందారు.

ఎకో పార్క్‌లో అందాలు దేఖో!

సీఆర్‌ఎంపీ రోడ్ల నిర్వహణకు టెండర్లు

లేన్‌మార్కింగ్‌లు, క్యాచ్ పిట్స్ పనులు సహా..

- తాత్కాలికంగా జూన్ వరకు మాత్రమే..

సాక్షి, సిటీబ్యూరో: సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం (సీఆర్‌ఎంపీ) కింద ప్రధాన మార్గాల్లోని రహదారుల నిర్వహణకు జీహెచ్‌ఎంసీ టెండర్లు ఆహ్వానిస్తోంది. ఐదేళ్ల క్రితం ఈ పనుల్ని పెద్ద కాంట్రాక్టు ఏజెన్సీలకిచ్చిన గడువు గత డిసెంబర్– జనవరిల్లోనే ముగిసిపోయింది. కానీ.. ఇప్పటివరకు మళ్లీ టెండర్లు పిలవలేదు. గతంలో మాదిరిగానే మళ్లీ పెద్ద ఏజెన్సీలకిచ్చే యోచనలో ఉన్న ఇంజినీరింగ్ అధికారులు రెండు రకాల ప్రతిపాదనలతో స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందారు. స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందిన విషయాన్ని తెలియజేస్తూ, ప్రభుత్వ అనుమతి కోసం సచివాలయానికి పంపి వేచి చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాకపోవడంతో.. తాత్కాలికంగా కొంత కాలం వరకైనా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలోనే ఈ పనులు చేసేందుకు తాజాగా టెండర్లు పిలుస్తున్నారు. వాస్తవానికి మే నెల ముగిసేలోగానే రీ కార్పెటింగ్, మరమ్మతులు తదితరమైనవి పూర్తి చేయాల్సి ఉండగా, స్పష్టత లేకపోవడంతో పనులు చేయలేదు.

తాజాగా సికింద్రాబాద్ జోన్ పరిధిలో..

ఇప్పటికే అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాకాలంలో పెరిగే వర్షాలకు రోడ్లు దెబ్బతింటాయి. ఇప్పటికే వివిధ సంస్థల అవసరాల కోసం తవ్వకాలకు అనుమతులివ్వడంతో, అనుమతులున్న వాటితోపాటు లేని ప్రాంతాల్లోనూ అడ్డదిడ్డంగా రోడ్లను తవ్వి వదిలేశారు. వాటిని తిరిగి పూడ్చాల్సి ఉంది. వర్షాలకు గోతులు పడితే ప్రజలతో పాటు ప్రతిపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతాయని గ్రహించి.. జూన్ వరకు పనుల కోసమంటూ తాజాగా సికింద్రాబాద్ జోన్‌లో టెండర్లు పిలిచారు. లేన్ మార్కింగ్‌లు, క్యాచ్‌పిట్స్ మరమ్మతులు, ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్లకు రంగులతో సహా సీఆర్‌ఎంపీ రోడ్ల నిర్వహణకు రూ.1.03 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. పెద్ద ఏజెన్సీలకిచ్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చేంత వరకు తాత్కాలికంగా ఈ టెండర్లు పిలిచారు. మిగతా జోన్లలోనూ పిలవనున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ నిర్ణయమేంటో?

ఒక ప్రతిపాదన మేరకు గతంలో ఉన్న మార్గాల్లోనే అంతే దూరం పనులుండగా, మరో ప్రతిపాదనలో అదనంగా కొన్ని రోడ్లను చేర్చడంతో పాటు ఈసారి అదనంగా పూడికతీత పనులు కూడా చేర్చారు. గతంలో ఎప్పటికప్పుడు రోడ్ల రీకార్పెటింగ్, గుంతల పూడ్చివేత, స్వీపింగ్, గ్రీనరీ, ఫుట్‌పాత్‌లు, లేన్‌మార్కింగ్‌ల పనులుండేవి. పాత మార్గాల్లోని రోడ్లకే అయితే.. 744 కి.మీ. నిర్వహణకు అంచనా వ్యయం రూ.2,491 కోట్లు కాగా, కొత్త రోడ్లు కూడా కలిపి 1,142 కి.మీ. నిర్వహణకు రూ.అంచనా వ్యయం రూ.3,825 కోట్లు. గతం కంటే 398 కి.మీ. మేర పనులు, రూ.1,334 వ్యయం అదనం. వీటిలో ప్రభుత్వం దేనికి అనుమతిస్తుందో, లేక ఏం చేస్తుందో వేచి చూడాల్సిందే.

గొంతు.. చెవులు కోసి.. ఒంటికి నిప్పంటించి

- మేడ్చల్ పరిధిలో మహిళ దారుణ హత్య
- నగభాగం వరకు కాలిన మృతదేహం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హత్యకు గురైన లక్ష్మి

మేడ్చల్: మేడ్చల్ పరిధిలో ఓ మహిళ దారుణ హత్యకు గురైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మి (50) మేడ్చల్ మండల పరిధిలోని అత్వెల్లిలో అద్దె గదిలో నివాసం ఉంటూ కిష్టాపూర్‌లోని ఓ మద్యం దుకాణంలో రోజువారీ కూలీగా పని చేస్తోంది. శుక్రవారం తెల్లవారుజామున ఆమె ఉంటున్న గదిలోంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చెవులు, గొంతు కోసి.. సగం కాలిన స్థితిలో మహిళ మృతదేహం కనిపించింది. ఆమె ఒంటిపై దుస్తులు వేసి కాల్చివేసినట్టు గుర్తించారు. క్లూస్ టీం సహాయంతో పోలీసులు ఆధారాలను సేకరించారు. ఈ సందర్భంగా ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి మాట్లాడుతూ... మహిళ హత్య కేసు ఛేదించడానికి లోకల్, ఎస్వోటీ పోలీసులతో కలిపి ఐదు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మహిళ ఒంటి మీదున్న నగలు, డబ్బుల కోసం నమ్మించి ఇక్కడికి వచ్చిన వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడ్డారా?, గతంలో తనతో సహజీవనం చేసిన వ్యక్తి ఈ పని చేశాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా.. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ఫేక్ సేల్‌డీడ్

నకిలీ పత్రాలను సృష్టించి బ్యాంక్ రుణాలు

- 9 ఏళ్లుగా సాగుతున్న వ్యవస్థీకృత మోసాలు
- అడ్వొకేట్లు, వైద్యుల సంతకాలు ఫోర్జరీ
- మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో కేటుగాళ్ల దోస్తీ
- పోలీసులకు చిక్కిన ఆరుగురు నిందితులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ సేల్‌డీడ్ పత్రాలు

ఒకటిన్నరేళ్లలో 181 నకిలీ బర్త్ సర్టిఫికెట్లు..

ఈ ముఠా నకిలీ ఆదాయ, కుల, జనన ధ్రువీకరణ పత్రాలను సైతం సృష్టించేది. అంబర్‌పేటకు చెందిన ఎండీ జలీల్, నల్లగొండకు చెందిన పులుసు మల్లేష్ గౌడ్‌లతో పాటు కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ప్రవీణ్, నార్సింగి మున్సిపల్ ఆఫీసులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి దుడ్డు సుధీర్ కుమార్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ ఆఫీసులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ముదస్సిర్‌లతో భాను ప్రకాశ్ జట్టు కట్టాడు. ఆస్పత్రి డిశ్చార్జ్ సమ్మరీ, ఆధార్ కార్డు ఇతరత్రా ఆధారాలు ఏవీ లేకుండానే ధ్రువీకరణ పత్రాలను తయారు చేసి, విక్రయించేవారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది అధికారికంగా మీ సేవ కేంద్రాల నుంచి ఆయా ధ్రువీకరణ పత్రాలను కస్టమర్లకు అందించేవారు. గడిచిన ఒకటిన్నరేళ్లలో ఈ ముఠా ఏకంగా 181 బర్త్ సర్టిఫికెట్లను జారీ చేసింది.

సాక్షి, సిటీబ్యూరో:

నకిలీ సేల్‌డీడ్‌లను సృష్టించి, వాటిని బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణం తీసుకుంటూ వ్యవస్థీకృత మోసాలకు పాల్పడుతున్న ముఠా ఆట కట్టించారు రాచకొండ పోలీసులు. వివరాలను శుక్రవారం రాచకొండ కమిషనర్ జి.సుధీర్ బాబు వెల్లడించారు. హయత్‌నగర్‌కు చెందిన తోట వెంకట భాను ప్రకాష్, ఆయన భార్య సాగరిక సాత్విక్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో సరూర్‌నగర్ మున్సిపల్ ఆఫీసు ఎదురుగా నోటరీ వ్యాపారం చేస్తున్నారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన వీరు వక్రమార్గంలో డబ్బు సంపాదించాలనుకున్నారు. హయత్‌నగర్‌కు చెందిన స్టాంప్ వెండర్ అడ్డగూడూరు అనిల్, అతడి తండ్రి చంద్రశేఖర్, సిటీ సివిల్ కోర్టులో డాక్యుమెంట్ రైటర్‌గా పని చేస్తున్న ఆసిఫ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఫిరోజ్ అలీతో ముఠాగా ఏర్పడ్డారు. నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల మీద నకిలీ అద్దె ఒప్పందాలు, అఫిడవిట్లు, సేల్ డీడ్‌లను సృష్టించేవారు. వీటిని భూ కబ్జాదారులకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదించేవారు. సులువుగా ఆదాయం వస్తుండటంతో ఆశపడిన భాను ప్రకాశ్.. పాత నాన్ జ్యుడీషియల్ పేపర్లను సేకరించి.. కొన్ని రకాల రసాయనాలను ఉపయోగించి స్టాంప్ పేపర్లపై



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుధీర్ బాబు

ఉన్న వివరాలను చెరిపివేసేవాడు.

అడ్వొకేట్ల, అధికారుల సంతకాలు ఫోర్జరీ..

దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రబ్బర్ స్టాంప్‌ల తయారీదారు సత్య ప్రభు నుంచి అడ్వొకేట్లు, వైద్యులు, ప్రభుత్వ అధికారుల నకిలీ రబ్బర్ స్టాంప్‌లను తయారు చేయించి వీరి సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ సేల్ డీడ్‌లను సృష్టించేవాడు. ఆయా డాక్యుమెంట్లను భూ కబ్జాదారులకు విక్రయించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకునేవాడు. ఈ నకిలీ డాక్యుమెంట్లను ఒక్కొక్కటి రూ.5 వేల నుంచి రూ.20 వేలకు విక్రయించేవాడు. గత ఏడాదిలోనే ఏకంగా 280 నకిలీ సేల్‌డీడ్‌లను సృష్టించాడు.

నకిలీ పత్రాలతో రుణం..

నకిలీ సేల్‌డీడ్ పత్రాలతో బ్యాంక్‌లో రుణం పొందేందుకు ఖమ్మంకు చెందిన చంచల నిఖిల్ ఈ ముఠాతో చేతులో కలిపాడు. ఈ క్రమంలో సరూర్‌నగర్‌కు చెందిన బొటిక్ వ్యాపారి జల్ల కిశోర్ కుమార్ వ్యాపార విస్తరణ కోసం డబ్బు అవసరం కాగా.. నకిలీ సేల్ డీడ్ పత్రాలతో రుణం పొందేందుకు భానును కలిశాడు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్స్ టీం (ఎస్‌ఓటీ), సరూర్‌నగర్ పోలీసులు సాత్విక్ ఎంటర్‌ప్రైజెస్‌లో సోదాలు నిర్వహించారు. ఆరుగురు నిందితులు భాను ప్రకాశ్, సాగరిక, చంద్రశేఖర్, అనిల్, జలీల్, కిశోర్ కుమార్‌లను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఫిరోజ్ అలీ, మల్లేష్, ప్రవీణ్, సుధీర్ కుమార్, ముదస్సిర్, నిఖిల్, సత్య ప్రభుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మ్యాన్‌హోళ్లలో బ్లాంకెట్లు.. బెడ్ షీట్లు!

నల్లగొండ చౌరస్తా వద్ద డీ- సిల్టింగ్‌లో వెలికితీత

- అవగాహన కల్పించినా.. మారని తీరు
- బయటపడుతున్న ఘన పదార్థాలు.. వ్యర్థాలు



బయటపడిన సిల్ట్, బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు

సాక్షి, సిటీబ్యూరో: నగర వాసుల తీరు మారడం లేదు. సీవరేజీ పైపులైన్‌లో వ్యర్థాలే కాదు.. కరగని ఘన పదార్థాలు, మురుగు ప్రవాహానికి అడ్డుపడే బ్లాంకెట్లు, బెడ్‌షీట్లను సైతం వదిలేస్తున్నారు. సీవరేజీ ఓవర్ ఫ్లో కట్టడికి 180 రోజుల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీ- సిల్టింగ్ చేసినా.. సీవరేజీ వ్యర్థాలపై అవగాహన కల్పించినా మార్పు రావడంలేదు. ఇటీవల మలక్‌పేట నల్లగొండ చౌరస్తా వద్ద సీవరేజీ ఓవర్ ఫ్లో పై ఫిర్యాదుల వస్తుండంతో జలమండలి అధికారులు శుక్రవారం డీ-సిల్టింగ్ పనులు నిర్వహించారు. జెట్టింగ్ యంత్రాలను ఉపయోగించి మ్యాన్‌హోళ్ల నుంచి సిల్ట్‌ను బయటికి తీయగా.. అందులోంచి బ్లాంకెట్లు.. బెడ్ షీట్లు, దుస్తులు, ప్లాస్టిక్ వస్తువులు ఇతర ఘన పదార్థాలు బయటపడ్డాయి. దీని కారణంగా ఆ ప్రాంతంలోని మ్యాన్‌హోళ్లు ఓవర్‌ఫ్లో అవుతున్నట్టు గుర్తించారు. ఇకనుంచి ఎవరైనా మ్యాన్‌హోళ్లలో చెత్త, వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి అధికారులు హెచ్చరించారు.

వాణిజ్య భవనాల్లో సిల్ట్ చాంబర్లు తప్పనిసరి

వాణిజ్య భవన సముదాయాల్లో సిల్ట్ చాంబర్లు తప్పనిసరి అని జలమండలి సూచించింది. రెస్టారెంట్లు, హాస్టల్స్, హోటళ్లు, బేకరీలు, ఫుడ్ కోర్టులు, ఆఫీసులు తదితర వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న భవనాల యజమానులు, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు.. తమ సీవరేజీ పైపులైన్‌ను నేరుగా జలమండలి సీవరేజ్ నెట్ వర్క్‌కు అనుసంధానం చేయడంతో వాటి నుంచి వచ్చే ఘన, కరగని వ్యర్థ పదార్థాలు మురుగు ప్రవాహనికి అడ్డుపడుతున్నాయి. ప్రధానంగా సిల్ట్ చాంబర్లు లేకపోవడంతో సీవరేజీ పైపులైన్లపై ఒత్తిడి పెరిగి అవి ఓవర్ ఫ్లో అవుతున్నాయి. మరోవైపు నివాస సముదాయాల నుంచి సీవరేజీ పైపులైన్‌లో బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు, ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, వాటర్ బాటిళ్లు, ఘన పదార్థాలు లాంటి వ్యర్థాలు వదలడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.

అక్రమార్కుల ఆగడాలకు చెక్!

3.5 ఎకరాల సర్కారు స్థలంపై కబ్జాదారుల కన్ను

- చెట్లపై సీసీ కెమెరాల ఏర్పాటుతో నిఘా
- వీటిని తొలగించిన రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు: షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి



సీసీ కెమెరాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బంజారాహిల్స్: మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు కబ్జాదారులు చేయని కుయుక్తులు లేవు. పట్టు వదలని విక్రమార్కుల్లా భూమిపై పట్టు నిలుపుకోవాలని అటు పోలీసుల్ని, ఇటు రెవెన్యూ అధికారులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. ఎంతో విలువైన మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు పన్నాగాలు పన్నుతూనే ఉన్నారు. కబ్జాదారు పార్థసారథి, ఆయన కొడుకు విజయ భార్గవన్ ఇద్దరూ కలిసి ఎవరికీ తెలియకుండా ఇక్కడి చెట్లపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టుగా అధికారులు గుర్తించారు. శుక్రవారం 12 సీసీ కెమెరాలను రెవెన్యూ యంత్రాంగం తొలగించింది.

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి..

షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నెం–10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా తట్టిఖానా వాటర్ రిజర్వాయర్‌ను ఆనుకొని సర్వే నెం. 403/పిలో ప్రభుత్వానికి చెందిన 5 ఎకరాల స్థలం ఉంది. ఇందులో కొంత మంది అక్రమార్కులు నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి కబ్జా చేసేందుకు ఎనిమిదేళ్లుగా తీవ్ర ప్రయత్నాలు చేయడంతో పాటు రౌడీలను సైతం దింపి ఈ స్థలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు ఈ స్థలాన్ని కబ్జా చేసిన పార్థసారథి, ఆయన కొడుకు విజయ్ భార్గవ్‌పై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఈ విషయంలో షేక్‌పేట రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయగా కేసులు కూడా నమోదయ్యాయి. మూడుసార్లు ఈ స్థలంలోకి వెళ్లిన రెవెన్యూ అధికారులు నిర్మాణాలు కూల్చివేసి అక్రమార్కులపై ఫిర్యాదు చేశారు. అయినాసరే కబ్జాదారులు ఈ స్థలంలో అడుగడుగునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారాన్ని తమ అధీనంలోకి తీసుకొని లోపల ఒక గదిని నిర్మించి రౌడీలను పెట్టుకున్నారు. సమాచారం అందుకున్న షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు.. కబ్జా జరిగిన స్థలం లోపల ఉన్న అయిదుగురు రౌడీలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రౌడీలను అక్కడి నుంచి ఖాళీ చేయించారు.



బ్లూషీట్లపై ప్రభుత్వ భూమి అని రాసిన అధికారులు

అధికారుల కళ్లుగప్పి..

ఠాణాలో క్రిమినల్ కేసులు నమోదైనా.. రౌడీలను తరి మేసినా.. అక్రమ నిర్మాణాలు కూల్చివేసినా.. సదరు కబ్జాదారులు మాత్రం ఈ స్థలంలో తిష్ట వేశారు. ఎలాగైనా భూమిని కబ్జా చేసుకోవాలని ఎన్నో రకాలుగా ప్రయత్నిస్తూ ఉన్నారు. కబ్జాదారుల ఆగడాలకు షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి చెక్ పెట్టినా.. అధికారుల కళ్లుగప్పి సెలవురోజుల్లో కబ్జాదారులు స్థలంలోకి చొచ్చుకొస్తున్నారు. అయిదెకరాల ఈ ప్రభుత్వ స్థలం పూర్తిగా ప్రభుత్వానికి చెందినదేనని.. ఇందులో ఎకరన్నర స్థలం తట్టిఖానా వాటర్ రిజర్వాయర్ కోసం కేటాయించినట్లు.. మిగతా మూడున్నర ఎకరాల భూమి పక్కాగా ప్రభుత్వానిదేనని తహసీల్దార్ అనితారెడ్డి పునరుద్ఘాటించారు. ఈ స్థలంపై ఎలాంటి వివాదాలు లేవని.. అందుకోసమే లోపల హెచ్చరిక బోర్డులతో పాటు బ్లూషీట్లపై ఇది ప్రభుత్వ భూమి అని రాసినట్లు ఆమె తెలిపారు. కబ్జాదారులు మరోసారి స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో రూ.15.2 లక్షలు స్వాహా

ప్రభుత్వ ఉద్యోగికి సైబర్ నేరగాళ్ల టోకరా

సాక్షి, సిటీబ్యూరో: పెట్టుబడుల పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.15.2 లక్షలు స్వాహా చేశారు. శుక్రవారం బాధితుడి ఫిర్యాదుతో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికిగత నెల 9న వాట్సాప్ కాల్ వచ్చింది. తమ సూచనలతో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతూ ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలు వస్తాయని నమ్మబలికారు. ఇన్వెస్ట్‌మెంట్స్, ట్రేడింగ్‌కు సంబంధించి సలహాలు, సూచనలు సైతం తామే ఇస్తామని పేర్కొన్నారు. తమ కంపెనీ పేరు 'ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లిమిటెడ్' అని, తమకు సెబీ అనుమతి కూడా ఉందని నమ్మించారు. ఐసీఐసీఐ సెక్యూరిటీ ట్రేడింగ్ పేరుతో ఉన్న యాప్‌ను లింక్ ద్వారా షేర్ చేసిన సైబర్ నేరగాళ్లు దాన్ని ఇన్‌స్టల్ చేసుకుని, యాక్టివేట్ చేసుకోవాలని సూచించారు. అలా చేసిన బాధితుడు దాని ద్వారానే నేరగాళ్ల ఖాతాల్లోకి రూ.2 లక్షలు, రూ.5 లక్షలు, రూ.8.2 లక్షలు చొప్పున బదిలీ చేశారు. ఈ మొత్తాన్ని స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసినట్లు, లాభాలతో కలిపి బ్యాలెన్స్ రూ.91.21 లక్షలకు చేరినట్లు ఆ యాప్‌లో బాధితుడికి కనిపించింది. ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా సాధ్యం కాలేదు. నగదు వెనక్కు తీసుకోవాలంటే మరో రూ.4.3 లక్షలు డిపాజిట్ చేయాలంటూ నేరగాళ్లు చెప్పారు. అంత మొత్తం తన వద్ద లేదని బాధితుడు చెప్పగా.. విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం లేదంటూ నేరగాళ్లు స్పష్టం చేశారు. త్వరలోనే తమ యాప్‌లోని ఖాతా కూడా బ్లాక్ అయిపోతుందని బెదిరించారు. దీంతో తాను రూ.15.2 లక్షల మేర మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

వరద సమస్యలపై హైడ్రా దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: ఒక్క వానకే నగరం చిగురుటాకులా వణికి పోవాల్సి వస్తోంది. రహదారులన్నీ జలమయం అవుతున్నాయి. బస్తీలు, కాలనీలు వరద నీటిలో చిక్కుకుంటున్నాయి. ఈ పరిస్థితులను చక్కదిద్దడంపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి పెట్టింది. మూసీ నది, దానికి దారి తీసే నాలాలు పక్కగా ఉంటే సిటీకి నీటి ముప్పు దాదాపు తప్పిపోతుంది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మూసీ నదికి హద్దుల గుర్తింపు, ఓఆర్ఆర్ లోపల ఉన్న నాలా నెట్‌వర్క్ వెడల్పు నిర్ధారణకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా శుక్రవారం వివిధ శాఖలు, నిపుణులతో బుద్ధభవన్‌లోని ప్రధాన కార్యాలయంలో మేధోమథనం నిర్వహించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో హైడ్రాకు ఎలాంటి సంబంధం లేనప్పటికీ ఆ నది ఆక్రమణలపై అందుతున్న ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుంటూ ఈ కోణంపై దృష్టి పెట్టింది. ఆ నదికి ఇరువైపులా సరిహద్దుల నిర్ధారణ ఎలా చేపట్టాలనే విషయంపై కూలంకషంగా చర్చించింది. చెరువులకు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) ఉన్నట్లే నదికి మాగ్జిమమ్ ఫ్లడ్ లెవల్ (ఎంఎఫ్ఎల్) ఉంటుంది. మూసీకి సంబంధించి దీనిని గుర్తించేందుకు గ్రామ, రెవెన్యూ రికార్డులను పరిగణలోకి తీసుకుని హద్దులు నిర్దేశించాలని నిపుణులు హైడ్రాకు సూచించారు. మూసీ పరివాహక ప్రాంతానికి సంబంధించి హైడ్రాలజీ నివేదికలు, ఎన్నారెస్సీ శాటిలైట్ ఇమేజీలు, సర్వే ఆఫ్ ఇండియా రికార్డులను కూడా పరిశీలించాలని, అలా మూసీ హద్దులను నిర్ధారించి ఆ ప్రాంతంలో నిర్మాణాలు జరగకుండా చూడాలని పలువురు అభిప్రాయపడ్డారు. అనేక చోట్ల నాలాల లింకు తెగిపోయిందని, వాటిని పునరుద్ధరించాలని కోరారు.

ఐదుగురు తహసీల్దార్ల బదిలీ

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో ఐదుగురు తహసీల్దార్లు బదిలీ అయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన వారిలో ఐదుగురు తిరిగి హైదరాబాద్‌కు, ఇక్కడికి వచ్చిన వారిలో ఐదుగురిని ఆయా జిల్లాలకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సదానందం, పద్మ సుందరి, బుచ్చయ్య, అశోక్ కుమార్ చంద్రశేఖర్ గౌడ్ బదిలీ కాగా, ఇతర జిల్లాలో పనిచేస్తున్న అన్వర్ హుస్సేన్, ఎం. నర్సయ్య, బిక్షపతి, బాలశంకర్, సునీల్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

రోడ్డు ఆక్రమించి.. షెడ్డు నిర్మించి..

- ఉమ్మడి ఏపీలో చంద్రబాబు హయాంలో సిబ్బందికి క్వార్టర్లు
- వాటిలో తిష్టవేసిన అక్రమార్కులు
- రెవెన్యూ అధికారుల పరిశీలన
- అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశం



క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న షేక్‌పేట తహసీల్దార్ అనిత

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్, షేక్‌పేట మండలం, జూబ్లీహిల్స్ రోడ్ నెం.78 నవ నిర్మాణ్‌నగర్ కాలనీ వెనక ఉన్న ప్రభుత్వ స్థలంలో..ఉమ్మడి ఏపీలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంట్లో పని చేసే సిబ్బంది కోసం క్వార్టర్లు నిర్మించారు. సర్వే నెం.403లో ఒక్కొక్కరికి 50 గజాల చొప్పున ఈ క్వార్టర్స్ నిర్మాణం చేపట్టారు. 1999 ప్రాంతంలో చంద్రబాబు ఇంట్లో పని చేసే సిబ్బంది కోసం ప్రభుత్వ ఖర్చులతో ప్రభుత్వ స్థలంలోనే ఈ క్వార్టర్లు నిర్మించి ఇందులో ఆరుగురికి పట్టాలు కూడా ఇచ్చారు. మరో ఆరు ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. అయితే చంద్రబాబు ఇంట్లో దోభీ, తోటమాలి తదితరులు ఖాళీగా ఉన్న ప్లాట్లలో ఉంటున్నారు. ప్లాట్ నెంబర్.1లో ఎలాంటి పట్టా లేకుండా సీహెచ్.మూర్తి అనే దోభీ కొంత కాలంగా అక్రమంగా నివసిస్తుండటమే కాకుండా..క్వార్టర్స్ ముందు రోడ్డును ఆక్రమించి షెడ్డు నిర్మించాడు. దీంతో స్థానికులు రాకపోకలు స్తంభించాయి. ఈ విషయమై కొంత కాలంగా పట్టాలు ఉండి అధికారికంగా ఉంటున్న వారికి, పట్టాలు లేకుండా ఖాళీ ప్లాట్లలో ఉంటున్న వారికి మధ్య రోడ్డు గొడవలు జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఇక్కడ సీవరేజి పైప్‌లైన్, మంచినీటి పైప్‌లైన్ మంజూరు కావడంతో పాటు జీహెచ్ఎంసీ రోడ్డు పనులు కూడా ప్రారంభించాల్సి ఉంది. అయితే దోభీ మూర్తి ఆక్రమించిన స్థలంలో షెడ్డు నిర్మాణం వీటికి అడ్డుగా ఉంది. సదరు షెడ్డును తొలగిస్తే పనులు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణంపై స్థానికులు షేక్‌పేట తహసీల్దార్‌కు స్థానికులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ అనితారెడ్డి క్వార్టర్లను పరిశీలించారు. వారి వద్ద ఉన్న పట్టాలు, ఖాళీగా ఉన్న ప్లాట్లపై ఆరా తీశారు. రోడ్డు ఆక్రమించి షెడ్డు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తామని, అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు రెండు రోజుల గడువు ఇస్తున్నామని ఆమె హెచ్చరించారు. మరో వైపు పట్టాలు లేకుండానే కొంత మంది అక్రమార్కులు ప్రభుత్వం నిర్మించిన ఈ క్వార్టర్లలో తిష్టవేసి వీటిని శాశ్వతంగా కాజేసేందుకు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు ఈ విషయంపై స్పందించి అక్రమార్కులను ఖాళీ చేయించి క్వార్టర్స్ అన్యాక్రాంతం కాకుండా చూడటంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నగరంలో నేడు

- ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో సైనికులకు మద్దతుగా 'మనం సైతం దేశం కోసం చలో ట్యాంక్‌బండ్' పేరిట తిరంగా ర్యాలీ సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.
- నిమ్స్ కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో అధిక రక్తపోటు, సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు ప్రపంచ రక్తపోటు దినోత్సవ ర్యాలీ నిమ్స్‌లోని బంజారా హిల్స్ గేట్ వద్ద ఉదయం 7.45గంటలకు జరుగుతుంది.
- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీకాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో డేస్ ఫెస్టివల్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లీష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7 విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ట్యాంక్‌బండ్‌పై ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ట్యాంక్‌బండ్‌పై శనివారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించనున్నారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి చిల్డ్రన్స్ పార్క్ వరకు ఈ ర్యాలీ జరుగనున్న నేపథ్యంలో సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ సమయంలో ట్యాంక్‌బండ్ పైకి వాహనాలు అనుమతించకుండా అంబేడ్కర్ విగ్రహం, డీబీఆర్ మిల్స్, సెయిలింగ్ క్లబ్ కేంద్రంగా ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్

మియాపూర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు వదిలివెళ్లిన బ్యాగులో రూ.8లక్షలు విలువైన బంగారు ఆభరణాలను ప్రయాణికురాలికి అందజేసి బస్సు డ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే..కొండాపూర్‌కు చెందిన భువన కుటుంబ సభ్యులతో కలిసి గోవాకు వెళ్లి తిరిగి గురువారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చింది. కొండాపూర్ వెళ్లేందుకు శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఆర్టీసీ మియాపూర్ -2 డిపోకు చెందిన పుష్పక్ బస్సు ఎక్కారు. ఆ తర్వాత కొద్ది సేపటికే బస్సు దిగి మరో బస్సు ఎక్కింది. ఆ సమయంలో ఆమె పుష్పక్ బస్సులో తన బ్యాగు మర్చిపోయింది. బస్సు బయలుదేరిన తర్వాత దీనిని గుర్తించిన పుష్పక్ బస్సు డ్రైవర్ షేక్ ముబీన్ బ్యాగ్‌ను పరిశీలించగా అందులో బంగారు నగలు ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. దీంతో అధికారులు సదరు ప్రయాణికురాలి వివరాలు తెలుసుకుని ఆమెకు సమాచారం అందించారు. శుక్రవారం ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి, డీపో మేనేజర్ వెంకటేషం భువనకు బ్యాగును అందజేశారు. బ్యాగును అందించి నిజాయితీని చాటుకున్న డ్రైవర్ షేక్ ముబీన్‌ను అధికారులు ఘనంగా సన్మానించారు.

మైనర్‌ను వేధించిన బీటెక్ విద్యార్థి అరెస్ట్

ఘట్‌కేసర్: ఓ బాలికను బ్లాక్ మెయిల్ చేస్తూ వేధిస్తున్న బీటెక్ విద్యార్థిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అవుషాపూర్ గ్రామానికి చెందిన అవినాశ్‌రెడ్డి స్థానిక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇంజినీరింగ్ చదువుతున్న బాలికతో అతడికి ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. కొన్నాళ్ల క్రితం అతను సదరు బాలికకు ఫోన్ చేసి డబ్బు అవసరముందని ఇంట్లోని బంగారు ఆభరణాలు తీసుకురావాలని చెప్పాడు. లేని పక్షంలో తనతో దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించాడు. దీంతో సదరు బాలిక బంగారు ఆభరణాలు తెచ్చి ఇచ్చింది. ఇంట్లో ఆభరణాలు కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు ఆమెను నిలదీయగా బ్లాక్ మెయిల్ విషయం చెప్పింది. దీంతో బాలిక తండ్రి ఈనెల 12న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం అతడిని రిమాండ్‌కు తరలించారు. కాగా ప్రియురాలి చెల్లిని తన దగ్గరికి సుకురావాలని అవినాశ్‌రెడ్డి బెదిరించినట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మనస్తాపానికి లోనైన ఆమె చెల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. సదరు యువకుడు బంగారాన్ని కుదువపెట్టి తీసుకున్న డబ్బులో నుంచి కొంత సదరు బాలిక కూడా తీసుకున్నట్లు సమాచారం.

బాకీ వసూలుకు వెళ్తే కుక్కతో కరిపించాడు

వెంగళరావునగర్: బాకీ వసూలు కోసం వెళ్లిన బ్యాంకు ఏజెంట్‌పై దాడి చేయడమేగాక కుక్కతో కరిపించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్‌కు చెందిన నందివర్ధన్‌రావు ఆర్‌బీఎల్ బ్యాంకు క్రెడిట్ కార్డు వినియోగించుకుని డబ్బులు తిరిగి చెల్లించలేదు. దీంతో బ్యాంకు ఉత్తర్వుల మేరకు బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ కె.సత్యనారాయణ గురువారం సాయంత్రం జవహర్‌నగర్‌లోని అతడి ఇంటికి వెళ్లాడు. బంధువులు ఆయన ఇంట్లో లేడని చెప్పడంతో సత్యనారాయణ వెనుదిరిగాడు. మొదటి అంతస్తు నుంచి కిందకు వస్తుండగా ఎదురుగా వచ్చిన నందివర్ధన్‌రావు ఎవరు నీవు, ఎక్కడ నుంచి వస్తున్నావని వివరాలు అడిగాడు. తాను బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌నని చెప్పడంతో ఆయన ఒక్కసారిగా సత్యనారాయణపై దాడిచేశాడు. తీవ్రంగా కొట్టడమే కాకుండా ఫోన్‌ను విసిరి పగల కొట్టాడు. అంతేగాకుండా పెంపుడు కుక్కను అతనిపై ఉసి గొలిపి కరిపించాడు. గాయపడిన సత్యనారాయణ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న అనంతరం శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపండి

ఉస్మానియాయూనివర్సిటీ: మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్‌లో పరిశోధక విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శాంతి చర్చలు–మేధో స్పందన అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆజాద్ అధ్యక్షత వహించగా ప్రొ.హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్, తెలంగాణ ఉద్యమ కారుడు గాదె ఇన్నయ్య, పౌరహక్కుల నేత ప్రొ.గడ్డం లక్ష్మణ్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.కాశీం, ప్రొ.అన్వర్‌ఖాన్, డా.కొండ నాగేశ్వర్‌రావు, వామ పక్ష నేతలు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొని ప్రసంగించారు. శాంతి చర్చలకు మావోయిస్టులు సానుకూలంగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి కాల్పుల విరమణ పాటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

బర్షత్ ఖాన్ 'బకాయి' రూ.25 కోట్లు!

- లగ్జరీ కార్ల స్మగ్లర్ లెక్కలు తేలుస్తున్న అహ్మదాబాద్ డీఆర్ఐ
- తక్షణం రూ.ఏడు కోట్లు చెల్లించాలంటూ ఆదేశాలు
- రూ.కోటి చెల్లించి బెయిల్‌కు దరఖాస్తు
- హైదరాబాద్ చేరుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందం
- నగరానికి చెందిన ఇద్దరు కార్ల కొనుగోలుదారుల గుర్తింపు



బర్షత్ ఖాన్

సాక్షి, సిటీబ్యూరో: గుజరాత్ కేంద్రంగా వ్యవస్థీకృతంగా సాగిన లగ్జరీ కార్ల అక్రమ రవాణా కేసుపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అహ్మదాబాద్ యూనిట్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ స్మగ్లింగ్‌లో కీలకంగా వ్యవహరించిన హైదరాబాద్ వ్యాపారి బర్షత్ ఖాన్ ఎగవేసిన కస్టమ్స్ సుంకం రూ.25 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. తక్షణం రూ.7 కోట్లు చెల్లించాలంటూ ఆదేశించగా... రూ.కోటి కట్టిన బర్షత్ మరో రూ.50 లక్షలు చెల్లించడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తూ అహ్మదాబాద్ కోర్టులో గురువారం బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ పిటిషన్‌ను తిరస్కరించాలంటూ డీఆర్ఐ అధికారులు చేసిన వాదనలతో ఏకీభవించిన కోర్టు ఆ మేరకు నిర్ణయం తీసుకుంది. మరోపక్క ఈ లగ్జరీ కార్లను ఖరీదు చేసిన వారిలో ఇద్దరు హైదరాబాదీలను అహ్మదాబాద్ డీఆర్ఐ యూనిట్ గుర్తించింది. వీరి నుంచి వివరాలు సేకరించేందుకు శుక్రవారం ఓ ప్రత్యేక బృందం హైదరాబాద్ చేరుకుంది. విజయ్‌నగర్ కాలనీలోని మధ్య తరగతి కుటుంబానికి చెందిన బర్షత్ అహ్మద్ ఖాన్ గచ్చిబౌలిలోని డైమండ్ హిల్స్‌లో 2008 నుంచి ఎస్కే కార్ లాంజ్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతడి సోదరుడికి రెండు వర్క్‌షాప్స్ ఉండటంతో బర్షత్ సైతం ఈ రంగంలోకి వచ్చాడు. పలువురు రాజకీయ నాయకులు, అధికారులతో పాటు బడా బిల్డర్లు, కాంట్రాక్టులతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్న బర్షత్ పదేళ్లలోనే గణనీయమైన స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం క్లెవ్ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బీఏకే కార్ లాంజ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, బీఏకే కార్ లాంజ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో డైరెక్టర్‌గా ఉన్నారు. ఇతడి కార్ లాంజ్ నుంచి ఖరీదైన లగ్జరీ కార్లను ఖరీదు చేసే వారిలోనూ వీళ్లే ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. బర్షత్ కస్టమర్లలో అత్యధికులు పన్ను ఎగ్గొట్టడానికి చెల్లింపులన్నీ నగదు రూపంలోనే చేసినట్లు డీఆర్ఐ అనుమానిస్తోంది. గడిచిన కొన్నేళ్లల్లో అమెరికా, జపాన్‌లోని హమ్మర్ ఈవీ, కాడిలాక్ ఎస్కలేడ్, రోల్స్ రాయిస్, లెక్సస్, టయోటా ల్యాండ్ క్రూయిజర్, లింకన్ నేవిగేటర్ తదితర కంపెనీలకు చెందిన 30 కార్లను అక్రమంగా దిగుమతి చేసుకున్నట్లు డీఆర్ఐ గుర్తించింది. ఈ వాహనాలను హైదరాబాద్, పుణే, అహ్మదాబాద్, బెంగళూరు, ఢిల్లీల్లో బడా వ్యాపారులు, రియల్టర్లకు విక్రయించారని అధికారులు ఆధారాలు సేకరించారు. దాదాపు పది కార్లు హైదరాబాదీలకే అమ్మినట్లు డీఆర్ఐ అధికారులు చెప్తున్నారు. వీరిలో ఇద్దరిని గుర్తించిన డీఆర్ఐ మిగిలిన వారి కోసం ఆరా తీస్తోంది.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- మాన్సూన్ ముందస్తు ఏర్పాట్ల సమీక్షలో జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ అన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మాన్సూన్‌కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై జీహెచ్ఎంసీ జోనల్, ఇంజినీరింగ్, ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద కాలువల్లో పూడికతీత పనులు సత్వరం పూర్తి చేయాలన్నారు. నీటినిల్వల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అవసరాలకు అనుగుణంగా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను నియమించాలన్నారు. మొబైల్ రెస్పాన్స్ టీమ్ వాహనాలకు జీహెచ్ఎంసీ లోగోతో బోర్డు పెట్టాలని, టీమ్‌లోని వారి ఫోన్ నెంబర్లను అన్ని పోలీస్ స్టేషన్లకు అందజేయాలన్నారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ శాఖల మధ్య సమన్వయం ఉండేలా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. ట్రాఫిక్‌జామ్‌లు, ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ మేనేజ్మెంట్ ప్లాన్‌ను సిద్ధం చేయాలన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలోని ఇంజినీర్లు 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని సూచించారు. వాటర్ లాగింగ్స్ పరిష్కారానికి పోలీస్ ఏసీపీ,జోనల్ కమిషనర్ సంయుక్తంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ అడిషనల్ సీపీ జోయల్ మాట్లాడుతూ, రోడ్లు తవ్విన ప్రాంతాల్లో వెంటనే పూడ్చివేయాలని సూచించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయే సందర్భాల్లో సిగ్నల్ వ్యవస్థ పనిచేయనందున ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సిగ్నళ్ల వద్ద బ్యాక్ అప్ బ్యాటరీ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రిప్టోకరెన్సీ పేరుతో మహిళకు రూ. 1.01 కోట్లు టోకరా

పోచారం: క్రిప్టోకరెన్సీ పేరుతో ముగ్గురు వ్యక్తులు ఓ మహిళకు రూ. 1.01 కోట్లు టోకరా వేసిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఇస్మాయిల్‌ఖాన్ గూడకు చెందిన మహిళకు తన కుమారుడు లాల నరేష్ ద్వారా మణికొండ రమ్య, మణికొండ దివ్య, జోగుల సుధీర్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత రమ్య తల్లి మణి, సుధీర్ తండ్రి జ్ఞానేశ్వర్ పరిచయమయ్యారు. 2021లో నరేష్ తల్లి వద్దకు వచ్చిన రమ్య, దివ్య తమ తండ్రి మరణించినందున ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, రూ. 50 లక్షలు అప్పు ఇవ్వాలని కోరారు. దీంతో ఆమె చేగుంటలోని స్థలాన్ని తనఖా పెట్టి రమ్య, దివ్య అకౌంట్లకు రూ. 50 లక్షలు బదిలీ చేసింది. మొదటి ఆరు నెలలు ఈఎమ్ఐలు చెల్లించిన వీరు ఆన్‌లైన్ ట్రేడింగ్, క్రిప్టోకరెన్సీలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నరేష్ తల్లిని నమ్మించి రూ. 1,66,48,118 రమ్య, దివ్య, సుధీర్ ఖాతాలకు బదిలీ చేయించుకుని, ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టారు. ఈ లావాదేవీల్లో నరేష్ తల్లికి రూ. 1,15,కోట్లు మాత్రమే వచ్చింది. ఇంకా తనకు రావాల్సి రూ.1,01,18,118 చెల్లించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీలో సస్పెండైన ఉద్యోగుల విషయంలో త్వరలో నిర్ణయం

లక్డీకాపూల్: తొలగించబడిన ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి త్వరలోనే సముచిత నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి విధుల నుంచి తొలగించిన ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రజాభవన్ వద్ద బైఠాయించిన ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను చిన్నారెడ్డి అడిగి తెలుసుకున్నారు. తగిన నిర్ణయం త్వరలోనే తీసుకుంటామని ఆర్టీసీ ఉద్యోగులకు భరోసా కల్పించారు. కాగా ఈ కార్యక్రమంలో మొత్తం 226 దరఖాస్తులు అందాయి.

హెచ్-న్యూ ది గ్రేట్!

- ఈ విభాగానికి కితాబిచ్చిన వరల్డ్ పోలీసు సమ్మిట్ కమిటీ
- 'ఎక్సలెంట్ ఇన్ యాంటీ నార్కోటిక్స్' అవార్డు ప్రదానం

సాక్షి, సిటీబ్యూరో: డ్రగ్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యంతో ఏర్పాటైన హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అరుదైన ఖ్యాతిని సొంతం చేసుకుంది. దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ పోలీసు సమ్మిట్‌లో 138 దేశాలు పాల్గొన్నాయి. 12 దేశాలకు చెందిన పోలీసు విభాగాలతో పోటీపడిన హెచ్-న్యూ 'ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కోటిక్స్' అవార్డు గెల్చుకుంది. దుబాయ్‌లోని పోలీసు ఆఫీసర్స్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఈ అవార్డు అందుకున్నారు. మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు అక్కడ వరల్డ్ పోలీసు సమ్మిట్ జరిగింది. డ్రగ్స్ నియంత్రణకు, వీటికి బానిసలుగా మారిన వారిలో మార్పు తీసుకురావడానికి హెచ్-న్యూ అధికారులు తీసుకుంటున్న చర్యలను ఈ సమ్మిట్ కమిటీ అభినందించింది. హెచ్-న్యూ విభాగాన్ని 2022లో సీవీ ఆనంద్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది టాస్క్‌ఫోర్స్‌లో అంతర్భాగంగా పని చేస్తోంది. నగరంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాలకు చెక్ పెడుతున్న హెచ్-న్యూ... విద్యార్థులు, సాధారణ పౌరుల్లో వీటికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ... 'ప్రపంచ వ్యాప్తంగా వివిధ ఖండాల నుంచి అత్యంత సమర్థవంతమైన పోలీసు విభాగాలు పోటీపడ్డాయి. హెచ్-న్యూ ప్రథమ స్థానంలో నిలిచి ఈ అవార్డు కైవసం చేసుకుంది. ఈ విజయం సాధించడంలో ఆ విభాగంలో పని చేస్తున్న అధికారుల నుంచి సిబ్బంది వరకు చేసిన సమష్టి కృషి ఉంది.' అన్నారు. ఈ సదస్సులో జరిగిన ప్యానెల్ చర్చలో పాల్గొన్న ఆనంద్ భారత్ ఎదుర్కొంటున్న మాదక ద్రవ్యాల సమస్య, కోవిడ్ తర్వాత పెరిగిన వినియోగం, అక్రమ రవాణా మార్గాలను వివరించారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.13, నల్లవంకాయ.18, పొడుగువంకాయ.18, బెండకాయ.35, పచ్చిమిర్చి.35, బజ్జీమిర్చి.35, క్యాప్సికం.45, పచ్చి కాకరకాయ.35, పందిరిబీర.45, క్యాబేజీ.13, క్యారెట్.25, దొండకాయ.35, గుండు బీన్నీస్.105, గింజచిక్కుడు.45, గోకరకాయ.35, కీర.35, దోసకాయ.18, బీట్‌రూట్.25, ఉల్లిగడ్డ.14, ఆలుగడ్డ.25, చామగడ్డ.35, మొరంగడ్డ.23, కందగడ్డ.95, కాలీఫ్లవర్ 23, సొరకాయ.11, పొట్లకాయ.18, అరటికాయ.10, మునగకాయ.4, మామిడికాయ.35, ముల్లంగి.4–5, ఉల్లిపొరక.45. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు నిమ్స్‌లో రక్తపోటుపై అవగాహన ర్యాలీ

లక్డీకాపూల్ : అధిక రక్తపోటు దాని సమస్యల గురించి అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టామని నిమ్స్ కార్డియాలజీ విభాగం హెచ్‌ఓడి డాక్టర్ ఎన్. రమాకుమారి తెలిపారు. ఈ క్రమంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిమ్స్‌లో అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ర్యాలీ నిమ్స్ బంజారాహిల్స్ వైపు గేటు నుంచి పంజాగుట్ట వైపు గేట్ వరకు కొనసాగుతుందన్నారు. హైపర్‌టెన్షన్‌పై రోగులు, వారి సహాయకులకు మరింత అవగాహన కల్పించే దిశగా ఈ ర్యాలీ జరిగే ఈ ర్యాలీని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ప్రారంభిస్తారని డా. రమా తెలిపారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి



వినాయకనగర్ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని వినాయకనగర్ బస్తీలో లో ప్రెషర్ వల్ల బస్తీవాసులు నీళ్ల సరిపోక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్య పరిష్కరించాలంటూ జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఫిలింనగర్ సెక్షన్ ఇన్‌చార్జి మేనేజర్ రాంబాబును కోరారు. శుక్రవారం ఆయన జలమండలి మేనేజర్, సిబ్బందితో కలిసి బస్తీలో పర్యటించారు. త్వరితగతిన లో ప్రెజర్ సమస్యను పరిష్కరించి బస్తీవాసులకు మంచినీటిని అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సరుకులు

- సెలవుల్లోనూ పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది
- మే 31వ తేదీ వరకు సెలవులు
- ఖైరతాబాద్ పరిధిలో కొనసాగుతున్న టీహెచ్‌ఆర్



ఇంటింటికి వెళ్ళి రేషన్ సరుకులు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు..

బంజారాహిల్స్: అంగన్ వాడీ కేంద్రాలకు రేషన్ సరుకులు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో మే నెలలో 15 రోజుల పాటు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇచ్చేవారు. ఈ సమయంలో ఒక్క వారం అంగన్‌వాడీ టీచర్లు, మరో వారం ఆయాలు లబ్ధిదారులకు సేవలు అందించే వారు. అయితే మొట్ట మొదటిసారిగా ప్రభుత్వం మే నెల మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించింది. కేంద్రాలు తెరిచే ఉంటాయి కాబట్టి పిల్లలు, లబ్ధిదారులకు మాత్రమే సెలవులు వర్తిస్తాయి. మహిళా శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ఖైరతాబాద్ -2 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్., వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట, ఖైరతాబాద్, సోమాజిగూడ, యూసుఫ్‌గూడ, వెంగల్‌రావునగర్, ఎర్రగడ్డ, రహ్మత్‌నగర్, బోరబండ డివిజన్ల పరిధిలో ఉన్న 151 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మే 1 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు కొనసాగుతున్నాయి. లబ్ధిదారులకు సంబంధిత అంగన్‌వాడీ టీచర్లు, అయాలు ఇంటింటికి వెళ్ళి హోం రేషన్ అందిస్తున్నారు.

15 రోజుల చొప్పున సెలవులు...

మొదటి 15 రోజులు టీచర్లకు, తదుపరి 15 రోజులు ఆయాలు, సెలవులు తీసుకుంటారు. విధుల్లో ఉండే రోజుల్లో సిబ్బంది కేంద్రాలు తెరిచి లబ్ధిదారుల ఇంటి వద్దకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. దీనిని టేక్ హోం రేషన్(టీహెచ్‌ఆర్) అంటారు. ఆరేళ్ళలోపు చిన్నారులతో పాటు గర్భిణీలు, బాలింతలకు ఇంటి వద్దకే బియ్యం, పప్పు, గుడ్లు, పాలు, బాలామృతం వంటి సరుకులను అందిస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్యార్థులకు సైతం ఈ సెలవులు వర్తింపజేస్తున్నారు. విధుల్లో ఉండే సిబ్బంది టీహెచ్‌ఆర్ పంపిణీ అనంతరం ఇంటింటి సర్వే నిర్వహించి పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులను చేర్పించడం, పిల్లల ఎత్తు, బరువులు చూడటం, బడి, ఈడు పిల్లలను గుర్తించడం వంటి వివరాలను నమోదు చేస్తున్నారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్ 2 పరిధిలో ఉన్న 151 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పిల్లలు, బాలింతలు, గర్భిణీలు కలిసి 62 వేల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ షెడ్యూల్ ప్రకారం పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. ఐసీడీఎస్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ లబ్ధిదారులకు సరుకులు అందుతున్నాయో లేదో పరిశీలిస్తున్నారు. సరుకులు అందజేసిన తర్వాత వీటిని సంబంధిత యాప్‌లో కూడా నమోదు చేస్తారు. రోజు రోజుకు ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మే 1 నుంచి 31వ తేదీ వరకు సెలవులు ప్రకటించగా జూన్ 1వ తేదీ నుంచి కేంద్రాలు యదావిధిగా పని చేస్తాయి.

చెత్త సేకరించే విషయంలో ప్రణాళికతో పని చేస్తున్నాం



ఇందిరానగర్‌లో నివాసితులతో మాట్లాడుతున్న డీఎంసి సమ్మయ్య

బంజారాహిల్స్: బస్తీవాసులు, కాలనీవాసులు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రణాళిక ప్రకారం అవగాహన కార్యక్రమాలు, జరిమానాలు విధిస్తూ ముందుకు వెళుతున్నామని జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీఎంసి సమ్మయ్య తెలిపారు. శుక్రవారం ఆయన బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌బస్తీలో ఇంటింటికి తిరుగుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారితో పాటు చెత్త సేకరించే వాహనాలకు చెత్తను ఇవ్వని వారితో మాట్లాడారు. వారికి చెత్త సేకరించే వారి వివరాలు అందజేసి ఖచ్చితంగా చెత్తను చెత్త సేకరించే వాహనదారులకు ఇవ్వాలని సూచించారు. బంజారాహిల్స్‌లోని ఎస్పీటీ నగర్ బస్తీతో పాటు సింగాడ బస్తీ, ఇందిరానగర్ బస్తీల్లో మహిళా సమాఖ్యలతో కలిసి చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతం అవుతున్నదని త్వరలోనే సర్కిల్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీల్లో ఈ విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరానగర్‌లో బహిరంగంగా చెత్త వేస్తున్న నలుగురికి జరిమానా విధించారు.

మంత్రి శ్రీధర్‌బాబును వెంటనే బర్తరఫ్ చేయాలి

పంజగుట్ట: సరస్వతీ పుష్కరాల ప్రారంభోత్సవానికి కేవలం దళితుడు అనే స్థానిక ఎంపీ గడ్డం వంశీ కృష్ణని ఆహ్వానించకుండా అవమానించారని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య ఆగ్రహంవ్యక్తం చేశారు. ఎంపీకి ఆహ్వానం అందించని మంత్రి శ్రీధర్‌బాబును వెంటనే బర్తరఫ్ చెయ్యాలని, అధికారులను సస్పెండ్ చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. మంత్రి శ్రీధర్‌బాబు మనువాద భావ జాలంతో ఆయన ఉద్దేశపూర్వకంగానే శ్రీ కాళేశ్వర, ముక్తేశ్వరాలయంలో ప్రారంభమైన సరస్వతీ పుష్కరాలకు స్థానిక ఎంపీకి ఆహ్వానం అందించకుండా, కనీసం ఫ్లెక్సీల్లో ఆయన ఫోటోకూడా పెట్టకుండా అవమానించారని ఆగ్రహంవ్యక్తం చేశారు. వెంటనే శ్రీధర్ బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని, సమాచారం అందించని అధికారులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మహిళను బెదిరిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: తాను పనిచేసే సిబ్బంది గ్రూపు ఫోటోలో నుంచి తనతో కలిసి ఉన్న ఓ మహిళ ఫోటోను వేరు చేసి ఆమె భర్తకు పంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిలింనగర్ బాబునాయుడునగర్‌లో నివసించే ఓ మహిళ (24) అపోలో ఆస్పత్రిలో హౌస్ కీపర్‌గా పనిచేస్తుంది. అందులోనే హౌస్ కీపర్‌గా పనిచేసే వికాస్ ఆమెకు పరిచయమయ్యాడు. హౌస్ కీపింగ్ సర్వీసెస్ సిబ్బంది తరచూ గ్రూపు ఫోటోలను తీసుకుంటుంటారు. ఆ ఫోటోల్లో సదరు మహిళతో కలిసి తాను ఉన్న ఫోటోలను వేరు చేసి తన భర్తతో పాటు సోషల్ మీడియాలో పంపుతానని బెదిరింపులకు పాల్పడడం మొదలుపెట్టాడు. ఆమె ఎక్కడికి వెళ్లినా అనుసరించేవాడు. లేకపోతే చిత్రాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించేవాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు వికాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీలో ఘనంగా కుంకుమపూజ



హిమాయత్‌నగర్ : మహాలక్ష్మి అమ్మవారి కుంకుమ పూజ కార్యక్రమం తిరుమల తిరుపతి దేవస్థానములు(టీటీడీ) హిందూ ధర్మ ప్రచారపరిషద్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం హిమాయత్‌నగర్ బాలాజీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పూజలో పాల్గొని తమ భక్తిని చాటారు. అర్చకులు నరసింహ మూర్తి సహస్రణామాలతో మహిళల చేత కుంకుమ పూజ చేయించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఏఈఓ రమేష్, త్రినాద్ బాబు, ప్రోగ్రాం అసిస్టెంట్ గూడూరు హరినాథ్, ధార్మికమండలి సభ్యులు నిషిత తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

ఖైరతాబాద్: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఖైరతాబాద్ డివిజన్ సర్కిల్ 17, ఎంటమాలజీ విభాగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన కల్పిస్తూ వాక్ నిర్వహించారు. శుక్రవారం ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తా నుంచి చేపట్టిన డెంగీ అవగాహన వాక్‌లో ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ విజయారెడ్డి, ఎఈ భాస్కర్, హెల్త్ అండ్ మలేరియా సూపర్ వైజర్లు పాల్గొన్నారు. ప్ల కార్డులు ప్రదర్శిస్తూ కాలనీలు, బస్తీలలో అవగాహన కల్పించారు.

ఫిలింనగర్ దైవసన్నిధానంలో ప్రత్యేక పూజలు

ఫిలింనగర్: శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థాన సంచలిత– ఫిలింనగర్ దైవ సన్నిధానంలో శుక్రవారం సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీసకల సిద్ధి విఘ్నేశ్వరస్వామి వారికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం 4.30 గంటల నుంచి పంచామృతాభిషేకం, 600 మామిడి పండ్లతో అలంకరణ, 316 కిలోల గుడార్చన (బెల్లంతో), పల్లకీసేవ, వ్రతకథ, హారతి, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరిగాయి.

నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్‌కు యత్నం

– కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: నకిలీ డాక్యుమెంట్లను సమర్పించి ఓ సంస్థ అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడుతున్నారంటూ ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని సాగర్ కో–ఆపరేటివ్ సొసైటీలో వైవాన్ డగ్లస్ ఫౌండేషన్ కార్యాలయం ఉంది. ఈ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఐజాక్ జేమ్స్ కాగా 1993లో అతని మరణానంతరం కుమారుడు ఐకే సుదర్శన్ జోసెఫ్ సభ్యులందరి ఆమోదం మేరకు అధ్యక్షుడిగా కొనసాగుతూ వస్తున్నారు. ఇదిలా ఉండగా 2007లో ఈ ఫౌండేషన్‌లో మోసపూరిత ఆస్తి లావాదేవీలు జరిగాయంటూ హైకోర్టులో పిటిషన్ వేయగా ఆ కేసు కొనసాగుతోంది. ఈ కేసు కోర్టులో ఉండగానే కుప్పు సూరజ్‌కుమార్, గొర్రెల శ్రీనివాసరావు, వుండ్రి సుధాకర్, కొమ్ము మాణిక్యమ్మ గొల్ల దినేష్‌కుమార్, బద్ద గోల్డెన్, పులి నగేషలు పోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్లను సమర్పించి ఫౌండేషన్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రయత్నం చేస్తుండడాన్ని సుదర్శన్ జోసెఫ్ గుర్తించాడు. కార్యాలయ అడ్రెస్ మార్పుతో పాటు నకిలీ సమావేశ నోటీసులు, నకిలీ సంతకాలు, నకిలీ అద్దె అగ్రిమెంట్, నకిలీ సొసైటీ సీళ్లు, లెటర్ హెడ్ వంటివి తయారుచేసి రిజిస్ట్రార్‌ను మోసం చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా సుదర్శన్ జోసఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చర్చిల వద్ద ట్రాఫిక్ చలాన్ల సమస్య నివారించాలి

- సీఎం ప్రజావాణిలో బిషప్‌లు, పాస్టర్ల వినతి
- డీజీపీకి లేఖ రాసిన ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి

లక్డీకాపూల్ : గ్రేటర్ పరిధిలోని చర్చిల వద్ద ట్రాఫిక్ చలాన్ల సమస్యను నివారించాలంటూ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జీ. చిన్నారెడ్డి పోలీసులను కోరారు. ఈ మేరకు ఆయన డీజీపీకి లేఖ రాశారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చర్చిల వద్ద ప్రతి ఆదివారం ప్రార్థనలకు వచ్చే క్రిష్టియన్లు రోడ్డు పక్కన వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ పోలీసులు చలాన్లు రాస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బిషప్స్, పాస్టర్స్, క్రిస్టియన్ సంఘం ప్రతినిధులు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన చిన్నారెడ్డి చర్చిల వద్ద చలాన్ల సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. క్రిస్టియన్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనే సాల్మన్ రాజ్ నేతృత్వంలో ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరరయ్యారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పార్కు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 5లోని గూడూరు నారాయణ రెడ్డి నివాసం పక్కన ఉన్న పార్కు అభివృద్ధికి నోచుకోకపోవడంతో కొంత మంది యువకులు ఈ పార్కులో రాత్రి కాగానే చేరుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ పార్కు స్థలం ఇలాగే నిరుపయోగంగా ఉంది. ఈ పార్కులో పచ్చని మొక్కలు పెట్టి వాక్ వేను, చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సాయంత్రం అయ్యిందంటే ఈ పార్కు వద్ద అల్లరిమూకలు చేరుకొని న్యూసెన్స్‌కు పాల్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఎస్పీఆర్‌హిల్స్‌కు మంత్రి పొన్నం రాక

రహమత్‌నగర్: రహమత్‌నగర్, బోరబండ డివిజన్ వాసులు నీటి కష్టాలు తీరనున్నాయి. ఎస్పీఆర్‌హిల్స్‌లో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో, 3 మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యంతో నిర్మించిన రిజర్వాయర్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జలమండలి అధికారులతో కలిసి శనివారం ప్రారంభించనున్నారు. తొలిసారి రహమత్‌నగర్ డివిజన్‌కు మంత్రి పొన్నం వస్తున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. నూతనంగా నిర్మించిన ఈ రిజర్వాయర్ ద్వారా రెండు డివిజన్లలో 52 బస్తీలకు తాగునీటి సమస్య తొలిగిపోనుంది. ఉదయం 9 గంటలకు రిజర్వాయర్‌ను ప్రారంభించనున్నారు.

రుణం చెల్లించడం లేదని దాడి

బంజారాహిల్స్: తీసుకున్న రుణం చెల్లించడం లేదని ఓ ఆర్టిస్ట్‌పై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మహిళలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.,యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ బ్లాక్–ఏలో నివాసం ఉండే పసుపులేటి దేవి కన్న చౌదరి ఈసీఐఎల్‌కు చెందిన అనురాధ నుంచి రూ.10 లక్షల రుణాన్ని తీసుకున్నాడు. అందులో రూ 1.5 లక్షలు తిరిగి చెల్లించాడు. మిగతా డబ్బులు సర్దుబాటు కాక ఇవ్వలేకపోయాడు. ఈ విషయమై చర్చించేందుకు అనురాధ అతనికి ఫోన్ చేసి కృష్ణానగర్ బాలాజీ స్వీట్ షాప్ వద్దకు రావాల్సిందిగా సూచించింది. దేవి కన్న చౌదరి అక్కడికి చేరుకోగా అప్పటికే అనురాధతో పాటు ఆమె తల్లి చిట్టమ్మ, సోదరి కూడా ఉన్నారు. వారందరూ అక్కడ అతనిపై దాడిచేశారు. కృష్ణానగర్ ఏ–బ్లాక్‌లోని ఎస్వీ గార్మెంట్ లోపలికి తీసుకువెళ్లి మళ్ళీ దాడి చేశారు. కొద్దిసేపటి తర్వాత ఆటోలో ఎక్కించుకుని పీఎస్‌కు తీసుకువెళ్లమని డ్రైవర్‌కు చెప్పారు. మార్గమధ్యంలో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని యూటర్న్ వద్ద ఉన్న బహిరంగ ప్రదేశానికి తీసుకువెళ్లగా అక్కడ రాజేష్, భూపతి అనే ఇద్దరు వ్యక్తులు అతనిపై కర్రలతో దాడి చేశారు. బాధితుడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్‌లో స్లిట్ ల్యాంప్ ఏర్పాటు



స్లిట్ ల్యాంప్‌ను ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: నిమ్స్‌లో రుమటాలజీ సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల కంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక స్లిట్ ల్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో సమకూర్చిన ఈ స్లిట్ ల్యాంప్‌ను శుక్రవారం డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుమటాలజీ క్లినిక్‌లో ప్రతి మంగళవారం పిల్లలకు స్లిట్ ల్యాంప్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రుమటాలజీ రోగుల కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ రూ. 4 లక్షల విలువైన ఆధునిక స్లిట్ ల్యాంప్‌ను సమకూర్చిందన్నారు. క్లినికల్ ఇమ్యునాలజీ, రుమటాలజీ విభాగంలో ఆధ్వర్యంలో అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో రుమటాలజీ విభాగం హెచ్‌ఓడీ డా.లీజా రాజశేఖర్, ఎల్వీ ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.ప్రసాంత్ గర్గ్, యూవైటిస్ నిపుణులు డా. బసు, పీడియాట్రిక్ రుమటాలజీ నిపుణుల డా.కీర్తి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఐటీ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి



నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్న ఆప్ నేతలు, బాధితులు ..


పంజగుట్ట: పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ ఐటీ కంపెనీలు, కన్సెల్టెన్సీలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆమ్ ఆద్మీ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు విజయ్ మల్లంగి డిమాండ్ చేశారు. లక్షలు చెల్లించి అమాయకులు మోసపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల 200 మంది నిరుద్యోగులను మోసం చేసిన గచ్చిబౌలిలోని ఫ్యూరోపాల్ ఐటీ సంస్థ బాధితులతో కలిసి ఆయన శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితులు సూర్యతేజ, వెంకటేష్, ఆదిత్యతో కలిసి మాట్లాడుతూ .. మొదటిమూడు నెలలు వర్క్‌ఫర్ హోం నమ్మించి ఆఖరుకు బిచాణా ఎత్తేశారని పేర్కొన్నారు. సుమారు 200 మంది బాధిత నిరుద్యోగులు ఒక్కొక్కరు 1.8 నుండి 2.5 లక్షల వరకు వసూలు చేశారని ఆవేదనవ్యక్తం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు యమున గౌడ్, సుధారాణి, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



హిమాయత్‌నగర్ : దోమల వ్యాప్తిని అరికట్టి డెంగీ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ సూచించారు. జాతీయ డెంగీ డే సందర్భంగా శుక్రవారం ఎంటమాలజీ విభాగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో డివిజన్‌లోని నజీర్ బాగ్, శంషీర్ బాగ్, రామారావు బస్తీలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

మేయర్ ర్యాలీ



బంజారాహిల్స్: నేషనల్ డెంగీ డే సందర్భంగా బంజారాహిల్స్ డివిజన్‌లో మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డెంగీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటి వద్ద నీరు నిల్వ ఉండే ప్రదేశాలను పరిశీలించి, వాటిని తొలగించాలని ప్రజలకు చెప్పారు.

తిరంగా యాత్రను విజయవంతం చేయాలి



కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న బీజేపీ నేతలు...

ఫిలింనగర్: భారత సైనికులకు మద్దతుగా ఈ నెల 17న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్ వరకు నిర్వహించే తిరంగా యాత్రను విజయవంతం చేయాలని జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ నేతలు కోరారు. జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ మేరకు శుక్రవారం డివిజన్‌లోని పలు బస్తీల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని వారు కోరారు. సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా ఈ తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారున. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రామాంజనేయులు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అకారణంగా యువకుడిపై దాడి.. కేసు నమోదు

వెంగళరావునగర్: అకారణంగా యువకుడిపై అతని బంధువు దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..బోరబండకు చెందిన షేక్ ఇమ్రాన్ పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 15న ఇమ్రాన్ తనకు తన వదిన షాహిదా బేగంకు మధ్యలో ఉన్న చిన్న గొడవల గురించి మాట్లాడదామని ఫోన్ చేశారు. ఆమె తన స్నేహితురాలు ఆశ్రియాతో కలిసి తన కుమారుడిని ఆసుపత్రికి తీసుకెళుతున్నానని చెప్పింది. ఇమ్రాన్ వారిని కారు ఎక్కించుకుని వెళుతుండగా మధ్యలో ఆశ్రియా కారు నుంచి దిగిపోయింది. అదే యూసుఫ్‌గూడ రత్నదీప్ వద్దకు రాగానే షాహిదాబేగం ఆవేశంతో ద్విచక్ర వాహనంపై వచ్చి ఇమ్రాన్ కళ్లల్లో కారం కొట్టి, అతనిపై దాడి చేసి గాయపరిచింది. అంతేగాకుండా చంపేస్తానని హెచ్చరించింది. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ పేరుతో మోసం...

ప్లాట్స్ డెవలప్‌మెంట్ చేసి ఇస్తానని నగదు తీసుకుని మోసం చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రాజమండ్రికి చెందిన కె.అనిషా నగరంలోని మియాపూర్‌లో నివసిస్తుంది. ఆమెకు 2023 జులైలో రియల్ ఎస్టేట్ ఏజెంట్ పి.జ్యోత్స్న పరిచయం అయింది. వికారాబాద్‌లో ప్లాట్స్ కొనుగోలు చేయాలని, త్వరగా రేట్లు పెరుగుతాయని చెప్పడంతో అనిషా కార్యాలయానికి వెళ్లి విచారించింది.

అమీర్‌పేటలోని వారి సంస్థకు వెళ్లి చైర్మన్ ఎల్.మాధవరెడ్డి, ఉద్యోగులు సాయిశ్రీనివాస్, శైలజను కలిసి వివరాలు అడిగి రూ.2.40 లక్షలు చెల్లించి రెండు ప్లాట్స్ కొనుగోలు చేసింది. మిగిలినవి 24 నెలలో ఈఎంఐ ద్వారా చెల్లిస్తానని అగ్రిమెంట్ రాసింది. ఈఎంఐ కాగానే రిజిస్ట్రేషన్ చేస్తానని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కాగా ఇటీవల మరో రూ.10 లక్షలు ఇస్తే ఆరు నెలల్లో ఇస్తామని, రూ.7 లక్షలతో పర్సనల్‌గా రెండు ప్లాట్స్ అదనపు డెవలప్‌మెంట్స్ చేస్తామని చెప్పడంతో రూ.17 లక్షలు కూడా అందజేసింది. అయితే నెలల తరబడి వాటిని డెవలప్ చేయకపోవడంతో ఆమె ఆఫీస్‌కు వెళ్లి నిలదీసింది. ఇదిగో అదిగో అంటూ మాయమాటలు చెబుతున్నారు. ఒక్కోసారి ఫోన్ స్విచాఫ్ చేసుకుంటున్నారు. దీంతో తాను మోసపోయమని గ్రహించి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్, శనివారం,
17, మే, 2025







హైదరాబాద్ నగరంలో ప్రతిష్టాత్మక 72వ మిస్ వరల్డ్ పోటీలు జరుగుతుండటం విధితమే. అయితే మిస్ వరల్డ్ అనేది ఒక ప్రముఖ అంతర్జాతీయ వేదిక. ఈ వేడుక ఎక్కడ జరిగినా దీనికి గ్లోబల్ వేదికగా ప్రచారం, స్పందన ఉండటం సర్వసాధారణం. ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో ఈసారి స్పందన మాత్రం ఇంతకు ముందెన్నడూ లేనంతగా వస్తోంది. దీనికి తోడు మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు అంతా ఒక్కో రోజు ఒక్కో ప్రసిద్ధ ప్రాంతాలను సందర్శిస్తున్న నేపథ్యంలో.. ఈ వ్యవహారం మొత్తం సోషల్ యాప్స్‌లో వైరల్‌గా మారుతోంది. ఈ తరుణంలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించిన నగరంలోని, రాష్ట్రంలోని ప్రాంతాలన్నీ అంతర్జాతీయ ఆన్‌లైన్ వేదికగా మరింత గుర్తింపు పొందుతున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

ఆమె స్ఫూర్తి.. విశ్వకీర్తి..

సోషల్ మీడియా వేదికగా గ్లామర్ వీడియోలు

- మిస్ వరల్డ్ పోటీలే దీనికి ప్రధాన కారణం
- వివిధ దేశాల కంటెస్టెంట్ల పోస్టులకు లక్షల్లో వ్యూస్
- హాష్ ట్యాగ్‌తో వేలాది సంఖ్యలో పోస్టులు
- ఇప్పటి వరకూ జరిగిన పోటీల్లో ఇదే హైలెట్ అంటున్న నిపుణులు
- సినీ, క్రీడా రంగాలకు చెందిన సెలబ్రిటీలు సైతం భాగస్వామ్యం



మిస్ వరల్డ్ 2025 పోటీలు హైదరాబాద్ నగరానికి గ్లోబల్ గుర్తింపును తీసుకొచ్చింది. ప్రముఖుల సోషల్ మీడియా పోస్టులు, వివాదాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఈ ఈవెంట్‌ను మరింత విశేషంగా మార్చాయి. తెలంగాణ సంస్కృతి, ఆతిథ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో ఈ పోటీలు కీలక పాత్ర పోషించాయి. ఈ వేడుక కేవలం అందాల పండుగగా మాత్రమే కాకుండా, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ అంశాల్లో దేశవ్యాప్తంగ చర్చనీయాంశం అవుతున్నాయి. ఈ పోటీల నేపథ్యంలో ప్రముఖ సినీ తారలు, క్రీడా ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు చేస్తున్న పోస్టులు, వ్యాఖ్యలు ఈ మిస్ వరల్డ్ ఈవెంట్‌ను మరింత విశేషంగా మార్చుతున్నాయి.

క్రిస్టినా పిస్కోవాతో మొదలు..

ఈ నెల్లో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కాకముందే మాజీ మిస్ వరల్డ్ విజేత క్రిస్టినా పిస్కోవా హైదరాబాద్ నగరాన్ని, తెలంగాణలోని యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సారి మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించి మొదట ఆన్‌లైన్, సోషల్ మీడియాలో ఇది బాగా వైరల్ అయ్యింది. 'ఇది నా ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒక ముఖ్య ఘట్టం' అంటూ ఆమె ఇన్‌స్టాలో చేసిన పోస్ట్‌కు విశేష స్పందన లభించింది. దీనికి సంబంధించిన పలు ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

చార్మినార్ టు రామప్ప..

చార్మినార్, లాడ్ బజార్, ఎక్స్‌పీరియం పార్క్, రామప్ప ఆలయం వంటి ప్రదేశాల్లో కంటెస్టెంట్స్ తీసుకున్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యాయి. ముఖ్యంగా వందల ఏళ్ల హైదరాబాద్ చరిత్రకు నిదర్శనంగా నిలిచిన చార్మినార్ వద్ద 109 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ తారల సందడికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభించింది. అంతేకాదు.. ప్రత్యేకంగా రామప్ప ఆలయంలో మహిళలు కంటెస్టెంట్స్ పాదాలను కడుగుతున్న వీడియో వివాదానికి దారితీసింది. ఈ ఘటనపై మహిళా హక్కుల సంఘాలు, రాజకీయ నాయకులు తీవ్రంగా స్పందించారు.

రాజకీయ స్పందనలు..

బీఆర్ఎస్ నేత కేటీఆర్, మిస్ వరల్డ్ ఈవెంట్‌కు రూ.250 కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను ఖండించి, వాస్తవ ఖర్చు రూ.27 కోట్లు మాత్రమేనని, దానిలో మిగతా భాగం స్పాన్సర్‌షిప్‌ల ద్వారా సమకూర్చబడిందని సంబంధిత అధికారులు, ప్రతినిధులు తెలిపారు.



సాంస్కృతిక కార్యక్రమాలు..

మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా చార్మినార్, లాడ్ బజార్‌లో హెరిటేజ్ వాక్, పోచంపల్లి సందర్శన, వరంగల్ బతుకమ్మ ఆటలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేశాయి. వీటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు తెగ వైరల్ అయ్యాయి. ముఖ్యంగా లాడ్ బజార్‌లో వ్యాపారస్తులు మాకు డబ్బులు వద్దు, మా సంస్కృతిని మీ దేశాల్లో ప్రచారం చేయండి అని కోరడం వైరల్ అయ్యింది. దీనికి స్పందించిన మిస్ వియత్నాం వంటి పలువురు కంటెస్టెంట్‌లు తమ వ్యక్తిగత పేజీల్లో ఈ లైవ్ వీడియోలు పోస్ట్ చేశారు.

ఆధ్యాత్మికతకు అద్భుత స్పందన..

యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, వేయి స్తంభాల దేవాలయం, రామప్ప ఆలయాల సందర్శనతో మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌కు భారత ఆధ్యాత్మికతపై ప్రత్యేక అనుభూతి కలిగింది. శిల్ప కళ, గోపురాల లోతైన అర్థాల్ని వారు గౌరవంతో స్వీకరించడం గమనార్హం. రామప్ప ఆలయం వద్ద వారు యోగా మరియు ధ్యానం చేసిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి.





సోషల్ మీడియా సంచలనం..

ఈ వేదిక ద్వారా తెలంగాణ రాష్ట్రం సాంస్కృతికంగా ఎంత విస్తృతమైందో ప్రపంచానికి తెలిసింది. ప్రపంచ నెటిజన్ల దృష్టి ఇప్పుడు హైదరాబాద్ మీదే. ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ అంతా ఈ కంటెస్టెంట్స్ లోకల్ ట్రెడిషనల్ దుస్తుల్లో ఫొటోలు, వీడియోలతో కళకళలాడుతోంది. స్థానికులు తమ సంప్రదాయాన్ని అంతర్జాతీయ వేదికపై చూసి గర్వపడుతున్నారు.

పర్యాటక అభివృద్ధికి బలమైన వేదిక..

ఈ కార్యక్రమం రాష్ట్ర పర్యాటక శాఖకు ఒక బలమైన ప్రచార మాధ్యమంగా మారింది. ఇప్పటికే విదేశాల నుంచి 'తెలంగాణ టూరిజం' వెబ్‌సైట్ ట్రాఫిక్ గణనీయంగా పెరిగిందని సమాచారం. యాదాద్రి దేవాలయం యొక్క ఆధునీకరణ, రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వంటి అంశాలు ప్రపంచం ముందు నిలబెట్టే ఈ సందర్భం, రాష్ట్ర అభివృద్ధికి బంగారు అవకాశంగా మారుతోంది. మిస్ వరల్డ్ పోటీలు కేవలం అందానికి మాత్రమే కాదు.. సంస్కృతి, చైతన్యం, స్త్రీ శక్తిని ప్రదర్శించడానికి మార్గంగా మారింది.. ఈసారి హైదరాబాదులో జరిగిన ఈవెంట్ భారత్‌ను, ముఖ్యంగా తెలంగాణను గ్లోబల్ మాప్‌పై మరింత ప్రకాశింపజేసింది. ఇది దేశానికి గర్వ కారణమే కాదు, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని అంతర్జాతీయ ఈవెంట్లకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

అంతర్జాతీయ కంటెస్టెంట్స్..

తెలంగాణ సంస్కృతిపై మక్కువతో మిస్ వరల్డ్ యుఎస్ఏ, మిస్ వరల్డ్ దక్షిణాఫ్రికా, మిస్ వరల్డ్ శ్రీలంక వంటి కంటెస్టెంట్స్, తెలంగాణ సంస్కృతి, చారిత్రక ప్రదేశాలపై తమ మక్కువను సోషల్ మీడియాలో వ్యక్తం చేశారు. 'ఇండియాలోని వైవిధ్యాన్ని అనుభవించడం గొప్ప అనుభూతి' అంటూ వారు పేర్కొన్నారు.



పీవీ సింధు, నిఖత్ జరీన్ : తెలంగాణకు స్వాగతం

తెలంగాణకు చెందిన ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌లు తమ సోషల్ మీడియా ద్వారా మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌కు స్వాగతం పలికారు. 'తెలంగాణ సంస్కృతిని అనుభవించండి' అంటూ వారు చేసిన వీడియోలు, పోస్టులు యువతలో ఉత్సాహాన్ని పెంచాయి.

చెస్‌లో శివాంశిక సత్తా

14 ఏళ్లకే గ్రాండ్ మాస్టర్ టైటిల్

అంతర్జాతీయ పోటీల్లో 153 : ఫెడ్ రేటింగ్

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి.శివాంశిక అంతర్జాతీయ చెస్‌లో సత్తా చాటుతోంది. భువనేశ్వర్ కిట్ యూనివర్సిటీలో నిర్వహించిన 16వ అంతర్జాతీయ చెస్ ఫెస్టివల్‌లో అమెరికా గ్రాండ్ మాస్టర్ జియాడినోవ్ రాసెట్‌పై విజేతగా నిలిచింది. అతనిపై ఏకంగా ఫెడ్ రేటింగ్ 153 పాయింట్లు సాధించి గ్రాండ్ మాస్టర్లు చెస్ క్రీడాకారుల నుంచి ప్రశంసలు అందుకుంది. మే 9 నుంచి 16వ తేదీ వరకూ జరిగిన చదరంగం పోటీల్లో 16 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. అమెరికా, బంగ్లాదేశ్, బెలారస్, ఈజిప్ట్, రష్యా, ఇండోనేషియా, కెన్యా, కజకిస్తాన్, నేపాల్, సింగపూర్, శ్రీలంక, స్లోవేకియా, వియత్నాం, జింబాబ్వే, కజకిస్తాన్, ఫిన్లాండ్, తెలంగాణ రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అత్తాపూర్‌లోని మెస్ట్రో చెస్ అకాడమీ చెస్ క్రీడాకారుడు అమిత్‌పాల్‌సింగ్, రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కె.శంకర్ రాథోడ్, అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్ గంగ్యానాయక్, ఉపాధ్యాయులు సాయిప్రసాద్ విద్యార్థిని శివాంశికను అభినందించారు. 14 సంవత్సరాల వయసులోనే గ్రాండ్ మాస్టర్ తీసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని, ప్రభుత్వం ప్రోత్సహిస్తే భారత దేశానికి మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తానని, తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతులు తెస్తానని శివాంశిక తెలిపింది.

రేపు సిరివెన్నెలకో నూలుపోగు పుస్తకావిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో : సిరివెన్నెల సీతారామశాస్త్రి జన్మదిన వేడుకగా ఆయన జీవిత ప్రస్థానంపైన పలువురు రచయితలు రాసినగ్రంథాల ఆవిష్కరణ ఈ నెల 18వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరగనుంది. లక్డీకాపూల్‌లోని ఫిక్కీ కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో సిరివెన్నెల అభిమానులు రాసిన 31 వ్యాసాల సంకలనం 'సిరివెన్నెలకో నూలుపోగు' చేంబోలు శ్రీరామశాస్త్రి రాసిన 'మనిషి'కి మరమ్మతు పుస్తకాలను ఆవిష్కరించనున్నారు.అలాగే సిరివెన్నెలకో నూలుపోగు 2024 పునర్ ముద్రణ సంచికను కూడా వెలువరించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సిరివెన్నెల జన్మదిన వేడుకల్లో ప్రముఖ రచయితలు ఆకెళ్ల రాఘవ, వీఎస్ ఆదిత్య, రామజోగయ్య శాస్త్రి, భాస్కరభట్ల రవికుమార్, అబ్బూరి రవి, డాక్టర్ జి.రఘు కిషోర్, అప్పాజీ అంబరీష్, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, సాయిశ్రీనివాస్ వడ్లమాని, తదితరులు పాల్గొనున్నారు.

యూఎస్ ఎంబసీతో వై-యాక్సిస్ ఎంఓయూ

తెలుగు రాష్ట్రాల్లో ఔత్సాహిక విద్యార్థుల సేవే లక్ష్యం

సాక్షి, సిటీబ్యూరో: అమెరికాలో చదువుకోవాలనుకునే తెలుగు రాష్ట్రాలకు చెందిన ఔత్సాహిక విద్యార్థులకు సహకారం అందించడానికి వై-యాక్సిస్ ఫౌండేషన్ యూఎస్ రాయబార కార్యాలయంతో అధికారిక భాగస్వామ్యం కుదుర్చుకుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా విద్యార్థులకు విశ్వసనీయమైన, నిష్పాక్షికమైన మార్గదర్శకత్వాన్ని పూర్తి ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఎడ్యుకేషన్ యూఎస్ఏ ప్రొవైడర్‌గా ఈ ఒప్పందాన్ని కుదర్చుకుంది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని వై యాక్సిస్ ఫౌండేషన్ కార్యాలయంలో అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ జెనిఫర్ లార్సన్, వై యాక్సిస్ ఫౌండేషన్ ట్రస్టీ జేవియర్ అగస్టిన్‌తో యూఎస్ ఎడ్యుకేషన్ సెంటర్ సేవలకు సంబంధించిన ఎంఓయును కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణలకు సేవలు అందించే ఏకైక ఎడ్యుకేషన్ యూఎస్ఏ కేంద్రంగా హైదరాబాద్‌లో వై-యాక్సిస్ ఫౌండేషన్‌తో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం సంతోషంగా ఉందని హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లారెన్ తెలిపారు. యునైటెడ్ స్టేట్స్‌లో చదువుకోవాలనుకునే వారికి అవసరమైన సమాచారం కోసం ఎడ్యుకేషన్ యూఎస్ఏ వన్-స్టాప్ సెంటర్ వై-యాక్సిస్ ఫౌండేషన్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వై-యాక్సిస్ ఫౌండేషన్ డైరెక్టర్ సబీనా జేవియర్ పాల్గొన్నారు.





జీవన విధానంలో క్రీడలు భాగం కావాలి

ముగిసిన క్యారమ్స్ ఛాంపియన్‌షిప్

డబుల్స్, సింగిల్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు

సాక్షి, సిటీబ్యూరో: మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఎంఏటీఏ), యునైటెడ్ స్టేట్స్ క్యారమ్స్ అసోసియేషన్ (యూఎస్ సీఏ), యూనిఫై స్పోర్ట్స్ అకాడమీ ఫౌండేషన్ (యూఎస్ఏఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన 29వ యుఎస్ నేషనల్ క్యారమ్స్ చాంపియన్‌షిప్ 2025 పోటీలను విజయవంతంగా నిర్వహించినట్లు మాట ప్రతినిధులు తెలిపారు. కాచిగూడలోని ఓ హోటల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో 'మాటా' వ్యవస్థాపకులు శ్రీనివాస గనగొని మాట్లాడుతూ..డబుల్స్, సింగిల్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు జరిగాయని, విజేతలకు బహుమతులు అందజేశామని పేర్కొన్నారు. శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగించే క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జీవన విధానంలో క్రీడలను భాగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజికల్ షో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాటా సహ వ్యవస్థాపకులు ప్రదీప్ సామల, అధ్యక్షులు కిరణ్ దుద్దగి, స్పోర్ట్స్ డైరెక్టర్ సురేష్ ఖజానా, జనరల్ సెక్రటరీ విజయ్ భాస్కర్, గౌరవ సలహాదారులు రఘు రామ్ వీరమల్లు, యూఎస్ఏఎఫ్ వాలంటీర్ శ్రీ చరణ్ ఖజానా పాల్గొన్నారు.

ప్రధాన నగరాల్లో గృహ, వాణిజ్య, రిటైల్ విభాగాలపై ప్రతికూలత

కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల విశ్వాసంపై దెబ్బ	లగ్జరీ గృహ కొనుగోళ్ల నిర్ణయానికి తాత్కాలిక విరామం	బహుళ జాతి కంపెనీల ఏర్పాటు, విస్తరణలు వాయిదా

మాల్స్, కొత్త రిటైల్ స్టోర్ల ప్రారంభాలకూ బ్రేక్‌లు



1971, 1999 యుద్ధ కాలంలోనూ దెబ్బతిన్న స్థిరాస్తి మార్కెట్

రియల్ వార్

దేశీయ స్థిరాస్తి రంగంపై యుద్ధం ప్రభావం

దేశీయ స్థిరాస్తి రంగంపై దాయాదుల పోరు దెబ్బ పడింది. సాయుధ పోరాటాలు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. యుద్ధాలతో ఆస్తి, ప్రాణ నష్టం కలగడమే కాకుండా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునర్నిర్మించుకోవడం కోసం పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు భారంగా మారుతుంది. యుద్ధాలు నిర్మాణ రంగాన్ని కూడా నిలిపివేస్తాయి. తుది వినియోగదారులు, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని తగ్గించడంతో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో స్థిరాస్తి లావాదేవీలపై ప్రభావాన్ని చూపిస్తుంది. గృహ కొనుగోలుదారులు తమ నిర్ణయాలను నిలిపివేస్తారు. బహుళ జాతి సంస్థలు కొత్త ఆఫీసుల ఏర్పాటు, విస్తరణ ప్రణాళికలను వాయిదా వేస్తారు. రిటైలర్లు తమ విస్తరణ ప్రణాళికలకు బ్రేక్‌లు వేస్తారు. అయితే ఈ అవరోధం తాత్కాలిక కాలమే..

– సాక్షి, సిటీబ్యూరో

బంగ్లాదేశ్ విమోచనం ప్రధాన అంశంగా 1971లో ఇండియా–పాకిస్తాన్ మధ్య, అలాగే తీవ్రవాదులు నియంత్రణ రేఖ దాటి మన దేశంలోకి చొచ్చుకురావడంతో 1999లో కార్గిల్ యుద్ధం జరిగింది. ఈ రెండు సందర్భాల్లోనూ దాయాదుల పోరుతో స్థిరాస్తి రంగంలో నాలుగు కీలక విభాగాలైన నివాస, వాణిజ్య, రిటైల్, ఆతిథ్య రంగాలపై యుద్ధం ప్రభావం చూపించింది.

నాలుగు అంశాలపై ప్రతికూలత..

- వినియోగదారులు, పెట్టుబడిదారుల విశ్వాసం తగ్గుతుంది. గృహ కొనుగోలుదారులు కొనుగోళ్లను ఆలస్యం చేస్తారు. సంస్థలు తమ కార్యాలయాల విస్తరణ లీజు లావాదేవీలను వాయిదా వేస్తారు. పెట్టుబడిదారులు బంగారం, స్టాక్ మార్కెట్లు, క్రిప్టో కరెన్సీ వంటి ప్రత్యామ్నాయ పెట్టుబడుల వైపు ఆసక్తి చూపుతారు.
- ఉక్కు, సిమెంటు, కాపర్, టైల్స్, శానిటరీ వేర్, రంగులు వంటి నిర్మాణ సామగ్రి ముడి పదార్థాల కొరత ఏర్పడుతుంది. దీంతో ఇన్‌పుట్ ధరలు పెరుగుతాయి.
- ప్రభుత్వం సైన్యం కార్యకలాపాలను మరింత బలోపేతం చేసేందుకు రక్షణ రంగంపై ఖర్చును పెంచుతాయి. మౌలిక సదుపాయాలు, వినియోగదారుల రియల్ ఎస్టేట్‌పై ఖర్చును తగ్గిస్తాయి.
- సాయుధ పోరాటాలు అద్దెలను పెద్దగా ప్రభావితం చేయకపోయినా.. డిమాండ్ తక్కువగా ఉండటం వల్ల గృహ మూలధన విలువలు దెబ్బతింటాయి.

కార్గిల్ వార్‌తో..

- 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం స్వల్ప కాలమైనా.. ఎక్కువ ప్రభావితమైంది. యుద్ధం కారణంగా మూడు నెలల పాటు మార్కెట్లు భయాందోళనకు దారితీసినా త్వరగానే కోలుకుంది.
- నివాసం: దేశీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ అప్పటికే ఆసియా ఆర్థిక సంక్షోభం ప్రభావంతో కొట్టుమిట్టాడుతోంది. దీంతో గృహ అద్దె విలువలు ప్రత్యక్షంగా దెబ్బతిన్నాయి. ఢిల్లీ, ముంబైలోని ప్రధాన నివాస ప్రాంతాల్లోని అద్దె విలువలు మూడు నెలల్లో 3–8 శాతం మేర పడిపోయాయి. 1999 చివరి నాటికి అట్టడుగు స్థాయికి క్షీణించాయి. ఆసక్తికరంగా కార్గిల్ యుద్ధ సమయంలో ముంబైలోని చారిత్రాత్మక, ప్రధాన వ్యాపార ప్రాంతమైన కఫ్ పరేడ్‌లో లగ్జరీ అపార్ట్‌మెంట్ ధర చ.అ.కు రూ.20,000–23,200 మధ్య అమ్ముడవడం కొసమెరుపు.
- వాణిజ్యం: 1999లో ప్రధాన నగరాల్లో సుమారు 48 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ సరఫరా అయింది. కన్నాట్ ప్లేస్ వంటి సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలలో ఖాళీలు 11–15 శాతం మధ్య పెరిగాయి. అద్దెలు స్వల్పంగా తగ్గాయి. పెద్ద అంతర్జాతీయ కంపెనీలు లీజు లావాదేవీలు రద్దు చేయలేదు. కానీ.. కొంతకాలం పాటు వాయిదా వేశాయి. అప్పట్లో బెంగళూరు సిలికాన్ వ్యాలీ కాదు కానీ కోరమంగళం వంటి ప్రాంతాల్లో పూర్తిస్థాయి ఐటీ పార్క్‌లు ఉన్నాయి. వీటిల్లో అద్దె నెలకు చ.అ.కు రూ.35–65 మధ్య లీజుకు పోయాయి.
- రిటైల్: దేశంలో ప్రధాన మాల్స్ అయిన ముంబైలోని క్రాస్‌రోడ్స్, ఢిల్లీలోని అన్సల్ ప్లాజాల నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి. 1999లో ప్రీమియం రిటైల్ రియల్ ఎస్టేట్ వాణిజ్య రియల్టీ కంటే ఎక్కువ అద్దెలను చవిచూసింది. కానీ, యుద్ధ వాతావరణంతో చాలా మంది రిటైలర్లు తమ స్టోర్ ఓపెనింగ్‌లను కొంతకాలం పాటు నిలిపివేశారు.
- ఆతిథ్యం: కార్గిల్ యుద్ధం సమయంలో ప్రత్యక్షంగా ప్రభావితమయ్యే ప్రాంతాలు మినహా పర్యాటక పరిశ్రమ గణనీయంగా బలంగా ఉంది. 1999లో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు 5.3 శాతం మేర పెరిగాయి. దీనికి ప్రధాన కారణం అప్పటి ప్రభుత్వం పర్యాటక రంగానికి ఇచ్చిన ప్రోత్సాహం, రూపాయి విలువ తగ్గడమే. ఈ 3 నెలల్లో ఉత్తర భారతదేశంలో హోటళ్ల రద్దు 20–30 శాతం పెరిగాయి. ఎక్కువగా ఢిల్లీ, కశ్మీర్ లోని హోటళ్లు ప్రభావితమయ్యాయి. 2003 నాటికి పర్యాటకుల సంఖ్య ఏటా 44 వేలకు చేరింది.

యుద్ధం తర్వాత ఏమైందంటే..

దాయాదుల మధ్య జరిగిన రెండు యుద్ధాల తర్వాత దేశీయ రియల్ ఎస్టేట్ రంగం మూడు ప్రధాన అంశాల నుంచి వేగంగా కోలుకుంది. గృహాలు, కార్యాలయాల అవసరం ఎప్పటి లాగే డిమాండ్ కొనసాగింది. యుద్ధంతో కొనుగోలుదారులు, పెట్టుబడిదారులలో నెలకొన్న భయాందోళలు తగ్గించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) కఠిన రుణ నిబంధనలను సరళతరం చేసింది. అలాగే స్టాక్ మార్కెట్లు త్వరగా కోలుకున్నాయి. ఈ రెండు యుద్ధాలతో వివిధ పాయింట్లతో నిఫ్టీ సుమారు 5 శాతం పడిపోయినప్పటికీ.. సానుకూల రాబడిని అందించడానికి 5–6 నెలల్లోనే తిరిగి క్షీణించాయి.



ఇండో–పాక్ యుద్ధంతో..

1971లో ఇండియా, పాకిస్తాన్ దేశాల మధ్య 13 రోజుల పాటు జరిగిన యుద్ధ కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) వృద్ధిలో భారీ తగ్గుదల నమోదైంది. 1970 ఆర్థిక సంవత్సరంలో 5.4 శాతంగా ఉన్న జీడీపీ.. 1972 నాటికి 1 శాతానికి పడిపోయింది. ద్రవ్యోల్బణం 11 శాతానికి పైగా దాటింది. నిర్మాణ పనులు సైనిక ప్రదేశాలకే పరిమితమయ్యాయి.

నివాసం: ఆర్థిక రాజధాని ముంబైలో(అప్పట్లో బొంబాయి) స్థానిక రాష్ట్ర ప్రభుత్వం సిమెంట్, ఉక్కుపై కఠిన నియంత్రణ విధించింది. నిర్మాణ సామగ్రి కొరత కారణంగా గృహ ప్రాజెక్ట్‌ల అనుమతులు 12 శాతం మేర తగ్గాయి. అద్దె నియంత్రణ చట్టం కారణంగా రెంట్లు స్థిరంగానే ఉన్నాయి. ద్రవ్యోల్బణం అదుపు తప్పినప్పటికీ.. గృహాల అద్దెలు పెరగలేదు. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు దాదాపు 10 శాతం మేర తగ్గాయి.

వాణిజ్యం: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) చెప్పుకోదగిన స్థాయిలో రాలేదు. ప్రైవేట్ కార్యాలయ స్థలాల అభివృద్ధి పూర్తిగా ఆగిపోయింది. దేశంలో ఖరీదైన, డిమాండ్ కలిగిన ప్రాంతాలైన ముంబైలోని పోర్ట్, ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లలో భారీగా ఆఫీసు వేకెన్సీలు కనిపించాయి. అయితే పరిమిత సరఫరా, కఠినమైన నిబంధనల కారణంగా కార్యాలయాల అద్దెలు మాత్రం తగ్గలేదు.

రిటైల్: ఇప్పటి లాగా 1971లో దేశంలో హైస్ట్రీట్ రిటైల్ రంగం వ్యవస్థీకృతంగా లేదు. ఎక్కువగా అసంఘటిత రంగంగానే ఉండేది. కానీ పాత ఢిల్లీ, కోల్‌కతాలోని స్థానిక దుకాణాలకు జన సంచారం గణనీయంగా తగ్గింది. 1971 నుంచి అందుబాటులో ఉన్న కోర్టు రికార్డ్‌ల ప్రకారం అద్దెదారులలో పెరిగిన ఒత్తిడి కారణంగా ముంబైలో దుకాణాల అద్దె వివాదాలు 18 శాతం మేర పెరిగాయి.

ఆతిథ్యం: దేశీయ పర్యాటక రంగం యుద్ధంతో ప్రభావితమైంది. 1970లో 20.2 లక్షలుగా ఉన్న విదేశీ పర్యాటకుల రాకపోకలు.. 1971 నాటికి 19.6 లక్షలకు తగ్గింది. ఢిల్లీలో హోటళ్ల ఆక్యుపెన్సీ 45 శాతం కంటే తక్కువకు పడిపోయింది. ఆ రోజుల్లో హాస్పిటాలిటీ రంగంలో ప్రధాన సంస్థ అయిన ఇండియన్ హోటల్స్ కంపెనీ కూడా రెండంకెలలో ఆదాయం పడిపోయింది. ప్రత్యక్షంగా శ్రీనగర్ పర్యాటక ప్రాంతం ఎక్కువగా ప్రభావితమైంది.



స్థిరాస్తి రంగంపై యుద్ధం ప్రభావం ఇలా..

- నివాసం: ఢిల్లీ–ఎన్‌సీఆర్, ఉత్తర భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో ఇళ్ల కొనుగోళ్లు 5–10 శాతం మేర తగ్గవచ్చు. అయితే ఇది కొద్దికాలమే.. సాధారణంగా అనిశ్చితి సమయంలో లగ్జరీ గృహ కొనుగోలుదారులు కొనుగోలులో ఆలస్యం చేస్తారు. సాధారణ స్థితి పునరుద్ధరణ అయ్యాక ముందుగా మధ్య ఆదాయ వర్గాల గృహాలకు డిమాండ్ ఏర్పడుతుంది. అయితే ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే సిమెంటు, ఉక్కు ధరలు పెరుగుతూనే ఉంటాయి.
- వాణిజ్యం: తాజా యుద్ధం ఇంకా కొనసాగితే కనుక బహుళ జాతి సంస్థలు మన దేశంలోకి ప్రవేశ, విస్తరణ ప్రణాళికలను తాత్కాలికంగా నిలిపివేస్తాయి. దీంతో ఆఫీసు స్పేస్ లీజులపై ప్రభావం పడుతుంది. దీర్ఘకాలిక డిమాండ్ కారణంగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు(జీసీసీ), బీఎఫ్‌ఎస్‌ఐ, ఐటీ రంగాలలో ఆఫీసు స్పేస్ లీజులు, కొనుగోలు లావాదేవీలు 12 లేదా అంతకంటే తక్కువ సమయంలోనే తిరిగి పుంజుకుంటాయి.
- రిటైల్: దీర్ఘకాలిక లీజులు, అద్దె మినహాయింపు నిబంధనల కారణంగా బ్రాండెడ్ మాల్స్‌పై పెద్దగా ప్రభావం పడదు. కానీ, మాల్స్‌లో జనసంచారం, రద్దీ తగ్గడంతో పాటు కొత్త స్టోర్ ప్రారంభాలు వాయిదా పడతాయి.
- ఆతిథ్యం: యుద్ధంతో సహజంగానే ఢిల్లీ, కశ్మీర్ వంటి ఇతర ప్రభావిత ప్రాంతాలలో పర్యాటక ప్రాంతాల రద్దీ తగ్గుతుంది. ఆయా ప్రాంతాలలో హోటల్ ఆక్యుపెన్సీ 10–15 శాతం క్షీణిస్తుంది.





మారుతున్న అభిరుచి

గృహ కొనుగోళ్లలో మారిన కస్టమర్ల ఆలోచన

వసతులతో పాటు వైద్య సేవలూ ఉండాల్సిందే.. ❖ ఆట స్థలాలు, డే కేర్ సెంటర్లు కూడా..

గృహ కొనుగోలుదారుల అభిరుచులు మారుతున్నాయి. గతంలో ధర ప్రాధాన్యంగా గృహ కొనుగోలు నిర్ణయం తీసుకునే కస్టమర్లు.. ఆ తర్వాత వసతులను పరిగణనలోకి తీసుకున్నారు. కరోనా తర్వాతి నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో ఇంటి ఎంపికలోనూ ఇదే ధోరణి అవలంబిస్తున్నారు. ధర, సౌకర్యాలే కాదు ఇంటికి చేరువలో ఎలాంటి మౌలిక వసతులు ఉన్నాయి? ఆఫీసులు, వినోద కేంద్రాలు ఎంత దూరంలో ఉన్నాయనే అంశాలను సైతం పరిగణలోకి తీసుకొని గృహాలను ఎంపిక చేస్తున్నారు.

–సాక్షి, సిటీబ్యూరో

ఆరోగ్యానికి ప్రాధాన్యం..



నేటి యువతరం ఇల్లు కొనేటప్పుడు చుట్టుపక్కల ఆరోగ్య సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది ప్రధానంగా చూస్తున్నారు. అత్యవసరంలో ఎంత సమయంలో ఆసుపత్రికి చేరుకోవచ్చు? ఎంత సమీపంలో వైద్య సదుపాయాలు ఉన్నాయనేది ఆరా తీస్తున్నారు. ఇంట్లో పిల్లలు, పెద్దల ఆరోగ్య అవసరాల రీత్యా వీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

డే కేర్ సెంటర్..



చిన్న కుటుంబాల నేపథ్యంలో పిల్లల ఆలనాపాలనా చూసే డే కేర్ సౌకర్యాలు ఉండాలని గృహ కొనుగోలుదారులు చూస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ కార్యాలయాలకు వెళితే పిల్లలను చూసుకోవడం కష్టం అవుతుంది. వర్క్ ఫ్రం హోమ్ ఉన్నా పిల్లలపై శ్రద్ధ పెట్టలేని పరిస్థితి. కాబట్టి కమ్యూనిటీలో డే కేర్ సదుపాయాలు ఉండాలని కోరుకుంటున్నారు.

ఆట స్థలాలు..



ఇల్లు విశాలంగా ఉండటమే కాదు కమ్యూనిటీలో సకల సౌకర్యాలు ఉండాలనేది నేటి గృహ కొనుగోలుదారుల మాట. పిల్లల కోసం క్రీడా సదుపాయాలు, పెద్దలకు క్లబ్‌హౌస్, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలు ఉండాలని భావిస్తున్నారు. ఎక్కువ ఖాళీ స్థలం వదిలి, పచ్చదనం అధికంగా ఉంటే ఇష్టపడుతున్నారు.

ఆఫీసుకు దగ్గరలో..



ఇల్లు కొనేటప్పుడు ఆఫీసుకు ఎంత దూరంలో ఉందనేది కస్టమర్ల ప్రాధామ్యాలలో ఒకటి. నగరంలో ట్రాఫిక్‌లోనే అధిక సమయం వృథా అవుతుంది కాబట్టి దూరం, సమయం అనేది ప్రధానంగా మారాయి. ప్రజా రవాణా సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటున్నారు.

వీకెండ్ ఎంజాయ్..



వీకెండ్ వస్తే కుటుంబంతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు షాపింగ్ మాల్స్, థియేటర్లు ఎంత దూరంలో ఉన్నాయనేవి కూడా కొనుగోలు ఎంపికలో భాగమైపోయాయి. పచ్చని ప్రకృతిని ఆస్వాదించాలని కోరుకునే నివాసితులు శివారు ప్రాంతాలలో ఫామ్ హౌస్‌లు, విల్లాల కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు.

బాధ్యత ఎవరిది?

- వార్షిక నిర్వహణ బాధ్యత అసోసియేషన్లదే..
- మెయింటనెన్స్ సరిగా లేకపోతే తగ్గేది ఇంటి విలువే..

హైదరాబాద్‌లో ఓ హైరైజ్ అపార్ట్‌మెంటది. దాదాపు పదేళ్ల క్రితం నిర్మాణం పూర్తి చేసి.. నివాసిత సంఘానికి అప్పగించేసింది నిర్మాణ సంస్థ. రెండు మూడేళ్లు బాగానే ఉన్నా.. ఆ తర్వాతే ఒకరిద్దరు ప్రతికూల సభ్యులతో నివాసిత సంఘం సర్వనాశనమైంది. పదేళ్ల క్రితం డెవలపర్ వసూలు చేసిన రూ.3.2 కోట్ల కార్పస్ ఫండ్. ప్రస్తుతం వడ్డీతో సహా కలిపి రూ.4–5 కోట్ల వరకుంది. ఏం లాభం ప్రాజెక్ట్ నిర్వహణ చేసుకునే స్థితిలో అసోసియేషన్ లేదు. మధ్యలో ఓసారి కమ్యూనిటీ బాధ్యతలు చేపట్టేందుకు మహిళా సభ్యులు ధైర్యంగా ముందుకొస్తే.. వాళ్ల మీద లేనిపోని పోలీసు కేసులు పెట్టడంతో మనకొచ్చిన గొడవెందుకులే అని వాళ్లూ వెనుదిరిగారు. ఫలితంగా ఆ అపార్ట్‌మెంట్ రంగులు వెలిసి, రోడ్లు పాడైపోయి బోసిపోయింది. దీంతో ప్రస్తుతం అక్కడ అపార్ట్‌మెంట్ ధర చ.అ.కు రూ.5 వేలు ఉంటే.. ఈ ప్రాజెక్ట్‌లో మాత్రం రూ.3,500లకు మించి పలకట్లేదు.

– సాక్షి, సిటీబ్యూరో



రెసిడెన్షియల్ అసోసియేషన్లలో ఒకరిద్దరు సభ్యులతో కలిగే నష్టాలకు ఇదొక ఉదాహరణ మాత్రమే. నగరంలోని కమ్యూనిటీ అసోసియేషన్లలో 50 శాతం వరకు ఇలాంటివే ఉంటాయంటే ఆశ్చర్యం లేదు. వార్షిక నిర్వహణ బాధ్యత నివాసిత సంఘాలదే అన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరిస్తే.. తగ్గేది మనం ఉండే ఇంటి విలువే.

ప్రతీది బిల్డరే చేయాలంటే ఎలా?

ప్రతి ఒక్కరూ కష్టపడిన సొమ్ముతోనే ఇల్లు కొనుక్కుంటారు. పండుగలకు, ప్రత్యేక సందర్భాలలో ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోమా? నాలుగైదేండ్లకు ఒకసారి రంగులు వేసుకోవటం, పగుళ్లు వచ్చినా, డ్రైనేజీ, బోర్, లిఫ్ట్ వంటి వాటిల్లో సమస్యలొస్తే రిపేరు చేసుకోమా? అలాగే అపార్ట్‌మెంట్లలో ఉండే వాళ్లూ అంతే అసోసియేషన్ సభ్యులు అందరూ కలిసి చేసుకోవాలే తప్ప.. ప్రాజెక్ట్‌లో ఏ నిర్వహణ పనులైనా బిల్డరే చేయించాలని పట్టుబడుతూ కూర్చుంటే పాడైపోయేది మీరు ఉండే ఇళ్లేనని గుర్తుంచుకోండి. నిర్వహణ వ్యయాన్ని కార్పస్ ఫండ్ నుంచి ఖర్చు పెట్టుకోవాలే గానీ అన్నింటికీ బిల్డరే చేయాలని కూర్చుంటే మూర్ఖత్వమే అవుతుంది. ఎవరి ప్రాపర్టీని వాళ్లే కాపాడుకోవాలి.

పైన పటారం.. లోన లొటారం..

'పైన పటారం లోన లొటారం' అన్న చందంగా.. భవనం బయట నుంచి చూస్తే రంగులు వెలిసి, రోడ్లు పాడైపోయి వికారంగా కనిపిస్తుంటుంది గానీ అదే అపార్ట్‌మెంట్ లోపలికి వెళ్లి చూస్తే మాత్రం అందమైన ఇంటీరియర్‌తో లగ్జరీగా బాగుంటుంది. అయినా ఏం లాభం బయటి నిర్మాణం అంద విహీనంగా కనిపిస్తుంటే ఇంటి విలువ తగ్గుతుంది. పాజిటివ్ మైండ్ సెట్ ఉన్న సభ్యులనే ఎన్నుకొని ప్రాజెక్ట్‌ను అభివృద్ధి పరుచుకోవాలని పరిశ్రమ నిపుణులు సూచిస్తున్నారు.

నివాసిత సంఘానికి సప్త సూత్రాలు!

- పాజిటివ్ మైండ్ ఉన్న వాళ్లనే అధ్యక్షులుగా ఎన్నుకోవాలి. నిర్వహణ కోసం వారిని ప్రోత్సహించాలి. వాళ్ల పనులకు అడ్డుపడుతూ, లోపాలను ఎంచకూడదు.
- ఇదేమీ వేతనం వచ్చే పదవి కాదు. సామాజిక సేవ లాంటిదే. అలాంటప్పుడు వాళ్ల పనులు వదిలేసి మన ప్రాజెక్ట్ బాగుండాలని, అభివృద్ధి చేయాలనే సదుద్దేశంతో ముందుకొస్తే లేనిపోని మాటలతో, అభాండాలను వేయకూడదు.
- ప్రతి అసోసియేషన్‌లో 2 శాతం నెగిటివ్ మైండ్‌సెట్ ఉన్న సభ్యులుంటారు. వాళ్లను వదిలేసి మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు నిర్ణయాలను తీసుకోవాలి. ఒకరిద్దరు సభ్యుల చెప్పుడు మాటలు విని తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దు.
- కమ్యూనిటీ అంతా ఒక కుటుంబంలా ఉంటే.. ఆనందం, ఆరోగ్యంతో పాటు బయటి వాళ్లలో కమ్యూనిటీ పట్ల మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. దీంతో ప్రాజెక్ట్ విలువ పెరుగుతుంది.
- పిల్లలు ఉంటే వీకెండ్స్, సెలవు రోజుల్లో ఆటలు, సాంస్కృతిక పోటీల వంటివి నిర్వహించాలి. పెద్దల కోసం తీర్థయాత్రలు, వన భోజనాల వంటివి ఏర్పాటు చేయాలి.
- రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థలను క్రమం తప్పకుండా చెక్ చేయించాలి. పార్క్, గ్రీనరీ, లిఫ్ట్, జనరేటర్ వంటి వసతులను నిర్వహణ చేసుకోవాలి. ఇందుకోసం అయ్యే వ్యయాలను సభ్యులు అందరూ కలిసి పంచుకోవాలి.

వావ్.. మూవింగ్ వాల్స్!

ఇంట్లోని గదులలో ఎక్కువగా సమయం గడిపేది లివింగ్ రూమ్‌లోనే.. అందుకే చాలా మంది ఈ గదికి ఎక్కువ విస్తీర్ణాన్ని కేటాయిస్తుంటారు. అయితే కరోనా తర్వాతి నుంచి ఇంటి స్వరూపం మారిపోయింది. కొనుగోలుదారుల అభిరుచులలో మార్పులు వచ్చాయి. దీంతో లివింగ్ రూమ్ విస్తీర్ణానికి కోత పెట్టి మాస్టర్ బెడ్ రూమ్, పిల్లల గదులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే బంధువులెవరైనా వచ్చినప్పుడు లివింగ్ రూమ్ చిన్నగా అనిపిస్తుందనే భావన నివాసితులకు కలుగుతుంది. అసలు లివింగ్ రూమ్‌లోని గోడలను అవసరం ఉన్నప్పుడు అటుఇటుగా కదిలించుకునే సౌలభ్యం ఉంటే ఎంత బాగుంటుంది కదూ. విదేశాల్లో ప్రాచుర్యం పొందిన ఈ తరహా సాంకేతికత ఇప్పుడిప్పుడే మన దేశంలోకి ప్రవేశిస్తుంది. హోటళ్లు, కన్వెన్షన్ హాళ్లలో కనిపించే ఈ కదిలే గోడలు క్రమంగా గృహాల్లోకి వచ్చేశాయి. – సాక్షి, సిటీబ్యూరో



రోజురోజుకు ఇళ్ల ధరలు పెరిగిపోతుండటంతో రూ.80 లక్షలకు పైగా వెచ్చిస్తే తప్ప 3 బీహెచ్‌కే ఫ్లాట్ దొరకని పరిస్థితి. ఇంటిలో ఉన్న విస్తీర్ణాన్ని అవసరానికి తగ్గట్టుగా సద్వినియోగం చేసుకునేలా నిర్మాణదారులు సరికొత్త సాంకేతిక ఆలోచనలు చేస్తున్నారు. గోడలు అనగానే ఇటుకలు, సిమెంట్ బ్లాక్స్‌తో కట్టేవే గుర్తుకొస్తాయి. ఇంటి లోపల ఇవే ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తుంటాయి. వీటి స్థానంలో బిల్డర్లు ప్యానల్స్ వంటి ప్రత్యామ్నాయాలను ఉపయోగిస్తున్నారు. ఇవి తక్కువ మందం ఉండటంతో పాటు పటిష్ఠంగా, ఎక్కువకాలం మన్నికతో ఉంటాయి.

- ఇంటి లోపల అంతర్గత గోడల కోసం ఈ ప్యానెల్స్‌ను ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే గతంలో వీటిని కదలించడానికి వీలు లేకుండా స్క్రూలతో బిగించేవారు. ఎలాగూ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నప్పుడు స్థిరంగా ఉండే బదులు కదిలేలా ఉంటే ఇంట్లో స్థలాన్ని ఎక్కువగా ఉపయోగించుకోవచ్చు. ఇంటీరియర్ డిజైనింగ్‌లోనూ ఈ కదిలే గోడలను వినియోగిస్తున్నారు.
- చిన్న పిల్లల గదిని పగటి పూట తగ్గించుకొని హాల్‌ను పెంచుకునేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇవి ఇంటీరియర్స్‌లో కలిసిపోయి ఉంటాయి కాబట్టి నివాసితులు చెబితే తప్ప ఎవరూ ఇవి కదిలే గోడలని గుర్తించలేరు. స్టూడియో అపార్ట్‌మెంట్స్‌లలో స్థలం తక్కువగా ఉంటుంది కాబట్టి ఈ కదిలే గోడలనే ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఉదయం సమయంలో బెడ్‌ను కాస్త గోడకు నిలబెట్టేస్తే అదొక డిజైన్ మాదిరి కనిపిస్తుంటుంది. అయితే సంప్రదాయ గోడల కంటే వీటి నిర్మాణానికి వ్యయం ఎక్కువ అవుతుంది. చదరపు అడుగు వాల్ ప్యానెల్స్ రూ.75–80 నుంచి ప్రారంభమవుతాయి. బహిరంగ మార్కెట్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ వివిధ రకాల డిజైన్లు లభ్యమవుతాయి.

మద్యం కేసు వెనుక

రాజకీయ దురుద్దేశాలు

వాటిని ఎంతమాత్రం కొట్టిపారేయలేం.. ప్రభుత్వం తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది

రాజకీయ దురుద్దేశాలను, ప్రాథమిక ఆధారాలను ఎలా సమతుల్యం చేస్తారు?

కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయకుండా దర్యాప్తు అధికారిని అడ్డుకోలేం

ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు ముందస్తు బెయిల్ ఇవ్వలేం

ఫలానా విధంగా వాంగ్మూలం ఇవ్వాలని ఒత్తిడి చేయవద్దు

బెదిరించడం గానీ, ప్రలోభ పెట్టడం గానీ చేయకూడదు

దర్యాప్తును నిష్పాక్షికంగా, పారదర్శకంగా కొనసాగించాలి

వీరిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడానికి వీల్లేదు..

ఏపీ సీఐడీకి సుప్రీంకోర్టు ఆదేశం



ఈ కేసు నమోదు వెనుక రాజకీయ దురుద్దేశాలు..పక్షపాతం ఉందని పిటిషనర్లు కొంతమేర ప్రాథమి కంగా రుజువు చేయగలిగారు. రాజకీయ దురుద్దేశాలు.. పక్షపాతానికి న్యాయపరమైన పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని తగిన సమయంలో తేలుస్తాం.

థర్డ్ డిగ్రీ ఉపయోగించినా.. బెదిరించినా.. ఒత్తిడి చేసినా.. ప్రలోభ పెట్టినా వీటిని మేము చాలా తీవ్రంగా పరిగణిస్తాం. నిందితులు, సహ నిందితుల నుంచి వాంగ్మూలాలను సేకరించే సమయంలో దర్యాప్తు సంస్థ కొన్ని సందేహాస్పద పద్ధతులను అనుసరిస్తోంది. పిటిషనర్లు, ఇతర సహ నింది తుల విషయంలో థర్డ్ డిగ్రీ ఉపయోగించడం, బెదిరించడం, ఒత్తిడి తేవడం, ప్రలోభపెట్టడం చెయ్యడానికి వీల్లేదు.

- సుప్రీంకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: ఏపీ మద్యం వ్యవహారంలో కేసు నమోదు వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని.. వాటిని ఎంతమాత్రం కొట్టిపారేయలేమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాజకీయ పక్షపాతం, దురుద్దేశాలకు న్యాయపరంగా తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అయితే, రాజకీయ దురుద్దేశాల కారణంతో.. నిందితులను కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయకుండా దర్యాప్తు అధికారిని నిరోధించలేమని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జంషేడ్ బుర్జోర్ పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం వ్యవహారంలో రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు ముందస్తు బెయిల్ ఇవ్వలేమని చెబుతూ, వారి పిటిషన్లను కొట్టివేసింది. పిటిషనర్లపై థర్డ్ డిగ్రీ ఉపయోగించడానికి వీల్లేదని ఏపీ సీఐడీ అధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, ఫలానా విధంగా వాంగ్మూలం ఇవ్వాలని ఒత్తిడి చేయడం గానీ, బెదిరించడం గానీ, ప్రలోభపెట్టడం గానీ చేయరాదంది. దర్యాప్తును నిష్పాక్షికంగా, పారదర్శకంగా కొనసాగించాలని ఆదేశించింది. పిటిషనర్లు రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకుంటే, కేసు పూర్వాపరాల ఆధారంగా విచారించి తగిన నిర్ణయం వెలువరించాలని కింది కోర్టు, హైకోర్టుకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విచారణ సమయంలో న్యాయవాదులు ఉండాలనుకుంటే, ఆ అభ్యర్థనతో హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్లకు సూచించింది.

సీఐడీ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నారు

మద్యం కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, కృష్ణ మోహన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. మద్యం కేసు నమోదు వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని, ప్రభుత్వం మారగానే కేసు నమోదైందని వారు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. సీఐడీ దర్యాప్తునకు పిటిషనర్లు పూర్తిగా సహకరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే 13 గంటల చొప్పున వీరిని దర్యాప్తు అధికారి ప్రశ్నించారన్నారు.

ఎలాంటి అక్రమాల్లేవనీ సీసీఐ తేల్చింది...

కొత్త మద్యం కంపెనీలకు అవకాశం కల్పించడం వెనుక అక్రమాలు జరిగాయని సీఐడీ ఆరోపిస్తోందని.. కానీ, ఈ ఆరోపణల్లో వాస్తవం లేదని కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తేల్చిందని అభిషేక్ మను సింఘ్వీ, వికాస్ సింగ్ పేర్కొన్నారు. సీఐడీ రిమాండ్ రిపోర్టులో ఇప్పుడు చేస్తున్న ప్రతి ఆరోపణ.. గతంలో సీసీఐకి చేసిన ఫిర్యాదులో ఉన్నదేనని గుర్తు చేశారు. నాటి ఫిర్యాదును సీసీఐ క్షుణ్ణంగా పరిశీలించి క్లీన్‌చిట్ ఇచ్చిందని వివరించారు. ఈ మేరకు సీసీఐ ఉత్తర్వులను వారు ధర్మాసనం ముందు ఉంచారు. అక్రమాలే లేవని తేలిన వ్యవహారంలో సీఐడీ కేసు నమోదు చేసిందని, రాజకీయ కక్ష సాధింపులకు ఈ కేసు ఓ ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. ఈ కేసులో సాక్షులను సీఐడీ పలు రకాలుగా భయపెడుతోందన్నారు. కావాల్సిన విధంగా వాంగ్మూలం ఇవ్వకుంటే నిందితులుగా చేర్చేందుకు కూడా వెనుకాడడం లేదని తెలిపారు. వాంగ్మూలాలు తప్ప సాక్ష్యాలు ఏమీ చూపడం లేదని నివేదించారు. పిటిషనర్లకు మద్యం వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేదని, వారు కేవలం ప్రభుత్వ అధికారులుగా సమావేశాల్లో మాత్రమే పాల్గొన్నారని చెప్పారు. ఇదే నేరం అంటూ కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు.

బెయిల్ పిటిషన్ దాఖలుకు గోవిందప్పకు అనుమతి

వికాట్ సంస్థ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప అరెస్ట్ నేపథ్యంలో తాము దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ఆయన తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే సుప్రీంకోర్టుకు వివరించారు. రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌కు అనుమతి కోరగా.. ధర్మాసనం అనుమతిచ్చింది. బాలాజీ గోవిందప్ప రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకుంటే కేసు పూర్వాపరాల ఆధారంగా నిర్ణయం వెలువరించాలని కింది కోర్టు, హైకోర్టుకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ సమయంలో దవే స్పందిస్తూ, ముందస్తు బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే గోవిందప్పను అరెస్ట్ చేశారన్నారు. ఇది ఏమాత్రం సహేతుకం కాదని, ఇలా అరెస్ట్ చేయడం తగదంటూ ఇదే కోర్టు గతంలో స్పష్టమైన తీర్పు ఇచ్చిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలించాలంటూ సంబంధిత తీర్పు కాపీని ధర్మాసనం ముందు ఉంచారు. ఇప్పుడు ఈ అంశాలన్నీ అవసరం లేదని, తాము బాలాజీ గోవిందప్పకు ముందస్తు బెయిల్ ఇవ్వలేదని ధర్మాసనం తెలిపింది.

పారదర్శక విధానాన్ని పూర్తిగా మార్చేశారు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ, ఇదో భారీ కుంభకోణమన్నారు. గతంలో మద్యం కొనుగోళ్లు చాలా పారదర్శకంగా జరిగేవని, గత ప్రభుత్వ హయాంలో దానిని పూర్తిగా మార్చేశారన్నారు. కీలక స్థానాల్లో కావాల్సిన వ్యక్తులను నియమించుకున్నారని తెలిపారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ... రాజకీయ దురుద్దేశాలను, ప్రాథమిక ఆధారాలను ఎలా సమతుల్యం చేస్తారని ప్రశ్నించింది. దీంతో ఇది విచారణకు స్వీకరించదగ్గ నేరమే కాదని వికాస్ సింగ్ సమాధానం ఇచ్చారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోర్టును కోరారు. అలాగైతే ఎఫ్ఐఆర్ కొట్టివేతకు పిటిషన్ దాఖలు చేసుకోవాలని ధర్మాసనం సూచించింది. ఆ పని కచ్చితంగా చేస్తామని వికాస్ తెలిపారు. సింఘ్వీ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు ప్రభుత్వాధికారులుగా పదవీ విరమణ చేశారని, వారు ఎక్కడికీ పారిపోయే అవకాశం లేదని అన్నారు. ఆ అవసరం కూడా వారికి లేదన్నారు. కావాలంటే పాస్‌పోర్ట్ జప్తునకు ఆదేశాలు ఇవ్వొచ్చునన్నారు. అలాంటప్పుడు దేశం విడిచివెళ్లిపోతారన్న ఆందోళన అనవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా స్పందిస్తూ, ఈ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా ఈసీఆర్ నమోదు చేసిందన్నారు. ఇరుపక్షాల వాదలను విన్న ధర్మాసనం, పిటిషనర్లకు ముందస్తు బెయిల్ ఇవ్వలేమంటూ పిటిషన్లు కొట్టేసింది.

మాట నిలబెట్టుకున్న వైఎస్ జగన్

అమర జవాన్ మురళీనాయక్ కుటుంబానికి రూ.25 లక్షల చెక్‌ను పంపిన వైఎస్ జగన్



మురళీనాయక్ కుటుంబానికి చెక్‌ను అందిస్తున్న ఉషశ్రీచరణ్

గోరంట్ల: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూకశ్మీర్‌లో శత్రుమూకలను తుదముట్టిస్తూ వీరమరణం పొందిన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన వీర జవాను మురళీనాయక్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. ఈ నెల 13న కల్లితండాకు వచ్చి మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శించిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రూ.25 లక్షల సాయం ప్రకటించిన విషయం తెలిసిందే. శుక్రవారం వైఎస్ జగన్ పంపిన రూ.25 లక్షల చెక్కును వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్.. మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతిబాయిలకు అందజేశారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన మురళీనాయక్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఉషశ్రీచరణ్ తెలిపారు.

ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్ట్

- రెడ్‌బుక్ కుట్రలో కొనసాగుతున్న అక్రమ అరెస్టుల పర్వం

సాక్షి, అమరావతి/సాక్షిప్రతినిధి, విజయవాడ: రెడ్‌బుక్ అక్రమ కేసులో సిట్ అక్రమ అరెస్టుల పర్వం కొనసాగిస్తోంది. తప్పుడు సాక్ష్యాలు, తప్పుడు వాంగ్మూలాలను అడ్డుపెట్టుకుని ఎ.ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను శుక్రవారం అరెస్టు చేసింది. ఈ కేసులో వారిద్దరూ సిట్ ఎదుట బుధ, గురువారాలు విచారణకు హాజరైన విషయం తెలిసిందే. రిటైర్డ్ అధికారులు, సీనియర్ సిటిజన్లు అయిన వీరిని మొదటి రోజు ఆరు గంటలపాటు, రెండో రోజు ఏకంగా 13 గంటలపాటు విచారణ పేరుతో సిట్ వేధించింది. సిట్ ఆదేశాలతో వారు వరుసగా మూడో రోజు శుక్రవారం కూడా విచారణకు హాజరయ్యారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం 7 గంటల వరకు విచారణ పేరుతో వేధించిన సిట్.. రాత్రి 7.15 గంటలకు వారిద్దరినీ అరెస్టు చేసినట్టు ప్రకటించింది. ఆ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలిపింది. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి సెల్ ఫోన్లను సిట్ స్వాధీనం చేసుకుంది. వారిద్దరూ శుక్రవారం రాత్రి సిట్ కార్యాలయంలోనే ఉండనున్నారు. శనివారం ఉదయం వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో హాజరు పరుస్తారు.

దుష్ట సంప్రదాయానికి నాంది: మద్యం అక్రమ కేసులో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిల అరెస్ట్ ముమ్మాటికీ అక్రమమని వైఎస్సార్ సీపీ నాయకులు, న్యాయవాదులు విమర్శించారు. ఈ సందర్భంగా న్యాయవాది సుదర్శన్‌రెడ్డి విజయవాడలోని సిట్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఏపీలో దుష్ట సంప్రదాయానికి కూటమి ప్రభుత్వం నాంది పలికిందన్నారు. అధికారులు అనే గౌరవం లేకుండా అక్రమ కేసులు పెడుతున్నారని, ఇది కక్ష సాధింపు చర్యలో భాగమేనని మండిపడ్డారు. ఉద్దేశ పూర్వకంగా కేసులు పెడుతున్నారని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

సారీ.. నో లారీ!

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశం ఉందని, ఇందులో 70.13 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. కాగా శుక్రవారం వరకు తెరిచిన రాష్ట్రంలోని 8,353 కొనుగోలు కేంద్రాలకు 55.73 ఎల్ఎంటీల ధాన్యం వచ్చిందని, 51.39 ఎల్ఎంటీల ధాన్యాన్ని సేకరించామని, 49.87 ఎల్ఎంటీల ధాన్యాన్ని మిల్లులకు తరలించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఆలస్యంగా వరి సాగు చేసిన ఉమ్మడి వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ మొదలైన జిల్లాల్లో మినహా దాదాపు అన్ని జిల్లాల్లో కోతలు పూర్తి అయినప్పటికీ ఆయా జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదని కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు పడుతున్న రైతుల్ని చూస్తే అర్థమవుతుంది.

ఎందుకు ఆలస్యం?

కొన్ని కొనుగోలు కేంద్రాల్లో 20 రోజులుగా రైతులు పడిగాపులు పడుతున్నా వడ్ల బస్తాలకు నిర్వాహకులు కాంటా వేయడం లేదు. ఎందుకంటే.. లారీలు లేవు, హమాలీల కొరత ఉందని నిర్వాహకులు చెపుతున్నారు. లారీలు లేకపోతే ట్రాక్టర్‌తో రైతులే సొంతంగా ధాన్యాన్ని మిల్లుకు తీసుకెళ్తామన్నా కూడా హమాలీల కొరత పేరు చెపుతూ కాంటా వేయడం లేదు. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, మహబూబాబాద్, నాగర్‌కర్నూలు, వనపర్తి, కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, భూపాలపల్లి, జనగాం తదితర జిల్లాల్లోని అనేక మండలాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ఇంకా ధాన్యం కుప్పలు నిండుగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఇంకా సుమారు 20 ఎల్ఎంటీల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. వాస్తవానికి కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించడానికి ముందే లారీల సరఫరా కాంట్రాక్టును జిల్లా అధికార యంత్రాంగం ఖరారు చేసి, ప్రణాళికాబద్ధంగా కేంద్రాల నుంచి మిల్లులకు వడ్ల బస్తాలను తరలించాల్సి ఉంది. కానీ ఈసారి ప్రణాళిక తప్పిందని అధికారులే అంగీకరిస్తున్నారు. హమాలీల విషయంలోనూ ఇదే జరిగిందనే విమర్శలు ఉన్నాయి. ధాన్యం దిగుబడి, కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం రావొచ్చనే అంచనాను బట్టి ఏ జిల్లాకు ఆ జిల్లాలో జాయింట్ కలెక్టర్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి లారీలు, ఇతర ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అయితే కొనుగోలు కేంద్రాల్లో పెద్ద మొత్తంలో ధాన్యం నిల్వ ఉండటాన్ని బట్టి చూస్తే లారీల కొరత ఉందనే విషయం స్పష్టమవుతోంది. ఇక హమాలీలు ఎక్కువ కూలీ లభించే మొక్కజొన్న, ఇతర పంటల కొనుగోళ్ల వద్దకు వెళ్లడం, ఉపాధి హామీ పనులకు వెళుతుండడం వల్ల ధాన్యం కేంద్రాలకు రావడం లేదని తెలుస్తోంది.

కాంటా వేసిన తర్వాత రైతు బాధ్యత ఎలా?

ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చిన తర్వాత కాంటా వేసేంత వరకే రైతు బాధ్యత. కాంటా వేసిన తర్వాత రైతుకు ఆ ధాన్యంతో సంబంధం ఉండకూడదు. ప్రభుత్వం కూడా అదే చెబుతుంది. కానీ మిల్లరు ధాన్యం బస్తాలను దించుకునేంత వరకు రైతుదే బాధ్యత అన్నట్టుగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. అమాయక రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లాలో గత యాసంగిలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అయితే ఈసారి యాసంగిలో ఏకంగా 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. జిల్లాలోని 193 కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించేందుకు మొత్తం 200 వరకు లారీలు అవసరమని తెలుస్తుండగా, సుమారు 150 వరకు లారీలే రాకపోకలు సాగిస్తున్నట్లు అంచనా. దీంతో ట్రాక్టర్లు పెట్టుకుని మిల్లులకు తరలించుకోవాలని అధికారులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. అయితే గతంలో ట్రాక్టర్ కిరాయిలు ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్ల నిర్వాహకులు నొక్కేసి రైతులకు ఇవ్వలేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాక్టర్లు పెట్టేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో కాంటాలు పెట్టి బస్తాలు కుట్టిన ధాన్యం సైతం వారాల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే ఉంచాల్సి వస్తోంది.

నల్లగొండ జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించేందుకు సెంటర్‌కు 2 లారీలు అవసరమని అంచనా. ఈ మేరకు ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. రైతులు తమ పంటను కాంటా వేయించుకునేందుకు వారాల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. కాంటా వేసిన ధాన్యం కూడా కుప్పలు కుప్పలుగా కేంద్రాల్లోనే మూలుగుతోంది. జిల్లాలోని కొన్ని కొనుగోలు కేంద్రాలకు 2, 3 రోజులకు ఒకసారి కూడా లారీలు రాని పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు.



మంచిర్యాల జిల్లా భీమారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా కప్పిన టార్పాలిన్ కవర్లు

భయపెడుతున్న ముందస్తు రుతు పవనాలు

గత రెండు సంవత్సరాలతో పోలిస్తే ఈసారి ధాన్యం కొనుగోళ్లు ఎన్నో రెట్లు ఎక్కువని ప్రభుత్వం చెపుతోంది. అదే సమయంలో ఈసారి గతంలో కన్నా కొంత ముందుగా నాట్లు వేయడం, సన్న రకాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో కోతలు ముందే వచ్చాయి. రైతుల అదృష్టం కొద్దీ ఈసారి దిగుబడి కూడా బాగుంది. ఈ పరిస్థితుల్లో కొనుగోళ్లు ముందుగానే ప్రారంభం కావడంతో ఇప్పటివరకు 51.39 ఎల్ఎంటీల ధాన్యం కొనుగోలు చేశారు. కేంద్రాల్లో ఇంకా 4.34 ఎల్ఎంటీల ధాన్యం కాంటా వేయకుండా ఉందని పౌరసరఫరాల శాఖే చెబుతోంది. అలాగే కొనుగోలు చేసిన ధాన్యంలోనూ ఇంకా సుమారు లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించ లేదని స్పష్టం చేస్తోంది. అయితే మొత్తంగా సుమారు 10 ఎల్ఎంటీల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉందని అంచనా. కాగా అకాల వర్షాలు రైతులను ప్రతిరోజూ భయపెడుతున్నాయి. భారీ వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల తడిచిన ధాన్యం ఆరితే కానీ రైతులు అమ్ముకోలేని పరిస్థితి ఉంది. తాజాగా.. రుతు పవనాలు ఈసారి ముందుగానే రాష్ట్రంలో ప్రవేశిస్తాయనే వార్తలతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. లారీలు, హమాలీలను అందుబాటులో ఉంచడం ద్వారా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

దొడ్డు ధాన్యమే ఎక్కువ..సన్న బియ్యం ఎలా?

రాష్ట్రంలో 6,58,486 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 51.39 ఎల్ఎంటీల ధాన్యంలో దొడ్డు రకం 34.02 ఎల్ఎంటీలు కాగా, సన్నాలు 17.37 ఎల్ఎంటీలు ఉన్నాయి. సన్నాలు 30 ఎల్ఎంటీల వరకు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేయగా, ప్రస్తుత పరిస్థితిని చూస్తే సాధ్యమయ్యే అవకాశం లేదని అధికారులు చెపుతున్నారు. నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, కామారెడ్డి, నారాయణపేట, వనపర్తి మొదలైన జిల్లాల్లో పండించిన మేలు రకం సన్న ధాన్యాన్ని రైతులు అధిక ధరకు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు సన్నాలు ఆశించిన స్థాయిలో రాలేదు. మరో 5 లక్షల నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తే తప్ప రేషన్ దుకాణాలకు ఇవ్వాల్సిన సన్న బియ్యానికి సరిపోవని అధికారులు చెబుతున్నారు.

లారీలు అందుబాటులో ఉంచాలని ఆదేశించాం

గత మూడేళ్లతో పోలిస్తే ఈసారి గణనీయంగా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించాం. ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలని జిల్లా అధికారులను ఆదేశించాం. హమాలీల సమస్య ఏమీ లేదు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొంటాం.

- ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌరసరఫరాల మంత్రి

ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపుల వివరాలు..

యాసంగిలో ధాన్యం సేకరణ అంచనా: **70.13 ఎల్ఎంటీ**

ఇప్పటివరకు సేకరించిన ధాన్యం: **51.39 ఎల్ఎంటీ**

ఇందులో దొడ్డు రకం (5,44,543 రైతులు): **34.02 ఎల్ఎంటీ**

సన్న రకం (2,25,215 రైతులు): **17.37 ఎల్ఎంటీ**

కొనుగోలు చేసిన ధాన్యం విలువ: **రూ.11,913.05 కోట్లు**

రైతులకు చెల్లించిన మొత్తం: **రూ.8,511.42 కోట్లు**

సన్న రకం ధాన్యానికి చెల్లించాల్సిన బోనస్: **రూ.868.61 కోట్లు**

వర్షం వస్తే ఎట్లా..?





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. అయితే లారీలు, హమాలీల కొరత, స్థానిక మిల్లుల ట్యాగింగ్‌లో జాప్యంతో పలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం కుప్పలుగా పడి ఉంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్‌కు చెందిన గంగవ్వ నాలుగెకరాల్లో పండిన ధాన్యాన్ని స్థానిక కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి 20 రోజులవుతున్నా వడ్లు కాంటా కాలేదు. వర్షాల భయంతో ధాన్యంపై కవర్లు కప్పి పడిగాపులు పడుతోంది. జైపూర్ మండలం పొనూరుకు చెందిన జాడి బాపు నాలుగెకరాల్లో పండించిన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చి పది రోజులు గడుస్తున్నా కాంటా వేయడం లేదు. దీంతో వర్షం వస్తే నష్టపోతానని ఆందోళన చెందుతున్నాడు. మరోవైపు మిల్లర్లు తరుగు పేరుతో 2 నుంచి 5 కిలోలకు పైగా కోత పెడుతున్నారని చెన్నూరు మండలం కిష్టంపేట, ఎల్లక్కపేట తదితర చోట్ల రైతులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌ది 'కమీషన్ సర్కార్'

- మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణలో కాంగ్రెస్.. కమీషన్ సర్కార్ నడుపుతోంది, ఇది రాష్ట్రంలో బహిరంగ రహస్యంగా మారినందుకు విచారకరం. మంత్రి కొండా సురేఖ గారు ఈ సత్యాలను బయట పెట్టినందుకు అభినందనలు! ఈ 30% కమీషన్ ప్రభుత్వంలో, వారి సొంత సహచర మంత్రి ప్రకారం, మంత్రులు గణనీయమైన వాటా తీసుకోకుండా ఫైళ్లపై సంతకం చేయరు. కాంట్రాక్టర్లు కూడా సెక్రటేరియట్ లోపల ధర్నా నిర్వహించి, ప్రభుత్వ కమీషన్ వ్యాపారాన్ని బయటపెట్టారు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. ''కొండా సురేఖ గారు ఈ కాంగ్రెస్ మంత్రులందరినీ పేరు పేరునా బహిర్గతం చేయాలని కోరుతున్నాను. రేవంత్‌రెడ్డి లేదా రాహుల్ గాంధీ వారి సొంత కేబినెట్ మంత్రి ఆరోపణలపై విచారణకు ఆదేశించగలరా?'' అని కేటీఆర్ ప్రశ్నించారు.

నా వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేస్తున్నారు

- మంత్రి కొండా సురేఖ



నయీంనగర్: వరంగల్‌లో గురువారం తాను చేసిన వ్యాఖ్యలను కొంతమంది పనికట్టుకొని తప్పుగా ప్రచారం చేస్తున్నారని, ఇలా చేయడం సహేతుకం కాదని మంత్రి కొండా సురేఖ అన్నారు. 'నేను మాట్లాడిన వీడియోను ఎడిట్ చేసి సర్క్యులేట్ చేస్తూ గొడవ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇది సరికాదు.. మీ ఆశలు నెరవేరవు..' అని వ్యాఖ్యానించారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ పనిచేయడానికైనా మంత్రులు డబ్బులు తీసుకునేవారని తాను అన్నానని, అవి అక్షర సత్యాలని, ఆ మాటకు తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు. తమ ప్రభుత్వం అద్భుతంగా పరిపాలన చేస్తుంటే ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు తమ పెయిడ్ సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వంలోని మంత్రులంతా అద్భుతంగా పని చేస్తున్నారన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై | దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- వాస్తవాలు ప్రజలకు చెప్పండి.. రైతులకు భరోసా కల్పించండి
- జిల్లా కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ సూచన
- వచ్చే 10–12 రోజులు చాలా కీలకమని వెల్లడి
- మంత్రులు జూపల్లి, కోమటిరెడ్డి, పొన్నంతో కలిసి వీడియో కాన్ఫరెన్స్



ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్. చిత్రంలో సీఎస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రజలకు వాస్తవాలు వివరించాలని, రైతులకు భరోసా కల్పించే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రానున్న 10–12 రోజులు చాలా కీలకమని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, కలెక్టర్లు చొరవ తీసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై శుక్రవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లోపాలు సత్వరమే పరిష్కరించండి

మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతుల అభీష్టానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు చేయాలని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని, క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పర్యటించడం ద్వారా ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న లోపాలను గుర్తించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటివరకు 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 2023 యాసంగిలో మే 15వ తేదీ నాటికి కేవలం 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేశామని చెప్పారు. ఈ ఏడాది పెద్ద ఎత్తున ధాన్యం వస్తుందన్న అంచనాతో ఎన్నడూ లేని రీతిలో 8,348 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈసారి ధాన్యం కొనుగోలు విజయవంతంగా సాగడంలో.. సమయానుకూలమైన ప్రణాళిక, విభాగాల మధ్య సమన్వయం, రైతు కేంద్రిత పాలన కీలకపాత్ర పోషించాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కంటే రెట్టింపు కొనుగోళ్లు జరిపామని అన్నారు.

నకిలీ రేషన్ కార్డులపై విచారణ

రాష్ట్రంలో 90 లక్షలకు పైగా రేషన్ కార్డులున్నాయని, ఇందులో 96,240 కార్డులు అనుమానాస్పదంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, వీటిపై వెంటనే పరిశీలన చేపట్టాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. 1,62,777 మంది లబ్ధిదారుల వివరాలు అనుమానాస్పదంగా ఉన్నాయని, వీటిపై విచారణ జరిపి వాస్తవాలు నిగ్గు తేల్చాలని ఆదేశించారు. కాగా ఈ సీజన్‌లో ఇప్పటివరకు 50 ఎల్ఎంటీల ధాన్యం కొనుగోళ్లు జరగడంపై మంత్రి ఉత్తమ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.

ధాన్యం కొనుగోలుకు రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలంటూ.. ఆ గ్రామ రైతులు ఆత్మకూరు(ఎం) లోని మెయిన్ రోడ్డుపై శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రైతుల రాస్తారోకోకు సంఘీభావం తెలిపిన అనంతరం మాట్లాడారు. తెలంగాణ ఆడపడుచులతో విదేశీ సుందరీమణుల కాళ్లు కడిగించిన ప్రభుత్వానికి.. రైతుల కన్నీళ్లు తుడిచే సమయం లేదా? అని ప్రశ్నించారు.

నిరీక్షణతో నీరసించి..

వడదెబ్బకు సొమ్మసిల్లిన అన్నదాత



వడ్ల కుప్ప వద్దే పడిపోయిన గంగన్న

వేమనపల్లి: మంచిర్యాల జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. రెండు వారాలైనా వడ్ల కొనుగోళ్లు లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద అన్నదాతలు అల్లాడుతున్నారు. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం దస్నాపూర్‌కు చెందిన తాటి పాముల గంగన్న పది రోజుల క్రితం వరి పొలం కోయించాడు. వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ఆరబోశాడు. వారం రోజులుగా సాయంత్రం పూట మబ్బు, పగలంతా విపరీతమైన ఎండలు కాస్తుండడంతో ధాన్యం కుప్ప వద్దే ఉండాల్సి వస్తోంది. దీంతో శుక్రవారం వడదెబ్బకు గురయ్యాడు. దీనికి తోడు మూర్ఛ రావడంతో కల్లం వద్దే పడిపోయాడు. సహచర రైతులు నీరు తాగించి ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇష్టమొచ్చినట్టు

ఇంటర్నల్ మార్కులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీలు మార్కుల మాయాజాలం చేస్తున్నాయి. హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) ఆడిట్‌లో ఈ విషయం వెలుగుచూసింది. దీనిపై కాలేజీలకు నోటీసులు కూడా ఇచ్చినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంపై శుక్రవారం ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు అధికారులు తెలిపారు. కొన్నేళ్లుగా సాగుతున్న ఈ మార్కుల దందాలో యూనివర్సిటీ ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉందని జేఎన్‌టీయూహెచ్ వర్గాలు తెలిపాయి. వారి వివరాలను కూడా నివేదికలో పేర్కొన్నట్టు అధికారులు చెబుతున్నారు. దీర్ఘకాలం యూనివర్సిటీలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఓ ప్రొఫెసర్ పాత్ర ఇందులో కీలకమని అనుమానిస్తున్నారు.

అటానమస్ కాలేజీల్లో మార్కుల మాయాజాలం

- 40 మార్కులకు గరిష్టంగా 38 వేస్తున్న వైనం
- థియరీలో 60 మార్కులకు 20 దాటని విద్యార్థులు
- జేఎన్‌టీయూహెచ్ ఆడిట్‌లో వెలుగు చూసిన నిజం
- కఠిన చర్యల దిశగా ప్రభుత్వానికి నివేదిక
- వర్సిటీ అధికారుల అండతోనే దందా సాగుతున్నట్లు ఆరోపణలు



ఏం జరిగిందంటే...

రాష్ట్రంలో 80కి పైగా అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ఈ హోదా కారణంగా ఆయా కాలేజీలే సొంతంగా పరీక్షలు నిర్వహించుకుంటాయి. ఇంజనీరింగ్‌లో ప్రతి పేపర్‌కు 40 అంతర్గత మార్కులు, 60 మార్కులు థియరీకి ఉంటాయి. విద్యార్థి ప్రాజెక్టు వర్క్, కాలేజీ హాజరు, నైపుణ్యం, లేబొరేటరీ వర్క్ ఇతర అంశాల ఆధారంగా ఇంటర్నల్ మార్కులు వేస్తారు. అయితే, ప్రతి అటానమస్ కాలేజీలో విద్యార్థులకు కనిష్టంగా 32, గరిష్టంగా 39 మార్కులు వేస్తున్నారు. ఇందులో కొంతమంది విద్యార్థులకు థియరీలో సగం మార్కులు కూడా రావడం లేదు. 68 కాలేజీల్లో ఇదే పరిస్థితి ఉన్నట్టు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ రాజకీయ ప్రముఖుడి కాలేజీలో ఇంటర్‌లో 45 శాతం మార్కులు సాధించిన విద్యార్థి ఇంజనీరింగ్ సీటు పొందాడు. ఫస్టియర్ మొదటి సెమిస్టర్‌లో థియరీలో అతడికి 28 శాతం మార్కులు మాత్రమే వచ్చాయి. ఇంటర్నల్‌లో మాత్రం ఏకంగా 38 మార్కులు వేశారు. వర్సిటీ తనిఖీల్లో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు వెలుగు చూశాయి. సబ్జెక్టుపై కనీస అవగాహన లేని విద్యార్థులు ఏకంగా మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులవుతున్నారు.

ఎలా బయటపడిందంటే..

అటానమస్ హోదా రాకముందు.. వచ్చిన తర్వాత ఆయా కాలేజీల్లో పరిస్థితి ఏమిటనే డేటాను జేఎన్‌టీయూహెచ్ అధికారులు పరిశీలించారు. 46 కాలేజీలు అటానమస్ రాక ముందు 56 శాతం ఫలితాలు సాధించాయి. అటానమస్ వచ్చిన తర్వాత ఏకంగా 80 శాతానికిపైగా విద్యార్థులు పాసయ్యారు. ఇందులో 75 శాతం విద్యార్థులు మొదటి శ్రేణి ఉత్తీర్ణత సాధించారు. ఇదెలా సాధ్యమని చూస్తే థియరీ మార్కులు బొటాబొటిగా ఉంటే, వాటిని మించి ఇంటర్నల్ మార్కులున్నాయి. ఈ వ్యవహారంపై గతంలో జేఎన్‌టీయూహెచ్‌కు అనేక ఫిర్యాదులు కూడా వచ్చినట్టు తెలిసింది. ఫిర్యాదులపై వర్సిటీ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఈ నోటీసుల తర్వాత అధికారులు, సదరు కాలేజీల మధ్య డీల్ కుదిరినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

మార్కెట్ పెంచుకోవడానికే...

ఉత్తీర్ణత, మొదటి శ్రేణి ఉత్తీర్ణత ఎక్కువగా ఉన్న కాలేజీలకు జాతీయ సంస్థల నుంచి గుర్తింపు వస్తుంది. దీన్ని అడ్డం పెట్టుకుని కాలేజీలు నాణ్యత ప్రమాణాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటాయి. ఫలితంగా సీట్లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ డిమాండ్‌ను బట్టి ఫీజులను పెంచుతున్నారు. 60 కాలేజీల్లో ఐదేళ్ల క్రితం ఇంజనీరింగ్‌కు రూ.లక్షల వార్షిక ఫీజు ఉంటే, ఇప్పుడు రూ. 2.5 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. అటానమస్ రాకముందు సగటు ఉత్తీర్ణత కూడా లేని 48 కాలేజీలు ఇప్పుడు జాతీయ ర్యాంకింగ్ పొందాయి. థియరీలో అతి తక్కువ మార్కులు వస్తున్నాయంటే, ఆ కాలేజీల్లో ఫ్యాకల్టీ కూడా సరిగా లేదని అధికారులు అనుమానిస్తున్నారు. మార్కెట్ పెంచుకోవడమే లక్ష్యంగా ఇష్టం వచ్చినట్టు ఇంటర్నల్ మార్కులు వేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

కాలేజీలను హెచ్చరించాం

అటానమస్ రాకముందు, వచ్చిన తర్వాత కాలేజీల ఉత్తీర్ణతలో భారీ తేడాలున్నాయి. ఈ పరిస్థితి వెనుక మతలబు ఉందనే సందేహాలొచ్చాయి. ఇప్పటికే అనుమానం ఉన్న కాలేజీలకు నోటీసులు ఇచ్చాం. ఇక ముందు ఇలాంటి గోల్‌మాల్ చేస్తే సహించేది లేదని హెచ్చరించాం.

– ప్రొఫెసర్ టి కిషన్ కుమార్‌రెడ్డి,
వైస్ చాన్స్‌లర్, జేఎన్‌టీయూహెచ్.

పుష్కర స్నానం.. పరమం పవిత్రం

- పరిపూర్ణానంద సరస్వతి స్వామి పుష్కర స్నానం
- సతీసమేతంగా వచ్చిన డిప్యూటీ సీఎం
- 80 వేల మంది భక్తుల రాక



సరస్వతి నదిలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

భూపాలపల్లి/కాళేశ్వరం: కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతినది పుష్కరాలకు రెండవరోజు భక్తులు భారీగా తరలివచ్చారు. శుక్రవారం తెల్లవారుజామునుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ నెలకొంది. త్రివేణి సంగమంలో భక్తులు పుష్కర స్నానాలు ఆచరించి, తమ పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. నదీమాతకు పూజలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాలయంలో పూజలు చేసి శ్రీశుభానందదేవి, మహాసరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. రెండో రోజు 80 వేల మంది పుష్కర స్నానాలు చేసినట్టు అధికారులు అంచనా. కాళేశ్వరాలయంలో దర్శనానికి భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. పీఠాధిపతి పరిపూర్ణనందస్వామి నదీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరున్ని దర్శించుకొని అభిషేకాలు చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క దంపతులు శుక్రవారం రాత్రి పుష్కర స్నానాలు ఆచరించారు. నదికి పసుపు, కుంకుమ, చీరతో సారె సమర్పించారు. అనంతరం సరస్వతిఘాట్ వద్ద ఏర్పాటు చేసిన కాశీపండితుల హారతి కార్యక్రమాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ రాహుల్‌శర్మలతో కలిసి వీక్షించారు. అనంతరం మీడియాతో భట్టి మాట్లాడుతూ కాళేశ్వరంలో సరస్వతి పుష్కర ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు నాయకత్వంలో ఎక్కడా చిన్న లోపం లేకుండా భక్తులందరికీ సకల సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు.

4 రోజుల్లో కొత్త ఎక్సైజ్ స్టేషన్లు.. వారంలో బదిలీలు

ఎక్సైజ్ సిబ్బందికి ఆ శాఖ మంత్రి జూపల్లి హామీ



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న జూపల్లి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుచేసిన 14 ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లను నాలుగు రోజుల్లో ప్రారంభిస్తామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అలాగే, వారం రోజుల్లో రాష్ట్రంలో గల ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల నుంచి కానిస్టేబుల్ వరకు గల అర్హులైన సిబ్బంది అందరికీ బదిలీలు చేపడతామని ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో తనను కలవడానికి పెద్దసంఖ్యలో తరలివచ్చిన ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బందిని ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. పదోన్నతుల అంశంతో బదిలీలను ముడిపెట్టడం వలన బదిలీల ప్రక్రియ ఆలస్యమైందన్నారు, పదోన్నతుల అంశం న్యాయపరమైన చిక్కులతో ముడిపడి ఉందని, అది ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో బదిలీలకు అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను కూడా రూపొందించి ఆమోదించామని చెప్పారు. విధి విధానాలను మరో నాలుగు రోజుల్లో విడుదల చేస్తామన్నారు.

ఎగ్ కాంట్రాక్టు.. మరో నెల లేటు

అంగన్‌వాడీల్లో కోడిగుడ్ల సరఫరా టెండరు గడువు మూడోసారి పొడిగింపు


సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్ల సరఫరాకు కాంట్రాక్టర్ల ఎంపిక ప్రక్రియను మూడోసారి వాయిదా వేస్తూ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నిర్ణయం తీసుకుంది. తొలుత నిర్దేశించినట్టుగా ఏప్రిల్ 10వ తేదీ వరకు ఉన్న గడువును ఐదురోజులు పొడిగిస్తూ ఏప్రిల్ 16 వరకు దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. టెండరు నిబంధనల్లో సవరణ చేయాలని పౌల్ట్రీ రైతులు డిమాండ్ చేయడంతో మరో నెలరోజులు పొడిగిస్తూ మే 15వ తేదీ వరకు అవకాశం కల్పించారు టెండరు విధానంలో నిర్దేశించిన నిబంధనలు కొంతమందికే అనుకూలంగా ఉన్నాయని పౌల్ట్రీ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుండడం, మరోవైపు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తదితర కారణాలతో టెండరు గడువును మూడోసారి పొడిగించాల్సి వచ్చింది. జూన్ 16వ తేదీ వరకు టెండరు దరఖాస్తులు సమర్పించొచ్చు. తాజాగా మార్పు చేసిన గడువు ప్రకారం జూన్ 17న టెండర్లు తెరిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తారు.

ఒక్క ఆరుతడి పంటకైనా నీటిని కేటాయించండి

- బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వ వాదన
- విచారణ జూలై 23–25కు వాయిదా



సాక్షి, హైదరాబాద్: అనావృష్టి.. అతివృష్టి పరిస్థితుల వల్ల వ్యవసాయం లాభసాటిగా లేదని.. తెలంగాణలో వెనుకబడిన ప్రాంతాల రైతులు, కూలీల జీవనోపాధులను నిలబెట్టడానికి కృష్ణాబేసిన్ (నది పరీవాహక ప్రాంతం)లో ఒక ఆరుతడి పంటకైనా నీటిని కేటాయించాలని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వం వాదించింది. కృష్ణా బేసిన్ తెలంగాణలో అధికంగా ఉన్నా, 15 శాతం సాగు భూమికి మాత్రమే నీటిని అందిస్తున్నారని.. అదే ఆంధ్రప్రదేశ్ 95 శాతం సాగుభూమికి నీటిని అందిస్తున్నారని ఎత్తిచూపింది. ఈ అన్యాయాన్ని సరి చేయాలని కోరింది. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణలకు పంపిణీ చేయడంపై జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.తలపత్ర సభ్యులుగా ఏర్పాటైన కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–2 బుధవారం నుంచి శుక్రవారం వరకూ విచారణ చేపట్టింది. ఈ దఫా కూడా తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు. 'ఒక్కో చుక్కకు ఎక్కువ పంట'అనే జాతీయ విధానాన్ని దృష్టిలో ఉంచుకొని.. తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ప్రాజెక్టు కింద పంటల సాగుకు తెలంగాణలో 12,800 ఎకరాలకు ఒక టీఎంసీ వినియోగిస్తుండగా.. ఏపీలో 8,400 ఎకరాలకు ఒక టీఎంసీని వాడుతున్నారని ఎత్తిచూపారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే పంటల సాగును చేపట్టడం ద్వారా మిగిలే నీటిని తెలంగాణకు కేటాయించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో నీటి పొదుపు నుంచి ఎస్‌ఎల్‌బీసీకి నీటిని కేటాయించకుండా.. ఎస్‌ఆర్‌బీసీకి కేటాయించారని.. వాటిని సవరించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చారిత్రక కారణాల వల్ల తగినంత నీటిని కేడబ్ల్యూడీటీ–1(బచావత్ ట్రిబ్యునల్) కేటాయించిందని, అందులో భాగమైన తెలంగాణకు నీటిపారుదల అవసరం ఉందన్నారు. బచావత్ ట్రిబ్యునల్ విచారణ సమయంలో ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఉండి ఉంటే.. కృష్ణా బేసిన్‌లోని మహబూబ్‌నగర్ జిల్లాలో నీటిపారుదల సౌకర్యాలు పొందే అవకాశాలు ఎక్కువగా ఉండేవన్నారు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కారణంగా తెలంగాణకు నీటి కేటాయింపులు కోల్పోయిందన్నారు. జూరాలకు బచావత్ ట్రిబ్యునల్ 17.84 టీఎంసీలను కేటాయించినా, దానిని రెండవ ప్రాధాన్యత కింద ఉంచారని ఎత్తిచూపారు. కృష్ణా డెల్టా, కేసీ కెనాల్ అదనపు నీటి డిమాండ్లను బచావత్ ట్రిబ్యునల్ తిరస్కరించినా, వాటిని మొదటి ప్రాధాన్యత కింద ఉంచారని గుర్తు చేశారు. వైద్యనాథన్ వాదనలు విన్న అనంతరం విచారణను జూలై 23–25కు ట్రిబ్యునల్ వాయిదా వేసింది.



ఫ్రిడ్జ్, వాషింగ్ మెషీన్‌తో పాటు ఒక ఏసీ

మారుతున్న వినియోగదార్ల అలవాట్లు

పల్లెల్లోనూ ఏసీలకు పెరుగుతున్న డిమాండ్

ఏడాదిలో ఏకంగా 1.4 కోట్ల ఏసీల అమ్మకం



ఎయిర్ కండీషనర్.. సంక్షిప్తంగా ఏసీ. కొన్నేళ్ల క్రితం వరకు కొన్ని వర్గాలకే పరిమితమైన ఈ గృహోపకరణం క్రమంగా సామాన్యుడి ఇంటినీ చల్లబరిచి అందరిదీ అనిపించుకుంటోంది. 2024–25లో దేశవ్యాప్తంగా అమ్మకాలు ఏకంగా 30 శాతం పెరిగాయి. కనీవిని ఎరుగని రీతిలో ఏకంగా 1.4 కోట్ల ఏసీల కొనుగోళ్లు జరిగాయంటే వీటికి పెరుగుతున్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు విలాసవంతమైనదిగా ఉన్న ఏసీ ఇప్పుడు అవసరాల జాబితాలోకి వచ్చిందని కంపెనీలు అంటున్నాయి. సులభ వాయిదాల్లో కొనుగోలు చేసే వెసులుబాటు కూడా వీటి విక్రయాలు ఊపందుకోవడంలో కీలకపాత్ర పోషిస్తోంది. 2024లో వేసవిలో అనేక భారతీయ నగరాల్లో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్ దాటాయి. ఇంకేముంది.. వినియోగదారులు ఏసీలు కొనడానికి దుకాణాలకు వరుస కట్టారు. రిఫ్రిజిరేటర్ లేదా వాషింగ్ మెషీన్ లేని కుటుంబాలు సైతం ఏసీలను కొనుగోలు చేయడం విశేషం. తీవ్రమైన వేడిగాలులు, వేసవి ఎక్కువ రోజులు ఉండడం కారణంగా గత ఆర్థిక సంవత్సరం రూమ్ ఎయిర్ కండీషనర్ల పరిశ్రమ భారీ వృద్ధిని నమోదు చేసింది. భానుడి ప్రతాపంతో 2024–25లో భారత్‌లో రికార్డు స్థాయిలో 1.4 కోట్ల యూనిట్ల రూమ్ ఏసీలు అమ్ముడయ్యాయి. 2023–24తో పోలిస్తే ఇది 30 శాతం అధికం. తయారీ కంపెనీలు గతేడాది అత్యధికంగా రూ.45,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి.

మీ ఇల్లు చల్లగుండ..

ఐదేళ్లలో రెట్టింపు..

మార్కెట్ అంచనాల ప్రకారం భారత రెసిడెన్షియల్ ఏసీ పరిశ్రమ ఏటా 15 శాతం వృద్ధి చెందనుంది. 2029–30 నాటికి ఏసీల అమ్మకాలు రెండింతలకుపైగా పెరిగి 3 కోట్లకు చేరనున్నాయట. 2050 నాటికి ఏకంగా 100 కోట్ల యూనిట్ల విక్రయాల స్థాయికి చేరనుందని పరిశ్రమ అంచనా వేస్తోంది. వినియోగ వస్తువుల వ్యాపారంలో భవిష్యత్తులో పరిమాణంతో పాటు, విలువనూ నడిపించే చోదక శక్తి ఏసీ లేనని హాయర్ అప్లయన్సెస్ ఇండియా చెబుతోంది. కేంద్ర గణాంక శాఖ నిర్వహించిన 78వ జాతీయ శాంపిల్ సర్వే 2020–21 ప్రకారం దేశంలోని మొత్తం ఇళ్లలో ఏసీలు ఉన్నవి 4.9% మాత్రమే. దేశ సగటుతో పోలిస్తే తెలుగు రాష్ట్రాల్లో ఏసీలు ఎక్కువే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 8.1%, తెలంగాణలో 6.6% ఇళ్లల్లో ఏసీలు ఉన్నట్టు శాంపిల్ సర్వే గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం దేశంలో ఏసీలు ఉన్న ఇళ్లు 10% అని అంచనా. 10–15 ఏళ్లలో వీటి సంఖ్య 50–60 శాతానికి చేరుతుందని వోల్టాస్ అంచనా వేస్తోంది.

సిద్ధమవుతున్న కంపెనీలు..

దేశంలోని ప్రధాన కంపెనీలు వచ్చే రెండేళ్లలో తయారీ సామర్థ్యాన్ని పెంచనున్నాయి. హాయర్ అప్లయన్సెస్ తన సామర్థ్యాన్ని 15 లక్షల నుంచి 40 లక్షల యూనిట్ల స్థాయికి చేరుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సిటీ ప్లాంటు సామర్థ్యాన్ని 8.5 లక్షల యూనిట్ల నుంచి 12 లక్షల యూనిట్లకు పెంచనుంది బ్లూ స్టార్ కంపెనీ. 'ఏప్రిల్–జూన్‌లో కంపెనీ రూమ్ ఎయిర్ కండిషనర్ వ్యాపారం 30% వృద్ధి చెందుతుందని అంచనా. గత ఏడాది ఇదే కాలంలో 50% వృద్ధి నమోదైంది' అని బ్లూ స్టార్ ఎండీ బి.త్యాగరాజన్ తెలిపారు. మరోపక్క, ఇప్పటివరకు ఈ వ్యాపారంలో లేని పెద్ద సంస్థలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నాయి. హాయర్ ఇండియాలో 49% వాటాను కొనుగోలు చేయడానికి భారతీ ఎయిర్‌టెల్ చర్చలు జరుపుతున్నట్టు సమాచారం.

ఏఐ ఏసీలూ వచ్చాయ్..

ఏసీల కొనుగోలులో వినియోగదారులు ఫీచర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రధానంగా కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో కూడిన ఏసీలను ఎక్కువగా ఇష్టపడుతున్నారనీ ఏసీల పంపిణీ వ్యాపారంలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన 'ఓమిండో ఆటోమెషీన్స్' డైరెక్టర్ పి.వి. కార్తీక్ తెలిపారు. గదిలో ఉన్న మనుషుల సంఖ్య, తేమనుబట్టి ఫ్యాన్, కంప్రెసర్ స్పీడ్, కూలింగ్‌ను మార్చుకోవడం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పనితీరు నియంత్రణ, సమర్థవంతంగా విద్యుత్ వినియోగం, మెరుగైన సౌకర్యం, దుమ్ము చేరితే అలర్ట్ చేయడం వంటి ఫీచర్లను ఏఐ ఏసీలు అందిస్తున్నాయి. యూజర్ వినియోగ విధానాన్ని అనుసరించి సెట్టింగ్స్‌ను మార్చుకోవడమూ వీటికి తెలుసు. కొన్ని కంపెనీలు విండ్ ఫ్రీ ఏసీలను విక్రయిస్తున్నాయి. బలంగా వీయకుండా సన్నని రంధ్రాల నుంచి చల్లని గాలి గది అంతా విస్తరించడం వీటి ప్రత్యేకత.

ఈ వేసవిలో మాత్రం...

ఈ ఏడాది ఏప్రిల్‌లో వేసవి ముందుగానే ప్రారంభమైనప్పటికీ భానుడు కాస్త శాంతించాడు. సాధారణం కంటే ఎక్కువ వేడిగాలులు వీస్తాయని అంచనా వేసినప్పటికీ దేశంలోని చాలా ప్రాంతాల్లో భిన్న వాతావరణం నెలకొంది. పగలు ఎండగా, సాయంత్రం చల్లగా ఉంటోంది. దీంతో 2024తో పోలిస్తే ఏసీల విక్రయాల్లో ప్రస్తుత సీజన్‌లో ప్రాంతాన్నిబట్టి 10 శాతం వరకు క్షీణత ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ ఇదే పరిస్థితి ఉంది.

– సాక్షి, స్పెషల్ డెస్క్

ఏసీ ముచ్చట్లు

- ఏసీని గతంలో 15–20 ఏళ్లు వాడేవారు. ఇప్పుడు 7–8 ఏళ్లకే మార్చేసి కొత్తవి కొంటున్నారు.
- మొత్తం ఏసీల అమ్మకాల్లో 5 స్టార్ రేటింగ్ మోడళ్ల వాటా 35 శాతం. మిగిలిన వాటా 3 స్టార్ ఏసీలది.
- గృహ విభాగంలో స్ప్లిట్ ఏసీలదే సింహభాగం. మొత్తం అమ్మకాల్లో అవే 95 శాతం వరకు ఉంటున్నాయి.
- గత ఏడాదితో పోలిస్తే ఏసీల ధరలు ప్రస్తుత సీజన్‌లో 3–4 శాతం వరకు పెరిగాయి.
- రూ.35,000 లోపు ధర కలిగిన ఏసీల అమ్మకాలే ఎక్కువ. మూడింట రెండొంతులు ఇవే.
- సులభ వాయిదాల్లో (ఈఎంఐ) దాదాపు 40 శాతం మంది కొనుగోలు చేస్తున్నారు.

ఏసీ అలాగే ఉంది

టీవీలు శక్తిమంతమైన క్యాథోడ్ రే ట్యూబ్‌లను ఉపయోగించే భారీ పెట్టెల నుండి సన్నని ఎల్‌ఈడీ వేరియంట్లుగా మారాయి. ఏసీలు మాత్రం.. దశాబ్దాల క్రితం మాదిరిగా ఇప్పటికీ ఎలాంటి మార్పు లేకుండా అలాగే ఉన్నాయి. అంతేకాదు వాటిని నడిపించే సాంకేతికత కూడా పెద్దగా అభివృద్ధి చెందలేదు.

24 డిగ్రీల వద్దే..

విద్యుత్‌ను సమర్థవంతంగా నిర్వహించే ప్రమాణాలు ప్రపంచవ్యాప్తంగా మెరుగుపడినప్పటికీ.. ఒక సాధారణ స్ప్లిట్ ఏసీ ఇప్పటికీ ఫ్యాన్ కంటే 15–20 రెట్లు ఎక్కువ విద్యుత్తును వినియోగిస్తుంది. ఏసీని 24 డిగ్రీలకు వద్దే వాడాలని, అప్పుడే విద్యుత్ వినియోగం తక్కువగా జరుగుతుందని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ సూచిస్తోంది. ఉష్ణోగ్రత ఒక్కో డిగ్రీ తగ్గిస్తున్నకొద్దీ 6 శాతం విద్యుత్ వినియోగం పెరుగుతుంది.

తహసీల్దార్ల బదిలీల్లో 'ట్విస్ట్'

99 మంది మాత్రమే వెనక్కి.. అది కూడా సొంత జిల్లాల నుంచి వెళ్లని వారినే

- సొంత జిల్లాల నుంచి వెళ్లిన 257 మందికి రెండేళ్లయినా కలగని మోక్షం
- పూర్వ స్థానాలకు తిరిగి పంపించేది లేదని మెలిక పెడుతున్న రెవెన్యూ శాఖ

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ సంఘాల ఒత్తిడి మేరకు తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు పంపేందుకు అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం...అందులో కొత్త మెలిక పెట్టింది. ఎన్నికల సమయంలో సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారు కాకుండా, ఇతర జిల్లాల నుంచి బదిలీపై వెళ్లిన వారిని మాత్రమే వెనక్కి పంపిస్తామని అంటోంది. ఈ మేరకు సొంత జిల్లాలు కాని జిల్లాల నుంచి ఎన్నికల సందర్భంలో బదిలీ అయిన వారిని తిరిగి పూర్వ జిల్లాలకు పంపిస్తూ భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కానీ, సొంత జిల్లాల తహసీల్దార్లను వెనక్కి పంపే విషయంలో మాత్రం ప్రభుత్వం ససేమిరా అంటుండడం గమనార్హం.

ఆనవాయితీనే.. కానీ: వాస్తవానికి, ఎన్నికల విధుల్లో కీలక మైన తహసీల్దార్లకు ఆ సమయంలో స్థానచలనం కల్పించ డం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే అటు అసెంబ్లీ, ఇటు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 356 మందిని బదిలీ చేశారు. వీరిలో 257 మంది సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వా రు కాగా, 99 మంది ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నా, ఎన్నికల విధుల కోసం బదిలీ చేశారు. అయితే, ఎన్నికలు ముగిసిన తర్వాత ఏ జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్‌ను మళ్లీ ఆ జిల్లాకు పంపాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ కూడా ఆనవాయితీగానే కొనసాగుతోంది. ఏపీలో కూడా ఎన్నికల బదిలీలు జరిగిన తహసీల్దార్లను వారి పూర్వ జిల్లాలకు పంపారు. కానీ, తెలంగాణలో మాత్రం మెలికలు పడుతూనే ఉన్నాయి.

పంపాల్సిందేనంటున్న రెవెన్యూ సంఘాలు

ఈ అంశంలో రెవెన్యూ సంఘాలు ఇప్పటికే ఎన్నోసార్లు కలిసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. కుటుంబానికి దూరంగా వందలమంది తహసీల్దార్లు పనిచేస్తూ మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారి కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వెంటనే పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని కోరు తూ రెవెన్యూ సంఘాలు సమయం దొరికినప్పుడల్లా అటు ప్రభుత్వాన్ని, ఇటు రెవెన్యూ ఉన్నతాధికారులను కోరుతూ వచ్చాయి. కానీ, ప్రభుత్వం మాత్రం సొంత జిల్లాలకు తహసీల్దార్లను పంపేది లేదని చెబుతోంది. సొంత జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్ల పనితీరుకు సంబంధించిన పూర్వ అనుభవాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు చెబుతోంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ సంఘాలు మాత్రం పట్టువదలని విక్రమార్కుల్లా తహసీల్దార్లందరి బదిలీల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాయి. అవసరమైతే ఆందోళనకు కూడా దిగుతామని చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తన పట్టును సడలించి తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు పంపుతుందా? లేక ఈ 97 మంది బదిలీలతోనే సరిపెడుతుందా అన్నది మాత్రం వేచిచూడాల్సిందే...!

సమాచార కమిషనర్‌గా వైష్ణవి

ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా మెర్ల వైష్ణవిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.. ఇటీవల కమిషనర్లుగా బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావు, పర్వీన్, దేశాల భూపాల్‌ను నియమించడం తెలిసిందే. తాజాగా వైష్ణవి నియామకంతో.. ముఖ్య కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కాకుండా ఐదుగురు కమిషనర్లను నియమించినట్లయింది.



అందెశ్రీకి సన్మానం

ప్రజాకవి అందెశ్రీని తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎస్.కోదండరెడ్డి సత్కరించారు. అందెశ్రీ శుక్రవారం తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిషన్ పనితీరు అద్భుతంగా, రైతుకు అండగా ఉందని కితాబిచ్చారు.

– సాక్షి, హైదరాబాద్

సాక్షి బిజినెస్
శనివారం
17-5-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
200	42
82,331	25,020

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,153	▲	4
డోజోన్స్	42,526	▲	203
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,685	▲	51
డాక్స్	23,767	▲	72
షాంఘై	3,381	▽	23
నికాయ్	37,752	▽	373

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.00	86.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	112.40	115.33
€	యూరో	ఎస్‌బీఐ	94.47	97.15
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.10	59.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.82	53.03
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.55	68.22
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.90	23.41
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.39	24.17
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.99	12.81

డెడ్‌లైన్ దగ్గరపడుతోంది.. క్లెయిమ్స్ దాఖలు చేయండి

కార్వీ ఇన్వెస్టర్లకు సెబీ సూచన

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) ఇన్వెస్టర్లు తమ క్లెయిమ్‌లను దాఖలు చేసేందుకు గడువు తేదీ అయిన జూన్ 2 దగ్గర పడుతోంది. ఈ నేపథ్యంలో మదుపరులు త్వరపడాలని, సత్వరం క్లెయిమ్‌లను ఫైల్ చేయాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ సూచించింది. దీనిపై సహాయం కోసం ఎన్‌ఎస్‌ఈని సంప్రదించవచ్చని లేదా టోల్ ఫ్రీ నంబర్ 1800 266 0050కి కాల్ చేయొచ్చని (ఐవీఆర్ ఆప్షన్ 5), లేదా defaultisc@nse.co.in ఈమెయిల్ ఐడీకి మెయిల్ చేయొచ్చని ఒక ప్రకటనలో పేర్కొంది. కేఎస్‌బీఎల్ తమ క్లయింట్ల సెక్యూరిటీలను తనఖా పెట్టి భారీగా నిధులు సమీకరించడం, వాటిని సొంత అవసరాల కోసం ఇతర అనుబంధ సంస్థలకు మళ్లించడం తెలిసిందే.

ఇండస్‌ఇండ్‌లో మళ్లీ కలకలం

ఖాతాల్లో రూ. 595 కోట్ల ఆధారం లేని నిల్వలు

- ఇంటర్నల్ ఆడిట్‌లో గుర్తింపు
- ఉద్యోగుల పాత్రపై అనుమానం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో మరో అకౌంటింగ్ లోపం బైటపడింది. తమ ఖాతాల్లో 'నిర్దిష్ట ఆధారాలు లేని' రూ. 595 కోట్ల బ్యాలెన్స్‌ను అంతర్గత ఆడిట్ విభాగం (ఐఏడీ) గుర్తించినట్లు బ్యాంక్ తెలిపింది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు బ్యాంకు ఇచ్చిన సమాచారం ప్రకారం, ప్రజా వేగు నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఆడిట్ కమిటీ 'ఇతర అసెట్స్', 'ఇతర లయబిలిటీస్' ఖాతాల్లో లావాదేవీలపై విచారణ జరిపింది. మే 8న ఐఏడీ సమర్పించిన నివేదిక బట్టి, 'ఇతర అసెట్స్' కింద ఎలాంటి ఆధారాలు లేని రూ. 595 కోట్ల మొత్తం నమోదైంది. దీన్ని జనవరిలో 'ఇతర లయబిలిటీల' కింద సర్దుబాటు చేసినట్లుగా రికార్డయ్యింది. మరోవైపు, గత ఆర్థిక సంవత్సరం మూడు త్రైమాసికాల్లో మొత్తం రూ. 674 కోట్లు, వడ్డీ ఆదాయం కింద ఖాతాల్లో తప్పుగా రికార్డు అయినట్లు, జనవరి 10న దీన్ని పూర్తిగా రివర్స్ చేసినట్లు బ్యాంకు వివరించింది ఈ మొత్తం వ్యవహారంలో కీలక ఉద్యోగుల పాత్రపై కూడా ఐఏడీ విచారణ జరిపినట్లు బ్యాంకు తెలిపింది. అంతర్గత విధానాలను పటిష్టం చేయడం, అవకతవకలకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవడం మీద బోర్డు దృష్టి పెట్టినట్లు వివరించింది.

డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అకౌంటింగ్ లోపాల కారణంగా సంస్థ నికర విలువపై 2.35 శాతం మేర ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందంటూ ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రభావం సుమారు రూ. 1,979 కోట్ల మేర ఉండొచ్చని, ఈ అంశంపై దర్యాప్తు చేసిన ఏజెన్సీ పీడబ్ల్యూసీ ఒక నివేదికలో పేర్కొంది. వివిధ స్థాయిల్లో చోటు చేసుకున్న అవకతవకలను, తీసుకోవాల్సిన చర్యలను సూచించింది. ఇప్పటికే సీఈవో సుమంత్ కథ్పాలియా, డిప్యూటీ సీఈవో అరుణ్ ఖురానా రాజీనామా చేశారు. కొత్త ఎండీ, సీఈవో బాధ్యతలు చేపట్టే వరకు కార్యకలాపాల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్‌ల కమిటీ ఏర్పాటైంది. అకౌంటింగ్ అవకతవకలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు గ్రాంట్ థార్న్‌టన్‌ను బ్యాంకు నియమించుకుంది.

అకౌంటింగ్‌లో అవకతవకల వార్తలతో శుక్రవారం ఉదయం బ్యాంక్ షేర్లు ఒక దశలో 6 శాతం క్షీణించినప్పటికీ తర్వాత కోలుకుని ఒక మోస్తరు లాభంతో ముగిశాయి. బీఎస్‌ఈలో కంపెనీ షేరు ఉదయం సెషన్లో 5.7% క్షీణించి రూ. 735.95కి తగ్గింది. చివరికి 0.26% పెరిగి రూ. 782.30 వద్ద క్లోజయ్యింది.

ఐపీవో స్ట్రీట్

బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ @ రూ. 85–90

- ఈ నెల 21–23 మధ్య ఐపీవో
- రూ. 2,150 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల కంపెనీ బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 21న ప్రారంభంకానుంది. 23న ముగియనున్న ఇష్యూకి రూ. 85–90 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ. 2,150 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. 20న యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్లను విక్రయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 166 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఇష్యూ నిధులలో రూ. 1,618 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. 2024 డిసెంబర్‌కల్లా కంపెనీ రుణ భారం రూ. 2,600 కోట్లుగా నమోదైంది. కంపెనీ ప్రధానంగా ఆటో రంగంలోని సేఫ్టీ క్రిటికల్ సిస్టమ్స్‌ను రూపొందించడంతోపాటు.. ఇతర ఇంజినీరింగ్ సొల్యూషన్స్ అందిస్తోంది.

బొరానా వీవ్స్ @ రూ. 205–216

ఈ నెల 20–22 మధ్య ఐపీవో

టెక్స్‌టైల్ తయారీ కంపెనీ బొరానా వీవ్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 20న ప్రారంభంకానుంది. 22న ముగియనున్న ఇష్యూకి రూ. 205–216 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూలో భాగంగా 67.08 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ. 145 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. 19న యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్లను విక్రయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 69 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఇష్యూ నిధులను కొత్త తయారీ యూనిట్ ఫైనాన్స్ వ్యయాలతోపాటు.. వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. గుజరాత్‌లోని సూరత్ వద్ద ఏర్పాటు చేస్తున్న యూనిట్ ద్వారా గ్రే ఫ్యాబ్రిక్‌ను ఉత్పత్తి చేయనుంది.

ఫైనాన్స్, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ

- సెన్సెక్స్ నష్టం 200 పాయింట్లు
- 25,100 స్థాయి దిగువకు నిఫ్టీ



ముంబై: ఫైనాన్స్, ఐటీ, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో శుక్రవారం స్టాక్ సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 200 పాయింట్లు కోల్పోయి 82,331 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 42 పాయింట్లు పతనమై 25,020 వద్ద నిలిచింది. అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య చర్చలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గుచూపారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే బలహీనంగా మొదలయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 384 పాయింట్లు క్షీణించి 82,147 వద్ద, నిఫ్టీ 109 పాయింట్లు నష్టపోయి 24,953 వద్ద కనిష్టాలు తాకాయి. నష్టాల మార్కెట్లోనూ ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపుపై ఆశలతో రియల్టీ, ఎన్‌బీఎఫ్‌సీ, ఆటోమొబైల్స్, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

- అధిక వెయిటేజీ భారతీ ఎయిర్‌టెల్(–3%), ఎస్‌బీఐ(–2%), ఇన్ఫోసిస్ (–1.50%) నష్టపోయి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. రంగాల వారీగా సూచీల్లో ఇండస్ట్రియల్స్, రియల్టీ 2%, క్యాపిటల్ గూడ్స్, వినిమయ 1.50% పెరిగాయి. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1% రాణించాయి.
- ఆపరేషన్ సిందూర్ చేపట్టిన రోజు (మే 7) ప్రారంభమైన రక్షణ రంగ షేర్ల ర్యాలీ కొనసాగుతూనే ఉంది. రక్షణ పరికరాల ఉత్పత్తి, ఎగుమతులను ప్రోత్సహించే దిశగా కేంద్రం లక్ష్యాలు నిర్దేశించుకోవడంతో ఈ రంగ షేర్లకు డిమాండ్ నెలకొంది. పారాస్ డిఫెన్స్ 19%, డేటా ప్యాటర్న్స్ 9%, ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రొడెక్ట్స్ 7%, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ 5.5%, మిశ్రా ధాతు నిగమ్ 5%, భారత్ ఎలక్ట్రానిక్స్ 4%, భారత్ డైనమిక్స్ 2% లాభపడ్డాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

2025లో జీడీపీ వృద్ధి 6.3 శాతం: ఐరాస	యూఎస్‌లో రెమిటెన్సులపై పన్ను.. ఎన్నారైలకు సెగ!

భారతి ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వాటా విక్రయం..

డీల్ విలువ 1.5 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్‌లో సుమారు 1.2 శాతం వాటా విక్రయించినట్లు సింగ్‌టెల్ తెలిపింది. ఈ డీల్ విలువ దాదాపు 2 బిలియన్ సింగపూర్ డాలర్లని (దాదాపు 1.5 బిలియన్ డాలర్లు) పేర్కొంది. అసెట్ పోర్ట్‌ఫోలియోను పటిష్టం చేసుకోవడం, వాటాదారులకు మరింత మెరుగైన రాబడులు అందించడం కోసం ఈ లావాదేవీ చేపట్టినట్లు వివరించింది. డీల్ అనంతరం ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వాటా 28.3 శాతానికి తగ్గింది. ప్రైవేట్ ప్లేస్‌మెంట్‌కి ప్రస్తుత షేర్‌హోల్డర్లు, కొత్త ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన లభించిందని సింగ్‌టెల్ తెలిపింది. దాదాపు 2 దశాబ్దాలుగా ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వ్యూహాత్మక ఇన్వెస్టర్‌గా కొనసాగుతోంది.

బీఎస్‌ఈలో భారతి ఎయిర్‌టెల్ షేరు 2.8% క్షీణించి రూ. 1,814 వద్ద క్లోజయ్యింది.

హ్యుందాయ్ లాభం డౌన్

- క్యూ4లో రూ. 1,614 కోట్లు
- షేరుకి రూ. 21 డివిడెండ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం నీరసించి రూ. 1,614 కోట్లకు పరిమితమైంది. దేశీ అమ్మకాలు మందగించడం ప్రభావం చూపింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,677 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 21 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం నామమాత్ర వృద్ధితో రూ. 17,671 కోట్ల నుంచి రూ. 17,940 కోట్లకు బలపడింది. ఈ కాలంలో దేశీయంగా 1,53,550 వాహనాలను విక్రయించింది. 2023–24 క్యూ4లో రూ. 1,60,317 యూనిట్ల అమ్మకాలు సాధించింది. అయితే ఎగుమతులు 33,400 యూనిట్ల నుంచి 38,100 వాహనాలకు జంప్ చేశాయి.

పూర్తి ఏడాదికి

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి హ్యుందాయ్ ఇండియా కన్సాలిడేటెడ్ నికర లాభం 7 శాతం క్షీణించి రూ. 5,640 కోట్లను తాకింది. 2023–24లో రూ. 6,060 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 69,829 కోట్ల నుంచి రూ. 69,193 కోట్లకు స్వల్పంగా తగ్గింది. దేశీ అమ్మకాలు 6,14,721 యూనిట్ల నుంచి 5,98,666 యూనిట్లకు వెనకడుగు వేశాయి. ఎగుమతులు నామమాత్ర వృద్ధితో 1,63,386 యూనిట్లకు చేరాయి. 2030కల్లా 20 ఐసీఈ, 6 ఈవీలతో కలిపి 26 కొత్త ప్రొడక్టులను ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ ఎండీ అన్సూ కిమ్ పేర్కొన్నారు. వీటిలో 8 మోడళ్లు 2027కల్లా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది(2025–26) రూ. 7,000 కోట్ల పెట్టుబడులు వెచ్చించనున్నట్లు కంపెనీ సీవోవో తరుణ్ గార్గ్ తెలియజేశారు. వీటిలో 40 శాతాన్ని పుణేలో ఏర్పాటు చేస్తున్న ప్లాంటుపై వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో హ్యుందాయ్ షేరు 1.3 శాతం లాభంతో రూ. 1,860 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

ప్రపంచకప్ చెస్ టోర్నీకి రాజా రిత్విక్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ ఈ ఏడాది జరిగే ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌కు అర్హత సాధించాడు. యూఏఈలో ముగిసిన ఆసియా వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లో రాజా రిత్విక్ ఆరో స్థానంలో నిలువడం ద్వారా ప్రపంచకప్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. ఆసియా చాంపియన్‌షిప్‌లో టాప్–10లో నిలిచిన వారికి ప్రపంచకప్ బెర్త్‌లు లభించాయి. ఆసియా చాంపియన్‌షిప్‌లో 33 దేశాల నుంచి 154 మంది క్రీడాకారులు స్విస్ ఫార్మాట్‌లో పోటీపడ్డారు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత రాజా రిత్విక్ 6.5 పాయింట్లతో ఆరో స్థానాన్ని దక్కించుకున్నాడు. రిత్విక్ ఐదు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోయాడు. హైదరాబాద్ కేఎల్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న రిత్విక్ ప్రస్తుతం ఎన్.రామరాజు, గొలోష్‌చపోవ్ (ఉక్రెయిన్) వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. ఆసియా టోర్నీ ద్వారా రిత్విక్‌తో పాటు భారత్ నుంచి నిహాల్ సరీన్, ఇనియన్, నారాయణన్, ప్రాణేశ్, హర్షవర్ధన్ కూడా ప్రపంచకప్‌కు అర్హత పొందారు.



భారత్ 'ఎ' జట్టులో కరుణ్ నాయర్

న్యూఢిల్లీ: దేశవాళీ క్రికెట్ గత సీజన్‌లో అద్భుతంగా చెలరేగిన బ్యాటర్ కరుణ్ నాయర్‌కు భారత టెస్టు టీమ్‌లో పునరాగమనం చేసేందుకు మరో అవకాశం లభించింది. ఇంగ్లండ్ 'ఎ' జట్టుతో రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో తలపడేందుకు సెలక్టర్లు ఎంపిక చేసిన భారత 'ఎ' జట్టులో కరుణ్ నాయర్‌కు చోటు లభించింది. కెరీర్‌లో 6 టెస్టులు ఆడిన నాయర్ 2017లో చివరిసారి భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. సెహ్వాగ్ తర్వాత భారత్ తరఫున 'ట్రిపుల్ సెంచరీ' నమోదు చేసిన రెండో ఆటగాడిగా గుర్తింపు పొందిన 33 ఏళ్ల నాయర్ మళ్లీ టీమ్‌లోకి వచ్చేందుకు శ్రమిస్తున్నాడు. 2024–25 రంజీ సీజన్‌లో విదర్భ తరఫున 9 మ్యాచ్‌లలో 863 పరుగులు చేసిన అతను...అంతకుముందు రెండు సీజన్లు ఇంగ్లండ్ కౌంటీ నార్తాంప్టన్‌షైర్ తరఫున ఆడి 56.61 సగటుతో 736 పరుగులు చేశాడు. తాజా ఫామ్, ఇంగ్లండ్‌లో అనుభవంతో పాటు భారత మిడిలార్డర్‌లో ఖాళీతో కరుణ్ ప్రస్తుతం రేసులో ఉన్నాడు.

ఆ్రస్టేలియా టెస్టు సిరీస్‌లో సభ్యులైన జైస్వాల్, జురేల్, నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా, సర్ఫరాజ్, ఆకాశ్ దీప్‌లను కూడా భారత 'ఎ' జట్టులోకి ఎంపిక చేశారు. ఇంగ్లండ్‌లో పరిస్థితులను అర్థం చేసుకునేందుకు యువ ఆటగాళ్లకు ఈ ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు సరైన అవకాశంగా సెలక్టర్లు భావించారు. భారత్, ఇంగ్లండ్ 'ఎ' జట్ల మధ్య మే 30 నుంచి తొలి మ్యాచ్, జూన్ 6 నుంచి రెండో మ్యాచ్ జరుగుతాయి. అనంతరం భారత సీనియర్ టీమ్, భారత 'ఎ' జట్ల మధ్య కూడా జూన్ 13 నుంచి ఒక నాలుగు రోజుల మ్యాచ్ జరుగుతుంది.

భారత 'ఎ' జట్టు వివరాలు: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), ధ్రువ్ జురేల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, శార్దుల్ ఠాకూర్, ఇషాన్ కిషన్, మానవ్ సుతార్, తనుశ్ కొటియాన్, ముకేశ్, ఆకాశ్‌దీప్, హర్షిత్ రాణా, అన్షుల్ కంబోజ్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, సర్ఫరాజ్ ఖాన్, తుషార్ దేశ్‌పాండే, హర్ష్ దూబే, శుబ్‌మన్ గిల్, సాయిసుదర్శన్.

'షో' మళ్లీ షురూ...

నేటి నుంచి ఐపీఎల్-2025 పునఃప్రారంభం

- సీజన్‌లో మరో 17 మ్యాచ్‌లు
- నేడు బెంగళూరుతో కోల్‌కతా 'ఢీ'
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం


కోహ్లి


వెంకటేశ్ అయ్యర్, రహానే

బెంగళూరు: ఐపీఎల్ 18వ సీజన్‌లో తొమ్మిది రోజుల విరామానంతరం తర్వాతి మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. భారత్, పాకిస్తాన్ మధ్య సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం కారణంగా లీగ్‌ను గవర్నింగ్ కౌన్సిల్ వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు పరిస్థితులు చక్కబడటంతో కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం నేటి నుంచి మ్యాచ్‌లు పునఃప్రారంభమవుతున్నాయి. శనివారం చిన్నస్వామి స్టేడియంలో జరిగే పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ తలపడుతుంది. లీగ్ దశలో ఆఖరి మ్యాచ్ ఈ నెల 7న జరిగింది. మే 8న ధర్మశాలలో పంజాబ్, ఢిల్లీ మధ్య మ్యాచ్‌ను అర్ధాంతరంగా నిలిపివేసి లీగ్‌కు విరామం ఇచ్చారు. ఇప్పుడు ఆ మ్యాచ్ మళ్లీ నిర్వహిస్తారు. 70 మ్యాచ్‌ల లీగ్ దశలో 57 మ్యాచ్‌లు ముగిశాయి. మిగిలిన 13 మ్యాచ్‌లతో పాటు నాలుగు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు (క్వాలిఫయర్–1, ఎలిమినేటర్, క్వాలిఫయర్–2, ఫైనల్) కలిపి మొత్తం ఈ సీజన్‌లో మరో 17 మ్యాచ్‌లు ఉన్నాయి. ఆరు వేదికలు బెంగళూరు, జైపూర్, ఢిల్లీ, లక్నో, ముంబై, అహ్మదాబాద్‌లలో లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ప్లే ఆఫ్స్ మ్యాచ్‌ల వేదికలు ఇంకా ప్రకటించలేదు. జూన్ 3న ఫైనల్ జరుగుతుంది.

ముస్తఫిజుర్, డుప్లెసిస్ రెడీ...

ఐపీఎల్‌లో మిగిలిన మ్యాచ్‌లలో పాల్గొనే విదేశీ ఆటగాళ్ల విషయంలో శుక్రవారం మరింత స్పష్టత వచ్చింది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నిరభ్యంతర పత్రం జారీ చేయడంతో పేసర్ ముస్తఫిజుర్ రహమాన్‌కు మార్గం సులువైంది. ఢిల్లీ తరఫున అతను బరిలోకి దిగుతాడు. ఢిల్లీ టాప్ పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్ తాను మిగిలిన మ్యాచ్‌లకు తిరిగి రావడం ముందే స్పష్టం చేసేశాడు. ఓపెనర్ డుప్లెసిస్ కూడా ఆడేందుకు సిద్ధం కావడం క్యాపిటల్స్‌కు సానుకూలాంశం. స్టబ్స్ మిగిలిన లీగ్ దశలో ఉండి ఆ తర్వాత డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం వెళ్లిపోతాడు. ఇప్పటికే ప్లే ఆఫ్స్ అవకాశాలు కోల్పోయిన హైదరాబాద్, చెన్నై, రాజస్తాన్ జట్లకు విదేశీ క్రికెటర్ల ప్రాతినిధ్యం పెద్దగా సమస్య కాకపోవచ్చు. అయితే ఫలితాన్ని ప్రభావితం చేయగల విదేశీ ఆటగాళ్లు ఉన్న టీమ్‌లకు వారంతా తిరిగి రావడం ప్లే ఆఫ్స్ అవకాశాలకు పెద్ద బలంగా మారింది. సాల్ట్, షెఫర్డ్, టిమ్ డేవిడ్‌లతో ఆర్‌సీబీ సంతృప్తిగా కనిపిస్తుండగా... హాజల్‌వుడ్ మాత్రం దూరమయ్యాడు. స్టొయినిస్, ఇన్‌గ్లిస్ విషయంలో పంజాబ్ కింగ్స్‌కు ఇంకా పూర్తి సమాచారం లేదు. ముంబై ఇండియన్స్ తరఫున అంతా అందుబాటులో ఉండగా... ప్రతిష్టాత్మక డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ముందు ఆ్రస్టేలియా కెప్టెన్ కమిన్స్ మిగిలిన మూడు లీగ్ మ్యాచ్‌ల కోసం సన్‌రైజర్స్‌తో చేరడం ఆశ్చర్యకరం!

గెలిస్తే ప్లే ఆఫ్స్‌కు ఆర్‌సీబీ...

సీజన్‌లో జోరు చూపిస్తూ ఎనిమిది విజయాలు సాధించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మరో విజయంపై గురి పెట్టింది. ప్రస్తుతం 16 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న ఆర్‌సీబీ సొంతగడ్డపై గెలిస్తే 18 పాయింట్లతో అధికారికంగా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది. బ్యాటర్లంతా ఫామ్‌లో ఉండటంతో పాటు పదునైన బౌలింగ్‌తో జట్టు బాగా బలంగా కనిపిస్తోంది. బెతెల్, కోహ్లి శుభారంభం అందిస్తుండగా, కెప్టెన్ రజత్ పాటీదార్ వేలి గాయం నుంచి కోలుకొని బరిలోకి దిగుతున్నాడు. భువనేశ్వర్, యశ్ దయాళ్, కృనాల్, సుయాశ్‌లతో బౌలింగ్ కూడా బాగుంది. మరోవైపు కోల్‌కతా పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. ప్రస్తుతం ఆరో స్థానంలో ఉన్న టీమ్ ఖాతాలో 11 పాయింట్లే ఉన్నాయి. మిగిలిన రెండు మ్యాచ్‌లు గెలిచినా... 15 పాయింట్లతో ప్లే ఆఫ్స్ ఖాయమేమీ కాదు. ఇతర ఎన్నో సమీకరణాలతో ముందంజ వేయడం ఆధారపడి ఉంటుంది. కానీ ఈ మ్యాచ్‌లో ఓడితే మాత్రం అధికారికంగా ప్లే ఆఫ్స్ చాన్స్ కోల్పోయిన నాలుగో జట్టుగా కేకేఆర్ నిలుస్తుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

నీరజ్ 90.23 మీటర్లు

- కెరీర్‌లో తొలిసారి 90 మీటర్ల మైలురాయి దాటిన భారత స్టార్
- దోహా డైమండ్ లీగ్ మీట్‌లో రెండో స్థానం ఖరారు



నీరజ్ చోప్రా

దోహా: 90 మీటర్లు... ఇంకెప్పుడు..? ఇంకెప్పుడు..? ఇంకెప్పుడు..? అని కొన్నేళ్లుగా అందరి నుంచి ఎదురవుతున్న ప్రశ్నలకు భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా శుక్రవారం సమాధానం ఇచ్చాడు. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఎట్టకేలకు భారత స్టార్ తన కెరీర్‌లో తొలిసారి 90 మీటర్ల మైలురాయిని అధిగమించాడు. శుక్రవారం ఖతర్ రాజధాని దోహాలో జరిగిన డైమండ్ లీగ్ మీట్‌లో నీరజ్ చోప్రా తన కెరీర్ బెస్ట్ ప్రదర్శనను నమోదు చేశాడు. 27 ఏళ్ల నీరజ్ తన మూడో ప్రయత్నంలో జావెలిన్‌ను 90.23 మీటర్ల దూరం విసిరాడు. ఈ క్రమంలో నీరజ్ తన పేరిటే ఉన్న (2022 స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్ మీట్‌లో 89.94 మీటర్లు) జాతీయ రికార్డును బద్దలు కొట్టాడు. విఖ్యాత కోచ్ జాన్ జెలెజ్నీ వద్ద శిక్షణ ప్రారంభించాక బరిలోకి దిగిన తొలి టోర్నమెంట్‌లోనే నీరజ్ తన అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం విశేషం. 11 మంది మేటి జావెలిన్ త్రోయర్లు పోటీపడ్డ దోహా డైమండ్ లీగ్ మీట్‌లో జూలియన్ వెబెర్ (జర్మనీ; 91.06 మీటర్లు) అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. నీరజ్ చోప్రా (90.23 మీటర్లు) రెండో స్థానం సంపాదించగా... అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా; 86.64 మీటర్లు) మూడో స్థానాన్ని పొందాడు. భారత్‌కే చెందిన కిశోర్ కుమార్ జేనా (78.60 మీటర్లు) ఎనిమిదో స్థానంతో సంతృప్తి పడ్డాడు. డైమండ్ లీగ్ మీట్‌లలో అథ్లెట్లకు పతకాలు బదులుగా పాయింట్లు కేటాయిస్తారు. టాప్–8లో నిలిచిన వారికి వరుసగా 8, 7, 6, 5, 4, 3, 2, 1 పాయింట్లు లభిస్తాయి. వెబెర్‌కు 8 పాయింట్లు, నీరజ్‌కు 7 పాయింట్లు, పీటర్స్‌కు 6 పాయింట్లు దక్కాయి. నిర్ణీత నాలుగు మీట్‌లు ముగిశాక టాప్–7లో నిలిచిన వారు ఫైనల్ మీట్‌లో పోటీపడతారు. సీజన్ తొలి మీట్‌లో నీరజ్ తొలి ప్రయత్నంలో జావెలిన్‌ను 88.44 మీటర్ల దూరం విసిరి శుభారంభం చేశాడు. ఆ తర్వాత రెండో ప్రయత్నంలో అతను ఫౌల్ చేశాడు. మూడో ప్రయత్నంలో నీరజ్ జావెలిన్ 90.23 మీటర్లకు వెళ్లింది. నాలుగో ప్రయత్నంలో నీరజ్ జావెలిన్‌ను 80.56 మీటర్ల దూరం విసరగా... ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. చివరిదైన ఆరో ప్రయత్నంలో నీరజ్ జావెలిన్‌ను 88.20 మీటర్లు విసిరాడు.

3 ఆసియా నుంచి జావెలిన్‌ను 90 మీటర్లకంటే ఎక్కువ దూరం విసిరిన మూడో ప్లేయర్‌గా నీరజ్ చోప్రా గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో అర్షద్ నదీమ్ (పాకిస్తాన్; 92.97 మీటర్లు), చావో సున్ చెంగ్ (చైనీస్ తైపీ; 91.36 మీటర్లు) ఉన్నారు. ఓవరాల్‌గా 25 మంది క్రీడాకారులు జావెలిన్‌ను 90 మీటర్ల కంటే ఎక్కువ దూరం విసిరారు.

నిజంగా డ్రెస్ వేసుకున్నట్లే..!

- వర్చువల్ ట్రై–ఆన్ అప్లికేషన్‌ను ఆవిష్కరించిన ఇద్దరు బాలురు
- ఆన్‌లైన్ షాపింగ్‌లో దుస్తులు ఒంటికి ధరించినట్లుగా అనుభూతి
- మంచిర్యాలకు చెందిన పదోతరగతి విద్యార్థుల ఘనత



అప్లికేషన్‌ను ప్రదర్శిస్తున్న రోహన్ సుధన్వ, సన్నిత్ శెట్టి. (ఇన్‌సెట్‌లో) ఏఐ ప్రాసెస్ చేసిన టీషర్ట్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా నేడు అంతా ఆన్‌లైన్ షాపింగ్ నడుస్తోంది. కస్టమర్లను ఆకర్షించేందుకు ఈ కామర్స్ సంస్థలు కొత్తకొత్త టెక్నాలజీలను ప్రవేశపెడుతున్నాయి. ముఖ్యంగా దుస్తుల ఎంపికలో వర్చువల్ ట్రై–ఆన్ టెక్నాలజీని ఇప్పుడిప్పుడే తెస్తున్నారు. అయితే, మంచిర్యాలకు చెందిన ఇద్దరు బాలురు ఇలాంటి టెక్నాలజీని అభివృద్ధి చేసి ఔరా అనిపించారు. ఇటీవలే పదో తరగతి పూర్తి చేసిన రోహన్ సుధన్వ, సన్నిత్ శెట్టి ఈ అప్లికేషన్‌ను తయారుచేశారు.

డీప్ లెర్నింగ్‌లో అల్గారిథం నేర్చుకుని..

మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన చేనేని తిరుపతి, మాధవీలత కుమారుడు రోహన్ సుధన్వ.. కొప్పుల సునీత, ప్రభాకర్ కుమారుడు సన్నిత్ శెట్టి చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఈ ఏడాదే పదో తరగతి పూర్తి చేశారు. ఆన్‌లైన్‌లో డ్రెస్‌ల ఎంపికలో ఎదురైన ఇబ్బంది వారిని కొత్తగా ఆలోచించేలా చేసింది. నచ్చిన దుస్తులను ఈ కామర్స్ సైట్‌లోనే వర్చువల్‌గా వేసుకొని చూసుకునే టెక్నాలజీల గురించి తెలుసుకొని.. తాము కూడా అలాంటి అప్లికేషన్ తయారుచేయాలని సంకల్పించారు. ఇందుకోసం రెండేళ్లుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డీప్ లెర్నింగ్‌లో వీరు అల్గారిథంలు నేర్చుకున్నారు. పదో తరగతి చదువుకుంటూనే వెబ్‌సైట్లు, యూట్యూబ్‌లో సందేహాలు తీర్చుకుంటూ అనుభవం గల ఐటీ నిపుణులకు దీటుగా పట్టు పెంచుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో 'గ్లోబల్ స్టార్టప్ క్లబ్'నిర్వహించిన ఈవెంట్‌లో వీరి అప్లికేషన్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. దీంతో 'సలిటా'పేరుతో కంపెనీ ఏర్పాటుచేసి సేవలు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎవరైనా పెట్టుబడి పెట్టేందుకు ముందుకొస్తే మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్తామని చెబుతున్నారు.

స్క్రీన్‌షాట్, సెల్ఫీతో..

వీరు రూపొందించిన అప్లికేషన్ వినియోగానికి చాలా అనువుగా ఉంది. ఈ కామర్స్ వెబ్‌సైట్లలో ఏదైనా షర్ట్, ప్యాంట్, షూ ఎంపిక చేసుకొని స్క్రీన్‌షాట్ తీసుకోవాలి. కొనుగోలుదారుడు సెల్ఫీ కూడా తీసుకొని, ఈ రెండు ఫొటోలను సదరు అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేస్తే ఆ డ్రెస్ మనకు ఎలా ఉంటుందో ఫొటో తీసి చూపిస్తుంది. డ్రెస్ రంగు, శరీరానికి తగినట్లుగా, తల, మెడ ఇతర భాగాల్లో ఫిట్టింగ్ వంటి వివరాలను అద్దం ముందు ఆ డ్రెస్‌తో ఉన్నట్లుగా చూపిస్తుంది. దీంతో కొనుగోలుదారులు ఆ వస్తువును కొనాలా? వద్దా? అనేది తేలిగ్గా నిర్ణయించుకోగలరు. దుస్తులతోపాటు ఆభరణాలు, మహిళల మేకప్ వంటివి కూడా ఇందులో చూసుకొనేలా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ అప్లికేషన్ వల్ల వస్తువులను తిప్పి పంపే ఘటనలు తగ్గుతాయని చెబుతున్నారు.

రైలు పట్టాలకూ ఫెన్సింగ్!

- తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన మార్గాల్లో ట్రాక్‌కు ఇరువైపులా...
- వన్యప్రాణులు రాకుండా దక్షిణమధ్య రైల్వే సరికొత్త ఆలోచన
- దాదాపు రూ.3,200 కోట్లు బడ్జెట్ కేటాయించిన దక్షిణ మధ్య రైల్వే

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన మార్గాల్లో రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఫెన్సింగ్ వేసేందుకు దక్షిణ మధ్య రైల్వే సిద్ధమైంది. దాదాపు అన్ని లైన్లను 130 కి.మీ. స్పీడ్‌తో వెళ్లేలా సామర్థ్యం పెంచిన ఈ నేపథ్యంలో ట్రాక్‌పై ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా మూగజీవాలు, వన్యప్రాణులు, పాడిపశువులు, నిరసనలు, ఆత్మహత్యలు, సంఘ విద్రోహ శక్తులు ట్రాక్‌పైకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన మార్గాల్లో మూగజీవాలు, ప్రమాదాల నివారణకు ఫెన్సింగ్, సబ్ వేల నిర్మాణానికి రూ.3,200 కోట్లు కేటాయించింది. వాడి, గుంతకల్, కాజీపేట, కడప, తిరుపతి, గూడూరు తదితర మార్గాల్లో ఫెన్సింగ్ లేదా గోడలు, సబ్‌వేలు నిర్మించాలని ప్రతిపాదించి ఆయా రూట్ల ఆధారంగా నిధులు కూడా విడుదల చేసింది.

స్టీల్, వెదురు, గోడలు

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైలు మార్గాలు అటవీ, పట్టణ ప్రాంతాల గుండా పోతున్నాయి. ఈ క్రమంలో పలు అటవీ జంతువులు వెళ్లే క్రమంలో పట్టాల కింద పడి మరణిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు తదితర పాడి పశువులు ట్రాక్ మీద పడి మరణిస్తున్నాయి. పైగా వందేభారత్ లాంటి హైస్పీడ్ రైళ్ల కోసం దక్షిణమధ్య రైల్వే రెండేళ్ల క్రితమే తన పరిధిలోని అన్ని ప్రధాన మార్గాలలో 130 కి.మీ.పైగా వేగాన్ని తట్టుకునేలా సామర్థ్యాన్ని పెంచింది. దీంతో హైస్పీడ్ రైళ్లు తిరుగుతున్న పట్టాలపై ఎలాంటి జంతువులు, మనుషులు రాకుండా స్టీల్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. జాతీయ రహదారుల సమీపంలో ఉన్న ట్రాక్‌లపై క్రియోసెట్ ఆయిల్‌తో ట్రీట్ చేసిన హెచ్‌డీపీఈ వెదురు బొంగులతో ఫెన్సింగ్ లేదా గోడలు నిర్మించనున్నారు. మరికొన్ని చోట్ల సబ్ వేలు ఏర్పాటు చేస్తారు.

మార్గం	పట్టాల సామర్థ్యం
బెజవాడ–కాజీపేట	130 కి.మీ.
సికింద్రాబాద్ –కాజీపేట	130 కి.మీ.
డోర్నకల్–మణుగూరు	100 కి.మీ.
పెద్దపల్లి–కరీంనగర్	100 కి.మీ.
కరీంనగర్–జగిత్యాల	90 కి.మీ.
తెల్లాపూర్–రామచంద్రాపూర్	100 కి.మీ.
గూడూరు–బెజవాడ	130 కి.మీ.
బెజవాడ–దువ్వాడ	110 కి.మీ.
గుడివాడ–మచిలీపట్నం	100 కి.మీ.
తెనాలి–గుంటూరు	110 కి.మీ.
గుంటూరు–నేలపాడు	110 కి.మీ.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

మా రోదన వినేదెవరు!

వైద్య విద్యార్థుల్లో డిప్రెషన్, ఒత్తిడి

- విద్యార్థుల్లో తీవ్రమైన పోటీ
- సుదీర్ఘ పనిగంటలు, నిరంతర విధులు
- పెరుగుతున్న ఆత్మహత్యలు, డ్రాపౌట్స్
- నేషనల్ మెడికల్ కమిషన్ నివేదికలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వైద్యో నారాయణో హరిః అన్నారు పెద్దలు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య విద్యార్థులు ఒత్తిడి, డిప్రెషన్, కళాశాలల్లో వేధింపులు, విషపూరిత ఆలోచనా విధానాలు, కుటుంబ పరిస్థితులు వెరసి బలవంతంగా తనువు చాలిస్తున్నారు. గత ఐదేళ్లలో దేశంలో 119 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని నేషనల్ మెడికల్ కమిషన్ వెల్లడించింది. ఇందులో ఎంబీబీఎస్ విద్యార్థులు 64 మంది ఉండగా, పీజీలు మరో 55 మంది ఉన్నారు. అదే సమయంలో 160 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు, మరో 956 మంది పీజీ విద్యార్థులు కలిపి మొత్తం 1,116 మంది వైద్య విద్యార్థులు తమ ప్రొఫెషన్ నుంచి తప్పుకున్నట్లు ఆ నివేదికలో పేర్కొంది. దీనికి ప్రధానంగా మానసిక ఒత్తిడి, తమ సమస్యల పట్ల బ్యూరోక్రాట్లు ఉదాసీనంగా వ్యవహరించడం కారణమని అభిప్రాయపడుతున్నారు.

ఎందుకీ పరిస్థితి..

రాష్ట్రంలో మొత్తం 65 మెడికల్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 36 ప్రభుత్వ కళాశాలలు కాగా, మిగిలినవి ప్రైవేటువి. ఏటా సుమారుగా 9 వేల మంది విద్యార్థులు వైద్యులుగా పట్టా (ఎంబీబీఎస్) పొందుతున్నారు. ఎంబీబీఎస్, పీజీ విద్యార్థుల నుంచి వచ్చే ఫిర్యాదులు, వాటి పరిష్కారంపై ఆయా కళాశాలలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్‌కు స.హ చట్టంలో ఇచ్చిన సమాధానంలో ఎన్ఎంసీ స్పష్టం చేసింది. ఈ సమస్య ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా యావత్ దేశంలో ఇదే పరిస్థితి ఉంది. యువ వైద్యుల్లో డిప్రెషన్, ఆందోళన, ఆత్మహత్యా ఆలోచనలు ఎక్కువగా ఉంటున్నాయి. తీవ్రమైన పోటీ, వైద్య కళాశాలల్లో వేధింపులు, తమ బాధను పంచుకునేందుకు ఎవరూ లేరన్న ఒంటరితనం, మానసికంగా క్షోభను అనుభవిస్తున్నారన్న విషయాలు గుర్తించారు. మెడికల్ విద్యార్థుల ఆత్మహత్యలకు అకడమిక్ ఒత్తిళ్లు, తరచూ పరీక్షలు, హై ఎక్స్‌పెక్టేషన్స్ తదితరాలు కారణాలు కనిపిస్తున్నాయి. సాధారణ ప్రజలతో పోల్చితే వైద్య విద్యార్థుల్లో నిరాశ, ఆందోళన, ఆత్మహత్యా ఆలోచనలు అధికంగా ఉన్నాయని ఈ సర్వే స్పష్టం చేస్తోంది.

సిలబస్ విషయంలోనూ రిలాక్సేషన్ ఇవ్వాలి

అకడమిక్ విద్యార్థులు తమ ఫోకస్ కేవలం చదువుపైనే పెడుతున్నారు. ఒత్తిడి ఫీలవుతున్నారు. అలా కాకుండా క్రీడలు, యోగా, శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసాన్ని కలిగించే కార్యక్రమాలు కళాశాలలు ఏర్పాటు చేస్తుండాలి. సిలబస్ విషయంలోనూ కొంత రిలాక్సేషన్ ఇవ్వాలి. పీజీ విద్యార్థుల పనిగంటలు తగ్గించాలి.

– శ్రీనివాస్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు

స్నేహపూర్వక వాతావరణం ఉండాలి



ఎంబీబీఎస్‌లో చేరే విద్యార్థులు ముందుగానే అన్ని విషయాలు తెలుసుకోవాలి. కుటుంబ సభ్యులు, కళాశాలల ఒత్తిడితో ఇష్టం లేకుండా చేరొద్దు. తరువాత ఇబ్బందులు పడొద్దు. ఎన్ఎంసీ 2018లో మెంటర్ మెంటీ చట్టం తెచ్చింది. దీనిప్రకారం కళాశాలలో కొంత మంది విద్యార్థులను టీచింగ్ ఫ్యాకల్టీ దత్తత తీసుకుంటారు. వారితో కష్టం, నష్టం, సంతోషం ఇలా అన్ని విషయాలు షేర్ చేసుకునే విధంగా స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తారు. ఇది అన్ని కళాశాలల్లోనూ కచ్చితంగా అమలు అయ్యే విధంగా చూడాలి. తల్లిదండ్రులు సైతం పిల్లలను పాఠశాల స్థాయి నుంచే మానసికంగా బలంగా తయారు చేయాలి. మార్కులు, ర్యాంకులు వెంట పడి పిల్లల్లో అవగాహన లేకుండా బట్టీ తరహాలో చదివిస్తున్నారు. అది మంచి పద్ధతి కాదు. అవగాహనతో చదవాలి. ప్యాషన్‌తో వైద్య వృత్తిలోకి రావాలి. ఎంబీబీఎస్, పీజీ రిలీవ్ అయ్యాక ఒక్క వైద్యుడిగానే కాకుండా వివిధ కోణాల్లో రాణించాలి. రీసెర్చ్, ఫార్మా రంగాల్లో విశాలమైన అవకాశాలు ఉన్నాయి. వైద్య రంగంలో నిత్య విద్యార్థిగా ఉండాలి. వైద్య సేవలు వేగంగా మారిపోతున్నాయి.

–కిరణ్ మాదాల, మెడికల్ ఎడ్యుకేషన్ కన్వీనర్, ఎన్ఎంసీ రీజనల్ సెంటర్ తెలంగాణ




గ్రామస్తులతో కలిసి సెల్‌టవర్‌ను ప్రారంభిస్తున్న గుల్సన్‌టర్కే

ఆదివాసీ గ్రామంలో సెల్‌టవర్

ప్రారంభించిన సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ గుల్సన్ టర్కే

చర్ల: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ఆదివాసీ పల్లెల్లో అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయని సీఆర్‌పీఎఫ్ 196 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ గుల్సన్ టర్కే తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్ పరిధి పూజారి కాంకేర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను శుక్రవారం అసిస్టెంట్ కమాండెంట్లు రమేశ్ నాయక్, హరిజ్ ప్రేమ్‌జిత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆదివాసీలకు మొబైల్ ఫోన్లు అందజేశాక మాట్లాడారు. ఆదివాసీల అభ్యున్నతికి అవరోధంగా మారిన మావోయిస్టులను తుదముట్టించేందుకు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. విద్య, వైద్యం, సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయడమే కాక రహదారులు నిర్మిస్తున్నాయని వెల్లడించారు. కాగా, తెలిసో తెలియకో మావోయిస్టులకు సహకరించిన ఆదివాసీలు ఇప్పుడు తీరుమార్చుకోవాలని సూచించారు.

'అల్ప్రాజోలం' కేసులో బెయిల్ ఇవ్వలేం: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి మెదక్ జిల్లాలో 132 కిలోల అల్ప్రాజోలం పట్టుబడిన కేసులో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. బెయిల్ మంజూరుకు కారణాలు చూపడంలో పిటిషనర్ విఫలమయ్యారని పేర్కొంది. 'ఎన్‌డీపీఎస్ చట్టం నిర్దేశించిన వాణిజ్య పరిమాణ పరిమితి 100 గ్రాములు. దీనితో పోలిస్తే నేరంలో పట్టుబడిన మత్తు పదార్థం అల్ప్రాజోలం 132 కిలోగ్రాములు చాలా ఎక్కువ పరిమాణం. నేరం తీవ్రత కారణంగా ఇలాంటి కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలంటే బలమైన కారణాలను నిందితుడు కోర్టు ముందుంచాలి. ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 37 ప్రకారం నేరంతో తనకు సంబంధం లేదని, బెయిల్‌పై ఉన్నా ఎలాంటి నేరం చేసే అవకాశం లేదని సహేతుకమైన కారణాలు వెల్లడించాలి. ఆధారాలతో సహా నిందితుడు వాదనలు వినిపించగలిగి, అవి సరైనవే అని కోర్టు నమ్మితేనే బెయిల్ మంజూరుకు అవకాశం ఉంటుంది. 23 నెలలుగా జైలులో ఉన్నాడనేది బెయిల్‌కు అర్హత కాదు' అని కోర్టు అభిప్రాయపడింది. 2016, డిసెంబర్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాలో అక్రమంగా అల్ప్రాజోలం తయారు చేస్తున్న యూనిట్‌పై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్‌ఐ) దాడిచేసి రూ.3.3 కోట్ల విలువైన 132 కిలోల అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో వి.నరేశ్ అనే వ్యక్తి అరెస్టు అయ్యాడు. ఈ కేసుపై విచారణ చేపట్టిన సంగారెడ్డి జిల్లా కోర్టు.. నరేశ్‌కు పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించింది. ఈ క్రమంలో జైలులో ఉన్న నరేశ్ బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. నరేశ్ నుంచి అల్ప్రాజోలం రికవరీ జరగలేదని, ఇతర నిందితుల వాంగ్మూలం ఆధారంగా కేసులో నిందితుడిగా చేర్చారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. బెయిల్‌కు అర్హతలేదంటూ నరేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక సంస్థ ఆహ్వానం

యూకేలోని తమ కొత్త కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఆహ్వానించిన పీడీఎస్ఎల్ సంస్థ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక సంస్థ ఆహ్వానం అందింది. లండన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ ఆటోమొబైల్ ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థ ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్), యూకేలోని వార్విక్ టెక్నాలజీ పార్క్‌లో ఏర్పాటుచేసిన తమ నూతన కేంద్రాన్ని ప్రారంభించాల్సిందిగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. ప్రపంచంలోనే అతిపెద్ద, విలువైన కారు బ్రాండ్ అయిన మైక్లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ వంటి ప్రముఖ ఆటో దిగ్గజాలకు ఈ సంస్థ సేవలు అందిస్తోంది. తమ నూతన కేంద్రం ద్వారా ఆటోమోటివ్ డెవలప్‌మెంట్, టెస్టింగ్ కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు పీడీఎస్ఎల్ సంస్థ పేర్కొంది. ఈ నెల 30వ తేదీన యూకేలోని వార్విక్ యూనివర్సిటీ సైన్స్ పార్క్‌లోని పరిశోధన కేంద్రాన్ని కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు పీడీఎస్ఎల్ సంస్థ కేటీఆర్‌కు శుక్రవారం ఆహ్వానం పంపింది. కేటీఆర్ చేతుల మీదుగా తమ కేంద్రం ప్రారంభం కానుండటం తమకు గర్వకారణమని సంస్థ డైరెక్టర్ క్రాంతి పుప్పాల అన్నారు. కాగా, పీడీఎస్ఎల్ సంస్థ ఆహ్వానించడంపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. తాను వ్యక్తిగతంగా ఈ ప్రారంభోత్సవానికి హాజరవుతానని తెలిపారు.

'కంచ' భూముల్లో సీఎం దొంగలా దొరికిపోయారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, సంజయ్, అనిల్ జాదవ్

సాక్షి, హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రభుత్వ తీరుకు అద్దం పట్టాయని, ఈ భూముల విషయంలో సీఎం దొంగలా దొరికిపోయారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, డాక్టర్ కె. సంజయ్, అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం వీరు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో గుంటనక్కల పాత్ర ఎవరు పోషిస్తున్నారో ప్రజలకు తెలిసిందని, కోర్టు సెలవులు ఉన్నప్పుడు గుంటనక్కల్లా చెట్లు నరికారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా బుద్ధితెచ్చుకోవాలని, కంచ భూముల్లో చెట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ లేవనెత్తిన అంశాలను సెంట్రల్ ఎంపవర్ కమిటీ తన నివేదికలో స్పష్టం చేసిందన్నారు. కంచ భూముల్లో జీవరాశుల మరణాలకు కారణం అయిన రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలని అన్నారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఆర్థిక అవకతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తే.. రూ.పదివేల కోట్ల ఆర్థిక అవకతవకల్లో బీజేపీ ఎంపీ పాత్ర ఉందని కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేయడం లేదని ఆరోపించారు. మరో వైపు ఫైళ్లు క్లియర్ కావాలంటే డబ్బులు తీసుకుంటున్నామని మంత్రి కొండా సురేఖ అనడాన్ని బీఆర్ఎస్ నేతలు ప్రస్తావిస్తూ విస్మయం వ్యక్తం చేశారు.

కథలు అల్లడం మహేశ్వర్‌రెడ్డికి అలవాటు

ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి తాను కూర్చునే నాంపల్లి బీజేపీ ఆఫీసులో ఏం జరుగుతుందో కూడా తెలియదని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. తన సహచర ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీలో ఉంటారో లేదో ఆయనకు తెలియదని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఆ పార్టీలోని ఆరుగురు నేతలు ఒకరి వెనుక ఒకరు గోతులు తీసుకుంటున్నారని, కానీ మహేశ్వర్‌రెడ్డి మాత్రం హైదరాబాద్‌లో కూర్చుని అమాయకంగా సీఎం రేవంత్‌రెడ్డి సీటు గురించి మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. రెండు నెలలకోసారి ఊకదంపుడు సోది చెపుతూ, ఊహకందని కథలు అల్లడం మహేశ్వర్‌రెడ్డికి అలవాటుగా మారిందని, ఆయన కాంగ్రెస్ పార్టీపై శ్రద్ధ తగ్గించి తన పార్టీపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. లేదంటే రాజకీయాలు మానేసి జ్యోతిషాలు చెప్పుకుంటే ఇంకా మంచిదని వ్యాఖ్యానించారు. ఆయన మాటల్లో రేవంత్‌రెడ్డిపై అక్కసు తప్ప ఏమీ కనిపించడం లేదని, ముఖ్యమంత్రి, మంత్రులు కలిసి చేస్తున్న అభివృద్ధి కూడా కనిపించడం లేదని అన్నారు. ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇస్తే మహేశ్వర్‌రెడ్డి గౌరవం పెరుగుతుందని, లేదంటే బీజేపీ ఆస్థాన జ్యోతిష్యుడిగా మిగిలిపోవాల్సి వస్తుందని లక్ష్మణ్‌కుమార్ అన్నారు.







ప్రపంచ సుందరీమణులు పాలమూరులోని పిల్లలమర్రిని చూసి ఫిదా అయ్యారు. ఏళ్ల నాటి చెట్టు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఎక్స్‌పీరియం ఎకో పార్కులో సందడిసందడిగా తిరుగుతూ గ్రూప్ ఫొటో తీసుకున్నారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిని సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.


బీఆర్ఎస్‌కు మతిపోయింది

తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయి కుమార్

సాక్షి, హైదరాబాద్: అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి 2023, డిసెంబర్ 3వ తేదీన కొట్టిన దెబ్బతో.. బీఆర్ఎస్ స్థితి, గతి, మతి పోయాయని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఎద్దేవా చేశారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మిస్‌వరల్డ్ పోటీదారులు రామప్ప దేవాలయానికి వెళ్లినప్పుడు.. ఎవరి కాళ్లు వారే కడుక్కున్నారని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళలు వారి కాళ్లు కడిగినట్టు బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతిపోయిన కేటీఆర్.. ఎర్రగడ్డలో చికిత్స చేయించుకుంటే అందుకు అవసరమయ్యే ఖర్చులను గాంధీభవన్ నుంచి భరిస్తామని చెప్పారు.

బీఆర్ఎస్‌లో ముసలం మొదలైంది

ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్



సాక్షి, హైదరాబాద్: కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయని, బీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలైందని ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ వ్యాఖ్యానించారు. గతంలో ఎప్పుడూ హరీశ్‌రావు ఇంటికి వెళ్లని కేటీఆర్.. ఆయన ఇంటికి వెళ్లడమే కాకుండా రెండు గంటల పాటు చర్చలు జరిపారని పేర్కొన్నారు. ఈ చర్చల మతలబు ఏంటో ప్రజలకు కేటీఆర్ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో హరీశ్‌రావు ఇంట్లో ఫంక్షన్లు జరిగినా కేటీఆర్, ఆయన కుటుంబం దూరంగానే ఉందని గుర్తు చేశారు. ఇంత అకస్మాత్తుగా హరీశ్‌రావుపై కేటీఆర్‌కు ప్రేమ ఎందుకు కలిగిందో అర్థం కావడం లేదన్నారు. చెల్లెలు కవిత ఇప్పటికే.. పార్టీకి వ్యతిరేకంగా బహిరంగ విమర్శలు చేస్తున్నారని, బావ హరీశ్‌రావు కూడా పార్టీ పెడుతున్నాడన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. రాజకీయ ఆధిపత్యం కోసమే కేసీఆర్ కుటుంబం కొట్లాడుతున్నట్టు కనిపిస్తోందని రామచంద్రునాయక్ అభిప్రాయపడ్డారు.

లక్షలాది కుటుంబాలపై ఫీజుల భారం

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలపై ఫీజుల భారం పడుతోందని, ఇప్పటి వరకు ఫీజుల నియంత్రణపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించలేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇంజనీరింగ్ చదువును ఉచితం చేస్తామని, ఫీజులు ప్రభుత్వమే భరిస్తుందన్న సీఎం హామీ ఏమైందని ప్రశ్నించారు. కొన్ని ఇంజనీరింగ్ కాలేజీలు సిండికేట్‌గా మారి.. ప్రజలను మోసం చేస్తున్నాయని శ్రీనివాస్ ఆరోపించారు.

ఆడపడుచులకు అవమానం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆడపడుచులతో మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లు కడిగించడమేమిటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రశ్నించారు. ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించడమే అవమానకరమైతే.. అందులో తెలంగాణ మహిళలను అవమానించడం మరింత దారుణమని వ్యాఖ్యానించారు. మరోవైపు వరంగల్ జిల్లాలో మిస్ వరల్డ్ పోటీదారుల పర్యటన సందర్భంగా.. మొత్తం పూరి గుడిసెలను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

అమెరికాకు కవిత



సాక్షి, హైదరాబాద్: తన కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొనడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అమెరికా బయల్దేరి వెళ్లారు. చిన్న కుమారుడు ఆర్యతో కలిసి ఆమె వెళ్లారు. కవిత ఈ నెల 23 వరకు అమెరికాలో పర్యటించడానికి ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు అనుమతి మంజూరు చేసింది.

రొటేషన్ పద్ధతిలో విధులు వేయండి

- ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ ఉపాధ్యాయులు, లైబ్రేరియన్లకు రొటేషన్ పద్ధతిలో విధులు కేటాయించాలని ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కూకుట్ల యాదయ్య, వై.పాపిరెడ్డి డిమాండ్ చేశారు. బీసీ గురుకుల సొసైటీలో పూర్తిస్థాయిలో బాధ్యతలు కేటాయిస్తున్నారని, దీంతో ఏడాదిపాటు పనిచేయాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. అలాకాకుండా గతంలో అనుసరించిన పద్ధతి ప్రకారం రొటేషన్ విధానంలో విధులు కేటాయిస్తే.. వారికి రోజువారీ కార్యక్రమాలను క్రమ పద్ధతిలో చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు శుక్రవారం బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులును కలిసి వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్లతో కాళ్లు పట్టించుకున్నప్పుడు ఏమైంది ఆత్మగౌరవం?

- కేటీఆర్‌పై భువనగిరి ఎంపీ చామల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: నిత్యం తప్పుడు ప్రచారం చేయడమే ధ్యేయంగా పెట్టుకున్న కేటీఆర్.. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కలెక్టర్లతో కాళ్లు పట్టించుకున్నప్పుడు ఆత్మగౌరవం గుర్తుకురాలేదా? అని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేతలు అల్లం భాస్కర్, శ్రీకాంత్ యాదవ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల పాటు తన ఇంటి ఆడబిడ్డ గురించి తప్ప.. తెలంగాణ ఆడబిడ్డల గురించి పట్టించుకోని కేటీఆర్.. ఇప్పుడు ఆత్మగౌరవం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. మిస్‌వరల్డ్ పోటీదారుల కాళ్లు ఎవరో కడిగారంటూ సోనియాగాంధీకి ట్వీట్ చేయడమేమిటని ప్రశ్నించారు. మార్ఫింగ్ వీడియోలు, కొన్ని యూట్యూబ్ చానల్స్ ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని ఎంపీ చామల కిరణ్‌రెడ్డి ఆరోపించారు.

మంత్రి శ్రీధర్‌బాబుది మనువాద భావజాలం

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



సాక్షి, హైదరాబాద్: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుది మనువాద భావజాలమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య విమర్శించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలోని ముక్తేశ్వరాలయంలో దళిత ఎంపీ గడ్డం వంశీకృష్ణను అవమానించారని, మంత్రి శ్రీధర్‌బాబుకు దళితులంటే చిన్నచూపని శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మంత్రిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, మంత్రివర్గం నుంచి బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

మర్కటంగారి.. పానీ కహానీ..



ఏమిటో ఈ ఎండ..



అరెరే నీళ్లు రాలేదే..

ఎండ దెబ్బకు రారెత్తిపోయిన ఓ మర్కటం దప్పిక తీర్చుకునేందుకు నానాపాట్లు పడింది. నీళ్ల ట్యాంక్‌పై కూర్చుని ఇది ప్రదర్శించిన హావభావాలు చూసినవారు కాసేపు ఆశ్చర్యచకితులయ్యారు. భక్తులు ఇచ్చిన ఆహారం తాపీగా తినేసిన తర్వాత ఎవరైనా గుక్కెడు నీళ్లు పోయక పోరా అని ఎదురుచూసింది. అంతలోనే ఇక లాభం లేదనుకుని ట్యాంక్ వద్ద కుప్పిగంతులేసి ఓ కుళాయి తిప్పి దాహం తీర్చుకుంది. ఈ దృశ్యాలు ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలో 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

- కొనకనమిట్ల



ట్యాప్ తిప్పితే పోలా..



హమ్మయ్యా దప్పిక తీరింది

ముద్దొస్తున్న మే పుష్పాలు



చూడ చక్కటి వర్ణం, ఆకారంతో అందరినీ ఆకర్షించే మే పుష్పాలు తెగ ముద్దొస్తున్నాయి. ఏడాదంతా ఈ పూలు వికసించవు. సంవత్సరంలో ఒకసారి మాత్రమే అతిథిలా వచ్చి ఆకర్షిస్తుంటాయి. గుబురుగా బంతి ఆకారంలో ఎర్రటి వర్ణంలో ఉండే ఈ పుష్పాలు అల్లూరి జిల్లా కించాయిపుట్టులో వనంలా విరబూశాయి.

- ముంచంగిపుట్టు

అయోమయంలో ప్రభుత్వ పాఠశాలల భవితవ్యం

ఉపాధ్యాయ సంఘాల ఆవేదన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల భవితవ్యంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యా విధానాల్లో ఇటీవల ప్రభుత్వ నిర్ణయాలు, అయోమయ పరిస్థితులు రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహానికి గురవుతున్నాయి.

తెలుగు మాధ్యమం తప్పనిసరి

తాజా జీవో నం.21ని సవరించి ప్రతి పాఠశాలలో తెలుగు మాధ్యమం తప్పనిసరి చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 117 రద్దు ఉత్తర్వులు సమస్యలను తెచ్చిపెడుతున్నాయన్నారు.

టీఎన్‌యూఎస్ డిమాండ్ కూడా ఇదే..

ప్రాథమిక పాఠశాల స్థాయిలో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియంను తప్పనిసరిగా ఉంచాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. లేదంటే ప్రభుత్వ స్కూళ్లల్లో డ్రాప్ అవుట్స్ పెరిగే అవకాశం ఉందని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామశెట్టి వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉద్యమం: ఏపీటీఎఫ్

ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తోందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి పేర్కొన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ, శుక్రవారం నుంచి 20 వరకు ఉద్యమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

పాఠశాల విద్య నిర్వీర్యం: ఏపీఎస్టీఏ

సంస్కరణల పేరుతో అమలుచేస్తున్న అశాస్త్రీయ నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అవుతోందని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేసి ఒక్కో పాఠశాలకు ఒక్కో నిబంధన విధించి ఉపాధ్యాయులను కేటాయించడం సరైంది కాదన్నారు.

ప్రయోగాలు వద్దు: ఆప్టా

జీవో నం.117 రద్దు చేస్తూ తీసుకొచ్చిన కొత్త విధానాలు అసంబద్ధంగా ఉన్నాయని, వాటిలో మార్పులు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాష్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలి

పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పారదర్శకంగా అమలు చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దీ బాబురాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకునేలా 'లేపాక్షి' ఆధునికీకరణ

చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

సాక్షి, అమరావతి: ఆకట్టుకునే హస్తకళల ఆకృతులతో లేపాక్షి విక్రయ కేంద్రాలను ఆధునికీకరించనున్నట్లు చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తెలిపారు. సాంప్రదాయకతకు పెద్దపీట వేస్తూనే ఆధునిక షోరూమ్‌లకు రూపకల్పన చేస్తున్నామని, ఇందుకోసం స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌తో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. విజయవాడ లేపాక్షి కేంద్ర కార్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ప్రతినిధులతో కలిసి వివిధ షోరూమ్‌ల నూతన డిజైన్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఢిల్లీ, రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుల్లో ఏర్పాటు చేస్తున్న నూతన షోరూమ్ డిజైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆప్కో షోరూమ్‌లు లాభాల బాట పట్టేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మధుమేహుల కోసం 'స్మార్ట్ కుక్కర్'

డయాబెటిస్, ఊబకాయాన్ని దరిచేరనీయదు

- గ్లైసెమిక్ ఇండెక్స్‌కు చెక్ పెట్టే అరుదైన సాంకేతికత
- ఎక్కడి నుంచైనా నియంత్రించే టెక్నాలజీ
- బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ
- ప్రపంచంలోనే పేటెంట్ హక్కు పొందిన తొలి కుక్కర్
- త్వరలో మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు





సాక్షి, అమరావతి: మధుమేహ బాధితులూ ఇకపై మీరంతా అధికంగా కార్బోహైడ్రేట్స్ ఉండే ఆహారాన్ని నిశ్చింతగా తినేయొచ్చు. ఊబకాయులు సైతం కార్బోహైడ్రేట్స్‌ను ఎంత కావాలంటే అంత లాగించేయొచ్చు. అవును.. మీరు వింటున్నది నిజమే. అదెలా సాధ్యమని ఆశ్చర్యపోకండి. ఆహారంలో గ్లైసెమిగ్ ఇండెక్స్ (జీఐ)ను అదుపులో ఉంచే స్మార్ట్ కుక్కర్ సిద్ధమైంది. బాపట్లలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్ శాస్త్రవేత్తలు మూడేళ్లపాటు శ్రమించి అభివృద్ధి చేసిన ఈ వినూత్న ఆవిష్కరణ త్వరలోనే మార్కెట్‌లోకి రాబోతోంది. ప్రపంచంలోనే తొలి స్మార్ట్ కుక్కర్‌గా పేటెంట్ సైతం దీనికి లభించింది.

గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయిని తగ్గించడమే లక్ష్యంగా..

గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) మనం తీసుకునే ఆహారంలో 55% కంటే తక్కువగా ఉంటే రక్తంలో సుగర్ అత్యంత నిదానంగా పెరుగుతాయి. జీఐ 56–70% మధ్య ఉంటే నెమ్మదిగా.. 70% పైబడి ఉంటే వేగంగా పెరుగుతాయి. రక్తంలో చక్కెర పాళ్లు పరిమితికి మించి పెరిగితే క్లోమ గ్రంధి (పాంక్రియాస్)పనితీరు మందగించి ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. ఇది డయాబెటిస్‌కు దారితీస్తుంది. ప్రస్తుత పరస్థితుల్లో పెద్దల్లోనేకాదు.. పిల్లల్లోనూ టైప్–1 డయాబెటిస్ విపరీతంగా పెర గడానికి కారణమవుతున్న ఆహారంలో గ్లైసెమిక్ ఇండెక్స్‌ను నియంత్రించాలన్న సంకల్పంతో బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్ బయో కెమిస్ట్రీ శాస్త్రవేత్త డి.సందీప్‌రాజా నేతృత్వంలో డాక్టర్ బీవీఎస్ ప్రసాద్, వి.వాసుదేవరావు, ఎల్.ఏడుకొండలుతో కూడిన శాస్త్రవేత్తల బృందం మూడేళ్లపాటు చేసిన పరిశోధన ఎట్టకేలకు ఫలించింది. ఎలాంటి వరి రకమైనా సరే ప్రాసెసింగ్ ట్రీట్‌మెంట్ ద్వారా వాటిలోని జీఐ స్థాయిలను తగ్గించి ఆహారం నెమ్మదిగా జీర్ణమయ్యేలా అభివృద్ధి చేసిన స్మార్ట్ కుక్కర్ ఆహార రంగంలో విప్లవమే.



ఇది ఎలా పనిచేస్తుందంటే..

ప్రాసెసింగ్ ట్రీట్‌మెంట్ ద్వారా జీఐను తగ్గించడమే లక్ష్యంగా ఈ స్మార్ట్ రైస్ కుక్కర్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో బియ్యాన్ని స్టీమింగ్ ప్రక్రియ ద్వారా ఉడికిస్తారు. గంజిని సోలనాయిడ్ వాల్వ్ ద్వారా వేరు చేస్తారు. తర్వాత అన్నం వేగంగా చల్లబడే (ర్యాపిడ్ కూలింగ్) చాంబర్‌లోకి పంపి 1–2 డిగ్రీల సెల్సియస్‌లో ప్రాసెస్ చేస్తారు. శాస్త్రీయంగా చెప్పాలంటే ఈ ప్రక్రియలో బియ్యాన్ని రీట్రో గ్రేడ్ చేయడం (అన్నేలింగ్, హీట్ మాయిశ్చర్ ట్రీట్‌మెంట్ (హెచ్‌ఎంటీ) ద్వారా అన్నంలో ఉండే స్టార్చ్ (పిండి పదార్థం)లో 20 నిమిషాల్లో జీర్ణమయ్యే పదార్థం (ర్యాపిడ్లీ డైజెస్టబుల్ స్టార్చ్–ఆర్‌డీఎస్)ను 90 నిముషాల్లో నెమ్మదిగా జీర్ణయ్యే పదార్థం (స్లో డైజెస్టబుల్ స్టార్చ్–ఎస్‌డీఎస్)గా మారుస్తుంది. దీంతోపాటు అన్నంలో రెసిస్టెంట్ స్టార్చ్ పెరుగుతుంది. ఇది అసలు జీర్ణమవకుండా డైటరీ ఫైబర్‌లా ప్రవర్తించేలా ఒక రకమైన పిండి పదార్థం. బియ్యాన్ని వండే సమయంలో అదనపు పానీడు తీసేయడంతో కొంత స్టార్చ్ తగ్గిపోతుంది. ఈ స్మార్ట్ కుక్కర్‌లో వండితే 45% ఆర్‌డీఎస్‌ను ఎస్‌డీఎస్‌గా మార్చి ఆర్‌ఎస్‌ను 121% శాతానికి పెంచుతుంది. ఫలితంగా గ్లైసెమిక్ ఇండెక్స్ 22% వరకు తగ్గిపోతుంది. ఇలా వండిన అన్నం సాధారణ అన్నం లాగే ఉంటుంది. సాధారణంగా వండే అన్నానికి ఉన్నట్టుగానే రంగు, రుచి, వాసనలు పాడవకుండా ఉంటుంది.

ప్రపంచంలోనే తొలి డయాబెటిస్ రైస్ కుక్కర్

ఇది పూర్తిగా స్మార్ట్ కంట్రోల్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) ఇంటిగ్రేషన్‌తో పనిచేస్తుంది. ఐవోటీ కంట్రోల్ రిమోట్ (మొబైల్ యాప్) ద్వారా ఎంతదూరం నుంచైనా దీనిని నియంత్రించవచ్చు. కేవలం ఒక కమాండ్ ఇస్తే చాలు ఇంట్లో అన్నం నిర్ణయించిన సమాయనికి రెడీ అయి ఉండేలా సెట్ చేసుకోవచ్చు. రైస్ వేరియంట్, బియ్యం–నీరు నిష్పత్తి, వండే ఉష్ణోగ్రత, చల్లదనం, స్టీమింగ్ సమయం వంటి వాటిని మొబైల్ ద్వారానే సెట్ చేసేలా ఏర్పాటు చేశారు. మనం పెట్టే బియ్యం రకం ఆధారంగా దానికి అవసరమైన నీటి నిష్పత్తి, ఉడికే ఉష్ణోగ్రత, ఉడికే సమయం, చల్లబడే ఉష్ణోగ్రత, చల్లబడే కాలం, స్టీమింగ్‌కు అవసరమైన సమయం, వంటి అంశాలను కూడా ప్రత్యేక అల్గారిథం ద్వారా స్వయం చాలకంగా నియంత్రించబడతాయి. 2022లో ప్రారంభమైన ఈ పరిశోధనకు మూడేళ్ల సమయం పట్టింది. ఈ పరిశోధన పూర్తిగా బాపట్లలోనే జరిగింది. ఫ్యాబ్రికేషన్ కోసం కోయంబత్తురులోని ఓ కంపెనీ సహకారం తీసుకున్నారు. ఈ వినూత్నమైన రైస్ కుక్కర్‌కు గత నెలలోనే భారత ప్రభుత్వం నుంచి పేటెంట్ హక్కు (405194–001) లభించింది.

డయాబెటిస్ రోగులకు ఎంతో ఉపయోగం



స్మార్ట్ రైస్ కుక్కర్‌లో వండిన అన్నం తినడం వల్ల రక్తంలోని సుగర్ స్థాయిలను పూర్తిగా నియంత్రించవచ్చు. నిధానంగా జీర్ణమవడం వల్ల మళ్లీ ఆకలి వేయడానికి సమయం పడుతుంది. తక్కువ కేలరీలు తీసుకోవడం వల్ల శరీర బరువును కంట్రోల్ చేస్తుంది. శరీరంలోని శక్తి పెరగడమే కాకుండా అలసట తగ్గుతుంది. రోజంతా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది. త్వరలోనే ఈ స్మార్ట్ రైస్ కుక్కర్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందుకోసం ఒక కంపెనీతో ఎంవోయూ చేసుకోబోతున్నాం. గతంలో నేను అభివృద్ధి చేసిన అఫ్లాటాక్సిన్‌ను కనుగొనే ఒక రాపిడ్ కిట్‌తో పాటు అతి తక్కువ ధరలోనే గ్లైసెమిక్ ఇండెక్స్‌ను తగ్గించేలా తయారు చేసిన కిట్‌కు పేటెంట్ హక్కులు లభించాయి. వరుసగా మూడో ఆవిష్కరణకు పేటెంట్ హక్కు రావడం ఆనందంగా ఉంది.

– డాక్టర్ దోనేపూడి సందీప్ రాజా, బయో కెమిస్ట్రీ శాస్త్రవేత్త, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల

నష్టాల్లో మగ్గుతున్న మామిడి రైతు

50 శాతం పతనమైన ధర

- బంగినిపల్లి, తోతాపురి ధరల క్షీణత
- దిగుబడి తగ్గినా.. ధర పెరగని పరిస్థితి
- అకాల వర్షాలు, తెగుళ్లతో నాణ్యతలేమి
- తీవ్ర నష్టాల్లో మామిడి రైతులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: నూజివీడు మామిడికి కళ తప్పింది. సాధారణంగా దిగుబడి తగ్గితే పంట ధర పెరుగుతుంది. కానీ మామిడి విషయంలో దిగుబడితో పాటు ధరలు కూడా భారీగా పతనమయ్యాయి. తెగుళ్లతో నాణ్యత పడిపోవడం దీనికి ఒక కారణంకాగా, ఈ పరిస్థితిని లాభంగా మార్చుకుంటున్న సిండికేట్ వైఖరి మరో కారణం.

'సాగు' క్షీణత

ఏలూరు జిల్లాలో నూజివీడు, చింతలపూడి నియోజకవర్గాల్లో మామిడి సాగు గణనీయంగా ఉంది. నూజివీడు మామిడికి దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయంగాను మంచి డిమాండ్ ఉంటుంది. మూడేళ్ల క్రితం అమెరికాకు కూడా మామిడి ఎగుమతి చేసిన పరిస్థితి. జిల్లాలో 15 ఏళ్ల క్రితం వరకు 80 నుంచి లక్ష ఎకరాల్లో విస్తరించి ఉన్న మామిడి సాగు వరుస నష్టాలు, తుపానుల ధాటికి క్రమంగా తగ్గుతూ, ప్రస్తుతం 52 వేల ఎకరాలకు పడిపోయింది. ఈ సీజన్‌కు సంబంధించి గత డిసెంబర్‌లో మంచి పూత వచ్చినా నల్లతామర తెగులుతో సుమారు 60 నుంచి 70 శాతం మేర దిగుబడి తగ్గిపోయింది. జిల్లాలో ప్రధానంగా బంగినపల్లి, తోతాపురి (కలెక్టర్ కాయలు), చిన్నరసాలు, పెద్దరసాల సాగు అధికంగా ఉంటుంది.

దేశీయ మార్కెట్‌కే పరిమితం

ఈ ఏడాది జిల్లాలో 1.35 లక్షల టన్నుల దిగుబడి అంచనా కాగా, తెగుళ్ల ధాటికి 50 వేల టన్నులకే పరిమితమైంది. ప్రధానంగా బంగినపల్లి, తోతాపురిలు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌తో పాటు ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు అవుతుండగా చిన్నరసాలు, పెద్దరసాలు రాష్ట్రంలో విక్రయాలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో గతేడాది బంగినపల్లి రకం టన్ను రూ.25 వేల నుంచి రూ.30 వేలు, తోతాపురి టన్ను రూ.13 వేల నుంచి రూ.15 వేల ధరకు విక్రయించారు. అయితే ఈ ఏడాది సీజన్ ప్రారంభమైన మార్చిలో పంట దిగుబడి లేకపోవడంతో బంగినపల్లి రకం టన్ను ధర రూ.80 నుంచి రూ.లక్ష వరకు పలికి, క్రమక్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ.15 వేలకు చేరింది. అలాగే తోతాపురి కూడా ప్రారంభంలో అత్యధికంగా రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పలికిన ధర ప్రస్తుతం రూ.8 వేలకు వేలకే పరిమితమైంది.

మార్కెట్‌లో తగ్గిన హవా

ఏటా మార్చి నెలాఖరు నుంచి మే నెలాఖరు వరకు నూజివీడు మామిడి విజయవాడ మ్యాంగో మార్కెట్ ద్వారా ఎగుమతులు జరుగుతుంటాయి. ప్రధానంగా నూజివీడు వెరైటీకి మహారాష్ట్ర, గుజరాత్‌లో మంచి డిమాండ్ ఉండటంతో అక్కడ వ్యాపారులు ప్రత్యేకంగా స్థానిక మార్కెట్‌లో కొనుగోలు చేసే పరిస్థితి. అయితే ప్రస్తుత పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉండటంతో దేశీయ మార్కెట్‌లో నూజివీడు హవా పూర్తిగా తగ్గి తెలంగాణ, ఉలవపాడు మామిడికి కొంత డిమాండ్ పెరిగింది.

తీవ్ర నష్టం



ఈ ఏడాది మామిడి తోటల వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అసలే దిగుబడి తక్కువ ఉండగా వరుసగా గాలిదుమ్ములు, వర్షాలు పడటంతో కాయలు రాలిపోవడం, ఉన్న కాయలు నాణ్యత కోల్పోవడం జరిగింది. ఎరువులు, పురుగు మందులకు పెట్టిన పెట్టుబడులు రాలేదు.

–మందపాటి రఘుపతిరెడ్డి, సి.గుడిపాడు, చాట్రాయి మండలం

పెట్టుబడీ.. రాదు



నాకు మూడు ఎకరాలు మామిడి తోట ఉంది. ఈ ఏడాది వచ్చిన మామిడి పూతను చూసి ధైర్యంతో అప్పులు తెచ్చి ఎకరానికి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాం. సంక్రాంతి తర్వాత నల్లతామర ఆశించడంతో పూతంతా మాడిపోయింది. ప్రస్తుతం నష్టం వచ్చే పరిస్థితి ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

–గుండ్ల హనుమంతరావు, అడవి నెక్కలం, ఆగిరిపల్లి మండలం

20 ఏళ్లలో ఎన్నడూ లేదు



బంగినపల్లి, తోతాపురి ధరలు పూర్తిగా పతనమయ్యాయి. ఏమాత్రం నాణ్యత లేకపోయినా మార్కెట్‌లో కాయలను దించుకోవడం లేదు. తెగుళ్ల, అకాల వర్షాల వల్ల కాయలు నాణ్యత కోల్పోయాయి. మామిడికి ఇలాంటి పరిస్థితులు 20 ఏళ్లలో ఎన్నడూ లేవు.

–పెదగమ్మళ్ల ఆదినారాయణ, మామిడి వ్యాపారి, నూజివీడు

దివ్యాంగుల గుర్తింపు కార్డులకు కేంద్రం చర్యలు

మంత్రి బాల వీరాంజనేయస్వామి



సాక్షి, అమరావతి: కేంద్రం దివ్యాంగులకు గుర్తింపు కార్డులు అందింస్తోందని, రాష్ట్రంలో చర్యలు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమంపై అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సదరం ధ్రువపత్రాలు, పీఎంజేఏవై వందన వయో వృద్ధుల హెల్త్ స్కీమ్‌పై మంత్రి చర్చించారు. గ్రామ సచివాలయాలు, మీసేవ కేంద్రాలతోపాటు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సదరం స్లాట్ బుకింగ్‌కు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న రోజు నుంచి నెలలోపు సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. సుదూర ప్రాంతాలు, గిరిజన తండాల నుంచి వచ్చే దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా సదరం క్యాంపులు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ పీఎంజేఏవై వందన స్కీమ్ ద్వారా రూ.5 లక్షల ఉచిత వైద్యం అందుతుందని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వెల్లడించారు.

సచివాలయంలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

సాక్షి, అమరావతి: ఉగ్రవాద దాడులను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఆక్టోపస్ బలగాలు వెలగపూడిలోని సచివాలయంలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించాయి. విపత్కర పరిస్థితుల్లో ఉగ్రవాద, సంఘ విద్రోహ శక్తులను అణచివేయడం, వారి దాడులను తిప్పికొట్టే తీరును ప్రదర్శించాయి. గుంటూరు ఎస్పీ సతీశ్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ మాక్ డ్రిల్‌లో ఆక్టోపస్ బలగాలతోపాటు గుంటూరు జిల్లా పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

100 లీటర్ల నాటుసారా స్వాధీనం

సోంపేట: శ్రీకాకుళం జిల్లా సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం 100 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ జీవీ రమణ తెలిపారు. మండలంలోని బకుడ గ్రామంలో సవర లక్ష్మి వద్ద 70 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రాగుపురం గ్రామంలో 30 లీటర్ల నాటు సారాతో నర్తు హేమరాజును అదుపులోకి తీసుకున్నారు.

సుప్రీంకు రాష్ట్రపతి ప్రశ్నలపై మీ వైఖరేంటి?

కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన సీపీఎం

సాక్షి, అమరావతి: రాష్ట్రాల హక్కులను కాపాడేలా సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును నిర్వీర్యం చేసేందుకు కేంద్రం రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టుకు ప్రశ్నలు సంధింపచేయడం గర్హనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలపై గవర్నర్‌లు దొడ్డిదారిన పెత్తనం చేసే విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామిక శక్తులన్నీ ఐక్యంగా నిలవాలన్నారు. సుప్రీంకు రాష్ట్రపతి ప్రశ్నలపై వైఖరిని స్పష్టం చేయాలని టీడీపీని డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తరఫున సుప్రీం కోర్టుకు తమ వైఖరిని తెలపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చేసే వైఖరిని కేంద్రం విడనాడాలని హితవు పలికారు.

ఆస్ట్రానమి

గ్రహాలపై వర్షం!



వర్షం అంటే ఏంటి? ఆకాశం నుండి నీటి బిందువుల రూపంలో భూమి మీద పడే ఒక సహజమైన వాతావరణ క్రియే కదా. అయితే భూగ్రహం మీద నీటి చినుకుల్లా కురిసే వర్షం, మన సౌరకుటుంబంలో ఒక్కో గ్రహం మీద ఒక్కో విధంగా, విచిత్రంగా కురుస్తుంది. ఇప్పుడు వివిధ గ్రహాలపై వర్షం ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

బుధుడు (Mercury): బుధుడికి వాతావరణం లేదు కాబట్టి వర్షం పడదు. అయితే, సూర్యుడి తీవ్ర వేడితో లోహాలు ఆవిరై, సూక్ష్మ చినుకుల్లా కనిపించవచ్చు.

శుక్రుడు (Venus): శుక్రుడిపై సల్ఫ్యూరిక్ ఆమ్ల వర్షం కురుస్తుంది. కానీ, శుక్రుడిపై ఉండే తీవ్రమైన 460సెఇ ఉష్ణోగ్రత వల్ల ఈ చినుకులు నేలను తాకే ముందే ఆవిరైపోతాయి.

చంద్రుడు (Moon): చంద్రుడికి వాతావరణం లేనందున వర్షం కురవదు. కానీ, సూక్ష్మ ఉల్కల ధూళి వర్షంలా పడతాయి.

అంగారకుడు (Mars): అంగారకుడిపై నీరు మంచు రూపంలో ఉంటుంది, కాబట్టి నీటి వర్షం ఉండదు. మంచు, ధూళి తుఫానులు కొన్నిసార్లు చిన్న చిన్న చినుకుల్లా కనిపిస్తాయి.

బృహస్పతి (Jupiter): బృహస్పతి అనేది ఈ గ్యాస్ గ్రహం. దీనిపైన వర్షం అమ్మోనియా, మీథేన్ రూపంలో కురుస్తుంది. అంతేకాకుండా ఇక్కడ లోతైన వాతావరణంలో అధిక ఒత్తిడి కారణంగా వజ్రాల వర్షం కూడా సాధ్యమని శాస్త్రవేత్తలు అంటున్నారు!

శని (Saturn): శని గ్రహంపై వర్షం మీథేన్, అమ్మోనియాగా కురుస్తుంది. శని యొక్క ఉంగరాల నుండి మంచు రేణువులు గ్రహంపై వర్షంలా పడతాయి.

యురేనస్, నెప్ట్యూన్: గ్రహాలపై వర్షం భూమిపై నీటి వర్షంలా కాదు, అద్భుతంగా ఉంటుంది! ఈ గ్రహాల వాతావరణంలో మీథేన్ గ్యాస్ చల్లగా ఉన్న ఎగువ పొరల్లో ద్రవ చినుకులుగా లేదా మంచు రవ్వలుగా మారి వర్షంలా కురుస్తుంది. లోతైన పొరల్లో, తీవ్ర ఒత్తిడి, వేడిమి వల్ల మీథేన్ కార్బన్‌గా విడిపోయి, వజ్రాల వర్షంగా పడవచ్చు! ఈ గ్రహాలపై నేల లేనందున, వర్షం గాలిలోనే తేలుతూ ఉంటుంద. పిల్లలకు ఇది నక్షత్రాల్లా మెరిసే వర్షంలా కనిపిస్తుంది!

● మహనీయులు

కన్నెగంటి హనుమంతు



బ్రిటిష్ వారి ప్రలోభాలకు లొంగని వీరుడు... కన్నెగంటి హనుమంతు

పిల్లలూ! మన దేశానికి బ్రిటిష్ వారి నుంచి స్వాతంత్ర్యం అందించేందుకు ఎంతోమంది సమరయోధులు పోరాటాలు చేశారు. కొందరు జాతీయోద్యమంలో చేరగా, మరికొందరు స్థానికంగా ఉంటూ బ్రిటిష్ వారి దురాగతాలను ఎదిరించారు. అలాంటివారిలో ఒకరు కన్నెగంటి హనుమంతు. ఆయన చూపిన ధైర్యసాహసాలను నేటికీ ప్రజలు గుర్తుచేసుకుంటారు.

గుంటూరు జిల్లాలో పల్నాడుగా ప్రసిద్ధి చెందిన గురజాల, మాచర్ల, వినుకొండ, నరసరావుపేట ప్రాంతాలు బ్రిటిషర్ల కాలంలో కరువుకు నిలయంగా ఉండేవి. పంటలు పండకపోయినా బ్రిటిష్ ప్రభుత్వం అక్కడ ప్రజలు నుంచి బలవంతంగా శిస్తు వసూలు చేసేది. పశువులను మేపేందుకు ప్రజలు అడవులపై ఆధారపడేవారు. ఇందుకోసం ఏడాదికి రూ.2 చొప్పున చెల్లించేవారు. దాన్ని 'పుల్లరి' అని పిలిచేవారు. అలాంటి పరిస్థితుల్లో దుర్గి మండలం మించాలపాడులో 1870లో కన్నెగంటి హనుమంతు జన్మించారు. తల్లి అచ్చమ్మ, తండ్రి వెంకటప్పయ్య. వారిది ధనిక కుటుంబం.

చిన్ననాటి నుంచి తన చుట్టూ జరుగుతున్న పరిస్థితులను చూస్తూ పెరిగిన హనుమంతు వాటిని అరికట్టాలని ప్రయత్నించేవారు. 1921లో దేశంలో సహాయ నిరాకరణోద్యమ సమయంలో మించాలపాడు కేంద్రంగా హనుమంతు ఆ ఉద్యమాన్ని నడిపారు. ఆయన్ని అడ్డుకోవాలని స్థానిక జమీందారులు, బ్రిటిష్ అధికారులు ప్రయత్నించినా ఆయన లొంగలేదు. మద్రాసు నుంచి ప్రత్యేక కలెక్టర్‌గా వచ్చిన రూథర్‌ఫర్డ్ హనుమంతును ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించారు. 45 గ్రామాలను కలిపి ఎస్టేట్‌గా మార్చి జమీందారును చేస్తామని ఆశపెట్టారు. కానీ ఆయన అంగీకరించలేదు.

ప్రభుత్వానికి ప్రజలు పుల్లరి చెల్లించనవసరం లేదని హనుమంతు ఉద్యమాన్ని లేవదీశారు. దీంతో బ్రిటిష్ అధికారులు ఆగ్రహించారు. తమకు పుల్లరి చెల్లించకుంటే ఊరిలోని పశువులన్నిటినీ తోలుకెళతామని హెచ్చరికలు జారీ చేశారు. 1922 ఫిబ్రవరి 22న జరిగిన పోరాటంలో హనుమంతుపై పోలీసులు 26 సార్లు కాల్పులు జరిపారు. వందేమాతరం అంటూ నినాదాలు చేస్తూనే హనుమంతు కన్నుమూశారు.

● మీకు తెలుసా?


ఆక్రిట్ ప్రణ్ జస్వాల్

ఏడేళ్లకే ఆపరేషన్ చేశాడు!

1993లో హిమాచల్ ప్రదేశ్‌లోని నూర్పూర్‌లో జన్మించిన ఆక్రిట్ ప్రణ్ జస్వాల్, చిన్న వయసులోనే అసాధారణ తెలివి చూపించాడు. 10 నెలలకే నడవడం, మాట్లాడడం మొదలుపెట్టాడు; రెండేళ్లకు చదవడం, రాయడం నేర్చుకున్నాడు. ఐదేళ్ల వయసులో షేక్‌స్పియర్, శాస్త్రీయ పుస్తకాలు చదివాడు. ఏడేళ్ల వయసున్నప్పుడు, అతను తన


ఓప్రా విన్‌ఫ్రే షోలో ఆక్రిట్

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఒక నిరుపేద కుటుంబానికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక చేతిపై శస్త్రచికిత్స చేసి, కాలిన గాయం వల్ల అతుక్కుపోయిన వేళ్లను విడదీసాడు. ఈ ఒక గంటపాటు జరిగిన ఆపరేషన్ విజయవంతమై, అతన్ని ''ప్రపంచంలోనే అతి చిన్న సర్జన్''గా చేసింది. ఆ సర్జరీ వీడియో యూట్యూబ్‌లో వైరల్ అయింది. 2007లో ఓప్రా విన్‌ఫ్రే షోలో ''లిటిల్ జీనియస్''గా కనిపించాడు ఆక్రిట్. 12 ఏళ్లలో చండీగఢ్ యూనివర్సిటీలో సైన్స్ డిగ్రీ, 17 ఏళ్లలో కెమిస్ట్రీలో మాస్టర్స్ చేశాడు. క్యాన్సర్ రోగుల బాధలు చూసి, చిన్నప్పటి నుండి క్యాన్సర్ నివారణ కనుగొనాలని కలలు కన్నాడు. ఓరల్ జీన్ థెరపీపై పరిశోధన చేస్తూ, ఆక్రిట్ సైన్స్ ద్వారా ప్రపంచాన్ని మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. అతని కథ ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఇంతటి మేధోశక్తి కలిగిన ఆక్రిట్ IQ 146.

● ఇన్వెన్షన్

ఎరేజర్ అను రబ్బర్ కథ



పెన్సిల్‌తో పేపర్‌పైన రాసిన దాన్ని తుడిపేయాలంటే రబ్బర్ కావాలి. దీన్నే 'ఎరేజర్'(ఉట్చుట్చట) అని అంటారు. అయితే ఒకప్పుడు రబ్బర్ లేదు. 1770 ప్రాంతంలో ఇలా అక్షరాలను తుడిచేయాలంటే తినే బ్రెడ్డును వాడేవారు. దానికన్నా ముందు మైనం, తేలికపాటి రాళ్లను పెన్సిల్ మరకల్ని చెరిపేందుకు వాడేవారు. ఆ తర్వాత జోసెఫ్ ప్రీస్ట్‌లే అనే రసాయన శాస్త్రవేత్త కొత్తగా ఓ పదార్థాన్ని కనుక్కొని, దానికి 'రబ్బర్' అని పేరు పెట్టారు. దానికి పెన్సిల్ మరకల్ని చెరిపేసే నైపుణ్యం ఉందని గుర్తించి దానిపై మరిన్ని పరిశోధనలు చేశారు. ఆ తర్వాత ఎడ్వర్డ్ నార్న్ అనే ఆయన తొలిసారి రబ్బర్‌ను తయారు చేసి మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. అయితే ఇది తొందరగా కరిగిపోవడం, పాడైపోతుండటం, చెడు వాసన వస్తుండటంతో ఎక్కువగా వాడలేకపోయేవారు. 1839లో చార్లెస్ గుడియర్ రబ్బర్‌ను అందరూ వాడేలా తయారు చేసే పద్ధతిని కనుగొన్నారు. దీనివల్ల రబ్బర్ ఎక్కువకాలం ఉండటంతోపాటు దుర్వాసన లేకుండా ఉంది. కొంతకాలానికి పెన్సిల్ చివర రబ్బర్‌ను ఏర్పాటు చేసే విధానం రావడంతో రాయడం, తుడిపేయడం మరింత సులువుగా మారింది. చూశారా.. మనం వాడే రబ్బర్ వెనక ఎంత చరిత్ర ఉందో!

● వండర్ కిడ్


నాలుగేళ్ల వయసు.. రికార్డుల్లో అదుర్స్



నాలుగేళ్ల పిల్లలు అల్లరితో, ఆటలతో కాలం గడుపుతారు. అయితే జమ్మూ కశ్మీర్ రాష్ట్రం గంగ్‌యల్ ప్రాంతానికి చెందిన నాలుగేళ్ల సిద్ధార్థ్ మాత్రం రికార్డులతో అదుర్స్ అనిపించుకుంటున్నాడు. అంత చిన్న వయసులో అతను సాధించిన రికార్డులు చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.


సిద్ధార్థ్ తల్లిదండ్రులు శివ్ జ్యోతి పాండే, శ్వేత పాండే వైద్యులు. చిన్నప్పటి నుంచి పిల్లాడికి వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ పెంచారు. దీంతో రెండేళ్ల వయసుకే ఇంగ్లిష్ అక్షరాలన్నీ నేర్చేసుకున్న సిద్ధార్థ్ 12 సెకండ్లలో వాటిని అప్పజెప్పి 'అతి చిన్న వయసులో, అత్యంత తొందరగా ఇంగ్లీషు అక్షరమాల అప్పజెప్పిన వ్యక్తి'గా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. మూడేళ్ల వయసులో భారత జాతీయ చిహ్నాలు, వివిధ రకాల కరెన్సీ నోట్లను గుర్తించి మరోసారి రికార్డు సాధించాడు. ఆ వయసులోనే ఎన్నో పద్యాలు, సంస్కృత శ్లోకాలు చెప్పి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఇతర దేశాల పేర్లు, వాటి జెండాలు, కరెన్సీ వంటి అంశాలను సైతం మూడేళ్లకే గుర్తించడం మొదలుపెట్టాడు. సిద్ధార్థ్ సాధించిన రికార్డులు చూసి ఇండియాస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ అతనికి 'గ్నాఛ్చీట ఓజీఛీ ొజ ్ఙ్జీ గౌట ఛీ' అనే టైటిల్ ఇచ్చింది. ముందు మరెన్నో రికార్డులు నెలకొల్పాలని సిద్ధార్థ్ ఉవ్విళ్లూరుతున్నాడు.

పెద్దలు రాసిన బాలనాటికలు



చిన్న పిల్లల కోసం సాహిత్యం సృష్టించిన పెద్దలు ఎందరో ఉన్నారు. అలాంటి పెద్దలు బాలల కోసం రాసిన నాటికల పుస్తకం ఇది. ఎంచక్కా స్కూలు యానివర్సరీలో ఈ నాటికలను ప్రదర్శించుకోవచ్చు. అపార్ట్‌మెంట్లలో కాలనీల్లో ఈ వేసవిలో ఈ పుస్తకంలోని నాటికలు పెద్దల సాయంతో ప్రదర్శిస్తే ఆ సరదాయే వేరు. ప్రముఖ రచయితలు దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామి, సి.నారాయణరెడ్డి, యశోదాదేవి పిల్లలు చదివేందుకు, ప్రదర్శించేందుకు నాటికలు ఇవి. సంపాదించి చదవండి.

స్నేహితుల సాహసాలు



ఏడేళ్ల వెరోనికాకు ఇంటి ముందు పచ్చగడ్డిలో ఆడుకోవడం ఎంతో ఇష్టం. కానీ ఆమె స్నేహితురాలు మాయకు అక్కడుండే పురుగులంటే భయం. తనలోని ఆ భయాన్ని పోగొట్టేందుకు వెరోనికా కొంతమంది స్నేహితులతో కలిసి బృందంగా ఏర్పడి పురుగులను తరిమి కొట్టే పథకం వేస్తుంది. అది విజయవంతం కావడంతో ఆ తర్వాత స్నేహితుల్లో ఒక్కొక్కరికి ఉన్న సమస్యలు తీర్చేందుకు అందరూ కలిసి రకరకాల సాహసాలు చేస్తారు. ఆద్యంతం ఆసక్తిగా చదివించే ఈ నవల పిల్లల్ని ఎంతో ఆకట్టుకుంటుంది. చదవండి 'ది ఫిక్సిట్ ఫ్రెండ్స్: హావ్ నో ఫియర్'.

● సినిమా చూద్దామా!

జురాసిక్ వరల్డ్: ఖేయాస్ థియరీ



హేయ్ కిడ్స్... 'జురాసిక్ వరల్డ్: ఖేయాస్ థియరీ సీజన్ 3' నెట్ ఫ్లిక్స్‌లో రిలీజ్ అయింది. సీజన్1 ఆలాగే 2 చూసిన వాళ్ళకు ఇదో పండుగ. ఈ సీజన్‌లో 10 ఎపిసోడ్స్ ఉంటాయి. స్టోరీ గురించి చెప్పాల్సి వస్తే 'జూరాసిక్ వరల్డ్: క్యోస్ థియరీ సీజన్ 3'లో సిక్స్ ఆఫ్ నూబ్లార్ అనే ఆరు మంది ఒక పెద్ద కుట్రను బయట పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. అసలు విషయం ఏమిటంటే నూబ్లార్‌లో ఉన్న డైనోసార్‌ల మనుషులకు పెద్ద డేంజర్ అని తెలుసుకుంటారు. అంతేకాదు ఆ ఆరుగురు వారిలో ఒకరి గురించి నిజం తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇదే టైంలో డైనోసార్‌లు వాళ్ళందరి మీద దాడి చేస్తాయి. ఈ డైనోసార్ల నుండి ఆ ఆరుగురు తప్పించుకుని మనుషులకు డైనోసార్ల కుట్ర గురించి చెబుతారా లేదా అన్నది మాత్రం మీరు నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న జురాసిక్ వరల్డ్: ఖేయాస్ థియరీ సీజన్ 3 అన్ని ఎపిసోడ్లు చూడాల్సిందే. అవడానికి ఇదో యానిమేటెడ్ సిరీస్ అయినా సౌండ్ ఎఫెక్ట్స్‌తో రియలిస్టిక్‌గా ఉంటాయి. కిడ్స్ ఇంకెందుకు ఆలస్యం గ్రాబ్ యువర్ రిమోట్ అండ్ ట్యూన్ ఇటు టు నెట్ ఫ్లిక్స్ టు ప్లే విత్ డైనోసార్స్.

- హరికృష్ణ ఇంటూరు

● కథ

ఎంగిలి పండు



ఒక ఊరిలో గిరి అనే అల్లరి పిల్లవాడు ఉండేవాడు. బడిలో అందర్నీ ఏడిపిస్తూ గొడవలు పడుతుండేవాడు. అందరూ అతనంటే అసహ్యించుకునేవారు. టీచర్లు దూరం పెట్టేవారు. తనకు అందరూ భయపడుతున్నారని గిరి గర్వపడేవాడు.

ఆ బడికి ఓ కొత్త టీచర్ వచ్చింది. గిరి అల్లరిని గమనించి బుద్ధిగా ఉండాలని హెచ్చరించేది. అయినా గిరి పట్టించుకోకుండా నచ్చినట్లు ఉండేవాడు.

అయినా టీచర్ ఓపిగ్గా అతనికి పాఠాలు చెప్పేది. ఒకసారి స్కూల్లో పరీక్షలు నిర్వహించారు. పేపర్లు దిద్దే క్రమంలో గిరి పేపర్లో, పక్క విద్యార్థి పేపర్లో ఒకే రకమైన సమాధానాలు ఉన్నట్లు టీచర్ గుర్తించింది. గిరి పక్కవాడి పేపర్లో చూసి రాశాడని తెలుసుకుంది. ఈ విషయం నేరుగా అడిగితే పొగరుగా సమాధానం చెబుతాడని ఓ ఉపాయం ఆలోచించింది. సాయంత్రం గిరితోపాటు ఆ విద్యార్థిని పిలిచింది.

ఓ జామపండు తీసి గిరి పక్కనున్న విద్యార్థికి ఇచ్చి కొరికి ఇవ్వమని అంది. అతను అలాగే చేశాడు. ఆ పండును గిరికి ఇచ్చిన టీచర్ తినమని చెప్పింది. 'ఛీ.. ఎంగిలి పండు' అంటూ గిరి ముఖం అసహ్యంగా పెట్టాడు. 'అతను తిన్న పండు ఎంగిలి అయితే, అతను రాసిన సమాధానాలు ఎంగిలివి కాదా? వాటిని తీసుకొని నువ్వు నీ పేపర్లో రాసుకోలేదా?' అని సూటిగా అడిగింది. ఏం సమాధానం చెప్పాలో తెలియక గిరి తలవంచుకున్నాడు.

టీచర్ గిరిని దగ్గరకు తీసుకుని మంచి పిల్లాడిగా మారడం వల్ల కలిగే ప్రయోజనాలు చెప్పింది. అల్లరి చేయడం వల్ల ఆనందం దక్కుతుందేమో కానీ గౌరవం మాత్రం దక్కదని చెప్పింది. టీచర్ మాటలతో గిరిలో ఆలోచన మొదలైంది. ఇకనుంచి మంచి పిల్లాడిలా పేరు తెచ్చుకోవాలని నిశ్చయించుకున్నాడు.

జీడీపీ వృద్ధి 6.3 శాతం

2025 సంవత్సరం అంచనాలు తగ్గించిన యూఎన్

- పూర్వపు అంచనా 6.6 శాతం
- వాణిజ్య ఉద్రిక్తతలు, అనిశ్చితుల ప్రస్తావన



ఐక్యరాజ్యసమితి: భారత్ జీడీపీ వృద్ధి అంచనాలను 2025లో 6.3 శాతానికి తగ్గిస్తున్నట్టు ఐక్యరాజ్య సమితి (యూఎన్) ప్రకటించింది. అయినప్పటికీ వేగంగా వృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉంటుందని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన తొలి అంచనాల్లో 2025కు భారత్ జీడీపీ 6.6 శాతం మేర వృద్ధి చెందుతుందని యూఎన్ పేర్కొనడం గమనార్హం. 2024లో భారత జీడీపీ 7.1గా ఉన్నట్టు తెలిపింది. ప్రభుత్వ మూలధన వ్యయాలు, వినియోగం బలంగా ఉండడానికితోడు సేవల ఎగుమతులు పటిష్టంగా ఉండడం ఆర్థిక వృద్ధికి మద్దతునిస్తాయని ప్రస్తావించింది. ఈ మేరకు 2025 సంవత్సరానికి సంబంధించి ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి తాజా నివేదికను విడుదల చేసింది. ''అధిక స్థాయి వాణిజ్య ఉద్రిక్తతలు, విధానపరమైన అనిశ్చితులతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సందిగ్ధ స్థితిలో ఉంది. ఇటీవల యూఎస్ టారిఫ్‌ల పెంపుతో తయారీ వ్యయాలు భారీగా పెరగనున్నాయి. ఇది అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థకు అవరోధం కల్పించడంతోపాటు ఆర్థిక గందరగోళాన్ని పెంచుతుంది''అని యూఎస్ నివేదిక పేర్కొంది.

ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఇంధనం, కాపర్‌కు అమెరికా టారిఫ్‌లు మినహాయించడంతో వీటిపై ప్రభావం తక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అయినప్పటికీ ఈ రంగాలకు టారిఫ్‌ల మినహాయింపు తాత్కాలికమేనన్న విషయాన్ని గుర్తు చేసింది.

2026లో 6.4 శాతం..

భారత జీడీపీ 2026లో 6.4 శాతం మేర వృద్ధిని సాధించొచ్చని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ''భారత్‌లో బలమైన ఆర్థిక కార్యకలాపాల నేపథ్యంలో నిరుద్యోగం నియంత్రణలోనే ఉంది. అయినప్పటికీ పని ప్రదేశాల్లో లింగ అసమానతలు కొనసాగుతున్నాయి. ఇది స్త్రీ, పురుషుల పరంగా మరింత సమాన అవకాశాల కల్పన అవసరాన్ని సూచిస్తోంది''అని యూఎన్ నివేదిక తెలిపింది. ఇక ద్రవ్యోల్బణం ఈ ఏడాది 4.3 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. గతేడాది 4.9 శాతం కంటే తక్కువని పేర్కొంది. 2025లో ప్రపంచ జీడీపీ 2.4 శాతం వృద్ధి చెందొచ్చని ఐక్యరాజ్యసమితి నివేదిక అంచనా వేసింది. 2024లో నమోదైన 2.9 శాతం కంటే తక్కువ. ఈ ఏడాది ఆరంభంలో యూఎన్ వేసిన అంచనాతో పోల్చి చూస్తే 0.4 శాతం తగ్గింది. 2026లో ప్రపంచ జీడీపీ వృద్ధి రేటు 2.5 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. అంతర్జాతీయంగా మారిపోయిన పరిణామాల నేపథ్యంలో జనవరిలో వేసిన అంచనా కంటే 0.4 శాతం తగ్గించాల్సి వచ్చినట్టు వివరించింది. ఇది మాంద్యం కాకపోయినప్పటికీ వృద్ధి రేటు తగ్గడం ఎన్నో దేశాలు, ప్రాంతాలపై ప్రభావం చూపిస్తుందని తెలిపింది. వాణిజ్యం, ఆర్థిక విధానాల్లో అనిశ్చితులు, అస్థిరతలు, భౌగోళిక ఉద్రిక్తతలతో కీలక పెట్టుబడుల నిర్ణయాలు వెనక్కి వెళ్లిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. అధిక రుణ భారం, నిదానించిన ఉత్పత్తి వంటి ఇప్పటికే ఉన్న సవాళ్లను ఇవి మరింత పెంచుతాయని.. ప్రపంచ వృద్ధి అవకాశాలను దెబ్బతీయొచ్చని పేర్కొంది. అమెరికా జీడీపీ వృద్ధి 2024లో 2.8 శాతంగా ఉంటే, 2025కు 1.6 శాతంగా యూఎన్ నివేదిక అంచనా వేసింది. చైనా జీడీపీ 4.6 శాతానికి తగ్గొచ్చని తెలిపింది.

ప్రభుత్వం ఆదుకోకుంటే 'దివాలా'నే

టెలికం శాఖకు వొడాఫోన్ ఐడియా లేఖ

న్యూఢిల్లీ: ప్రభుత్వం నుంచి తమకు సకాలంలో మద్దతు లభించకపోతే ఈ ఆర్థిక సంవత్సరం తర్వాత కార్యకలాపాలను కొనసాగించే పరిస్థితి ఉండదని టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా (వీఐఎల్) వెల్లడించింది. ప్రభుత్వ మద్దతు, బ్యాంకుల నుంచి రుణాలు లభించక, పెట్టుబడులు పెట్టలేక, తమ సంస్థ (దివాలా పరిష్కార ప్రక్రియ కోసం) నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను (ఎన్‌సీఎల్‌టీ) ఆశ్రయించాల్సి వస్తుందని పేర్కొంది.



అలాంటి పరిస్థితే వస్తే స్వల్ప వ్యవధికైనా సర్వీసుల్లో అంతరాయం ఏర్పడిన పక్షంలో నెట్‌వర్క్, స్పెక్ట్రం అసెట్స్ విలువ పడిపోతుందని టెలికం శాఖ కార్యదర్శికి రాసిన లేఖలో వీఐఎల్ సీఈవో అక్షయ ముంద్రా తెలిపారు. దీని వల్ల 20 కోట్ల మంది యూజర్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో ఏజీఆర్ బాకీలు, స్పెక్ట్రం బాకీల కేంద్రం కొంత సహాయం అందించాలని ముంద్రా పేర్కొన్నారు. ప్రభుత్వం సకాలంలో మద్దతునిస్తే ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉపాధి పొందుతున్న 30,000 మందికి, 60 లక్షల మంది పైగా షేర్‌హోల్డర్లకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

10 శాతం పెరిగిన పెట్రోల్ అమ్మకాలు



డీజిల్ విక్రయాల్లోనూ 2% వృద్ధి

న్యూఢిల్లీ: వేసవి నేపథ్యంలో పెట్రోల్ అమ్మకాలు ఊపందుకున్నాయి. ఈ నెల మొదటి 15 రోజుల్లో అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంలోని గణాంకాలతో పోల్చి చూసినప్పుడు 10 శాతం పెరిగినట్టు ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ సంస్థల (బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐవోసీ) గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. ఇంధన అమ్మకాల్లో 90 శాతం వాటా ఈ సంస్థల చేతుల్లోనే ఉంది. మే 1–15 తేదీల మధ్య 1.37 మిలియన్ టన్నుల పెట్రోల్ అమ్మకాలు జరిగాయి. వేసవి సెలవుల్లో వ్యక్తిగత వాహన వినియోగం పెరగడం ఇందుకు మద్దతుగా ఉంది. డీజిల్ విక్రయాలు 2 శాతం పెరిగి 3.36 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. రవాణా, వ్యవసాయ రంగంలో ప్రధానంగా వినియోగించే డీజిల్ అమ్మకాలు గత ఆర్థిక సంవత్సరంలోనూ 2 శాతం పెరగడం తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో డీజిల్ విక్రయాలు 8.23 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలోని అమ్మకాల కంటే 4 శాతం అధికం. ఏప్రిల్‌నెల మొదటి 15 రోజుల్లో డీజిల్ అమ్మకాలు 3.19 మిలియన్ టన్నులతో పోల్చి చూస్తే 5 శాతం వినియోగం పెరిగినట్టు తెలుస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతుండడంతో గత కొన్ని నెలలుగా డీజిల్ అమ్మకాల్లో వృద్ధి పరిమితంగానే ఉంటున్నట్టు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

ఎల్‌పీజీ అమ్మకాలదీ ఎగువబాటే

విమానయాన ఇంధనం (ఏటీఎఫ్) అమ్మకాలు మే మొదటి 15 రోజుల్లో 3,27,900 టన్నులుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలం అమ్మకాల కంటే 1.1 శాతం తగ్గాయి. పాకిస్థాన్‌తో ఘర్షణల నేపథ్యంలో ఉత్తరాదికి విమాన సర్వీసులు ప్రభావితం కావడం వినియోగం తగ్గడానికి కారణంగా తెలుస్తోంది. ఎల్‌పీజీ అమ్మకాలు 10.4 శాతం పెరిగి 1.34 మిలియన్ టన్నులుగా ఉన్నాయి.

ఎపిటోరియా ఫార్మా 'ఆరో అస్త్ర' కోర్సు ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా తమ అనుబంధ సంస్థ ఎపిటోరియా ద్వారా 'ఆరో అస్త్ర – పోస్ట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికేషన్ ఇన్ లీడర్‌షిప్ (సీఎల్‌పీ)' ప్రోగ్రాంను ఆవిష్కరించింది. ఇందుకోసం హైదరాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీతో (ఐఎంటీహెచ్) జట్టు కట్టింది.



ఈ కోర్సు ఆరు నెలల పాటు ఉంటుంది. ఆరు మాడ్యూల్స్ కింద 13 రోజుల పాటు క్లాస్‌రూమ్ సెషన్లు ఉంటాయి. స్వీయ, బృంద, వ్యాపార అభివృద్ధికి సహాయపడుతూ, వృత్తి నిపుణులను నాయకులుగా తీర్చిదిద్దడంపై ప్రధానంగా దృష్టి పెట్టే విధంగా ఈ కోర్సు ఉంటుందని అరబిందో ఫార్మా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యూఎన్‌బీ రాజు తెలిపారు.

జీఐసీ 'అచ్చా కియా ఇన్సూరెన్స్ లియా' ప్రచార కార్యక్రమం



ముంబై: సాధారణ బీమా ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(జీఐసీ) 'అచ్చా కియా ఇన్సూరెన్స్ లియా' పేరుతో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. అత్యవసరవేళలు, ప్రమాదాలు, ఊహించని సంఘటనల సమయాల్లో 'సాధారణ బీమా' ఎలా ఆదుకుంటుందో తెలియజేస్తుంది. ఆరోగ్యం, వాహన, ఇల్లు, ప్రయాణాలు, పంటల తదితర అన్ని బీమా రక్షణలపై నెలకొన్న అపోహలు ప్రచారం ద్వారా తొలగిస్తామని కంపెనీ తెలిపింది.

జేఎస్‌డబ్ల్యూ ఇన్ఫ్రాలో వాటా తగ్గించుకున్న సజ్జన్ జిందాల్ ఫ్యామిలీ

ముంబై: జేఎస్‌డబ్ల్యూ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రమోటర్లలో ఒకరైన సజ్జన్ జిందాల్ ఫ్యామిలీ ట్రస్ట్ వాటా తగ్గించుకుంది. ఓపెన్ మార్కెట్ ద్వారా 4.2 కోట్ల ఈక్విటీలను(2% వాటాకు సమానం) రూ.1,210 కోట్లకు విక్రయించినట్టు ఎన్ఎస్ఈ డేటా తెలిపింది. తాజా లావాదేవీ తర్వాత జేఎస్‌డబ్ల్యూ ఇన్ఫ్రాలో సజ్జన్ జిందాల్ ఫ్యామిలీ ట్రస్ట్ వాటా 80.72% నుంచి 78.72 శాతానికి దిగివచ్చింది. సింగపూర్ ప్రభుత్వం 1.84 కోట్ల షేర్లను రూ.531 కోట్లకు కొనుగోలు చేసింది.

ఎస్ఎస్ఈలో సీజీఆర్ లిస్టింగ్

ఎస్ఎస్ఈలో తొలి పర్యావరణ ఎన్‌జీవో



హైదరాబాద్: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ ప్రవేశపెట్టిన సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎస్ఎస్ఈ)లో హైదరాబాద్ సంస్థ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్(సీజీఆర్) లిస్టకానుంది. తద్వారా ఎస్ఎస్ఈలో లిస్టయిన తొలి పర్యావరణ ఎన్‌జీవోగా సీజీఆర్ నిలవనుంది. యంగ్ ఎర్త్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్ రెండో దశ(వైఈఎల్‌పీ–2)కు నిధుల సమీకరణ లక్ష్యంగా రూ. 85 లక్షల విలువైన ఈ ఇష్యూ వెలువడింది. ఈ నెల 7న ప్రారంభమైన ఇష్యూ 27వరకూ కొనసాగుతుంది. కఠిన పరిశీలనల తదుపరి ఎస్ఎస్ఈలో 14వ సంస్థగా సీజీఆర్ లిస్టకానున్నట్లు సంస్థ సీఈవో జి.నారాయణ రావు పేర్కొన్నారు. సెబీ అనుమతించిన జీరో కూపన్ జీరో ప్రిన్సిపల్(జెడ్‌సీజెడ్‌పీ) బాండ్ల రూపేణా నిధులను సమీకరించనుంది. వడ్డీ, అసలు ఆఫర్ చేయని ఈ బాండ్ల కొనుగోలుదారులు 80జీ ఆదాయపన్ను లబ్దిని క్లెయిమ్ చేసుకోవచ్చు. దేశీయంగా 3,300 ఎన్‌జీవోలు రిజిస్టర్‌కాగా, వీటిలో సుమారు 100 మాత్రమే ఎస్ఎస్ఈలో లిస్టయ్యేందుకు అర్హత కలిగి ఉన్నట్లు రావు తెలియజేశారు. ఎస్ఎస్ఈలో ఒకసారి రిజిస్టరైతే ఎన్ఎస్ఈ లేదా బీఎస్ఈలలో లిస్టయ్యేలోపు పలు కఠిన ప్రొటోకాల్స్‌ను ఎదుర్కోవలసి ఉంటుందని వివరించారు. రక్షణ శాఖ ఆధ్వర్యంలోని పీఎస్‌యూ భారత్ డైనమిక్స్ జీఎంగా గతంలో రావు పనిచేశారు. కాగా.. ఎస్ఎస్ఈలో లిస్టయిన తొలి సంస్థగా బెంగళూరుకు చెందిన ఎన్‌జీవో ఎస్‌జీబీఎస్ ఉన్నతి ఫౌండేషన్ రికార్డు సృష్టించింది. 2022 డిసెంబర్‌లో ఈ సంస్థ సంపన్నవర్గాల(హెచ్ఎన్ఐలు) నుంచి రూ. 2 కోట్లవరకూ సమీకరించింది.

అమెరికాలో రెమిటెన్సులపై పన్ను.. ఎన్నారైలకు సెగ..!

1.6 బిలియన్ డాలర్ల భారం అంచనా



న్యూఢిల్లీ: అమెరికాలో ఉంటున్న విదేశీయులు స్వదేశాలకు పంపే రెమిటెన్సులపై 5 శాతం ట్యాక్స్ విధించాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రతిపాదన అక్కడి ప్రవాస భారతీయులకు సమస్యగా పరిణమించనుంది. దీని వల్ల వారు భారత్‌కి నిధులు పంపించడానికి సంబంధించిన వ్యయాలు పెరగనున్నాయి. ఇటీవలి రిజర్వ్ బ్యాంక్ ఆర్టికల్‌లో ప్రస్తావించిన 2023–24 డేటా ప్రకారం ఏకంగా 1.6 బిలియన్ డాలర్ల మేర భారం పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సదరు కథనం ప్రకారం వివిధ దేశాల నుంచి 2010–11లో రెమిటెన్సులు 55.6 బిలియన్ డాలర్ల నుంచి 2023–24లో రెట్టింపై 118.7 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఇందులో అమెరికా వాటా 27.7 శాతంగా ఉంది. దీన్ని బట్టి చూస్తే అమెరికా నుంచి 32.9 బిలియన్ డాలర్లు రెమిటెన్సుల రూపంలో వచ్చాయి. దీనిపై 5 శాతం ఎక్సైజ్ ట్యాక్స్ విధిస్తే 1.64 బిలియన్ డాలర్ల పన్ను భారం పడుతుందని అంచనా. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధానంగా దృష్టి పెడుతున్న ప్రతిపాదన ప్రకారం గ్రీన్ కార్డులు, హెచ్1బీ వీసాలపై ఉన్న వారు సహా మొత్తం 4 కోట్ల మందిపై 5 శాతం ఎక్సైజ్ ట్యాక్స్ భారం పడనుంది. ఇది అమెరికన్ పౌరులకు వర్తించదు.

టాప్‌లో భారత్..

ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం అత్యధిక స్థాయిలో రెమిటెన్సులను అందుకోవడంలో 2008 నుంచి భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రపంచ దేశాల మధ్య 2001లో 11 శాతంగా ఉన్న భారత్ వాటా 2024లో 14 శాతానికి పెరిగింది. 2024లో 129 బిలియన్ డాలర్లతో భారత్ అగ్రస్థానంలో ఉండగా, మెక్సికో (68 బిలియన్ డాలర్లు), చైనా (48 బిలియన్ డాలర్లు), ఫిలిప్పీన్స్ (40 బిలియన్ డాలర్లు), పాకిస్తాన్ (33 బిలియన్ డాలర్లు) తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	363.8	3.82
TATACONSUM	1,170.00	1.99
BAJAJ-AUTO	8,491.00	1.98
ADANIENT	2,551.00	1.23
HINDUNILVR	2,380.00	1.05

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	1,814.40	-2.83
HCLTECH	1,661.00	-2.06
INFY	1,589.40	-1.46
JSWSTEEL	1,024.30	-1.35
SHRIRAMFIN	666.3	-1.26

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-5-2025

విశాఖ	530–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	525–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	517–00
వరంగల్	517–00
రిటైల్ ధర	5.75

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,699
ఎన్ఎస్ఈ	1,49,818
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,62,308
ఎఫ్ఐఐ	+ 8,831
డీఐఐ	+ 5,187

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	62.53	$ 61.62
బ్రెంట్	65.48	$ 64.53

మార్చి త్రైమాసిక ఫలితాలు

బీహెచ్ఈఎల్ లాభం ప్లస్

- క్యూ4లో రూ. 504 కోట్లు
- షేరుకి రూ. 2 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బీహెచ్ఈఎల్) గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 3 శాతం వృద్ధితో రూ. 504 కోట్లను అధిగమించింది. ఇండస్ట్రీ అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 490 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 8,417 కోట్ల నుంచి రూ. 9,143 కోట్లకు బలపడింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 0.5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. క్యూ4 ఆదాయంలో ఇండస్ట్రీ విభాగం నుంచి రూ. 2,801 కోట్లు లభించింది. 2023–24 క్యూ4లో రూ. 2,092 కోట్ల ఆదాయం మాత్రమే నమోదైంది. ఇక పవర్ బిజినెస్ ఆదాయం రూ. 6,168 కోట్ల నుంచి రూ. 6,192 కోట్లకు స్వల్పంగా బలపడింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 282 కోట్ల నుంచి రూ. 534 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం ఆదాయం రూ. 24,439 కోట్ల నుంచి రూ. 28,805 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో బీహెచ్ఈఎల్ షేరు బీఎస్ఈలో 2% లాభంతో రూ. 250 వద్ద ముగిసింది.

ఇమామీ లాభం అప్

- క్యూ4లో రూ. 162 కోట్లు
- షేరుకి రూ. 2 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ కంపెనీ ఇమామీ లిమిటెడ్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 11 శాతం వృద్ధితో రూ. 162 కోట్లను అధిగమించింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 147 కోట్లు మాత్రమే ఆర్జించింది. నవరత్న, బోరోప్లస్, డెర్మికూల్ బ్రాండ్ల కంపెనీ మొత్తం ఆదాయం రూ. 891 కోట్ల నుంచి రూ. 963 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 9 శాతం పెరిగి రూ. 744 కోట్లను తాకాయి. 50 వసంతాల సందర్భంగా కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 2 చొప్పున ప్రత్యేక డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం 11 శాతం ఎగసి రూ. 803 కోట్లకు చేరింది. 2023–24లో రూ. 724 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం 7 శాతం బలపడి రూ. 3,877 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో ఇమామీ షేరు బీఎస్ఈలో 1 శాతం లాభంతో రూ. 637 వద్ద ముగిసింది.

ఆదిత్య బిర్లా క్యాపిటల్ మిశ్రమ పనితీరు

- నికర లాభం 30 శాతం డౌన్
- రుణ పోర్ట్‌ఫోలియో, నిర్వహణ ఆస్తుల్లో వృద్ధి

ADITYA BIRLA CAPITAL

న్యూఢిల్లీ: రుణాలు, బీమా, మ్యూచువల్ ఫండ్స్ తదితర ఆర్థిక సేవలను అందించే ఆదిత్య బిర్లా క్యాపిటల్ మార్చితో అంతమైన త్రైమాసికంలో మిశ్రమ పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 30 శాతం క్షీణించి రూ.865 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,245 కోట్లుగా ఉంది. ఆదాయం మాత్రం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.10,803 కోట్ల నుంచి రూ.12,239 కోట్లకు వృద్ధి చెందింది. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్స్ (ఎన్‌సీడీలు) సహా డెట్ సెక్యూరిటీలను జారీ చేయడం ద్వారా (ఒకటి లేదా అంతకు మించిన విడతల్లో) రూ.1,65,000 కోట్ల నిధుల సమీకరణకు బోర్డు ఆమోదం తెలిపినట్టు కంపెనీ ప్రకటించింది. ఇందుకు కంపెనీ వాటాదారులు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఎన్‌బీఎఫ్‌సీ, హౌసింగ్ ఫైనాన్స్ విభాగం కింద రుణాల పోర్ట్‌ఫోలియో 27 శాతం పెరిగి మార్చి ఆఖరుకి రూ.1,57,404 కోట్లకు చేరుకున్నట్టు సంస్థ ప్రకటించింది.

బీఎస్ఈలో ఆదిత్య బిర్లా క్యాపిటల్ షేరు అర శాతం నష్టంతో రూ.204 వద్ద స్థిరపడింది.

ఎల్‌టీ ఫుడ్స్ లాభం ప్లస్

- క్యూ4లో రూ. 161 కోట్లు
- షేరుకి రూ. 1 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ కంపెనీ ఎల్‌టీ ఫుడ్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 7 శాతం వృద్ధితో రూ. 161 కోట్లకు చేరింది. మార్జిన్లు మెరుగుపడటం, పంపిణీని విస్తరించడం ఇందుకు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 150 కోట్లు ఆర్జించింది. దావత్, రాయల్ బాస్మతి బ్రాండ్ల కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ. 2,075 కోట్ల నుంచి రూ. 2,228 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు 8 శాతం పెరిగి రూ. 2,049 కోట్లను తాకాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 1 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం 2 శాతం స్వల్ప వృద్ధితో రూ. 612 కోట్లకు చేరింది. 2023–24లో రూ. 598 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 8,770 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌టీ ఫుడ్స్ షేరు బీఎస్ఈలో 1.6% నీరసించి రూ. 363 వద్ద ముగిసింది.

క్రాంప్టన్ గ్రీవ్స్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 172 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ క్రాంప్టన్ గ్రీవ్స్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 29 శాతం జంప్‌చేసి రూ. 172 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 133 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 5 శాతం వృద్ధితో రూ. 2,077 కోట్లకు చేరింది. అయితే మొత్తం వ్యయాలు 2 శాతం పెరిగి రూ. 1,846 కోట్లను తాకాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం 28 శాతం ఎగసి రూ. 564 కోట్లను అధిగమించింది. 2023–24లో రూ. 442 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం 7 శాతంపైగా బలపడి రూ. 7,932 కోట్లను దాటింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1.2 శాతం నీరసించి రూ. 327 వద్ద ముగిసింది.

స్ట్రింగ్ మెటావర్స్ ఆదాయం రూ. 407 కోట్లు

STRING METAVERSE

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో స్ట్రింగ్ మెటావర్స్ ఆదాయం సుమారు 169 శాతం వృద్ధి చెంది రూ. 151 కోట్ల నుంచి రూ. 407 కోట్లకు చేరింది. నికర లాభం రూ. 11 కోట్ల నుంచి 225 శాతం పెరిగి రూ. 35 కోట్లుగా నమోదైంది. అంతర్జాతీయంగా క్లౌడ్ డేటా సెంటర్లలో 50 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. వచ్చే మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఏడీఆర్‌లు, విదేశీ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్లు మొదలైన మార్గాల్లో 2 బిలియన్ డాలర్ల వరకు సమీకరించనున్నట్లు వివరించింది.

యూరేకా ఫోర్బ్స్ లాభం రెట్టింపు

మార్చి క్వార్టర్‌లో రూ.49 కోట్లు



న్యూఢిల్లీ: యూరేకా ఫోర్బ్స్ మార్చితో ముగిసిన త్రైమాసికంలో మంచి పనితీరు చూపించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు రెట్టింపునకు పైగా పెరిగి రూ.49.48 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.21.38 కోట్లుగా ఉంది. ఆదాయం ఇదే కాలంలో 11 శాతం వృద్ధితో రూ.554 కోట్ల నుంచి రూ.613 కోట్లకు వృద్ధి చెందింది. ఇక 2024–25 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ నికర లాభం 72 శాతం వృద్ధితో రూ.164 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాదిలో లాభం రూ.96 కోట్లుగా ఉండడం గమనార్హం.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో యూరేకా ఫోర్బ్స్ షేరు 10 శాతం లాభపడి రూ.595 వద్ద ముగిసింది.

అంతా కోహ్లిమయం

టెస్టు జెర్సీల్లో మైదానంలోకి అభిమానులు

బెంగళూరు: భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఇటీవల వ్యక్తిగత పని పూర్తి చేసుకొని తిరిగొస్తుండగా మైదానంలో ఒక అభిమాని ఎందుకు టెస్టులకు రిటైర్మెంట్ తీసుకున్నావని అడిగాడు. దానికి స్పందిస్తూ 'ఆర్‌సీబీని గెలిపిస్తాం కదా' అని కోహ్లి జవాబిచ్చాడు. ఈ సీజన్‌లో బెంగళూరుకు టైటిల్ అందించాలని అతను ఎంత పట్టుదలగా ఉన్నాడో అర్థమవుతుంది. అతని బ్యాటింగ్‌లోనూ అది కనిపించింది. 11 ఇన్నింగ్స్‌లలో ఏకంగా 7 అర్ధసెంచరీలతో ఇప్పటికే 505 పరుగులు సాధించిన కోహ్లి నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. టెస్టు ఫార్మాట్‌కు అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత మొదటిసారి కోహ్లి మైదానంలోకి దిగుతుండటంతో అందరి దృష్టి అతనిపైనే ఉంది. గురువారం అతని ప్రాక్టీస్ సెషన్ సమయంలో కూడా చిన్నస్వామి స్టేడియంను ఫ్యాన్స్ హోరెత్తించారు. వందల సంఖ్యలో హాజరైన అభిమానులు కోహ్లి ప్రతీ కదలికపై సందడి చేశారు. దాదాపు గంట పాటు అతను నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. కోహ్లి ఉన్నంత సేపూ అతని పేరు తప్ప అక్కడ మరేమీ వినిపించలేదు. నేడు కోల్‌కతాతో జరిగే మ్యాచ్‌లోనూ ఇదే పరిస్థితి ఉండవచ్చు. కోహ్లి టెస్టుల నుంచి రిటైర్ అయిన తర్వాత కొందరు వీరాభిమానులు సోషల్ మీడియాలో ఒక సందేశాన్ని పంచుకున్నారు. అతనిపై తమ అభిమానాన్ని ప్రదర్శిస్తూ, టెస్టు క్రికెటర్‌గా కోహ్లిని గుర్తు చేస్తూ ఐపీఎల్ మ్యాచ్‌కు కూడా తెలుపు రంగు టెస్టు జెర్సీలతో స్టేడియానికి రావాలని పిలుపునిచ్చారు. దీనికి భారీ స్థాయిలో స్పందన లభించింది. ఈ రకంగా చూస్తే నేడు ఆర్‌సీబీ రెగ్యులర్ జెర్సీ 'రెడ్ అండ్ గోల్డ్'లో కాకుండా 'విరాట్ 18' వైట్ జెర్సీలే మైదానాన్ని ముంచెత్తవచ్చు. అయితే విరాట్‌పై మైదానం బయటి స్పందనలు, వ్యాఖ్యలు ఎలాంటి ప్రభావం చూపించవని... ఏకాగ్రత చెదరకుండా తనదైన శైలిలో ఎప్పటిలాగే అతను బాగా ఆడి మ్యాచ్‌ను గెలిపించాలనే ఏకైక లక్ష్యంతోనే బరిలోకి దిగుతున్నాడని ఆర్‌సీబీ డైరెక్టర్ మో బొబాట్ వ్యాఖ్యానించారు.







'ఇదో ప్రత్యేక అనుభూతి'

వాంఖెడేలో రోహిత్ శర్మ స్టాండ్ ఆవిష్కరణ

ముంబై: భారత క్రికెట్‌లో బ్యాటర్‌గా, కెప్టెన్‌గా తనకంటూ ప్రత్యేక అధ్యాయం రచించుకున్న రోహిత్ శర్మను అతని సొంత సంఘం ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) సముచిత రీతిలో గౌరవించింది. ప్రతిష్టాత్మక వాంఖెడే స్టేడియంలో ఒక ప్రేక్షకుల గ్యాలరీకి 'రోహిత్ శర్మ స్టాండ్' అంటూ పేరు పెట్టింది. శుక్రవారం ఈ స్టాండ్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. రోహిత్ తల్లిదండ్రులు పూర్ణిమ, గురునాథ్, భార్య రితిక, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఈ కార్యక్రమానికి హాజరై 'రోహిత్ శర్మ స్టాండ్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోహిత్ భావోద్వేగానికి గురయ్యాడు. 'నేడు ఇక్కడ జరిగిన కార్యక్రమాన్ని నేను కలలో కూడా ఊహించలేదు. **ఇదో ప్రత్యేక అనుభూతి. మ్యాచ్‌లలో సాధించే** ఎన్నో మైలురాళ్లకంటే విశేషమైంది. వాంఖెడేలాంటి ప్రతిష్టాత్మక మైదానంలో ఎంతో మంది దిగ్గజాల సరసన నా పేరు కనిపిస్తున్న ఆనందాన్ని మాటల్లో వర్ణించలేదు. ఈ స్టేడియంలో నాకు ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. నేను ఇంకా క్రికెట్ ఆడుతున్నాను. వచ్చే బుధవారం ఇక్కడ నా స్టాండ్ ముందు ఐపీఎల్ మ్యాచ్ ఆడబోతున్నాను. అది చాలా గొప్ప అనుభవం అవుతుంది. ఇక భారత్ తరఫున మ్యాచ్ ఆడితే మాత్రం ఇంకా చాలా బాగుంటుంది. నా కుటుంబ సభ్యులందరి ముందు ఈ కార్యక్రమం జరిగింది. అందరికీ ఎం**తో కృతజ్ఞుడను' అని రోహిత్ వ్యాఖ్యానించాడు.** శుక్రవారం ఇదే కార్యక్రమంలో భారత మాజీ కెప్టెన్ అజిత్ వాడేకర్ పేరిట, సీనియర్ అడ్మినిస్ట్రేటర్, ఐసీసీ మాజీ అధ్యక్షుడు శరద్ పవార్ పేరిట కూడా స్టాండ్‌లను ఆవిష్కరించిన ఎంసీఏ... ఇటీవలే కన్నుమూసిన మాజీ అధ్యక్షుడు అమోల్ కాలే పేరిట ప్రత్యేక లాంజ్‌ను కూడా ప్రారంభించింది.

'నేనైతే సిడ్నీలో రోహిత్‌ను ఆడించే వాడిని'

ఆస్ట్రేలియాతో సిరీస్‌తో చివరి టెస్టుకు ముందు తాను ఫామ్‌లో లేనంటూ రోహిత్ శర్మ స్వయంగా తప్పుకున్నాడు. సిడ్నీలో జరిగిన ఈ టెస్టుకు దూరమైన అతను మళ్లీ టెస్టు ఆడకుండానే ఇటీవల రిటైర్మెంట్ ప్రకటించాడు. **అయితే తాను జట్టు కోచ్‌గా ఉండి ఉంటే రోహిత్‌ను తప్పనిసరిగా ఆ టెస్టులో ఆడించే వాడినని మాజీ కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యానిం**చాడు. 'సిరీస్ ముగిసిపోలేదు కాబట్టి కచ్చితంగా అతడిని ఆడించే వాడిని. సిరీస్‌లో 1-2తో వెనుకబడి ఉన్న సమయంలో జట్టును వదలవద్దని చెప్పేవాడిని. ఆ టెస్టులో తేడా ఒక 30-40 పరుగులు మాత్రమే. ఫామ్ ఎలా ఉన్న అతనో మ్యాచ్ విన్నర్. పిచ్‌పై పరిస్థితిని అర్థం చేసుకొని ఓపెనర్‌గా ఒక 35-40 పరుగులు చేసి ఉంటే చాలు మ్యాచ్ ఫలితం మారిపోయేదేమో. సిరీస్ కూడా సమంగా ముగిసేది. అక్కడ రోహిత్ ఆడకపోవడం నన్ను చాలా కాలం వెంటాడింది' అని రవిశాస్త్రి తన మనసులో మాటను పంచుకున్నాడు.

కనబడుతున్నా... కపట నాటకం

- అజర్‌బైజాన్ నకిలీ అంధత్వ జూడో క్రీడాకారిణిపై జీవితకాల నిషేధం
- టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకం నెగ్గిన షహానా హాజియెవా

బాకు (అజర్‌బైజాన్): ప్రపంచాన్ని 'గుడ్డి'గా నమ్మించిన అజర్‌బైజాన్ పారా జూడో క్రీడాకారిణి పాపం పండింది. జీవితకాల నిషేధానికి గురైంది. ఒక శాతం కూడా దృష్టిలోపం లేకపోయినా... నకిలీ అంధత్వ సర్టిఫికెట్‌తో అంతర్జాతీయ పోటీల్లో అజర్‌బైజాన్ జూడో క్రీడాకారిణి షహానా హాజియెవా పతకాలు గెలిచింది. ఇప్పుడు పాపం పండటంతో 'పోడియం'కెక్కిన ఆమె పాతాళానికి పడిపోయింది. అసలు విషయమేమిటంటే... 26 ఏళ్ల హాజియెవా టోక్యో పారాలింపిక్స్‌లో దృష్టి లోపం ఉన్న జూడో క్రీడాకారిణిల విభాగంలో (48 కేజీలు) పోటీపడి బంగారు పతకం గెలుపొందింది. కాలచక్రం తిరిగేసరికి ఈ లోపల మరో పారాలింపిక్స్ క్రీడలు (పారిస్) కూడా ముగిశాయి. ఇన్నాళ్లూ బాగానే ఉంది. కానీ ఈనెల కజకిస్తాన్‌లోని అస్తానాలో ప్రపంచ పారా జూడో చాంపియన్‌షిప్ జరిగింది. ఇందులో కళ్లున్నా... కనపడనట్లు ఆడిన కపట నాటకం బయటపడింది. ఈవెంట్ సందర్భంగా నిర్వహించిన అంధత్వ పరీక్షలో విస్తుపోయే వాస్తవం వెలుగులోకి వచ్చింది. షహానా హాజియెవాకు రెండు కళ్లు వందశాతం కనిపిస్తూనే ఉన్నాయని తేలింది.



ఎలాంటి దృష్టి లోపం, పాక్షిక అంధత్వం కూడా లేదని తేలింది. దీంతో ప్రపంచ పారాలింపిక్ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమెపై జీవితకాల నిషేధం విధించింది. ప్రపంచం 'కన్ను'గప్పిన ఆమె మోసంతో ఇప్పుడు పారా క్రీడలు కాదుకదా అసలైన క్రీడల్లో కూడా పాల్గొనే అర్హతను పూర్తిగా కోల్పోయింది. అజర్‌బైజాన్‌కే చెందిన ఎల్నారా నిజామ్లికి పాక్షిక దృష్టి లోపం ఉంది. కానీ ఆమె పూర్తి అంధత్వంతో 'జే1' కేటగిరీలో పాల్గొనాలని చూసిన మోసం కూడా బట్టబయలైంది. అయితే ఆమెకు 'జే2' కేటగిరీ (పాక్షిక అంధత్వం)లో పాల్గొనే అవకాశమిచ్చారు. అజర్‌బైజాన్ జాతీయ పారాలింపిక్ సంఘం తమ అథ్లెట్ల కపట నాటకంపై స్పందించింది. ఇద్దరిపై చర్యలు తీసుకుంటామని చెప్పింది.



టోక్యో పారాలింపిక్స్ స్వర్ణ పతకంతో షహానా... 48 కేజీల ఫైనల్ బౌట్ దృశ్యం

ఫైనల్లో అల్కరాజ్



రోమ్: స్పెయిన్ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్కరాజ్ తన కెరీర్‌లో 25వ టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో భాగంగా శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో అల్కరాజ్ 6-3, 7-6 (7/4)తో లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై విజయం సాధించాడు. 2 గంటల 3 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ ఒక ఏస్ సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. ఈ ఏడాది నాలుగో టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించిన అల్కరాజ్ రెండు టోర్నీల్లో (మోంటెకార్లో మాస్టర్స్ సిరీస్; రోటర్‌డామ్ ఓపెన్) విజేతగా నిలిచి, బార్సిలోనా ఓపెన్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. యానిక్ సినెర్ (ఇటలీ), టామీ పాల్ (అమెరికా) మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో ఫైనల్లో అల్కరాజ్ తలపడతాడు.

31, జూన్ 1 తేదీల్లో పీకేఎల్ ఆటగాళ్ల వేలం



ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌కు ముందు ఆటగాళ్ల వేలం ప్రక్రియను ఈ నెల 31, జూన్ 1 తేదీల్లో నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముంబైలో నిర్వహించే ఈ వేలానికి సంబంధించిన సమాచారాన్ని ఇదివరకే 12 ఫ్రాంచైజీ యాజమాన్యాలకు తెలియజేశామని నిర్వాహకులు వెల్లడించారు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన 11 సీజన్లలో 8 వేర్వేరు జట్లు టైటిళ్లు గెలుపొందడం విశేషం. ఈ నేపథ్యంలో కబడ్డీ లీగ్‌లో పలానా జట్టు ఫేవరెట్ అనే మాటే లేకుండా ప్రతీ జట్టు టైటిల్ కోసం పోరాడుతూనే ఉంది. దీంతో యేటికేడు కబడ్డీ కూతకు ఆదరణ అంతకంతకు పెరుగుతూనే ఉంది.

బెంగాల్ వారియర్స్ కోచ్‌గా నవీన్

ఈ ఏడాది జరిగే 12వ సీజన్ పీకేఎల్ కోసం బెంగాల్ వారియర్స్ తమ జట్టు హెడ్ కోచ్‌గా నవీన్ కుమార్‌ను నియమించింది. ప్రస్తుతం కోచ్‌గానే కాదు... అంతకుముందు ఆటగాడిగాను అతనికి మంచి రికార్డు ఉంది. దక్షిణాసియా క్రీడలు (2006), ఆసియా క్రీడలు (2006), కబడ్డీ ప్రపంచకప్ (2007), ఆసియా ఇండోర్ క్రీడల్లో (2007) భారత్ స్వర్ణాలు గెలిచిన బృందంలో అతను సభ్యుడిగా ఉన్నాడు. కోచ్‌గానూ నిరూపించుకున్నాడు. గతంలో అతను భారత జాతీయ, దేశవాళీ జట్లకు కోచింగ్ సేవలందించాడు. భారత నేవి, స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) జట్లకు కోచ్‌గా వ్యవహించాడు. ఆటలో కడదాకా కనబరిచే పోరాటస్ఫూర్తి, ఏ దశలోనూ కుంగిపోని సానుకూల దృక్పథం అతన్ని మేటి కోచ్‌గా నిలబెడుతోంది. 12 ఫ్రాంచైజీలు తలపడిన గత సీజన్‌లో బెంగాల్ పదో స్థానంతో నిరాశపరిచింది. ఈ నేపథ్యంలో వేలానికి ముందే అతన్ని నియమించుకోవడం ద్వారా సరైన ఆటగాళ్ల కొనుగోలు, జట్టు కూర్పు, పటిష్టమైన దళాన్ని తయారు చేసుకోవడానికి కావాల్సినంత సమయం లభిస్తుందని ఫ్రాంచైజీ యాజమాన్యం భావించింది. బెంగాల్‌కు కోచింగ్ పట్ల నవీన్ కుమార్ హర్షం వ్యక్తం చేశాడు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని వారియర్స్‌ను దీటైన జట్టుగా, బరిలో ఎదురులేని ప్రత్యర్థిగా తయారు చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నాడు.



నేటి నుంచి ప్రపంచ టీటీ చాంపియన్‌షిప్

దోహా: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ఆధ్వర్యంలో నేటి నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్ జరగనుంది. ఈనెల 25 వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో మొత్తం ఐదు విభాగాల్లో మ్యాచ్‌లను నిర్వహిస్తారు. పురుషుల సింగిల్స్, డబుల్స్, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో మ్యాచ్‌లుంటాయి. భారత్ నుంచి మహిళల సింగిల్స్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ, మనిక బత్రా, యశస్వి, దియా చిటాలె... పురుషుల సింగిల్స్‌లో అంకుర్, మనుశ్ షా, మానవ్ ఠక్కర్, సత్యన్ జ్ఞానశేఖరన్ బరిలో ఉన్నారు. పురుషుల డబుల్స్‌లో మానవ్-మనుశ్; సత్యన్-హర్మీత్ దేశాయ్ జోడీలు పోటీపడతాయి. మహిళల డబుల్స్‌లో అహిక-సుతీర్థ ముఖర్జీ; యశస్విని-దియా చిటాలె జంటలు తలపడతాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో హర్మీత్-యశస్విని; మనుశ్-దియా బరిలో ఉన్నారు.



ఎయిర్ ట్యాక్సీల్లో వేదికలకు రవాణా

తొలిసారిగా లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో సేవలు

లాస్ ఏంజెలిస్: వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఒలింపిక్స్ క్రీడల్లో ఇప్పటి వరకు ఆటగాళ్లు, ప్రేక్షకులు, వీఐపీలు కార్లు, బస్సుల్లోనే వేదికలకు చేరేవారు. కానీ లాస్ ఏంజెలిస్‌లో 2028లో జరిగే విశ్వక్రీడలు 'విహంగ విహారానికి' సిద్ధమవుతున్నాయి. మరో మూడేళ్లలో అమెరికాలోని ప్రఖ్యాత నగరంలో జరిగే ఈ మెగా ఈవెంట్‌లో 'ఎయిర్ ట్యాక్సీ'లను వినియోగిస్తామని ఆర్గనైజింగ్ కమిటీ తెలిపింది. ఆటగాళ్లు, వీఐపీలే కాదు... సాధారణ ప్రేక్షకులు సైతం విహంగ విహారం చేస్తూ ఆయా వేదికలకు చేరుకుంటారు. విశ్వక్రీడల్లో ఈ తరహా ఎయిర్ ట్యాక్సీలు నిర్వహించనుండటం చరిత్రలోనే తొలిసారి కానుంది. తద్వారా ఎవరికీ ప్రయాణ బడలిక లేకుండా కేవలం పది నుంచి 20 నిమిషాల్లోపే వేదికలకు చేరవేయవచ్చని నిర్వాహకులు ప్రణాళికలతో ఉన్నారు. సోఫీ స్టేడియం, లాస్ ఏంజెలిస్ మెమోరియల్ కొలిజియం, శాంటా మోనికా, ఆరెంజ్ కౌంటీ, హాలీవుడ్ వేదికలకు ఎయిర్ ట్యాక్సీలను వినియోగించే ఆలోచనతో ఉన్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సీఈఓ ఆడమ్ గోల్డ్‌స్టెయిన్ తెలిపారు. అమెరికా భవిష్య ప్రయాణ ముఖచిత్రాన్నే లాస్ ఏంజెలిస్ విశ్వక్రీడలు మార్చబోతున్నాయని చెప్పారు.

ఫైనల్లో యువ భారత్



యుపియా (అరుణాచల్ ప్రదేశ్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-19 టోర్నమెంట్‌లో భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. మాల్దీవులు జట్టుతో శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో భారత్ 3-0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున డానీ మెటీ (14వ నిమిషంలో), ఒమంగ్ డోడుమ్ (21వ నిమిషంలో), ప్రశాన్ జాజో (65వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. 'శాఫ్' టోర్నీల చరిత్రలో మాల్దీవులుపై భారత్‌కిది పదో విజయం కావడం విశేషం. అంతకుముందు జరిగిన తొలి సెమీఫైనల్లో బంగ్లాదేశ్ 2-1 గోల్స్ తేడాతో నేపాల్ జట్టును ఓడించింది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో భారత్, బంగ్లాదేశ్ అమీతుమీ తేల్చుకుంటాయి.

31 నుంచి టేబుల్ టెన్నిస్ లీగ్

అహ్మదాబాద్: ఈ వేసవిలో ప్రముఖ క్రికెట్ లీగ్ (ఐపీఎల్) ముగిసే దశలో భారత ప్రేక్షకుల్ని అలరించేందుకు టేబుల్ టెన్నిస్ లీగ్ సిద్ధమవుతోంది. అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) ఆరో సీజన్ పోటీలు ఈ నెల 31 నుంచి జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అహ్మదాబాద్‌లోని ఎకా ఎరెనాలో ఈ పోటీలు జరుగనున్నాయి. మొదటి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ డెంపా గోవా చాలెంజర్స్... ఆతిథ్య జట్టు అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్‌తో తలపడుతుంది. అదేరోజు రెండో మ్యాచ్‌లో మాజీ చాంపియన్ దబంగ్ ఢిల్లీ టీటీసీ... జైపూర్ పేట్రియాట్స్ 'ఢీ'కొంటాయి. తెలంగాణ స్టార్ ఆకుల శ్రీజ జైపూర్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది. జూన్ 1న యు ముంబా టీటీ తమ తొలి మ్యాచ్‌లో పీబీజీ పుణే జాగ్వార్స్‌తో పోటీపడుతుంది. కోల్‌కతా థండర్‌బ్లేడ్స్ పోరు జూన్ 2న మొదలవుతుంది. ఆ రోజు కోల్‌కతా... మాజీ చాంపియన్ చెన్నై లయన్స్‌ను 'ఢీ'కొంటుంది. మొత్తం ఎనిమిది ఫ్రాంచైజీల మధ్య 23 మ్యాచ్‌లు జరుగుతాయి. ఒక్కో ఫ్రాంచైజీ లీగ్ దశలో ఐదేసి మ్యాచ్‌ల చొప్పున ఆడుతుంది. రెండు పురుషుల సింగిల్స్, రెండు మహిళల సింగిల్స్, ఒక మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్ నిర్వహిస్తారు. పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు నాకౌట్ దశ సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. జూన్ 13, 14 తేదీల్లో సెమీఫైనల్స్, 15న టైటిల్ పోరుతో యూటీటీ సీజన్ ముగుస్తుంది.

జూన్ 15న ఫైనల్



హరే కృష్ణ మందిరం
ఇస్కాన్-బెంగళూరుదే

సుప్రీంకోర్టు కీలక తీర్పు
- రెండు దశాబ్దాల వివాదానికి ముగింపు

న్యూఢిల్లీ: కర్ణాటక రాజధాని బెంగళూరులోని ప్రఖ్యాత హరే కృష్ణ మందిరం బెంగళూరు ఇస్కాన్ సొసైటీకే చెందుతుందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదానికి ముగింపు పలికింది. ఈ మందిరం ముంబై ఇస్కాన్ సొసైటీకి చెందుతుందని కర్ణాటక హైకోర్టు గతంలో ఉత్తర్వు జారీ చేయగా, దీన్ని సవాలు చేస్తూ బెంగళూరు ఇస్కాన్ సొసైటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. శుక్రవారం తీర్పు వెలువరించింది. కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును తోసిపుచ్చింది. హరే కృష్ణా మందిరంపై ముంబై ఇస్కాన్ సొసైటీకి హక్కులు ఉన్నాయని చెప్పడానికి ఆ సంస్థ ఎలాంటి ఆధారాలు సమర్పించలేదని పేర్కొంది. మందిరం స్థలానికి సంబంధించిన సేల్ డీడ్ బెంగళూరు సొసైటీకి అనుకూలంగా ఉన్నట్లు తెలిపింది. సేల్ డీడ్‌ను బెంగళూరు సొసైటీ సభ్యులు మధు పండిత దాస, భక్తి లతా దేవి, చంచలపాటి దాస, చమరిదేవి తారుమారు చేశారంటూ వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టంచేసింది. ఆలయానికి సంబంధించిన కీలక పత్రాల్లో బెంగళూరు సొసైటీ రబ్బర్ స్టాంప్ ఉన్నట్లు తెలియజేసింది. షెడ్యూల్ 'ఎ'లో ఉన్న ఆ ఆస్తిని బెంగళూరు డెవలప్‌మెంట్ అథారిటీ ఇస్కాన్ బెంగళూరు సొసైటీకి కేటాయించినట్లు చెప్పడానికి స్పష్టమైన సాక్ష్యాధారాలు ఉన్నట్లు ధర్మాసనం తన తీర్పులో ఉద్ఘాటించింది. బెంగళూరు సొసైటీని కర్ణాటక సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం కింద స్వతంత్ర సొసైటీగా రిజిస్టర్ చేసినట్లు వివరించింది. ముంబై సొసైటీకి బెంగళూరు సొసైటీ ఒక శాఖ అని హైకోర్టు చెప్పడం సరైంది కాదని అభిప్రాయపడింది. అందుకే హైకోర్టు తీర్పును పక్కనపెడుతున్నట్లు తేల్చిచెప్పింది. బెంగళూరు సొసైటీ హరే కృష్ణా మందిరంతోపాటు ఒక విద్యాసంస్థను కూడా నిర్వహిస్తోంది. ఈ మందిరం ముంబై సొసైటీదే అంటూ కర్ణాటక హైకోర్టు ఉత్తర్వు జారీ చేయగా, బెంగళూరు సొసైటీ ఆఫీసు-బేరర్ కోదండరామ దాస 2011 జూన్ 2న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు పట్ల బెంగళూరు ఇస్కాన్ సొసైటీ అధ్యక్షుడు మధు పండిత్ దాస హర్షం వ్యక్తంచేశారు.

యూకే హైకోర్టులో నీరవ్ మోదీకి చుక్కెదురు

న్యూఢిల్లీ: పరారీలో ఉన్న నేరగాడు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను యూకే హైకోర్టు మరోసారి తిరస్కరించింది. పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.8,560 కోట్ల మేర మోసం చేసినట్లు ఇతడు మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. నీరవ్ భారీ మోసానికి పాల్పడ్డాడని, స్వదేశానికి అప్పగింత చర్యలు తుది దశలో ఉన్నాయని జడ్జి గురువారం తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వినతి మేరకు ఇత డిని స్కాట్లాండ్ యార్డ్ పోలీసులు 2019 మార్చి 19 న అరెస్టు చేసి జైలులో పెట్టారు. యూకేలోని వెస్ట్ మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టులో ఆరుసార్లు, యూకే హైకోర్టులో మూడుసార్లు బెయిల్ కోసం ఇతడు ప్రయత్నాలు చేశాడని ఈడీ తెలిపింది. ప్రతిసారీ ఇతడి పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయని వివరించింది. ఇప్పటి వరకు ఇతడికి చెందిన దేశవిదేశాల్లోని రూ.2,626 కోట్ల మేర ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ తెలిపింది. ఇందులో వెయ్యి కోట్ల ఆస్తులను విజయవంతంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు బదలాయించినట్లు వెల్లడించింది. ఈ కేసులో మరో కీలక నిందితుడు నీరవ్ మామ మెహుల్ చోక్సీని బెల్జియంలో ఉండగా అధికారులు అరెస్టు చేశారు. వీరిద్దరూ కలిసి పంజాబ్ నేషనల్ బ్యాంకు కన్సార్టియంను రూ.13 వేల కోట్ల మేర మోసం చేశారు.

రాజు వెడలె...



శుక్రవారం లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్స్ అబేలో 'ఆర్డర్ ఆఫ్ ద బాత్' 300వ వార్షికోత్సవంలో బ్రిటన్ రాజు చార్లెస్3. మధ్యయుగాల నాటి ఈ కార్యక్రమం నాలుగేళ్లకోసారి జరుగుతుంది.

'రాణి' వచ్చె...



ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని మోకాలిపై కూర్చుని స్వాగతిస్తున్న అల్బేనియా ప్రధాని ఎడీ రమా. అల్బేనియాలో 47 యూరప్ దేశాల శిఖరాగ్రం జరుగుతున్న విషయం తెలిసిందే.

'86 47' సంకేతం
వెనుక ఏముంది?

ఎఫ్‌బీఐ మాజీ చీఫ్ కొమీ పోస్ట్ దుమారం
- అది ట్రంప్‌ను చంపేందుకు వాడిన 'కోడ్' అని ఆరోపణలు
- దర్యాప్తు చేపట్టిన నిఘా విభాగాలు

వాషింగ్టన్: ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) మాజీ బాస్ జేమ్స్ కొమీ సోషల్ మీడియాలో పెట్టిన '86 47'సంకేత పోస్ట్‌పై దర్యాప్తు చేపట్టామని హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టి నోమ్ గురువారం వెల్లడించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు పన్నిన కుట్రలో ఇదో భాగమని భావిస్తున్నట్లు ఆమెతోపాటు పలువురు రిపబ్లిక్ పార్టీ నేతలు ఆరోపణలు చేశారు. అంతకుముందు కొమీ ఇన్‌స్టా పోస్ట్‌లో 'బీచ్‌లో నడుస్తుండగా నత్త గుల్లలు '86 47'ఆకారంలో కనిపించాయి'అంటూ ఓ ఫొటోను షేర్ చేశారు. ఇందులోని 86ను తొలగించడం, వదిలించుకోవడం అనే అర్థమొచ్చేలా వాడుతారు. 47ను ట్రంప్‌ను సూచిస్తూ వాడిన రహస్య సంఖ్య. ఆయన అమెరికాకు 47వ అధ్యక్షుడు. మొత్తమ్మీద అధ్యక్షుడిని హత్య చేసేలా ప్రేరేపించడమే దీని వెనుక అర్థమని ట్రంప్ ప్రభుత్వంలోని పలువురు ఉన్నతాధికారులు అంటున్నారు. దీనిపై డీహెచ్‌ఎస్, సీక్రెట్ సర్వీస్ దర్యాప్తు చేపట్టి తగు రీతిలో స్పందిస్తాయని నోమ్ పేర్కొన్నారు. డొనాల్డ్ ట్రంప్ జూనియర్ కూడా తన తండ్రిని చంపాలని పిలుపునిస్తూ కొమీ ఈ పోస్ట్ పెట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు. సీక్రెట్ సర్వీస్ ఈ వ్యవహారంపై దర్యాప్తు జరుపుతోందని ఎఫ్‌బీఐ చీఫ్, భారత సంతతికి చెందిన కాశ్ పటేల్ తెలిపారు. పశ్చిమాసియాలో అధ్యక్షుడు ట్రంప్ పర్యటిస్తున్న సమయంలో ఆయన్ను చంపాలని ఉగ్రవాదులకు ఈ సంకేతం ద్వారా కొమీ ప్రేరేపించారని వైట్ హౌస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జేమ్స్ బ్లయిర్ ఆరోపించారు. నేషనల్ ఇంటెలిజెన్స్ చీఫ్ తుల్సి గబ్బార్డ్ కూడా ఇదే రకమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. 'ఈ పోస్ట్‌ను తీసిపారేయరాదు. ఇది చాలా ప్రమాదకరమైన పోస్ట్. అధ్యక్షుడు ట్రంప్‌పై ఇప్పటికే రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి'అని ఆమె అన్నారు. ఈ ఆరోపణలపై జేమ్స్ కొమీ స్పందించారు. 'రాజకీయ ఉద్దేశంతో పెట్టిన పోస్ట్‌పై హింసను ప్రేరేపించేలా ఉందంటూ కొందరు విపరీతార్థాలు తీస్తారని నేను ఊహించలేదు. హింసకు నేను పూర్తిగా వ్యతిరేకిని'అంటూ ఆయన తన పోస్ట్‌ను తొలగించారు. 2013-2017 మధ్య కాలంలో జేమ్స్ కొమీ ఎఫ్‌బీఐ చీఫ్‌గా పనిచేశారు.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై కేంద్రం అనాసక్తి

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చాలంటూ ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్ నెరవేరేలా కనిపించడం లేదు. ఆపరేషన్ సిందూర్ తాత్కాలికంగా నిలిపివేశామని, ఈ సమయంలో పార్లమెంట్‌ను సమావేశపర్చడం అనవసరమైన చర్చకు తావిచ్చినట్లు అవుతుందని బీజేపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే అఖిల పక్ష సమావేశంలో ఇందుకు సంబంధించిన అన్ని అంశాలపై అన్ని పార్టీలతో చర్చించిన విషయాన్ని వీరు గుర్తు చేస్తున్నారు. మళ్లీ ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం లేదని కొట్టిపారేస్తున్నారు. వచ్చే జూలైలో జరిగే వర్షాకాలం సమావేశాల్లోనే పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌లపై చర్చించాలని కేంద్ర ప్రభుత్వం యోచన చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉగ్రదాడి, పాక్‌పై తీవ్ర ఉద్రిక్తతలు వంటి కీలక పరిణామాల నేపథ్యంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల ప్రధానమంత్రి మోదీకి లేఖలు రాయడం తెలిసిందే.

భారత్ దిశగా చైనా గూఢచార నౌక

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర ఘటన అనంతరం భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ డ్రాగన్ దేశం కపటబుద్ధి మరోసారి బయట పెట్టుకుంది. ఆ దేశానికి చెందిన గూఢచార నౌక 'ద యాంగ్ యి హావో' భారత్ దిశగా వస్తోంది. ఈ విషయాన్ని డామియెన్ సిమోన్ అనే ఓపెన్‌సోర్స్ ఇంటెలిజెన్స్ నిపుణుడు తెలిపారు. చైనాకున్న గూఢచార నౌకల్లో ఇదొకటి. వీటిని పరిశోధన నౌకలని చైనా చెప్పుకుంటున్నప్పటికీ, వీటిని నిఘా నౌకలుగానే భారత్ తదితర దేశాలు పరిగణిస్తున్నాయి. శాస్త్రీయ పరిశోధనలతో పాటు పౌర, సైనిక అవసరాలను తీర్చేలా వీటిని రూపొందించారు. సముద్ర జలాల్లో పరిశోధనలు, సముద్ర గర్భం మ్యాపింగ్, ఖనిజ, జీవ వనరుల అన్వేషణ పేరుతో సంచరించే ఈ నౌకలు క్షిపణుల గమనాన్ని ట్రాక్ చేయగలవు, సబ్‌మెరీన్ల కదలికలను పసిగట్టడం వంటివి చేయగలవు. తాజాగా, మలక్కా నుంచి బయలుదేరిన ఈ నౌక శ్రీలంక దక్షిణ తీరం దిశగా సాగుతున్నట్లు మ్యాప్‌ను బట్టి సిమోన్ విశ్లేషించారు. ఈ నౌకతో ప్రమాదమేమంటే.. ఇందులో మనుషులతో అవసరం లేకుండా సముద్రం అడుగున సంచరిస్తూ నిఘా కార్యకలాపాలను నిర్వహించే వాహనాలుంటాయి. సముద్రం అడుగున మందుపాతరలు, ఇతర సైనిక కార్యకలాపాలను కనిపెట్టి మ్యాపింగ్ చేస్తాయి. భారత్‌లో క్షిపణి పరీక్షలు, ఇతర సైనిక కార్యకలాపాల సమయంలో చైనా నిఘా నౌకలు పొరుగుదేశాలకు చేరుకుని గూఢచర్యం చేయడం ఇటీవలి కాలంలో మామూలైపోయింది. గతేడాది ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5ను ప్రయోగించిన సమయంలో చైనాకే చెందిన జియాంగ్ యాంగ్ హాంగ్ 01 అనే గూఢచర్య మన దేశ సమీపానికి వచ్చింది. ఒడిశాలోని బాలాసోర్ తీరం వెంబడి క్షిపణి పరీక్షలప్పుడు సైతం చైనా నిఘా నౌకలు తూర్పు తీరానికి సమీపంలోకి వచ్చినట్లు తెలిసింది. విశాఖ తీరంలోని సబ్‌మెరీన్లలోని అణు క్షిపణుల సిగ్నళ్లను సైతం ఇవి కనిపెట్టే అవకాశముందని సమాచారం.

భారత్, అఫ్గాన్ స్నేహగీతం

అఫ్గాన్ విదేశాంగ మంత్రితో మాట్లాడిన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్

- పహల్గాం ఉగ్రవాద దాడిని ఖండించినందుకు కృతజ్ఞతలు
- పాకిస్తాన్‌ను ఏకాకిని చేసే దిశగా భారత్ వ్యూహరచన
- ప్రాంతీయ ప్రయోజనాల కోసం అఫ్గాన్‌కు స్నేహహస్తం
- రెండు దేశాల మధ్య మరింత బలపడనున్న సంబంధాలు

శత్రువుకు శత్రువు మిత్రుడు అన్నట్లుగా భారత్, అఫ్గానిస్తాన్ దేశాలు స్నేహగీతం పాడుకుంటున్నాయి. శతాబ్దాల క్రితం అఖండ భారత్‌లో భాగమైన రెండు దేశాల మధ్య మళ్లీ సంబంధాలు బలపడే సూచనలు కనిపిస్తున్నాయి. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తాజాగా అఫ్గానిస్తాన్ విదేశాంగ మంత్రితో మాట్లాడారు. పహల్గాం ఉగ్రవాద దాడిని ఖండించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. 2021 ఆగస్టులో తాలిబన్లు అఫ్గానిస్తాన్‌ను మరోసారి ఆక్రమించిన తర్వాత అక్కడి మంత్రితో అధికారికంగా మాట్లాడడం ఇదే మొదటిసారి కావడం విశేషం. భవిష్యత్తులో రెండు దేశాల మధ్య సంబంధాలు బలపడడం ఖాయమని చెప్పడానికి ఇదొక నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. అఫ్గాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం పట్ల భారత్ ఇటీవల సానుకూల వైఖరి ప్రదర్శిస్తోంది. ఇది ముమ్ముందు పూర్తిస్థాయి వ్యూహాత్మక ద్వైపాక్షిక బంధంగా మారిన ఆశ్చర్యం లేదు. 1999లో ఉగ్రవాదులు భారత విమానాన్ని హైజాక్ చేసి, అఫ్గానిస్తాన్‌లోని కాందహార్‌లో దించిన సంగతి తెలిసిందే. ప్రయాణికులను రక్షించడానికి సైనిక ఆపరేషన్ చేపట్టేందుకు భారత్ సిద్ధపడగా, అప్పటి తాలిబన్ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దాంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు చాలావరకు తెగిపోయాయి. తదనంతర పరిణామాల నేపథ్యంలో రెండు దేశాలు మళ్లీ ఒక్కటవుతున్నాయి.

తాలిబన్ల రాకతో దెబ్బతిన్న సంబంధాలు

శతాబ్దాల పాటు అఖండ భారత్‌లో అంతర్భాగంగా కొనసాగిన అఫ్గనిస్తాన్ 18వ శతాబ్దంలో ప్రత్యేక దేశంగా విడిపోయిందని చరిత్రకారులు చెబుతుంటారు. అమెరికా, రష్యా మధ్య ఆధిపత్య పోరుకు అఫ్గాన్ ఒక వేదికగా మారింది. చాలా ఏళ్లపాటు ఈ పోరాటం కొనసాగింది. 1973లో అఫ్గాన్ రిపబ్లిక్ దేశంగా అవతరించింది. అఫ్గాన్‌ను భారత్ అధికారికంగా గుర్తించింది. తమ మిత్రదేశంగా ప్రకటించింది. 1996 దాకా ఇరుదేశాల మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తలేదు. సాధ్యమైనంత వరకు పరస్పరం సహకరించుకున్నాయి. 1996లో తాలిబన్ల ప్రాబల్యం మొదలైంది. పాకిస్తాన్ అండతో తాలిబన్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అఫ్గాన్‌లో తాలిబన్ సర్కార్‌ను గుర్తించేందుకు భారత్ నిరాకరించింది. విమానం హైజాక్ ఘటన తర్వాత పరిస్థితి దిగజారింది. భారత్-అఫ్గాన్ సంబంధాలు పూర్తిగా చెడిపోయాయి. ఆ తర్వాత అమెరికాలో ప్రపంచ వాణిజ్య కేంద్రంపై అల్‌ఖైదా ఉగ్రవాదుల దాడి, అఫ్గాన్‌పై అమెరికా యుద్ధం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అమెరికా మద్దతుతో అఫ్గాన్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. 2021లో అమెరికా తన సేనలను అఫ్గాన్ నుంచి ఉపసంహరించుకోవడంతో తాలిబన్లు గద్దెనెక్కారు.

ఇన్నాళ్లూ రహస్యంగా చర్చలు!

మళ్లీ అధికారంలోకి వచ్చిన తాలిబన్లతో భారత ప్రభుత్వం తొలుత అంటీముట్టనట్లుగానే వ్యవహరించింది. వేచి చూసే ధోరణి అవలంబించింది. భారత్-అఫ్గాన్ మధ్య సంబంధాలు మానవతా సాయం, సాంస్కృతిక, క్రీడల రంగానికే పరిమితం అయ్యాయి. అఫ్గాన్ క్రికెటర్లు ఇండియాలో పోటీల్లో పాల్గొన్నారు. ఇరుదేశాల మధ్య చాలాసార్లు రహస్యంగా చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చాయి. కానీ, భారత్ వాటిని ఖండించింది. మరోవైపు సంబంధాలు మెరుగవుతున్న సూచనలు స్పష్టంగా కనిపించాయి. ఈ ఏడాది జనవరి 8వ తేదీన భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ అఫ్గాన్ విదేశాంగ మంత్రితో సమావేశమయ్యారు. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సైతం అఫ్గాన్ విదేశాంగ మంత్రితో మాట్లాడారు. ప్రాంతీయ ప్రయోజనాల కోణంలో అఫ్గాన్‌ను సన్నిహిత దేశంగా మార్చుకోవాలని భారత్ భావిస్తున్నట్లు సమాచారం.

పాకిస్తాన్‌కు ఇక ముసళ్ల పండుగే

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గత నెల 22వ తేదీన ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను పొట్టనపెట్టుకున్నారు. ఈ దాడికి పాకిస్తాన్ నుంచే కుట్ర జరిగినట్లు భారత్ గుర్తించింది. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను అంతం చేయాలన్న లక్ష్యంతో ఆపరేషన్ సిందూర్ ప్రారంభించింది. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను, వైమానిక స్థావరాలను నేలమట్టం చేసింది. ఉగ్రవాదం పీడను శాశ్వతంగా వదిలించుకోవడంతోపాటు దక్షిణాసియాలో తనకు తలనొప్పిగా మారిన పాకిస్తాన్‌ను ఏకాకిని చేసే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. వ్యూహాలకు పదును పెడుతోంది. అందులో భాగంగానే అఫ్గానిస్తాన్‌కు స్నేహహస్తం అందిస్తోంది. రాబోయే రోజుల్లో భారత్, అఫ్గాన్ మరింత సన్నిహితంగా మారితే పాకిస్తాన్‌కు ఇక్కట్లు తప్పవని నిపుణులు అంటున్నారు. ఆర్థిక, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవాలని భారత్, అఫ్గాన్ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

పాక్-అఫ్గాన్ మధ్య రగులుతున్న విభేదాలు

తాలిబన్లకు తండ్రి లాంటి పాకిస్తాన్, తాలిబన్ల పాలనలో ఉన్న అఫ్గానిస్తాన్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు రగులుతున్నాయి. ఇరుదేశాల మధ్య సరిహద్దు గొడవలు ముదురుతున్నాయి. తాలిబన్లు తమ చెప్పుచేతల్లో ఉండకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తుండడం పాకిస్తాన్ జీర్ణించుకోలేకపోతోంది. ఇస్లామాబాద్, కాబూల్ నడుమ సంబంధాలు వేగంగా పతనమవుతున్నాయి. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ) అనే సంస్థ పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తూంక్వా, బలూచిస్తాన్ ప్రావిన్స్‌ల్లో ఇటీవల దాడులకు పాల్పడింది. టీటీపీకి తాలిబన్ సర్కారు అండదండలు ఉన్నాయని పాక్ ఆరోపిస్తోంది. అఫ్గాన్ గడ్డపైనుంచే టీటీపీ కార్యకలాపాలు సాగిస్తోందని మండిపడుతోంది. టీటీపీ దాడులకు ప్రతీకారంగా గత ఏడాది డిసెంబర్‌లో పాక్ సైన్యం అఫ్గాన్‌లోని పాక్తీకా ప్రావిన్స్‌లో వైమానిక దాడులు నిర్వహించింది. ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశామని పాక్ ప్రకటించింది. ఈ దాడుల పట్ల తాలిబన్లు తీవ్రంగా స్పందించారు. పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. మరోవైపు సరిహద్దుల్లో కంచె వేసేందుకు పాక్ ప్రయత్నిస్తుండగా, తాలిబన్లు అడ్డుకుంటున్నారు. బ్రిటిష్ పాలకులు నిర్ధారించిన డురాండ్ లైన్‌ను సరిహద్దు రేఖగా ఇస్లామాబాద్ గుర్తిస్తుండగా, అఫ్గాన్ అందుకు ఒప్పుకోవడం లేదు. మరోవైపు 2023లో వేలాది మంది అఫ్గాన్ శరణార్థులను పాక్ ప్రభుత్వం బలవంతంగా బయటకు వెళ్లగొట్టింది. ఈ వ్యవహారంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

సాక్షి, నేషనల్ డెస్క్

ఇజ్రాయెల్ దాడుల్లో 93 మంది మృతి

గాజా: ఇజ్రాయెల్ మారణకాండ కొనసాగుతోంది. గురువారం రాత్రి నుంచి గాజాపై యథేచ్ఛగా కొనసాగించిన వైమానిక దాడుల్లో 93 మంది ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రుల సంఖ్య వందల్లోనే ఉంటుందని స్థానికులు తెలిపారు. డెయిర్ అల్-బలాహ్, ఖాన్‌యూనిస్ నగరాలు, చుట్టుపక్కల ప్రాంతాలను ఇజ్రాయెల్ ఆర్మీ లక్ష్యంగా చేసుకుంది. దాడులతో నేలమట్టమైన భవన శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని వెలికి తీసేందుకు స్థానికులు ప్రయత్నిస్తున్నారు. హమాస్‌ను తుదముట్టించేందుకు గురువారం 150 లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ శుక్రవారం తెలిపింది. ట్యాంకు విధ్వంసక క్షిపణి స్థావరాలు, మిలటరీ వసతులను ధ్వంసం చేయడంతోపాటు పలువురు మిలిటెంట్లను చంపినట్లు తెలిపింది. బెయిట్ లహియా పట్టణం, జబాలియాలో శరణార్థులున్న టెంట్లపై బాంబులు వేయడంతో ఆ ప్రాంతమంతా పొగలు, దుమ్ము వ్యాపించాయి. జనం కట్టుబట్టలతోనే ఆ ప్రాంతాలను ఖాళీ చేశారు. హమాస్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నుంచి బయటకు వచ్చిన ఇజ్రాయెల్ మార్చి 18వ తేదీ నుంచి గాజాపై మొదలుపెట్టిన దాడుల్లో ఇప్పటి వరకు 3 వేల మంది ప్రాణాలు కోల్పోగా రెట్టింపు సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. మిగతా బందీలను విడుదల చేసేలా హమాస్‌పై ఒత్తిడి పెంచేందుకు ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న గాజా దిగ్బంధనం మూడో నెలకు చేరుకుంది. ఇజ్రాయెల్ ఆర్మీ ఆ ప్రాంతంలోని లక్షలాది మందికి ఆహారం, నీరు, మందులు, ఇతర అత్యవసరాలను అందకుండా చేస్తోంది. ఇలా ఉండగా, గాజాపై ఇజ్రాయెల్ దాడులపై అబూధబిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. గాజా సహా ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామన్నారు. 'గాజాలో రోజూ ఎంతో మంది చనిపోతున్నారు. ఆకలితో అలమటిస్తున్నారు. చాలా విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి'అన్నారు. గాజాను ఫ్రీడం జోన్‌గా మార్చాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్యానించారు.

బిహార్‌లో బీఎస్పీ ఒంటరి పోరు!

మొత్తం 243 స్థానాల్లో పోటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నిర్ణయించింది. దోపిడీకి గురైన, అణగారిన, దళిత, అత్యంత వెనుకబడిన తరగతులను ఆదుకునేందుకు రాష్ట్రంలోని అన్ని సీట్లలో పోటీ చేయనున్నట్లు పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్ ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కచ్చితంగా నిర్ణయాత్మక పాత్ర పోషిస్తామన్నారు. గత 20 ఏళ్లుగా బిహార్ ఎన్నికల్లో బీఎస్పీ పోటీ చేస్తున్నా, రెండంకెల స్థానాలను గెలుచుకోలేదు. 243 స్థానాలున్న అసెంబ్లీలో 2000 ఎన్నికల్లో మాత్రమే 5 స్థానాలు గెలుచుకోగలిగింది. గత 2020 ఎన్నికల్లో ఒకే ఒక్క స్థానం దక్కింది. పెద్దగా సీట్లు గెలువలేకున్నా, బిహార్ ఎన్నికల్లో ఇతర కూటముల గెలుపోటములను మాత్రం ప్రభావితం చేస్తూ వస్తోంది. గడిచిన ఎన్నికల్లో ఎంఐఎం, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీల కలిసి పోటీ చేసిన బీఎస్పీ 1.49 శాతం ఓట్లను సాధించింది. ఎంఐఎం మాత్రం 1.3 శాతం ఓట్లతో 5 స్థానాలు గెలుచుకుంది. బీఎస్పీ 70కి పైగా స్థానాల్లో పోటీ చేసి చాలా చోట్ల ఆర్‌జేడీ, కాంగ్రెస్ కూటమి ఓట్లకు గండి కొట్టింది. బీఎస్పీ పోటీ చేసిన స్థానాలన్నీ ఎస్సీలు, ముస్లింలు అధికంగా ఉన్న స్థానాలే. దీంతో ఇక్కడ ఓట్లు చీలి ఇతర పార్టీల గెలుపు అవకాశాలకు దెబ్బతీసింది. ఈసారి ఎన్నికల్లో ఎస్సీ, మైనార్టీ ఓట్ల బలంతోనే అన్ని సీట్లలో పోటీ చేయాలని పార్టీ నిర్ణయించింది. రాష్ట్రంలో 15.5 శాతం ఎస్సీలు, 17.70 శాతం మంది ముస్లింలు ఉన్నారు. ఈ రెండు వర్గాలే 32శాతం పైగా ఉండటంతో బీఎస్పీ వీరు మెజారిటీగా ఉన్న సీట్లపైనే దృష్టి సారించనుంది. అదే జరిగితే ముస్లిం ఓట్లను నమ్ముకున్న కాంగ్రెస్, ఆర్‌జేడీల ఓట్లకు గండి పడటం ఖాయం. ఈ వర్గాలనే టార్గెట్ చేస్తూ బీఎస్పీ ఇప్పటికే అక్కడ ప్రచారం సైతం మొదలు పెట్టింది. జూన్ నుంచి నెలకో సభ చొప్పున నవంబర్ వరకు వరుస బహిరంగ సభలు నిర్వహించేందుకు బీఎస్పీ అధినేత్రి మాయావతి సిద్ధమవుతున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

రేపు భారత్, పాక్ డీజీఎంఓల చర్చలు

ఇస్లామాబాద్: వివాదాస్పద అంశాలపై భారత్ తమతో చర్చలకు ముందుకు రావాలని పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాఖ్ దార్ కోరారు. ఆయన తాజాగా పాక్ సెనేట్‌లో ప్రసంగించారు. కలిసి కూర్చొని, సుహృద్భావ వాతావరణంలో చర్చించుకుందామని ఇండియాకు పిలుపునిచ్చారు. వేర్వేరు వివాదాస్పద అంశాలపై చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాల్పుల విరమణను ఈ నెల 18వ తేదీ దాకా పొడిగించినట్లు చెప్పారు. ఇరుదేశాల డీజీఎంఓలు 18వ తేదీన మళ్లీ చర్చిస్తారని వెల్లడించారు. భారత్, పాక్ మధ్య వివాదాలకు ముగింపు పలకాలంటే రాజకీయపరమైన చర్చలే అంతిమ మార్గమని అభిప్రాయపడ్డారు. సింధూ నది జలాలు తమ దేశంలోకి ప్రవహించకుండా ఎవరైనా అడ్డుకుంటే అది యుద్ధ చర్యగానే పరిగణిస్తామని ఇషాఖ్ దార్ స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా, పాకిస్తాన్‌తో చర్చలు జరిగితే పీఓకే, ఉగ్రవాదుల అప్పగింతపైనే జరగాలని భారత్ తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే. నిజానికి 2003లో జనరల్ పర్వేజ్ ముషారఫ్ హయాంలో భారత్, పాక్ మధ్య చర్చలు జరిగాయి. 2008లో జరిగిన ముంబై ఉగ్రవాద దాడుల తర్వాత చర్చలు ఆగిపోయాయి.

కరోనా వల్ల 1.8 ఏళ్లు
తగ్గిపోయిన సగటు జీవితకాలం

ప్రజల జీవన నాణ్యతను దెబ్బతీసిన మహమ్మారి ● ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

న్యూయార్క్: కోవిడ్-19 సృష్టించిన విలయం మర్చిపోలేనిది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని ఈ మహమ్మారి బలి తీసుకుంది. కరోనా వల్ల ప్రపంచవ్యాప్తంగా మనుషుల సగటు జీవిత కాలం 1.8 సంవత్సరాలు పడిపోయినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) వెల్లడించింది. ఈ తాజాగా 'ప్రపంచ ఆరోగ్య గణాంకాలు-2025' నివేదికను విడుదల చేసింది. మహమ్మారి ప్రజల ప్రాణాలను హరించడమే కాదు, జీవన నాణ్యతను సైతం దెబ్బతీసినట్లు నివేదిక పేర్కొంది. 2019 నుంచి 2021 మధ్య సగటు జీవిత కాలం 1.8 ఏళ్లు పడిపోయిందని, చరిత్రలో ఇదే అతిపెద్ద పతనమని స్పష్టంచేసింది. నివేదికలోని ముఖ్యాంశాలు...



- కరోనా విపత్తు సమయంలో కేవలం ఆందోళన, కుంగుబాటు వల్ల ఆరోగ్యకరమైన సగటు జీవితకాలం ఆరు వారాలు పడిపోయింది.
- ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో కొంత ప్రగతి నమోదైనప్పటికీ, సాధించాల్సింది ఇంకెంతో ఉంది.
- పొగ తాగడం తగ్గించుకోవడం, మెరుగైన వాయు నాణ్యత, సురక్షితమైన తాగునీరు, పారిశుధ్య వసతులు అందుబాటులోకి రావడం వల్ల 1.4 బిలియన్ల మంది ఆరోగ్యంగా జీవిస్తున్నారు.
- మరోవైపు అత్యవసర వైద్య సేవలు పొందడం వేగంగా మెరుగుపడడం లేదు. కేవలం 431 మిలియన్ల మంది మాత్రమే ఈ సేవలు పొందగలుగుతున్నారు.
- మాత, శిశు మరణాలు ఆశించిన స్థాయిలో తగ్గడం లేదు. 2000 నుంచి 2023 దాకా ఈ విషయంలో కొంత ప్రగతి సాధ్యమైంది. బాలింతల మరణాలు 40 శాతం తగ్గాయి.
- ఆరోగ్య రంగానికి ప్రభుత్వాలను తగినన్ని నిధులు కేటాయించడం లేదు. నైపుణ్యం కలిగిన వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది.
- ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే 2030 నాటికి అదనంగా 7 లక్షల మాత మరణాలు, 80 లక్షల శిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉంది.
- ప్రస్తుతం 70 ఏళ్లలోపు వయసున్న వారిలో అత్యధిక మరణాలకు హృదయ సంబంధిత వ్యాధులు, గుండె పోటు, క్యాన్సర్, డయాబెటిస్ కారణమవుతున్నాయి.
- చైల్డ్‌హుడ్ వ్యాక్సినేషన్ రేటు కోవిడ్‌కు ముందున్న స్థాయికి ఇంకా చేరుకోలేదు. దీనివల్ల బాలలకు ముప్పు పొంచి ఉంది.

'దేవానాం ప్రియ' అనేది ఎవరి బిరుదు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

కళింగ యుద్ధం అశోకుడు పూర్తిగా ధర్మం వైపుగా పరివర్తనం చెందడానికి కారణమైంది. ధర్మ ప్రచారం కోసం ఈయన ధర్మ మహామాత్రులు అనే ప్రచారకులను నియమించాడు. వీరిని పశ్చిమాసియా, శ్రీలంకకు పంపించాడు. మానవుడిని నైతికంగా, ఉన్నతంగా చేసేవిధంగా, సమాజాన్ని ఉద్ధరించేలా దమ్మ సూత్రాలను రూపొందించాడు. అంతేగాని ప్రజలపై మతాన్ని రుద్దడం వీటి ఉద్దేశం కాదు.

జైనమతం (క్రీ.పూ. 540-468)

జైనమత స్థాపకుడు రుషభనాథుడు. జైన ప్రవక్తలను 'తీర్థంకరులు' అంటారు. మొత్తం 24 మంది తీర్థంకరులు ఉండేవారు. రుషభనాథుడు మొదటి తీర్థంకరుడు. 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడు. చివరివారైన 24వ తీర్థంకరుడు మహావీరుడు.

మహావీరుడు క్రీ.పూ. 540లో వైశాలి నగరానికి సమీపాన ఉన్న 'కుంద' గ్రామంలో క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు సిద్ధార్థుడు, వైశాలి. మహావీరుడి భార్య యశోధ, కుమార్తె ప్రియదర్శిని. ఈయన జీవిత సుఖాలతో తృప్తి చెందక కొంత కాలం దిగంబరుడిగా కఠోర నియమాలను పాటించి తపస్సు చేశాడు. 'జృంబిక' గ్రామంలో పరిపూర్ణజ్ఞానాన్ని పొందిన తర్వాత 'మహావీరుడు'గా పేరు పొందాడు. ఈయన ప్రబోధించిన సరైన క్రియ, సరైన విశ్వాసం, సరైన జ్ఞానం అనే మూడు అంశాలను 'త్రిరత్నాలు'గా పేర్కొంటారు. పంచవ్రతాల ద్వారా మోక్షాన్ని సాధించవచ్చని మహావీరుడు ప్రవచించాడు. ఈయన తన 72వ ఏట క్రీ.పూ. 468లో 'పావాపురి' వద్ద నిర్యాణం చెందాడు.

జైనులు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు. ఉపవాసాలు చేసి శరీరాన్ని కృశింపజేసుకొని మరణించడాన్ని 'సల్లేఖన వ్రతం'గా పేర్కొంటారు. చాలా మంది రాజులు జైనమతాన్ని ఆదరించి అభివృద్ధి చేశారు. చంద్రగుప్త మౌర్యుడు ఈ మతాన్ని అనుసరించి, అన్నింటినీ త్యజించి శ్రావణ బెళగొళలో మరణించాడు. జైనులు ప్రజల భాష అయిన ప్రాకృతంలో తమ సందేశాన్ని ప్రచారం చేశారు. చంద్రగుప్తుడి కాలంలో పాటలీపుత్రంలో స్థూలభద్ర ఆధ్వర్యంలో జైనమత మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జైనమత బోధనలను 12 అంగాలుగా విభజించి క్రోడీకరించారు. కొంతకాలం తర్వాత వస్త్రధారణ విషయంలో అభిప్రాయభేదాలు తలెత్తడం వల్ల జైనమతం దిగంబర, శ్వేతాంబర శాఖలుగా చీలిపోయింది. రెండో జైన సంగీతి క్రీ.శ. 512లో వల్లభి (గుజరాత్)లో దేవార్ధి క్షమపణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 'గంధర్వ' అనే పవిత్ర గ్రంథాలను క్రమానుసారంగా రాశారు. జైనులు శిల్పకళను అభివృద్ధి చేశారు.

క్రీ.పూ. 4వ శతాబ్దం చివరి రోజుల్లో గంగా లోయ ప్రాంతంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో చాలామంది జైన గురువులు, సన్యాసులు దక్షిణ భారతదేశానికి తరలివెళ్లారు. ముఖ్యంగా శ్రావణ బెళగొళ ప్రాంతానికి ఎక్కువ మంది వచ్చారు. దక్షిణానికి వచ్చినవారిలో భద్రబాహుడు, చంద్రగుప్త మౌర్యుడు లాంటి ప్రముఖులు ఉన్నారు. మగధలో ఉన్న జైనులు శ్వేతాంబరులయ్యారు. వీరికి గురువు స్థూల బాహుడు.

జైనమత మహత్వ సూత్రాలు:

1) అహింస
2) సత్యభాషణ
3) అపరిగ్రహం (దొంగిలించకపోవడం)
4) అస్తేయం (ఆస్తి లేకుండా ఉండటం)
5) బ్రహ్మచర్యం

వీటిలో మొదటి నాలుగు సూత్రాలు మహావీరుడి ముందు కాలం నుంచే అమల్లో ఉన్నాయి. మహావీరుడు బ్రహ్మచర్యాన్ని పంచమ సూత్రంగా కలిపాడు.

జైనుల ప్రధాన కట్టడాలు:

- అబూ పర్వతం-మహావీరుడి దేవాలయం
- శ్రావణ బెళగొళ-గోమతేశ్వరుడి విగ్రహం
- అజంతా, ఎల్లోరా, ఉదయగిరి గుహలు
- బాదామి – జైన దేవాలయాలు

అజీవికులు: గోశాల మస్కారిపుత్రుడు అజీవిక మతశాఖను స్థాపించారు. ఇది జైన మత సిద్ధాంతాలకు సన్నిహితంగా ఉంది. అశోకుడి కాలంలో ఇది బాగా వ్యాప్తి చెందింది.

హర్యాంక వంశం (క్రీ.పూ.542-490)

క్రీ.పూ. 542–490 మధ్య కాలంలో రాజకీయంగా అనేక పరిణామాలు సంభవించాయి. ఉత్తర భారతదేశంలో మహాజనపదాలుగా పేర్కొనే పదహారు పెద్ద రాజ్యాలు ఏర్పడ్డాయి. వీటినే 'షోడశ మహాజనపదాలు' అంటారు. వీటిలో మగధ రాజ్యం శక్తిమంతమైంది. గిరివ్రజం, పాటలీపుత్రం దీని రాజధాని నగరాలు. మొదటగా దీన్ని బృహద్రథ వంశస్థులు పాలించారు. తర్వాత హర్యాంక వంశస్థులు పరిపాలించారు. వీరిలో బింబిసారుడు గొప్పవాడు. ఈయన తర్వాత అజాతశత్రువు పాలించాడు.



అజాతశత్రువు పాలనా కాలం క్రీ.పూ. 495–464. ఈయన హర్యాంక వంశ స్థాపకులైన బింబిసారుడి కుమారుడు. అజాతశత్రువు భార్య వజీరాదేవి. ఈమె కోసలరాజు ప్రసేనజిత్తు కుమార్తె. అజాతశత్రువు వజ్జి గణరాజ్య సమాఖ్యతో 16 ఏళ్లు యుద్ధం చేసి జయించాడు. కంటక శిల, కంటక బోధన అనే రాళ్లు, విసరు రథాలను యుద్ధంలో ఉపయోగించి శత్రురాజులను జయించాడు. ఈయన పాటలీపుత్రాన్ని నిర్మించాడు. ఈయనకు కుణిక అనే పేరు కూడా ఉంది. ఉదయనుడు ఈయన వారసుడు. అజాతశత్రువు గౌతమబుద్ధుడి సమకాలీకుడు.

హర్యాంక వంశం తర్వాత మగధను శిశునాగ వంశం (క్రీ.పూ. 490–458) పాలించింది. వీరి తర్వాత నంద వంశస్థులు రాజ్యానికి వచ్చారు. నంద వంశంలో మహాపద్మనందుడు గొప్పరాజుగా పేరు పొందాడు. ఈయనకు 'మహాక్షత్రాంతక' అనే బిరుదు ఉంది. ఆ తర్వాత చంద్రగుప్త మౌర్యుడు చాణక్యుని సహాయంతో నందవంశాన్ని నిర్మూలించి మౌర్యవంశాన్ని స్థాపించాడు.

విదేశీ దండయాత్రలు (క్రీ.పూ. 327–325):

భారతదేశంలో రాజకీయ అనైక్యత కారణంగా విదేశీయులు దండయాత్రలు ప్రారంభించారు. పారశీకులు మొదటగా భారత్‌పై దండయాత్ర చేశారు. వీరిలో 'సైరస్', 'డేరియస్' గొప్పవారు. పారశీక చక్రవర్తి 'సైరస్' గాంధారను జయించారు. వీరి తర్వాత గ్రీకులు భారతదేశంపై దండెత్తారు. గ్రీకు రాజ్యాల్లో అగ్రగామి అయిన మాసిడోనియా చక్రవర్తి అలెగ్జాండర్ విశ్వవిజేతగా పేరు పొందారు. గ్రీకు దండయాత్రల ఫలితంగా భారతదేశానికి, యూరప్ దేశాల మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. భారతీయులు గ్రీకుల నుంచి నాణేల ముద్రణ; శిల్ప, ఖగోళ శాస్త్రాలను నేర్చుకున్నారు.

మౌర్య సామ్రాజ్యం (క్రీ.పూ. 322)

మౌర్యుల చరిత్రకు ఆధారాలు:

విదేశీ గ్రంథాలు: మెగస్తనీస్ (గ్రీకు రాయబారి) రాసిన 'ఇండికా', స్ట్రాబో, డియోడరస్, ఏరియన్, ప్లీనీ రచనలు మౌర్యుల చరిత్రకు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

సాహిత్య ఆధారాలు: కౌటిల్యుడి 'అర్థశాస్త్రం', విశాఖదత్తుడి 'ముద్రారాక్షసం'.

మత సంబంధ ఆధారాలు: పురాణాలు, బౌద్ధుల దివ్య వదన, అశోకవదన, శ్రీలంకకు సంబంధించిన దీపవంశ, మహావంశ, జైనులకు సంబంధించిన పరిశిష్ట పర్వణ్ మొదలైనవి కూడా మౌర్యుల చరిత్రను తెలుసుకోవడానికి దోహదపడుతున్నాయి.

వీటితో పాటు శిలా శాసనాలు, రాతి చెక్కడాలు, గుహలు కూడా మౌర్యుల చరిత్రకు ఆధారాలుగా ఉన్నాయి.

చంద్రగుప్త మౌర్యుడు: ఈయన మౌర్యవంశ స్థాపకుడు. చంద్రగుప్త మౌర్యుడు తన చివరి రోజుల్లో కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో జీవించాడు. 'సల్లేఖన వ్రతం' ద్వారా మరణించాడు. ఈయన క్రీ.పూ. 303లో 'సెల్యూకస్ నికేటర్'తో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా మౌర్య సామ్రాజ్యానికి ఎక్కువ ప్రయోజనం కలిగింది.

బిందుసారుడు (క్రీ.పూ. 298–273): ఈయన చంద్రగుప్త మౌర్యుడి కుమారుడు. బిందుసారుడికి 'అమిత్రఘాత', 'సింహసేనుడు' అనే బిరుదులు ఉన్నాయి. ఈయన రాజ్యాన్ని మైసూరు వరకు విస్తరించాడు. చాణక్యుడు కొంత కాలంపాటు బిందుసారుడికి కూడా మహామంత్రిగా ఉండి ఆయనకు రాజ్య రక్షణలో సాయపడినట్లుగా టిబెట్ చరిత్రకారుడు తారానాథ్ పేర్కొన్నారు.

బిందుసారుడి పాలనా కాలంలో తక్షశిలలో తిరుగుబాటు జరిగింది. ఈయన ఆజ్ఞ ప్రకారం అశోకుడు తక్షశిలకు వెళ్లి శాంతి నెలకొల్పాడు. బిందుసారుడు గ్రీకు రాజ్యాలతో స్నేహ సంబంధాలు పెంపొందించాడు.

అశోకుడు (క్రీ.పూ. 273–232): ఈయన బిందుసారుడి కుమారుడు. అశోకుడు పట్టాభిషేకం చేసుకున్న తొమ్మిదేళ్లకు (క్రీ.పూ. 262– 61లో) సామ్రాజ్యకాంక్షతో కళింగ రాజ్యంపై దండెత్తి జయించాడు. ఈ యుద్ధం 'ధర్మాశోకుడు'గా పూర్తిగా పరివర్తనం చెందడానికి కారణమైంది. ఆ తర్వాత ఉపగుప్తుడు అనే బౌద్ధ ఆచార్యుడి వద్ద అశోకుడు బౌద్ధమత దీక్ష స్వీకరించాడు. ధర్మప్రచారానికి పూనుకొని 'దేవానాం ప్రియ', 'ప్రియదర్శిని' బిరుదులు పొందాడు. బానిసలు, సేవకుల పట్ల కరుణ, తల్లిదండ్రులు, పెద్దల పట్ల విధేయత, గురువుల పట్ల గౌరవం, స్నేహితులు, బంధువులు, పరిచయస్థుల పట్ల ఔదార్యం, పురోహితులు, భిక్షువుల పట్ల ఆదరణ అనేవి అశోకుడు ప్రబోధించిన 'ధర్మం'లోని సూత్రాలు. 'అహింసా' అనేది 'ధర్మం'లోని ముఖ్యసూత్రం. అశోకుడు 42 ఏళ్లు పరిపాలించి క్రీ.పూ. 232లో మరణించాడు.

వివిధ శాసనాల ఆధారంగా అశోకుడి సామ్రాజ్య సరిహద్దుల గురించి తెలుస్తోంది. షహబద్‌గిరి, మాన్‌షేషరా శాసనాలు వాయవ్య సరిహద్దును, రుమిండై శాసనం ఈశాన్య సరిహద్దును, సొపారా, గిర్నార్ శాసనాలు పశ్చిమ సరిహద్దును తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. బబ్రూ శాసనం అశోకుడి బౌద్ధమత స్వీకారం గురించి, ధౌలీ, జునాగఢ్ శాసనాలు ఉదాత్త రాజ ధర్మ స్వరూపం గురించి, బరాబర్ శాసనం పరమత సహనం గురించి, 13వ శిలాశాసనం కళింగ యుద్ధం గురించి తెలుపుతున్నాయి. మస్కీలో అశోక అనే పదం ఉంది. కళింగ యుద్ధం తర్వాత అశోకుడి పాలన గురించి కళింగ శాసనం ద్వారా తెలుస్తోంది. రుమిండై, ఇగ్లివ శాసనాలు అశోకుడికి బుద్ధుడిపై ఉన్న గౌరవాన్ని వివరిస్తాయి. తరాయి శాసనం అశోకుడికి బౌద్ధమతంపై ఉన్న గౌరవాన్ని తెలుపుతుంది.

అన్ని మతాల సారాంశం ఆధారంగా అశోకుడు కొన్ని సూత్రాలతో దమ్మను తయారు చేశాడు. ఈయన దమ్మ ప్రచారం కోసం ధర్మమహామాత్రులు అనే ప్రచారకులను పంపిస్తే వారు బౌద్ధ మతాన్ని ప్రచారం చేశారు. భారత ఉపఖండంలో అశోకుడు వేయించిన 14 ప్రధాన శిలా శాసనాలు, ఏడు స్తంభ శాసనాలు, అనేక చిన్నరాతి శాసనాలు లభించాయి. ఇందులో చాలావాటిపై ప్రజల కోసం చేసిన ప్రకటనలు చెక్కారు. 14 శిలా శాసనాలు అశోకుడి దమ్మ సూత్రాల గురించి తెలుపుతున్నాయి. మస్కీ శాసనంలో 'దేవానాం ప్రియ' అని ఉంది.

మౌర్య వంశ చివరి పాలకులు (క్రీ.పూ. 232 – 185): అశోకుడి తర్వాత వచ్చిన రాజులు అర్ధ శతాబ్దం పాటు పాలించారు. మౌర్య వంశ చివరి రాజైన బృహద్రథుడిని ఆయన సేనాని పుష్యమిత్రుడు వధించి మగధను ఆక్రమించడంతో వీరి పాలన అంతమైంది.

మౌర్యుల పాలనా వ్యవస్థ

భారతదేశంలో ప్రప్రథమంగా కేంద్రీకృత అధికారాలు కలిగిన నిర్దిష్టమైన పరిపాలన రూపొందించింది మౌర్య చక్రవర్తులే. వీరికి పాలనలో సలహా కోసం మంత్రితో పాటు పరిషత్తు ఉండేది. పాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని నాలుగు రాష్ట్రాలుగా విభజించి వాటికి రాజప్రతినిధులను నియమించారు. భూమిశిస్తు ప్రభుత్వ ప్రధాన ఆదాయం. పంట దిగుబడిలో 4 నుంచి 6వ వంతు వరకు శిస్తు వసూలు చేసేవారు. పాటలీపుత్ర నగర పాలన ముప్పై మంది సభ్యులున్న బోర్డు నిర్వహణలో ఉండేది. వర్తకుల 'శ్రేణులు' బ్యాంకులుగా పనిచేశాయి. సమాజంలో బహు భార్యత్వం, కన్యల విక్రయం, సతీసహగమనం లాంటి దురాచారాలు ఉండేవి. ఈ కాలంలో స్త్రీల స్థాయి తగ్గింది. మౌర్యులు ఎక్కువగా ప్రజల భాష అయిన ప్రాకృతాన్ని ఉపయోగించారు. శిలా శాసనాల్లో 'ఖరోష్టి', 'బ్రాహ్మి' లిపులను వాడారు.

అప్రయత్నంగా మెరిసిన భావాల అక్షరాకృతి?



ఆధునిక కవితోద్యమాలు

భావ కవిత్వం

తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు సుబ్బారావు. తొలి తెలుగు భావ కవితా రచన రాయప్రోలు రాసిన 'లలిత'. భావ కవిత్వాన్ని వివిధ కవులు వివిధ పేర్లతో పిలిచారు.

1. రాయప్రోలు సుబ్బారావు – అభినవ కవిత
2. దేవులపల్లి కృష్ణశాస్త్రి – కాల్పనిక కవిత్వం
3. నోరి నరసింహశాస్త్రి – నవ్య కవిత్వం
4. దువ్వూరి రామిరెడ్డి – గీత కవిత్వం

- భావ కవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఆంధ్రపత్రిక సహాయ సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారని డాక్టర్ గిడుగు సీతాపతి 'హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్' అనే గ్రంథంలో పేర్కొన్నారు.
- ఆంగ్లంలోని '**లిరికల్ పోయెట్రీ**'నే తెలుగులో '**భావ కవిత్వం**' అని పిలుస్తున్నారు.
- 'లిరిక్' అంటే '**గాన గుణం అమరిన రచన**' అని అర్థం.
- భావ కవులు వియోగ శృంగారానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.
- తెలుగులో నవ్య కవిత్వానికి కట్టమంచి రామలింగారెడ్డి '**ముసలమ్మ మరణం**' నాందిగా చెప్పవచ్చు.
- భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్తగా **కట్టమంచి రామలింగారెడ్డి**ని పిలుస్తారు.
- తెలుగులో నవ్య సాహిత్య యుగానికి **రాయప్రోలు, గురజాడ**ను ఆద్యులుగా చెబుతారు.
- తెలుగులో భావ కవిత్వానికి మూలం **కాల్పనికవాదం**. దీనికి మూల పురుషుడు **రూసో**.
- ఆధునిక కాల్పనికతకు న్యాయనిర్ణేత – **రూసో**.
- ఫ్రెంచ్ సాహిత్యంలో జనించిన '**రొమాంటిసిజమ్**'ను అనుసరించిన కవులనే '**కాల్పనికవాద కవులు**' అంటారు.
- రొమాంటిసిజంనే ఆంగ్ల సాహిత్యంలో లిరికల్ పోయెట్రిగా పిలుస్తారు.
- '**లిరికల్ పోయెట్రీ**'ని తెలుగులో **ఆత్మాశ్రయ కవిత్వం** అంటారు.
- కాల్పనికోద్యమ పితామహునిగా **రూసో**ను (1712 -88) పాశ్చాత్యులు అంగీకరించారు.
- రూసో 'న్యూ హెలాయిస్' రచనలో ప్రణయతత్వాన్ని, 'సోషల్ కాంట్రాక్ట్' గ్రంథంలో మానవతావాదాన్ని ప్రతిపాదించారు.
- కాల్పనికోద్యమానికి మూలసూత్రం – **ఆత్మాశ్రయ సిద్ధాంతం**.
- భావకవితోద్యమం మూడు (1910–40) దశాబ్దాల పాటు విలసిల్లింది.

భావ కవిత్వం - నిర్వచనాలు

1. 'కవికి తన్మయజ్యోతి మెఱుపువలె చటాలున ఒక్కసారి మెరయును. దానికి ప్రతిఫలమే ఉత్తమ కవిత లేక భావకవిత' – **వేలూరి శివరామశాస్త్రి** (1929 భారతి పత్రికలో)
2. 'కవి అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావ కవిత్వం' – **విశ్వనాథ సత్యనారాయణ**.
3. 'కవి హృదయంలో తటిల్లత లాగా అప్రయత్నంగా మెరసిపోయిన భావాల అక్షరాకృతి భావ కవిత' – **శ్రీశ్రీ**.
4. 'వస్తు, భావ రచనల్లో భావానికి ప్రాధాన్యత అగ్రతాంబూలమిచ్చిన కవిత భావకవిత్వం' – సి.నా.రె.

భావ కవిత్వం లక్షణాలు

1) ఆత్మాశ్రయత	2) ప్రకృతి ప్రీతి
3) స్వేచ్ఛాప్రియత్వం	4) ప్రణయం
5) దేశభక్తి	6) సంఘ సంస్కరణాభిలాష
7) స్త్రీ ఉదాత్త చిత్రణ	
8) మానవ సామాజిక స్పృహ	
9) మార్మికత	10) స్మృతి

భావ కవిత్వం - శాఖలు

- డాక్టర్ సి.నారాయణరెడ్డి భావ కవిత్వాన్ని ఆరు శాఖలుగా విభజించారు.
- భావ కవిత్వంలోని ప్రధాన శాఖలు
  1) ప్రకృతి కవిత్వం 2) ప్రణయ కవిత్వం
  3) సంఘ సంస్కరణ కవిత్వం
  4) దేశ భక్తి కవిత్వం
  5) స్మృతి కవిత్వం 6) మర్మ కవిత్వం

సుప్రసిద్ధ భావకవులు - వారి రచనలు

- **రాయప్రోలు సుబ్బారావు** – లలిత, అనుమితి, తృణకంకణము, ఆంధ్రావళి, మధుకలశం, స్నేహలత, కష్టకమల, వనమాల, జడకుచ్చులు మొదలైనవి.
- **బసవరాజు అప్పారావు** – సెలయేటి గానం, ప్రేమతత్వం, బసవరాజు అప్పారావు గీతాలు.
- **పింగళి – కాటూరి కవులు** – తొలకరి, సంక్రాంతి, సౌందర నందనం.
- **కాటూరి వెంకటేశ్వరరావు** – గుడిగంటలు, పౌలస్త్య హృదయం.
- **దేవులపల్లి కృష్ణశాస్త్రి** – కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, పల్లకి, సంస్కర్త మొదలైనవి.
- **దువ్వూరి రామిరెడ్డి** – పానశాల, భగ్నహృదయం, కడపటి వీడ్కోలు, స్వప్నశేషం, నలజారమ్మ అగ్ని ప్రవేశం, కృషీవలుడు, వనకుమారి, జలదాంగన మొదలైనవి.
- **నండూరి సుబ్బారావు** – యెంకి పాటలు
- **నాయని సుబ్బారావు** – సౌభద్రుని ప్రణయ యాత్ర, మాతృగీతాలు, విషాదమోహనం, వేదనా వాసుదేవం, భాగ్యనగర కోకిల మొదలైనవి.
- **వేదుల సత్యనారాయణశాస్త్రి** – దీపావళి, ముక్తఝరి.
- **అబ్బూరి రామకృష్ణారావు** – మల్లికాంబ, జలాంజలి, ఊహాగానం, నదీ సుందరి, ఎర్రగన్నేరు, రసపిపాసి, కాపుపాలు, మాతృ భూమి, తిక్కన మొదలైనవి.
- **అడవి బాపిరాజు** – శశికళ, గోధూళి, గంగిరెద్దు, వరద గోదావరి, చిగురుటాకులు, గడ్డిపూల పళ్ళెం, తరంగిణి, శిల్పబాల.
- **విశ్వనాథ సత్యనారాయణ** – ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం, వరలక్ష్మి త్రిశతి, శశిధూతం, కిన్నెరసాని, కోకిలమ్మ పెళ్ళి, గిరికుమారుని ప్రేమగీతాలు, భ్రష్టయోగి.

అభ్యుదయ కవిత్వం

సామాజిక సిద్ధాంత బలాన్ని సమన్వయించుకొని వెల్లువెత్తిన తొలి ఆధునిక కవితోద్యమం **అభ్యుదయ కవిత్వం**. ఇది ఆంధ్రదేశంలో 1940 నుంచి 1960 చివరి వరకు ఉధృతంగా సాగింది. అభ్యుదయం అనే పదానికి **మంగళం, శుభం** అనే నైఘంటికార్థాలున్నాయి. ఆంగ్లంలోని '**ప్రోగ్రెస్**' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో '**అభ్యుదయం**' అనే పదాన్ని వాడుతున్నారు. ప్రస్తుతం ఈ పదానికి '**పురోగమనం, ప్రగతి శీలం, చైతన్యం**' అనే స్థూలార్థాలను గ్రహిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడితజన పక్షం, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలను ప్రవేశపెట్టింది **అభ్యుదయ కవిత్వమే**.

- సంస్కృతి పరిరక్షణ కోసం 1935లో '**పారిస్**'లో అంతర్జాతీయ రచయితల సదస్సు జరిగింది.
- 1935లో డిసెంబర్‌లో అలహాబాద్‌లో '**ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్**'ను ఏర్పాటు చేశారు.
- 1936 ఫిబ్రవరిలో లండన్ నుంచి వెలువడే '**ది డెయిలీ ట్రిబ్యూన్**' పత్రికలో భారత అభ్యుదయ రచయితల ప్రణాళికను ప్రకటించారు.
- 1936 ఏప్రిల్ 9, 10 తేదీల్లో లక్నోలో '**మున్షీ ప్రేమ్ చంద్**' అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ నిర్వహించారు.
- 1932లో ఆడెన్ తదితర కవులు ఆంగ్లంలో '**న్యూ సిగ్నేచర్స్**' అనే కవితా సంకలనాన్ని వెలువరించారు.
- 1850 దశకంలో వెలువడిన కారల్ మార్క్స్ రచనలు ప్రపంచ వ్యాప్తంగా కవులు, కళాకారుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి.
- తెలుగునాట అభ్యుదయ సాహిత్యోద్యమానికి **మార్క్సిజమే** పునాది. 1943లో **అభ్యుదయ రచయితల సంఘాన్ని** ఏర్పరిచారు.
- 1943లో తెనాలిలో జరిగిన తొలి అభ్యుదయ రచయితల మహాసభలకు **తాపీ ధర్మారావు** అధ్యక్షత వహించారు.
- 1955లో బెజవాడలో **శ్రీశ్రీ** అధ్యక్షతన 5వ మహాసభలు జరిగాయి.
- చిట్టచివరి సమైక్య అభ్యుదయ రచయితల సభలను 1974లో **చాగంటి సోమయాజులు** అధ్యక్షతన ఒంగోలులో నిర్వహించారు.

అభ్యుదయ కవిత్వం - నిర్వచనాలు

1. 'ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించిందీ, సామాన్య మానవున్ని సాహిత్యానికి మకుటధారిని చేసిందీ **అభ్యుదయ కవిత్వం**'.
2. 'ధనిక సమాజం మారాలనుకోవడమే అభ్యుదయం' – **దేవులపల్లి కృష్ణశాస్త్రి**.
3. 'చైతన్యమే పర్యవసానంగా కలది అభ్యుదయ సాహిత్యం' – **వేల్చేరు నారాయణరావు**.

అభ్యుదయ కవిత్వం - లక్షణాలు

1. అంతర్జాతీయ దృక్పథంలో మానవాభ్యుదయాన్ని కాంక్షించడం.
2. ఆర్థిక అసమానతలు తొలగించి సామ్యవాద సమాజాన్ని నెలకొల్పడం.
3. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయడం.
4. వర్ణ, వర్గ రహిత సమ సమాజ స్థాపన.
5. శ్రమ దోపిడీ లేని సమాజం.
6. దేశ పారిశ్రామికీకరణం.
7. నవసమాజ నిర్మాణం.

తెలుగులో అభ్యుదయ కవిత్వ ప్రస్థానం

- తెలుగునాట అభ్యుదయ సాహిత్య మూలవిరాట్ – **శ్రీశ్రీ** అని సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు.
- **శ్రీశ్రీ** 1934 ఏప్రిల్ 12న మహాప్రస్థానం గేయాన్ని రాశారు. ఇది ముద్దుకృష్ణ '**జ్వాల**' పత్రికలో మొదటగా ప్రచురితమైంది.
- తెలుగులో వెలువడిన తొలి అభ్యుదయ కవితా సంకలనం '**నయాగరా**'. 1944లో దీన్ని బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రమణ్యం కలసి రచించారు.
- **శ్రీశ్రీ మహాప్రస్థానం** సంపూర్ణ కావ్యంగా 1950లో ప్రచురితమైంది.

ప్రసిద్ధ కవులు - అభ్యుదయ రచనలు

- **శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ):** మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి
- **ఆరుద్ర:** త్వమేవాహం, సినీవాలి, గాయాలు – గేయాలు
- **ఆవంత్స సోమసుందర్:** వజ్రాయుధం (తెలంగాణ సాయుధ పోరాటం)
- **కాళోజీ నారాయణరావు:** నా గొడవ (అభ్యుదయ కవితా సంపుటాలు)
- **దాశరథి కృష్ణమాచార్యులు:** అగ్నిధార, రుద్రవీణ, పునర్నవం, ఆలోచనాలోచనలు, తిమిరంతో సమరం, మహాంధ్రోదయం.
- **రెంటాల గోపాలకృష్ణ:** సర్పయాగం, సంఘర్షణ
- **అనిసెట్టి సుబ్బారావు:** అగ్నివీణ
- **కె.వి. రమణారెడ్డి:** అడవి, భువనఘోష, అంగారవల్లరి
- **సి. నారాయణరెడ్డి:** మంటలు – మానవుడు, అక్షర గవాక్షం, విశ్వంభర, ప్రపంచ పదులు, నాగార్జున సాగరం, సినారె గజళ్ళు.
- **పురిపండా అప్పలస్వామి:** పులిపంజా, అనలపతాకం, సంధ్యావందనం, స్వర్గానికి – నరకానికి.
- **పఠాభి:** ఫిడేలు రాగాల డజన్, పఠాభి పంచాంగం (1964)
- **శిష్ట్లా ఉమామహేశ్వరరావు:** నవమిచిలుక, విష్ణుధనువు
- **శ్రీరంగం నారాయణబాబు:** మౌనశంఖం, రుధిరజ్యోతి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆధునిక కవిత్వంలో రాయప్రోలు సుబ్బారావు మొదటగా లేవనెత్తిన ప్రణయ సిద్ధాంతం?
   1) కులపాలికా ప్రణయం
   2) కరుణ విప్రలంభం
   3) అమలిన శృంగారం
   4) విప్రలంభ శృంగారం
2. 'కవి అవిస్పష్ట వాంఛాంకురం, ఒక అంతర్నిగూఢ తాపం ఒక చిన్న కావ్యంలో ఊదబడితే' అది?
   1) విప్లవ కవిత్వం
   2) అభ్యుదయ కవిత్వం
   3) ఆధ్యాత్మిక కవిత్వం 4) భావ కవిత్వం
3. 'వేదాంతాలు జీవితాన్నీ, ప్రకృతినీ అవగాహన చేసుకున్నారు; మేం లోకాన్ని, జీవితాన్ని, ప్రకృతినీ కూడా మారుస్తాం' అనే శ్రీ రంగం నారాయణ బాబు మాటలు దేనికి ప్రాతినిధ్యం వహిస్తాయి?
   1) దిగంబర కవిత 2) అభ్యుదయ కవిత
   3) భావ కవిత 4) విప్లవ కవిత
4. అభ్యుదయ కవిత్వ ప్రధాన లక్షణం?
   1) వర్గ సామరస్యం 2) వర్గ సంఘర్షణ
   3) ప్రణయ బోధన 4) దేశభక్తి ప్రబోధం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, తిరుపతి జిల్లాలో 20 ఉద్యోగాలు

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ చిల్డ్రన్ హోమ్స్‌లో అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 20.
» **పోస్టుల వివరాలు:** కుక్-05, హెల్పర్/హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్-05, ఎడ్యుకేటర్-04, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్-02, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్-03, హౌస్ కీపర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఏడో తరగతి, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ/బీఎడ్, బీఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు కుక్‌కు రూ.9,930, హెల్పర్/హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్‌కు రూ.7,994, ఇతర పోస్టులకు రూ.10,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.05.2025.
» **వెబ్‌సైట్:** tirupati.ap.gov.in/

బీఈఎల్, ఘజియాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) ఘజియాబాద్ యూనిట్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** హవాల్దార్-03, డ్రైవర్-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో డ్రైవింగ్ అనుభవం ఉండాలి.
» **వయసు:** 43 నుంచి 48 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.20,500 నుంచి రూ.79,000.
» **ఎంపిక విధానం:** పీఈటీ టెస్ట్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.05.2025.
» **వెబ్‌సైట్:** https://bel-india.in/



దేశంలో వరిని అధికంగా ఉత్పత్తి చేసే ప్రాంతం?

భారతదేశం- వ్యవసాయం

మనదేశంలోని ఆహార పంటలు మొత్తం పంటల సాగు విస్తీర్ణంలో 75 శాతం. వ్యవసాయ ఉత్పత్తుల్లో వీటి విలువ 50 శాతం. ఆహార పంటలను కాయధాన్యాలు, పప్పు ధాన్యాలుగా విభజించవచ్చు.

1. **కాయధాన్యాలు:** వరి, గోధుమ, జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగి, బార్లీ.
2. **పప్పుధాన్యాలు:** పెసలు, కందులు, మినుములు, ఉలవలు, సెనగలు మొదలైనవి.

వరి: మనదేశంలో వరి ముఖ్యమైన ఆహారపంట. ఇది ప్రధానంగా ఖరీఫ్ కాలానికి చెందిన పంట. కానీ రబీలోనూ పండిస్తున్నారు.

వరి పండించడానికి అనువైన పరిస్థితులు:

1) ఒండలి నేలలు అనుకూలం.
2) వార్షిక వర్షపాతం 150 సెం.మీ. నుంచి 200 సెం.మీ. వరకు ఉండాలి.
3) 22ని సెంటీగ్రేడ్ నుంచి 32ని సెంటీ గ్రేడుల ఉష్ణోగ్రత ఉండాలి.
4) వ్యవసాయ కూలీల లభ్యత అధికంగా ఉన్న ప్రాంతాలు ఈ పంటకు అనువైనవి.

- వరి ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉంది.
- భారతదేశంలో ఉత్పత్తి పరంగా పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో, ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నాయి.
- దేశంలో వరిని అధికంగా ఉత్పత్తి చేసే ప్రాంతం గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతం.

గోధుమ: గోధుమ ప్రధానంగా 'రబీ' కాలపు పంట. శీతాకాలం ఈ పంటకు అనుకూలమైంది. విస్తీర్ణపరంగా, ఉత్పత్తిపరంగా వరి తర్వాత ఇది రెండో ప్రధాన ఆహార పంట.

- గోధుమ ఉత్పత్తిలో చైనా మొదటిస్థానంలో ఉంది. రెండో స్థానంలో భారత్ ఉంది.
- గోధుమ పంట ఉత్పత్తి పరంగా భారత్‌లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో, పంజాబ్ రెండో స్థానంలో ఉన్నాయి.
- వరి, గోధుమ పంటలకు సంబంధించి భారతదేశంలో ఎక్కువ ఉత్పత్తి 1960వ దశాబ్దంలో (1965 తర్వాత) ప్రారంభమైంది. దీన్నే 'హరిత విప్లవం' అంటారు.

భారతదేశంలో హరిత విప్లవం (1965-66)

పురాతన వ్యవసాయ పద్ధతులకు స్వస్తి పలుకుతూ.. అధిక దిగుబడినిచ్చే వంగడాలు, రసాయనిక ఎరువులు, నీటిపారుదల వసతులను ఉపయోగించి, కొత్త సాంకేతిక పద్ధతులతో చేసే వ్యవసాయాన్ని హరిత విప్లవం (Green Revolution) అంటారు. దీన్నే సస్యవిప్లవం అని కూడా అంటారు.

- ఇందులో భాగంగా 1965-66లో అధిక దిగుబడులనిచ్చే వంగడాల కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా ప్రవేశ పెట్టారు.
- హరిత విప్లవం అనే పదాన్ని మొదటగా వాడిన వ్యక్తి విలియం గాండ్.
- హరిత విప్లవాన్ని మొదటిసారిగా ప్రపంచంలో వ్యాప్తి చేసిన వ్యక్తి నార్మన్ బోర్లాగ్ (మెక్సికో).
- భారత్‌లో హరిత విప్లవాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చిన వ్యక్తి ఎస్.స్వామినాథన్. ఈయననే భారతదేశ హరిత విప్లవ పితామహుడు అంటారు.
- హరిత విప్లవం వల్ల అధికంగా ప్రయోజనం పొందిన పంటలు వరుసగా..
1. గోధుమ, 2. వరి, 3. జొన్న, 4. మొక్కజొన్న.
- దీనివల్ల తక్కువ ప్రయోజనం పొందిన పంటలు 1. పప్పుధాన్యాలు, 2. నూనెగింజలు.



రెండో హరిత విప్లవం (2006):

2004లో వాజ్‌పేయి ప్రభుత్వం రెండో హరిత విప్లవం గురించి 11వ ప్రణాళికలో పేర్కొన్నప్పటికీ అది అమలు కాలేదు.

- 2006 మే 26న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ దీన్ని ప్రకటించాడు.
- భారతదేశంలో వర్షపాతం తక్కువగా ఉండే మెట్ట ప్రాంతాల్లో చిరుధాన్యాలను పండిస్తున్నారు. చిరుధాన్యాల్లో ముఖ్యమైనవి.. జొన్నలు, కొర్రలు, సజ్జలు, రాగులు, మొక్కజొన్న.
- ప్రోటీన్లు అధికంగా ఉండే 'లెగుమినేసి' కుటుంబా నికి చెందిన పంటలన్నీ పప్పుధాన్యాల కిందకి వస్తాయి. వీటిలో ముఖ్యమైనవి సెనగలు, కందులు, పెసలు, మినుములు.

వాణిజ్య లేదా నగదు పంటలు

భారతదేశంలో నగదు పంటలు మొత్తం పంట విస్తీర్ణంలో 15 శాతం ఆక్రమిస్తూ, ఉత్పత్తిలో 40 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

- పత్తిని 'తెల్లబంగారం' అంటారు.
- భారతదేశంలో ఎక్కువగా పొడుగు గింజ, మధ్యరకం గింజ పత్తిని పండిస్తున్నారు.
- పత్తి ప్రధానంగా నల్లరేగడి నేలలో పండుతుంది.
- భారతదేశంలో అధికంగా రబ్బరు ఉత్పత్తి (దాదాపు 85 శాతం) కేరళలో జరుగుతోంది.
- దేశంలో మొదటిసారిగా తేయాకు సాగుచేసిన ప్రాంతం అసోం.

శ్వేత విప్లవం (White Revolution)

- పాల ఉత్పత్తిలో అధిక దిగుబడులను తీసుకురావడానికి శ్వేత విప్లవాన్ని ప్రవేశ పెట్టారు.
- దీని ముఖ్య ఉద్దేశం.. గ్రామీణ ఉత్పత్తి దారులు, పట్టణ వినియోగదారులను కలపడం.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
జాగ్రఫీ

- ఇందులో భాగంగా 1970లో 'ఆపరేషన్ ఫ్లడ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- శ్వేత విప్లవ పితామహుడు - వర్గీస్ కురియన్
- ప్రస్తుతం ప్రపంచంలో పాల ఉత్పత్తిలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది.
- ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఉత్పత్తిపరంగా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

నీలి విప్లవం (Blue Revolution)

ఇది చేపల ఉత్పత్తిలో పెరుగుదల కోసం చేపట్టిన కార్యక్రమం.

- చేపల పెంపకాన్ని 'పిసికల్చర్' అంటారు.
- చేపల గురించి చేసే అధ్యయనాన్ని 'ఇక్తియాలజీ' అంటారు.
- చేపల ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా, జపాన్ తర్వాత భారతదేశం ఉంది.
- పట్టు పురుగుల పెంపకాన్ని 'సెరికల్చర్' అంటారు.

వివిధ పంటలు పరిశోధనా సంస్థలు

- జాతీయ వరి పరిశోధనా కేంద్రం - కటక్ (ఒడిశా)
- అంతర్జాతీయ వరి పరిశోధనా కేంద్రం - మనీలా (ఫిలిప్పీన్స్)
- భారత చెరకు పరిశోధనా సంస్థ - లక్నో (ఉత్తరప్రదేశ్)
- సుగంధ ద్రవ్యాల పరిశోధనా కేంద్రం - కాలికట్ (కేరళ)
- కేంద్రీయ పత్తి పరిశోధనా కేంద్రం - నాగపూర్ (మహారాష్ట్ర)
- ఇక్రిసాట్ (International Crops Research Institute for Semi Arid Tropics - ICRISAT) - హైదరాబాద్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్
  - న్యూ ఢిల్లీ తేయాకు పరిశోధనా కేంద్రం
  - జోర్హట్ (అసోం)
- భారత ప్రభుత్వం 2000 జనవరి 28న మొదటి సారిగా 'జాతీయ వ్యవసాయ విధా నాన్ని' ప్రకటించింది. ఇందులో భాగంగా 'ఇంద్రధనస్సు' విప్లవాన్ని ప్రకటించింది. ఈ విప్లవంలో మిశ్రమ వ్యవసాయం కూడా ఒక భాగం.

భారతదేశంలో వివిధ రకాల పంటలు

అధికంగా ఉత్పత్తి చేసే రాష్ట్రాలు

పంట	రాష్ట్రాలు
1. వరి	1. పశ్చిమ బెంగాల్ 2. ఉత్తరప్రదేశ్
2. గోధుమ	1. ఉత్తరప్రదేశ్ 2. పంజాబ్
3. జొన్న	1. మహారాష్ట్ర 2. కర్ణాటక
4. రాగి	1. కర్ణాటక 2. తమిళనాడు
5. వేరుసెనగ	1.గుజరాత్ 2. తమిళనాడు
6. పత్తి	1. గుజరాత్ 2.మహారాష్ట్ర
7. జనుము	1. పశ్చిమ బెంగాల్ 2. బిహార్
8. చెరకు	1. ఉత్తర ప్రదేశ్ 2. మహారాష్ట్ర
9. కాఫీ	1. కర్ణాటక 2. కేరళ
10. తేయాకు	1. అసోం 2. పశ్చిమబెంగాల్
11. రబ్బరు	1. కేరళ
12. పాలు	1. ఉత్తరప్రదేశ్ 2. గుజరాత్

గతంలో అడిగిన ప్రశ్నలు

1. భారతదేశ 'స్పైస్ గార్డెన్'గా పేరు పొందిన రాష్ట్రం ఏది? (డిప్యూటీ జైలర్స్-2012)
   1) కేరళ 2) ఆంధ్రప్రదేశ్
   3) తమిళనాడు 4) కర్ణాటక
2. కిందివాటిలో ఏ రాష్ట్రం సోయాబీన్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తుంది?(డిప్యూటీ జైలర్స్-2012)
   1) బిహార్ 2) మధ్యప్రదేశ్
   3) ఉత్తరప్రదేశ్ 4) పశ్చిమ బెంగాల్
3. జతపరచండి. పంట ముఖ్య ఉత్పాదక రాష్ట్రం
   ఎ. కాఫీ 1. కేరళ
   బి. పత్తి 2. గుజరాత్
   సి. పెండలం 3. ఆంధ్రప్రదేశ్
   డి. పొగాకు 4. తమిళనాడు
   ఇ. మిరప 5. కర్ణాటక
   (డిప్యూటీ జైలర్స్-2012)
   1) ఎ-1, బి-2, సి-3, డి-4, ఇ-5
   2) ఎ-4, బి-5, సి-3, డి-2, ఇ-1
   3) ఎ-3, బి-5, సి-3, డి-2, ఇ-1
   4) ఎ-5, బి-2, సి-1, డి-3, ఇ-4
4. భారతదేశ సహజ సిద్ధ రబ్బరు అవసరాలను ఎక్కువగా తీర్చే రాష్ట్రం ఏది? (డిప్యూటీ జైలర్స్ -2012)
   1) కేరళ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) ఏదీకాదు
5. ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ భాగంతో పాటు హరిత విప్లవం వల్ల ముందు లబ్ధి పొందిన రాష్ట్రాలు? (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్-2013)
   1) పంజాబ్, హర్యానా
   2) పంజాబ్, మహారాష్ట్ర
   3) హర్యానా, ఆంధ్రప్రదేశ్
   4) మహారాష్ట్ర, కర్ణాటక
6. కిందివాటిలో సిల్క్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రం? (కానిస్టేబుల్-2012)
   1) ఆంధ్రప్రదేశ్ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) అసోం
7. భారతదేశంలో అత్యధికంగా జీడిపప్పును పండించే రాష్ట్రం ఏది? (కానిస్టేబుల్-2012)
   1) ఆంధ్రప్రదేశ్ 2) అసోం
   3) కేరళ 4) కర్ణాటక
8. భారతదేశానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యం దేని ఎగుమతి ద్వారా లభిస్తుంది? (కానిస్టేబుల్-2012)
   1) ఇనుము 2) టీ
   3) జనపనార 4) పంచదార
9. నీలి విప్లవం అంటే ఏమిటి? (కానిస్టేబుల్-2013)
   1) వాణిజ్య పంటల ఉత్పత్తి
   2) నీలి మందుల ఉత్పత్తి
   3) నీలి లోహ ఉత్పత్తి 4) చేపల ఉత్పత్తి
10. కిందివాటిలో ఏ పంటకు ఒక హెక్టార్‌కు ఎక్కువ నీరు అవసరం? (కానిస్టేబుల్ - 2013)
   1) చెరకు 2) గోధుమ
   3) మొక్కజొన్న 4) బార్లీ
11. హరిత విప్లవానికి కారణమైన వ్యవసాయ శాస్త్రజ్ఞుడు ఎవరు? (జైల్ వార్డెన్-2012)
   1) కురియన్ 2) ఎస్.ఎస్. భట్నాగర్
   3) శాంతి స్వరూప్ 4) నార్మన్ బోర్లాగ్

సమాధానాలు

1) 1; 2) 2; 3) 4; 4) 1; 5) 1; 6) 3; 7) 3; 8) 2; 9) 4; 10) 1; 11) 4.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో వరి ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రం ఏది?
   1) అసోం 2) పశ్చిమ బెంగాల్
   3) ఆంధ్రప్రదేశ్ 4) ఉత్తరప్రదేశ్
2. భారతదేశంలో తేయాకును ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రం ఏది?
   1) ఉత్తరాంచల్ 2) తమిళనాడు
   3) అసోం 4) పశ్చిమ బెంగాల్
3. భారత కేంద్రీయ వరి పరిశోధనా సంస్థ ఎక్కడ ఉంది?
   1) కటక్2) మైసూర్
   3) కోల్‌కతా 4) బెంగళూరు
4. గ్రీన్ రివల్యూషన్ ప్రభావం దేనిపై ఎక్కువగా కనిపిస్తుంది?
   1) పప్పుధాన్యాలు 2) గోధుమలు
   3) వరి 4) నూనె గింజలు
5. క్షీర విప్లవ పితామహుడు ఎవరు?
   1) రామన్ కురియన్ 2) రామనాథ్ కృష్ణన్
   3) వర్గీస్ కురియన్ 4) జె.ఎం. జోసఫ్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 2; 5) 3;

Who amongst the five types the fastest?

Model Questions

1. In a certain code, PLANT is written as "$@2H©" and YIELD is written as "b64@%". How is "DELAY" written in that code?
   1) b4H2% 2) b4@2%
   3) %42@b 4) %4@2b
   5) None of these
2. How many meaningful English words can be formed with the letters ARILT using each letter only once in that word?
   1) None 2) One 3) Two
   4) Three 5) More than three
3. D said, "A's father is the only brother of my sister's son." How is A's father related to D?
   1) Cousin 2) Nephew
   3) Aunt 4) Data inadequate
   5) None of these

Directions (Q. No. 4-6): The following questions are based on the 5 three-digit numbers given below:

394 632 783 576 895

4. If the positions of the first and the second digit within each number are interchanged, then which of the following will be the second highest number?
   1) 632 2) 783 3) 576
   4) 895 5) 394
5. If the first and second digits of each of the numbers are added, the resulting sum of which of the following numbers will not be exactly divisible by 3?
   1) 895 2) 394
   3) 576 4) 632 5) 783
6. If 2 is added to the last digit of each number and then the positions of the first and the third digits are interchanged, which of the following will be the highest number?
   1) 576 2) 895 3) 783
   4) 394 5) 632
7. If A is coded as 1, B as 3, C as 5 and so on, which of the following is the numerical value of the word "FAZED"?
   1) 81 2) 79
   3) 77 4) 80 5) None of these
8. Which of the following pairs of words have the same relationship as FAN : HEAT?
   1) Water : Drink 2) Light : Night
   3) Teach : Student
   4) Air : Breathe 5) Food : Hunger
9. Q types faster than R but not as fast as V. T types faster than R. S types faster than V. Who amongst the five types the fastest?
   1) V 2) T 3) S
   4) Data Inadequate
   5) None of these
10. If "B×C" means "B is the daughter of C", "B + C" means "B is the husband of C" and "B – C" means "B is the sister of C", then what does "M+ N – P × Q" mean?
   1) M is the brother-in-law of Q
   2) M is the uncle of Q
   3) M is the son-in-law of Q
   4) Q is the mother-in-law of M
   5) None of these

Directions (Q. No. 11-15): Study the following arrangement carefully and answer the questions given below:

R	D	A	K
5	B	I	2
M	J	E	N
9	7	U	Z
V	1	W 3	H
4	F	Y	8
P	6	T	G



Bank Exams
REASONING

11. How many such numbers are there in the above arrangement, each of which is immediately preceded by a consonant and immediately followed by a vowel?
   1) None 2) One 3) Two
   4) Three 5) More than three
12. Which of the following is the eighth to the left of the seventeenth from the left end?
   1) M 2) J 3) 8
   4) 5 5) None of these
13. Four of the following five are alike in a certain way based on their positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
   1) E 9 J 2) Z 1 U
   3) H W 4 4) Y 4 8 5) B 2 K
14. Which of the following is the sixth to the right of the nineteenth from the right end?
   1) 5 2) Z 3) V
   4) 1 5) None of these
15. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a number and immediately followed by another consonant?
   1) None 2) One 3) Two
   4) Three 5) More than three

Directions (Q. No. 16-19): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and **Give answer:**

1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statement II alone are sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question.
4) If the data given in both the statements I & II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I & II together are necessary to answer the question.

16. How is 'never' written in a code language?
   I) "never ever go there" is written as "na ja ni ho" in that code language.
   II) "go there and come back" is written as "ma ho sa ni da" in that code language.
17. Among M, P, K, J, T and W, who is lighter than only the heaviest?
   I) P is heavier than M and T.
   II) W is heavier than P but lighter than J who is not the heaviest.
18. What does "$" mean in a code language?
   I) "5 $ # 3" means "flowers are really good".
   II) "7 # 3 5" means "good flowers are available".
19. How many students are there between Suresh and Mohan in a row of fifty students?
   I) Suresh is twelfth from the left end and Mohan is seventeenth from the right end.
   II) Suresh is six places away from Jayesh, who is twentieth from the left end.

Key And Explanations

1. **Ans: 4**
   P L A N T Y I E D
   $ @ 2 t c b 6 4 %
   ∴ DELAY Þ %4@2b
2. **Ans: 3.** TRAIL, TRIAL,
3. **Ans:** 2. A's father
   = the only brother of D's sister's son
   = D's sister's son
   = D's nephew
4. **Ans: 5.** Interchanging the first two digits, we get 934, 362, 873, 756 and 985. Of these, 934 is the second highest.
5. **Ans:** 1. 895 ⇒ 8 + 9 = 17 is not divisible by 3.
6. **Ans:** 1. Look for the highest third digit.
7. **Ans: 2.** In general, nth letter of the alphabet =2n–1 Here, FAZED = 11 + 1 + 51 + 9 + 7 = 79
8. **Ans: 5.** The first dispels the second.
9. **Ans: 4.** V > Q > R; T > R; S > V Combining, we get S > V > Q > R and T > R. Hence, either S or T is the fastest.
10. **Ans: 3.**
    Q
    |
    M(+) ⇔ N(–)<—>P(–)
11. **Ans: 1.**
12. **Ans: 1.** 8th to the left of 17th from left = 17 – 8 = 9th from the left = M
13. **Ans: 5.** In all others, the first and third elements are consecutive ones.
14. **Ans: 3.** 6th to the right of 19th from the right = 19 – 6 = 13th from the right = V
15. **Ans: 4.** M, F and T
16. **Ans: 4.** Only two words are common between I and II.
17. **Ans: 5.** From I: P > M, T
    From II: J > W > P
    Combining, we get K > J > W > P > M, T Hence, K is the heaviest and J lighter than only the heaviest.
18. **Ans: 5.**
    From I: 5$#3 = flowers are really good ... (i)
    From II: 7#35 = good flowers are available ... (ii)
    From I and II: 5#3
    = flowers are good ... (iii)
    Putting (iii) in (i), we get: $ = really.
19. **Ans:** 1. From I: Suresh
    = 12th from left
    Mohan = 17th from right
    ∴ No. of students between them
    = 50 – 29 (12+17) = 21
    From II: No data about Mohan.

విద్య, ఉద్యోగ సమాచారం

యూనియన్ బ్యాంక్‌లో 500 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 500.
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్(క్రెడిట్)-250, అసిస్టెంట్ మేనేజర్(ఐటీ)-250.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏ, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, ఎంసీఏ, పీజీడీబీఎంలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.48,480 నుంచి రూ.85,920.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 20.05.2025.
- **వెబ్‌సైట్ :** https://www.unionbankofindia.co.

సీఐఎస్ఎఫ్‌లో 30 హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు

కేంద్ర హోంశాఖ పరిధిలోని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్).. స్పోర్ట్స్ కోటా(హాకీ)లో హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల సంఖ్య :** 30
- **పోస్టుల వివరాలు:** హెడ్ కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ)
- **అర్హత:** గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు హాకీలో రాష్ట్ర/జాతీయ/అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి.
- **వయసు:** 01.08.2025 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక ప్రక్రియ :** ట్రయల్ టెస్ట్, ప్రొఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 30.05.2025
- **వెబ్‌సైట్ :** https://www.cisf.gov.in/cisfeng/recruitment